సంక్షిప్త

# శ్రీ సాయిబాబా సచ్చరిత్ర

మూలము
శ్రీ గోవింద రఘునాథ దాభోల్కర్ (హేమాద్ పంత్)

సంకలనము
కొండా కృష్ణమూర్తి




ప్రచురణ
శ్రీ షిరిడి సాయిబాబా సేవా సంస్థన్
సిద్ధిపేట - 502103
Ph.No .08457-226299

# Sankshiptha Sri Saibaba Sacharitra

By KONDA KRISHNA MURTHY

| | | | |
|---|---|---|---|
| First edition | : 2009 | copies | 1500 |
| Second edition | : 2013 | copies | 2000 |

Copies available at :

1. K. Krishna Murthy
   9-6-41, Durga Bhavani Nagar,
   Champapet, Hyderabad – 500059.
   Ph. 040- 24530406, m. 9490956511

2. Shri Shiridi Sai baba Seva Sansthan Trust
   Sai Vidya Nagar, Siddipet – 502103.
   Dist. Medak. A.P. Ph. 08457-226299

Price: Rs.50/-

Published By : Shri Shiridi Sai Baba Seva
Sansthan, Siddipet - 502103.
Printed at : Om Sai Printers, Hyderabad
m. 98850 22659

ఓం శ్రీ సాయినాథాయనమః

*****

శుక్లాం బరధరం విష్ణుం శశి వర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే
అగజానన పద్మార్కం గజానన మహర్నిశం
అనేకదం తం భక్తానాం ఏకదంతముపాస్మహే

సదా సత్స్వరూపం చిదానందకందం
జగత్సంభవస్థాన సంహార హేతుమ్
స్వభక్తేచ్ఛయా మానుషం ధర్శయంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్

సదా నింబ వృక్షస్య మూలాధి వాసాత్
సుధా స్రావిణం తిక్తమప్య ప్రియంతమ్
తరుం కల్పవృక్షాధికం సాధయంతమ్
నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్

సదా కల్పవృక్షస్య తస్యాధిమూలే
భవద్భావ బుధ్యా సపర్యాధి సేవాం
నృణాంకుర్వతాం భుక్తి ముక్తి ప్రదంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ మహరాజ్ కి జై

# శ్రీ సాయి సూక్తులు

1. షిరిడి ప్రవేశమే సర్వ దుఃఖ పరిహారము.
2. ఆర్తులైన నేమి, నిరుపేదలైన నేమి, ద్వారకామాయి ప్రవేశ మొనరించనంతనే సుఖ సంపదలు పొందగలరు.
3. ఈ భౌతిక దేహానంతరము సహితము నేనప్రమత్తుడనే.
4. నా భక్తుల రక్షణ నా సమాధి నుండియే వెలువడు చుండును.
5. నా సమాధి నుండియే నేను సర్వ కార్యములను నిర్వహింతును.
6. నా సమాధి నుండియే  నా మనుష్య శరీరము మాట్లాడును.
7. నన్ను ఆశ్రయించిన వారిని, నా శరణు జొచ్చిన వారిని నిరంతరము రక్షించుటయే నా కర్తవ్యము.
8. నా యందే దృష్టి నిలపండి, వారి యందు నా కటాక్షము ఎల్లప్పుడు వుండును.
9. మీ భారము నాపై పడవేయుడు, నేను మోసెదను.
10. నా సహాయమును గాని , సలహాను గాని కోరిన తక్షణమే యొసంగెదను
11. నా భక్తుల గృహముల యందు 'లేమి' యను శబ్దము పొడ చూపదు.

ఓం శ్రీ సాయి నాథాయ నమః
ఓం లక్ష్మీ నారాయణాయ నమః
ఓం శ్రీ కృష్ణ రామ శివ మారు త్యాదిరూపాయ నమః
ఓం శేష సాయినే నమః
ఓం గోదావరి తట షిరిడి వాసినే నమః
ఓం భక్త హృదయాలయాయ నమః
ఓం సర్వహృద్వాసినే నమః
ఓం భూతా వాసాయ నమః
ఓం భూత భవిష్యద్భావ వర్జితాయ నమః
ఓం కాలాతీతాయ నమః
ఓం కాలాయ నమః
ఓం కాల కాలాయ నమః
ఓం కాలదర్పదమనాయ నమః
ఓం మృత్యుంజయాయ నమః
ఓం  అమర్త్యాయ నమః
ఓం మర్త్యాభయ ప్రదాయ నమః
ఓం జీవాధారాయ నమః
ఓం సర్వాధారాయ నమః
ఓం భక్తావన సమర్థాయ నమః
ఓం భక్తావన ప్రతిజ్ఞాయ నమః
ఓం అన్న వస్త్రదాయ నమః
ఓం ఆరోగ్య క్షేమదాయ నమః
ఓం విత్త మాంగల్య దాయ నమః
ఓం బుద్ధి సిద్ధి దాయ నమః
ఓం  పుత్ర మిత్ర బంధు కళత్రదాయ నమః

ఓం యోగ క్షేమ వహాయ నమః
ఓం ఆపద్బాంధవాయ నమః
ఓం మార్గ బంధవే నమః
ఓం భుక్తి ముక్తి స్వర్గాపవర్గ దాయ నమః
ఓం ప్రియాయ నమః
ఓం ప్రీతివర్ధనాయ నమః
ఓం అంతర్యామినే నమః
ఓం సచ్చిదాత్మనే నమః
ఓం నిత్యానందాయ నమః
ఓం పరమసుఖదాయ నమః
ఓం పరమేశ్వరాయ నమః
ఓం పరబ్రహ్మణే నమః
ఓం పరమాత్మనే నమః
ఓం జ్ఞాన స్వరూపిణే నమః
ఓం జగతఃపిత్రే నమః
ఓం భక్తానాం మాతృ దాతృ పితా మహాయ నమః
ఓం భక్తాభయ ప్రదాయ నమః
ఓం భక్త పరాధీనాయ నమః
ఓం భక్తానుగ్రహ కారకాయ నమః
ఓం శరణాగత వత్సలాయ నమః
ఓం భక్తిశక్తిప్రదాయ నమః
ఓం జ్ఞాన వైరాగ్యదాయ నమః
ఓం ప్రేమ ప్రదాయనమః
ఓం సంశయ దౌర్బల్య పాపకర్మ వాసనా క్షయ కరాయ నమః
ఓం హృదయ గ్రంధి భేదకాయ నమః

ఓం కర్మ ధ్వంసినే నమః
ఓం శుద్ధ సత్వ స్థితాయ నమః
ఓం గుణాతీత గుణాత్మనే నమః
ఓం అనంత కళ్యాణ గుణాయ నమః
ఓం అనంత పరాక్రమాయ నమః
ఓం జయినే నమః
ఓం దుర్ధర్షాక్షోభ్యాయ నమః
ఓం అపరాజితాయ నమః
ఓం త్రిలోకేషు అవిఘాత గతయే నమః
ఓం అశక్యరహితాయ నమః
ఓం సర్వ శక్తి మూర్తయే నమః
ఓం సురూప సుందరాయ నమః
ఓం సులోచనాయ నమః
ఓం బహురూప విశ్వ మూర్తయే నమః
ఓం అరూపవ్య క్తాయ నమః
ఓం అచింత్యాయ నమః
ఓం సూక్ష్మాయ నమః
ఓం సర్వాంతర్యామినే నమః
ఓం మనో వాగతీతాయ నమః
ఓం ప్రేమ మూర్తయే నమః
ఓం సులభ దుర్లభాయ నమః
ఓం అసహాయ సహాయాయ నమః
ఓం అనాథ నాథ దీన బాంధవే నమః
ఓం సర్వ భార భృతే నమః
ఓం అకర్మానేక కర్మసుకర్మిణే నమః
ఓం పుణ్య శ్రవణ కీర్తనాయ నమః

ఓం తీర్థాయ నమః
ఓం వాసుదేవాయ నమః
ఓం సతాంగతయే నమః
ఓం సత్య నారాయణాయ నమః
ఓం లోక నాథాయ నమః
ఓం పావనానఘాయ నమః
ఓం అమృతాంశాయ నమః
ఓం భాస్కర ప్రభాయ నమః
ఓం బ్రహ్మ చర్య తపశ్చర్యాది సుకృ తాయ నమః
ఓం సత్య ధర్మ పరాయణాయ నమః
ఓం సిద్ధేశ్వరాయ నమః
ఓం సిద్ధ సంకల్పాయ నమః
ఓం యోగేశ్వరాయ నమః
ఓం భగవతే నమః
ఓం భక్త వత్సలాయ నమః
ఓం సత్పురుషాయ నమః
ఓం పురుషోత్తమాయ నమః
ఓం సత్య తత్త్వబోధకాయ నమః
ఓం కామాది షడ్వైరి నధ్వంసినే నమః
ఓం అభేదానందాను భవ ప్రదాయ నమః
ఓం సమ సర్వమత సమ్మతాయన నమః
ఓం శ్రీ దక్షిణా మూర్తయే నమః
ఓం శ్రీ వేంకటేశ రమణాయ నమః
ఓం అద్భుతానంత చర్యాయ నమః
ఓం ప్రపన్నార్తి హరాయ నమః
ఓం సంసార సర్వ దుఃఖ క్షయకరాయ నమః
ఓం సర్వవిత్ సర్వతో ముఖాయ నమః

ఓం  సర్వాంతర్బహిస్థితాయ నమః
ఓం  సర్వ మంగళకరాయ నమః
ఓం  సర్వాభీష్ట ప్రదాయ నమః
ఓం సమరస సన్మార్గ స్థాపనాయ నమః
ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ మహరాజ్ కి జై

ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి



# ముందు మాట

శ్రీ గోవింద రఘునాథ్ దాభోల్కర్ (హేమాద్ పంత్), బాబా వద్ద భక్తుల అనుభవాలను వ్రాస్తే చదివినవారికి ఆనందము, ఉల్లాసము కలుగునని బాబా అనుమతికి ప్రయత్నించగా, బాబా అనుగ్రహించాడు. బాబా ఆశీర్వాదముతో హేమాద్ పంత్ ' శ్రీ సాయి సచ్చరిత్ర' అను గ్రందాన్ని రచించారు. ఆ గ్రంధాన్ని ఎంతో మంది వివిధ బాషలలోనికి అనువదించారు. హేమద్ పంత్ రచించిన సాయి సచ్చరిత్ర ఒక వేదం లాంటిది. ఎంత మంది వ్రాసినా ఇంకా ఎంతో వుంటుంది. పాల సముద్రమును దేవదానవులు చిలికినకొద్దీ ఎన్నెన్నో వస్తువులు వచ్చాయి, యింకా సముద్రములో ఏమేమి దాగున్నావో సంగ్రహంగా ఎవరికి తెలియదు. ఈ సచ్చరిత్ర కూడా అలాంటిదే. సాయినాథుని ఆజ్ఞ అనుగ్రహముతో కొందరు మహానుభావులు రచించిన గ్రంథాలను చదివి, సులభ శైలిలో శ్రీ సాయి సచ్చరిత్ర గ్రంధాన్ని సంకలనము చేయడము జరిగింది. ఈ గ్రంధాన్ని **2004** గురుపూర్ణిమ నాడు **1000** ప్రతులను ప్రచురించి విడుదల చేయడము జరిగింది. తర్వాత కొందరు భక్తుల కోరికపై **1100** ప్రతులను **2007** గురుపూర్ణిమ వరకు ప్రచురించ బడినవి. ఆ గ్రంధములో **52** ఆధ్యాయాలు మరియు బాబా తో గడిపిన భక్తుల ఫోటోలను సేకరించి వారి గురించి అతి సంక్షిప్తంగా వ్రాయబడింది.


శ్రీ సాయి నాథుని చరిత్రను, లీలలను సంక్షిప్తంగా సచ్చరిత్ర గ్రంథాన్ని ముద్రిస్తే బాగుంటుందని బాబా నా మదిలో ఆలోచనని అంకురింప చేసారు. కొందరు స్నేహితులు కూడా ఈ ప్రయత్నము బాగుంటుందని ప్రోత్సహించారు. ఆ ప్రయత్న ఫలితమే ఈ గ్రంథము. సంక్షిప్త శ్రీ సాయిబాబా సచ్చరిత్ర అను ఈ గ్రంథము చిన్న సైజులో వుండటము వలన భక్తులు సులువుగా చదువగలరని తలుస్తున్నాను. ఈ

గ్రంథములో సాయినాథుని లీలలు, కథలు, మరియు అధ్యాత్మిక విషయాలు ఇవ్వబడినవి. ఈ గ్రంధాన్ని **2009** లో **1500** ప్రతులను ప్రచురించి విడుదల చేయడము జరిగింది. భక్తుల కోరిక పై మరియు బాబా అనుగ్రహముతో ఈ రెండవ ప్రచురణ. ముద్రణ సమయములో బాబా శ్రీ **YKD** ప్రసాద్ **(DLRL)** గారిని పంపించి కొన్ని తప్పులను సరిచేయించారు. వారికి నా కృతజ్ఞతలు తెలుపుచున్నాను.

శ్రీ సాయి సచ్చరిత్ర అనే మహా సముద్రములో ఎక్కడ దిగినా సాయినాథుని కృప తప్పక లభించును. ఈ గ్రంథాన్ని పారాయణ చేసిన వారికి శ్రీ సాయి సచ్చరిత్ర పూర్తి గ్రంథాన్ని పారాయణం చేసిన అనుభూతి కలుగుతుం ది, స్వ స్వ రూప దర్శనము బాబా కలిగిస్తారని ఆశిస్తూ.

సదా సాయి సేవలో

(కొండా కృష్ణమూర్తి)



శ్రీ గోవింద రఘునాథ దాభోల్కర్ (హేమాద్ పంత్)

# పారాయణ పద్ధతి

సంక్షిప్త శ్రీ సాయిబాబా సచ్చరిత్రను ఈ క్రింది పద్ధతులలో పారాయణ చేయవచ్చును.

**1**. సప్తాహము : పారాయణము చేయు వారు భక్తి భావంతో మరియు పూర్తి శ్రద్ధతో పారాయణము చేయాలి. పారాయణము చేయువారు ఒక గురువారము నాడు, వారి నిత్య కర్మలు పూర్తి చేసుకొని, ఒంటరిగా సప్తాహ పారాయణము మొదలు పెట్టాలి. పారాయణము చేయునప్పుడు పూజా మందిరములో బాబా ఫోటో ఎదురుగా కూర్చోవాలి. మధ్య మధ్యలో బాబా కళ్ళ లోకి చూస్తూ పలకరిస్తుండవలయును. ఈ గ్రంథములో సచ్చరిత్రలోని ముఖ్యమైన కథలను సంక్షిప్తంగా ఇవ్వబడినవి. ప్రతి ఖథకు చిన్నపిల్లలకు కూడా అర్థమయే విధంగా రేఖచిత్రలను ఇవ్వబడినవి. చిత్రాలను చూస్తూ కథ చదువితే మనస్సుకు బాగా హత్తుకుంటుంది. ఎంతో ఆనందము కలుగును. ప్రతిరోజు పారాయణము పూర్తి చేయగానే బాబాకు కర్పూర హారతి ఇవ్వవలెను. ఏడు రోజులు పారాయణము చేసిన తర్వాత ఎనిమిదవ రోజు (గురువారం) ధ్యానంలో బాబా కథలను లీలలని మననం చేసుకొని వ్రత సమాప్తి చేయాలి. సాయి నాథునికి నైవేద్యం సమర్పించి హారతి ఇవ్వ వలయును. కనీసం ఇద్దరు పేదవారికి అన్నదానం చేయవలయును. సాయి సద్గురువుకు నమస్కరించి **11** రూపాయలు ఏదైన షిరిడి సాయిబాబా దేవాలయములో దక్షిణ ఇవ్వాలి. ఇలా చేస్తే సాయి నాథుడు ప్రసన్నుడై కోరిన కోరికలను తీర్చి మోక్ష సంపదను ప్రసాదిస్తాడు.

సప్తాహ కాలములో గురువారం నుండి బుధవారం వరకు చదువవలసిన అధ్యాయాలు.

| | | | | |
|---|---|---|---|---|
| **1**. | గురువారం | **1**అ. | నుండి | **8** అ. వరకు |
| **2**. | శుక్ర వారం | **8**అ. | నుండి | **15**అ. వరకు |
| **3**. | శని వారం | **16**అ. | నుండి | **23**అ. వరకు |
| **4**. | ఆది వారం | **24**అ. | నుండి | **31**అ. వరకు |
| **5**. | సోమ వారం | **32**అ. | నుండి | **37**అ. వరకు |
| **6**. | మంగళవారం | **38**అ. | నుండి | **45**అ. వరకు |
| **7**. | బుధ వారం | **46**అ. | నుండి | **52**అ. వరకు |

పై అధ్యాయాలు పారాయణం చేయడం పద్ధతి మాత్రమే, ఇలా చేయాలని నియమము లేదు. ఒకటి/రెండు,/మూడు రోజులలో కూడా పారాయణము చేయగలిగితే సాయి మహారాజు ప్రసన్నుడౌతాడు.

**2**. నిత్య పారాయణము : కుటుంబ సభ్యులు మరియు ఇతర భక్తులు ఒక చోట కూర్చుని ఎదురుగా బాబా పటము పెట్టుకొని అగరు బత్తులు వెలిగించాలి. వారి అవకాశాన్ని బట్టి ఈ సచ్చరిత్ర గ్రంథము లోని అధ్యాయాలను బిగ్గరగా చదువ వలయును. మిగిలిన వారు ఏకాగ్రతతో విన వలయును. ఆ రోజు పారాయణము ముగిసిన తర్వాత బాబాకు కర్పూర హారతి ఇవ్వ వలయును. ప్రసాదము నైవేద్యంగా చూపిస్తే మంచిది.

పైన చెప్పిన పద్ధతులలో చేయలేని భక్తులు వారి కాల కృత్యములు ముగించుకొని స్నానం చేసిన తర్వాత పూజా మందిరములో కూర్చుని ఈ శ్రీ సాయి సచ్చరిత్రలోని సాయిబాబా కథామాలిక లోని కథలను పారాయణము చేయాలి. రోజూ వారి వారి వీలును బట్టి **1** లేక **2** అధ్యాయాలు చదువ వలయును అది కూడా వీలు కాని రోజు ఒక కథ శ్రద్ధతో చదివినా సరిపోతుంది. పూర్తి ధ్యాస బాబాపైననే వుంచాలి

ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి

## సంక్షిప్త శ్రీ సాయిబాబా సచ్చరిత్ర
## విషయ సూచిక :

**1**. గురు వారము


| | |
|---|---|
| **1** | మంగళాచరణము |
| **2** | కథా ప్రయోజనము నామకరణము |
| **3** | గ్రంథ ప్రయోజనము, బాబా అనుజ్ఞ |
| **4** | సాయి సమర్థవతరణము |
| **5** | శ్రీ సాయి పునః ప్రకటీభవము |
| **6** | శ్రీ రామ నవమి ఉత్సవము |
| **7** | వివిధ కథా నిరూపణము |
| **8** | శ్రీ సమర్థవతరణము |


**2**. శుక్ర వారము


| | |
|---|---|
| **9** | పంచ సూనాది పాతక ప్రక్షాళన,ఆత్మారామునికథలు |
| **10** | శ్రీ సాయినాథ మహిమలు |
| **11** | శ్రీ సాయినాథ మహిమలు ఒఒ |
| **12** | శ్రీ సంత ఘేలప దర్శనము |
| **13** | భక్తుల రోగనివారణ |
| **14** | రతన్‌జీ మౌలీ సాహెబ్ దక్షిణ వృత్తాంతము |
| **15** | దాసగణు సంకీర్తన,చోల్కర్ మొక్కు, బల్లి పలుకు |

**3**. శని వారము


**16** పరమ లోభి బ్రహ్మ జిజ్ఞాసి బ్రహ్మ స్వరూప వర్ణన
**17** బ్రహ్మజ్ఞాన కథనము శ్రేయము ప్రియము
**18** శ్రీ సాయిబాబా అనుగ్రహము
**19** శ్రీ సాయిబాబా అనుగ్రహము శ్రద్ధ, సహనము
**20** ఈసావాస్య ఉపనిసత్ సారము
**21** అనుగ్రహ కరణము
**22** అపమృత్యు నివారణము


**4**. ఆది వారము


**23** గురుభక్తి లీలా దర్శనము
**24** వినోద విలసితము
**25** భక్తాభీష్య సంపాదనము
**26** అపస్మార ఆత్మ హత్యానివారణము
**27** దీక్ష అనుగ్రహ దానము
**28** కలలలు కథలు
**29** బాబా చేసే దాన ధర్మాలు
**30** మొక్కుబడులు ఇతర కథలు
**31** సాయి దర్శన మహిమ


**5**. సోమ వారము


**32** గురు మహిమ వర్ణనము
**33** విభూతి మహిమ - 1
**34** విభూతి మహిమ - 2

35 విభూతి మహిమ - 3, సంశయాల నివారణ
36 సాయి సర్వ వ్యాపకత, ఆశీర్వచన ఫలం
37 చావడి వర్ణనము

6. మంగళ వారము

38 హండీ వర్ణనము
39 గీతా శ్లోక వివరణ సమాధి మందిర నిర్మాణం
40 ఉధ్యాపన కథా కథనము
41 సాయి కృపానుగ్రహ దానము
42 సాయినాథుని మహ సమాధి - 1
43 సాయినాథుని మహ సమాధి - 2
44 సాయినాథుని మహ సమాధి - 3
45 గురుచరణ మహిమ వర్ణనము

7. బుధ వారము

46 శ్యామా కాశి గయ ప్రయాణము మేకల జన్మ వృత్తాంతము
47 శ్రీ సాయి ముఖ స్తుత కథనము
48 సాశంక భక్త అనుగ్రహము
49 సత్పురుష పరీక్ష మనోనిగ్రహము
50 అజ్ఞాన నిరసనము
51 భక్త త్రయ వృత్త కథనము
52 ఫలశృతి , ప్రార్థన

# అధ్యాయము 1

(మంగళాచరణము)

శ్రీ గజముఖ గణపతి నీకు వందనము, నీవు భక్తుల విఘ్నాలను తొలగిస్తావు. నీ బుద్ధి సిద్ధులతో నన్ను కటాక్షించు. శ్రీ సాయియే గజాననుడు. శ్రీ సరస్వతిదేవికి నా వందనము. మాతా జగన్మాతా నన్ను సదా కటాక్షించు. బాబా, మీ లీలలను సమస్త భక్త జనులకు అర్థమగునట్లు క్లుప్తముగ వ్రాయించు. పూర్వజన్మ సుకృతము ఉన్నచో బాబా పాదాలచెంత అనుగ్రహము లభించును. సాయియే సద్గురువు. శ్రీ సాయి బాబా చరిత్ర ఒక మహాసముద్రము. దాని అవతలి ఒడ్డు దృష్టికి కనపడదు. మహా పర్వతాన్ని ఒక పురుగు తొలుచుట సాధ్యమా! బాబా! నన్ను అనుగ్రహించి నా ఈ ప్రయత్నము సంక్షిప్త సచ్చరిత్ర సఫల మగునట్లు అనుగ్రహించు స్వామీ. నీ కరుణ లేనిదే ఒక్క అక్షరము ముక్క కూడా వ్రాయలేను.బాబా ఆజ్ఞపాలనే నా కర్తవ్యము. బాబానే ఈ కార్యాన్ని పూర్తిచేసుకుంటాడు. జ్ఞాన సంపన్నులందరికి వందనములు. నా తల్లి బాల రాజమ్మకు, తండ్రి పాపయ్యకు పాదాభివందనములు. చివర సద్గురు సాయి నాథునికి పాదాభివందనము. హస్తాలతో సాయిచరణ సేవ, నయనాలతో దర్శనము, నాసికతో సాయి పాదతీర్థ ఆఘ్రాణము, చెవులతో లీలామృత శ్రవణము, మనస్సుతో సాయి దివ్యమూర్తి ధ్యానము, చిత్తంతో సాయి చింతన చేస్తే సంసార బంధనము తొలగి పోవును. సాయిని శరణు జొచ్చిన వారు అనేక కష్టాల నుండి రక్షించ బడతారు.

**శ్రీ దభోల్కర్‌కు సాయిబాబా కనిపించుట** : శ్రీ గోవింద రఘునాథ దభోల్కర్ (హేమాద్ పంత్) షిరిడికి వచ్చిన తొలిరోజులలో క్రీ.శ.**1911**. వ సంవత్సరం మాసములో సాయి బాబా దర్శనమునకు వెళ్ళాడు. ఆ రోజు ఉదయము బాబా ద్వారకామాయిలో ముఖము కడుగుకొని ఒక చేటలోకి సంచిలోనుండి గోధుమలు పోసాడు. ఒక

గోనెసంచిని నేలపై పరచి, దాని పై విసుఱ్ఱాయి వుంచాడు. పిడి ఊడకుండ గట్టిగా కొట్టాడు. చేతి పై కఫినీని మోచేతి పైకి లాక్కుని విసుఱ్ఱాయికి దగ్గరగా కాళ్ళు చాపుకొని కూర్చున్నారు. గోధుమలను పిడికెడు, పిడికెడు విసుఱ్ఱాయిలో పోస్తు విసరు చుండెను. ఈ దృశ్యము చూసి హేమాద్‌పంత్ మరియు అక్కడ చేరిన భక్తులు ఆశ్చర్య పోయారు. బాబాను ప్రశ్నించే ధైర్యము ఎవరికి లేకుండెను. ఊళ్ళో వారికి ఈ విషయము తెలియగానే నలుగురు స్త్రీలు పరుగెత్తుకొని వచ్చి బాబాకు కోపము వచ్చినా వారినక్కడి నుండి లేవదీసి వారి లీలలను గానం చేసుకుంటూ విసరసాగారు. ఆ స్త్రీల అనురాగం చూసి బాబా యొక్క కోపము కరిగి పోయింది. బాబా వారిని ప్రేమగా చూస్తూ నవ్వుకొన్నారు.

జ్ఞానమనే పిడిని పట్టుకొని క్రింది ఱాయి (కర్మ)పై భక్తితో విసరినచో గోధుమలు పిండిగా మారును. గోధుమల నుండి పిండి, పిండితో రొట్టె ఇలా రూపాంతరము చెందుతూ సృష్టిచక్రములో ఉండిపోవడమే. ఏ గోధుమలైతే మధ్యలో వున్న ఇనుప బొడ్డును అంటి పెట్టుకొని వుండునో అవి మార్పు చెందకుండా స్థిరంగా వుండును. ఆ ఇనుప బొడ్డే గురువు. గురువును అంటి పెట్టుకుని ఉండువారే ముక్తి పొందగలరు.

## స్త్రీలు గోధుమ పిండిని ఊరి పొలిమేరలో చల్లుట:

విసరు నప్పుడు ఆ స్త్రీలు తమలో తామిట్లనుకొనిరి 'భిక్షావృత్తి చేసే బాబా స్వయంగా రొట్టెలు చేసుకోరు, వారికి ఇల్లూ పిల్లలు లేరు, పోషించ వలసిన వారెవరూ లేరు. వారికి ఈ గోధుమ పిండి అవసరము లేదు. ఆయనకు గోధుమ పిండితో ఏమి పని? పరమ దయాళువు అయిన బాబా ఈ పిండినంతా మనకే యిచ్చేస్తారు కాబోలు.' పిండి విసరిన తర్వాత ఆ పిండిని ఆ స్త్రీలు నాలుగు భాగములుగా చేసి నలుగురూ తీసుకొను చుండిరి. ఆ పిండిని నింపుకొని తమ యిళ్ళకు బయలు దేరు

చుండగా నిశ్శబ్దంగా శాంతంగా కూర్చుని ఆ స్త్రీల పనిని కనిపెట్టిన బాబా లేచి, కోపముతో వారిని తిట్టుచు ఇట్లనెను. 'నేను మీకు ఋణపడి వున్నట్లు, మీ బాబు సొమ్ము లాగ ఈ పిండిని ఎక్కడికి తీసుకెళ్ళు చున్నారు? ఊరికే దొరికింది కదా అని తిందామను కుంటున్నారు కదూ! వెంటనే వెళ్ళి ఈ పిండిని గ్రామ సరిహద్దులో చల్లుడు.' ఆ స్త్రీలు బాబా మాటను ఆజ్ఞగా తీసుకొని, వారు చేసిన పనికి సిగ్గు పడుతూ, బాబా ఆజ్ఞానుసారము గ్రామ పొలిమేరలలో ఆ పిండిని చల్లిరి. తరువాత బాబా ఎందుకు అలా చేసారని హేమాద్ పంత్ ఊరి వారిని అడుగగా, ఊరిలో కలరా వ్యాధి వ్యాపించి ఉందని, ఆ మహమ్మారిని బాబా గోధుమ పిండి రూపములో బయటకు పారద్రోలిరని చెప్పారు. ఆ విధంగా చేసి నప్పటి నుండి ఊళ్ళో చల్లని ప్రశాంత వాతావరణం ఏర్పడిందని చెప్పారు. ఈ వింత చర్యను చూసి హేమాద్ పంత్ ఆకర్షితుడై ఇలాంటి విచిత్రములతో కూడిన సాయి బాబా లీలలను సచ్చరిత్ర రూపములో వ్రాయాలని సంకల్పించారు. బాబా అనుమతి కోరగా, కొంత కాలమాగమని ఆదేశించారు. క్రీ.శ.**1917** సం. లో శ్యామా ద్వారా ప్రయత్నించగా బాబా విభూతి ప్రసాదమును చేతిలో పెట్టి ఆశీర్వదించారు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *పూర్వ జన్మ సుకృతము ఉన్నచో బాబా పాదాలచెంత అనుగ్రహము లభించును.*
- *హస్తాలతో సాయి చరణ సేవ, నయనాలతో దర్శనము, నాసికతో సాయి పాదతీర్థ ఆఘ్రాణము, చెవులతో లీలామృత శ్రవణము, మనస్సుతో సాయి దివ్యమూర్తి ధ్యానము, చిత్తంతో సాయి చింతన చేస్తే సంసార బంధనము తొలగిపోవును.*

# అధ్యాయము 2

(కథా ప్రయోజనము నామకరణము)

గోధుమ పిండితో కలరా వ్యాధిని తరిమి వేసి, గ్రామస్థులకు ఆశ్చర్యాన్ని కలిగించిన సాయిబాబా లీల శ్రీ గోవింద రఘునాథ దభోల్కర్ (అన్నా సాహెబ్ దభోల్కర్)లో ఆనందాన్ని కలిగించింది. సాయి బాబా యొక్క యితర మహిమలను కూడ విని చాలా సంతోషించారు. బాబా లీలలను భక్తులకు విశద పరిస్తే వారి పాపాలు పోతాయని, ఇహ పర సుఖాలు లభిస్తాయని, అతి పవిత్రమైన ఈ సాయి సచ్చరిత్రను వ్రాయ సంకల్పించారు. సత్పురుషుల చరిత్ర, న్యాయ శాస్త్రము లేక తర్క శాస్త్రము లాంటిది కాదు. ఇది ఒక మహా సముద్రము. సత్సంగాలలో సద్గురువుల, యోగీశ్వరుల కథలను శ్రవణము మననము చేయు వారు ధన్యజీవులు.ఎల్లప్పుడూ బాబా వద్ద భక్తులు అనుభవించిన విషయాలను వ్రాస్తే అవి చదివిన వారికి ఆనందము, ఉల్లాసము కలుగును. బాబా చెప్పిన కథలు వింటే భక్తులు శరీర బాధలు మరిచి పోతారు. బాబా బోధలను మననము చేసిన వారికి, విన్న వారికి సంపూర్ణ శాంతి మరియు ముక్తి లభిస్తుంది. ఈ రచన సాయి నాథుని ప్రేరణే, వారేది చెపితే అది వ్రాస్తాను అని అనటానికి కూడా హేమాద్ పంత్ తన అహంభావమే అనుకొన్నాడు.

**గురువు గురించి వాదన :** అన్నా సాహెబ్ దభోల్కర్ షిరిడి వెళ్ళిన మొదటి రోజు బాలా సాహెబ్ భాటేతో గురువు యొక్క అవసరము గూర్చి వివాదము జరిగినది. మన స్వేచ్ఛను విడిచి ఇంకొకరికి ఎందుకు లొంగి ఉండవలెను? మన కర్మలను మనమే చేసినప్పుడు గురువు యొక్క అవసరం ఏమి? తనంతట తాను జన్మ నుండి తప్పించు కొనవలెను. ఏమి కష్ట పడని వారికి ఎవరైన ఏమి చేయగలరు? అని అన్నా సాహెబ్ వాదించాడు. గర్వము అహంకారము ఏమి తోడ్పడవు. గురువు యొక్క అనుగ్రహము లేకపోతె

ఎంత వేదాంతి అయినా ముక్తి పొంద లేడని భాటే వాదన. అన్నా సాహెబ్ చాలా అల్లరి వాడు, మాటకారి, ఇతరులను అవమాన పరచే అలవాటు ఉండేది. ఎప్పుడు వాగ్వివాదాలకు దిగేవాడు. అతనికి సద్గురువు మహిమ కాని ప్రాముఖ్యము కాని తెలియవు. కాకాసాహెబ్ దీక్షిత్ మరియు నానా సాహెబ్ చందోర్కర్ వీరికి బాగా పరిచయము. కాకాసాహెబ్ దీక్షిత్ బలవంతము వలన షిరిడి వెళ్ళడానికి నిశ్చయించు కున్నాడు. ఆ సమయములో లోనావాలాలో ఉన్న అతని స్నేహితుని కొడుకు జబ్బు పడ్డాడు. ఎన్ని చికిత్సలు, మంత్ర ప్రయోగాలు చేసినా, వారి గురువు గారిని పిలిపించి ప్రక్కన కూర్చో బెట్టినా ఆ అబ్బాయి చని పోయాడు. తన స్నేహితుని కుమారుణ్ణి రక్షించలేని గురువు ప్రయోజనము ఏమి? గురువు మనకు ఏమి సహాయము చేయ నప్పుడు తను షిరిడి ఎందుకు పోవాలి, అని భావించి షిరిడి ప్రయాణము ఆపి వేసాడు. మనకు వచ్చే సుఖ దుఃఖాలను మనము అనుభవించ వలసినదే. ఎందుకు గురువు వెంట వుండాలి? జరుగ నున్న దానిని తప్పించ లేనప్పుడు గురువెందుకు? కానున్నది కాక మానదు. అంటూ వాదించాడు. ఈ వాదన ఒక గంట వరకు జరిగింది. అందరూ వాదించి అలసి పోవుటచే వాదన మాను కున్నారు. ఫలితము ఏమి తేల లేదు పైగా అందరి మనశ్శాంతి పోయింది

**అన్నా సాహెబ్ దభోల్కర్‌కు నామకరణము** : కొంత సేపటి తర్వాత అందరు కలిసి మసీదుకు పోగానే బాబా, కాకా సాహెబ్‌తో వాడాలో ఏమి జరిగింది? దేని గురించి ఈ వాదన? ఈ హేమాద్ పంత్ ఏమంటున్నాడు? అంటూ అన్నా సాహెబ్ దభోల్కర్ వైపు చూసాడు. ఇంత దూరంలో ఉన్నప్పటికి బాబాకు యీ విషయము ఎలా తెలిసిందని అందరూ ఆశ్చర్య పడ్డారు. అన్నా సాహెబ్ పరుగెత్తి బాబా పాదాలపై పడ్డాడు. నానా సాహెబ్ చెప్పిన దాని కంటె ఎక్కువ ఆనందాన్ని పొందాడు. బాబా దర్శనంతో జీవితం ధన్యమైందని తలచాడు. తనకు ఈ అవకాశం ఇప్పించి ఉపకారం చేసిన వారికి

కృతజ్ఞతలు తెలుపు కున్నాడు. అప్పటి నుండి అతనికి వైరాగ్యము మొదలైంది. కాకి లాంటి తను సాయి పాదస్పర్శతో హంసనై పోయానని అనుకొన్నాడు. అతని ఆనందానికి అవధులు లేవు. అతనికి సర్వం సాయి మయం అనిపించింది. కొంత సేపటి తర్వాత అందరు కలిసి మసీదు కు పోగానే బాబా, కాకా సాహెబ్‌తో వాడాలో ఏమి జరిగింది? దేని గురించి ఈ వాదన? ఈ హేమాద్ పంత్ ఏమంటున్నాడు? అంటూ అన్నా సాహెబ్ దభోల్కర్ వైపు చూసాడు. ఇంత దూరంలో ఉన్నప్పటికి బాబాకు యీ విషయము ఎలా తెలిసిందని అందరూ ఆశ్చర్య పడ్డారు. అన్నా సాహెబ్ సిగ్గుతో తలవంచుకుని నిశ్శబ్దంగా నిలబడి పోయాడు.

ఉదయము తను చేసిన వాదన కారణంగానే హేమాద్ పంత్ అని నామకరణము చేసాడని, బాబా సర్వజ్ఞుడని అర్థము చేసు కున్నాడు. 'నేను భరధ్వాజస గోత్రజ్ఞు డను, మూఢుడను, మూర్ఖుణ్ణి, వాచాలుడను, నేను ఒక్క పద్యమైన వ్రాయలేని వాణ్ణి. బాబా నా అహంకారాన్ని అణచి వేయాలని ఇక నుంచైనా అణకువతో ఉండాలని బాబా ఇలా పేరుపెట్టాడు వారు ప్రసాదించిన పేరును నేను భూషణంగా తీసుకోవాలి.'ఇప్పటినుండి వాగ్వివాదాలలో పాల్గొన కూడదు అని కూడా నిర్ణయించు కున్నాడు. అతనితో సచ్చరిత్ర వ్రాయించెదననియు ముందే బాబాకు తెలుసు. బాబా బోధనల పద్ధతే వేరు హేమాద్ పంత్‌కు విసుర్థాయి తో గురువును ఆశ్రయిస్తేనే ముక్తి కలుగునని జ్ఞాన బోధ చేసాడు.

హేమాద్ పంత్, అను పేరు హేమాద్రి పంత్ అను పేరుకు మారుపేరు, **13** వ శతాబ్దములో దేవగిరికి చెందిన యాదవ రాజులు మహాదేవరాజు, రామరాజులకు మంత్రి హేమాద్రి పంత్. అతడు రాజకీయ ధురంధరుడు మహా పండితుడు, చతుర్వర్గ చింతామణి, రాజప్రశస్తి అను గ్రంథములను రచించాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 3

(గ్రంథ ప్రయోజనము, బాబా అనుజ్ఞ)

**సాయి బాబా వాగ్దానము :** సాయి బాబా హేమాద్ పంత్‌కు ధైర్యాన్నిచ్చి 'నా చరిత్ర రచించటానికి నా పూర్తి అనుమతి ఉంది. నీ పనిని నీవు చేయుము. నీవు భయపడకుము. నా లీలలు భక్తి శ్రద్ధలతో వింటే ప్రపంచము పై వ్యామోహము తొలగి పోవును. నా లీలలలో మునిగిన వారికి జ్ఞాన రత్నాలు లభించును.'అని అనగా, హేమాద్ పంత్ భయాలు తొలగి పోయిన వాడై, బాబా పాదాలకు నమస్కరించి సచ్చరిత్ర వ్రాయడానికి సిద్ధపడెను. బాబా శ్యామాతో భక్తులకిచ్చే తన వాగ్దానాన్ని ఇలా తెలిపాడు, 'నాపై మనస్సు ఉంచిన వారి యోగ క్షేమములు నేను చూసు కుంటాను. నా నామాన్ని ప్రేమతో ధ్యానము చేయు వారి కోరికలు తీర్చి ప్రేమను వృద్ధి పరుస్తాను. నా చరిత్రను, లీలలను గానం చేయు వారికి శాశ్వతమైన ఆనందమును ఇచ్చెదను. నన్నెవరు సర్వస్య శరణాగతి వేడెదరో వారికి సుఖ శాంతులు కలిగిస్తాను.  నన్ను శరణు జొచ్చి, నా భజన కీర్తన స్మరణము చేయువారిని ఉద్ధరించెదను. భక్తితో నన్ను ఎల్లప్పుడు ధ్యానము చేసే వారికి ప్రపంచ విషయముల యందు ధ్యాస ఎలా ఉంటుంది? నా కథలు వింటే సర్వ రోగాలు నివారణ మవుతాయి. నా భక్తుని మృత్యువు నుండి కూడా బయటికి లాగెదను. నాపై శ్రద్ధ, ధ్యాస ఉన్న వారికి మనస్సు ప్రసన్నంగా ఉంటుంది.

**రోహిల్లా ఖురాను బిగ్గరగా చదువుట :** రోహిల్లా అను బాబా భక్తుడు దృఢమైన వాడు, పొడుగైన వాడు,  పొడుగైన చొక్కా తొడిగే వాడు. బాబా కీర్తి విని మోహితుడై షిరిడి మసీదు లో స్థిర నివాసము ఏర్పరుచు కున్నాడు. అతను ఎవరిని లెక్క చేసే వాడు కాదు. రాత్రింబగళ్ళు ఖురాను లోని కల్మాను గొంతు చించుకొని బిగ్గరగా చదివే వాడు.  బాబా ఎంత క్షమాశీలి, రోహిల్లా ఒక పిచ్చి వాడు,

అయినా అతనంటే బాబాకు ఎంతో గౌరవం, ఆదరం. అతను కల్మాలను శాస్త్రీయంగ పాడేవాడు. నిజంగా రోహిల్లాకు భార్యయే లేదు, భార్య అనగా దుర్బుద్ధి అని అర్థం. బాబా కల్మాను ప్రీతితో వినేవారు. రోహిల్లా సహవాసం తనకు యిష్టం అంటే తనకు భగవన్నామస్మరణ అంటే యిష్టం అని అందరికి తెలియచేసారు. హరి నామం అంటే గిట్టని వారిని బాబా తన దగ్గరకు చేరనిచ్చే వాడు కాదు. బాబాకు బ్రాహ్మణుడైనా పఠాను అయినా సమానమే.

**షిరిడి ప్రజలు  బాబాకు మొర పెట్టుకున్నారు :** పొలాలలో కష్టపడి పని చేసే షిరిడి ప్రజలు అర్ధ రాత్రి కూడా రోహిల్లా అరుపులకు నిద్ర పట్టక అసౌకర్యానికి విసుగు చెందే వారు. సాయి మహారాజు అతనిని ఏమి అనేవాడు కాదు. అతను బాబా మద్దతుతో ఊరి ప్రజలను తిట్టే వాడు. ఊరి వారు భరించ లేక బాబా దగ్గర ఆ కేకలను ఆపు మని మొర పెట్టు కున్నారు. కాని బాబా వారినే కోపించి రోహిల్లా జోలికి మీరు వెళ్ళ వద్దు, మీ పనులు మీరు చేసుకోండి అని మందలించారు. రోహిల్లాకు ఒక దౌర్భాగ్యపు భార్య కలదని. ఆమె గయ్యాళి యనియు, ఆమె రోహిల్లాను, తనను బాధ పెట్టునని, రోహిల్లా అరుపులు విని అది ఏమి చేయలేక ఊరకుండునని బాబా చెప్పేవాడు. అలసి పోయినంత తానే ఊరకుండును, మీ బాధ తీరి పోతుంది అని చెప్పారు. ఇంత దగ్గర ఉండి బాబానే భరించి నప్పుడు మనకేంటి అని ప్రజలు వెళ్ళి పోయారు. ఒక రోజు  బాబా ఈ క్రింది మధుర వచనాలు పలికాడు. 'మీరు ఎక్కడున్నా ఏమి చేస్తున్నా మీ విషయాలు నాకు అన్ని తెలుసని జ్ఞాపకం ఉంచుకోండి. నేను అందరి హృదయాలలో ఉన్న అంతర్యామిని, అందరి స్వామిని నేనే. ప్రపంచములోని జీవకోటిలో నిండి ఉన్నాను. జగత్తును నడిపించే సూత్ర ధారిని నేనే. నేనే జగన్మాతను. యింద్రియములను నడిపించు వాడను నేనే. సృష్టి, స్థితి, లయ కారకుడను నేనే. నా పై దృష్టి వున్న వారికి ఏ కష్టము ఉండదు. నన్ను మరిచిపోయిన వారిని మాయ బాధిస్తుంది. పురుగులు, చీమలు,

దోమలు, రాజు, పేద, చరాచర జీవకోటి అంతా నా రూపమే. ఈశ్వరునికి, సత్పురుషునికి భేదం లేదు, సాయి చరాచర జీవ కోటిలో వున్నాడు. ప్రపంచమంతా సాయి రూపమే.వారి అవతారం ప్రపంచాన్ని ఉద్ధరింటానికి. గురు తత్వంలో లీనం కావాలంటే గురువును కీర్తించాలి, గానం చేయాలి, భక్తితో శ్రవణం చేయాలి. భక్తి భావంతో శ్రవణం చేస్తే మంచి జరుగును. గురు పాదాలపై ప్రేమ జనించి అంతా క్షేమం కలుగుతుంది.

**బాబా కథా శ్రవణము :** ఓడలు సముద్రములో దారి తెలియక చిక్కు కోకుండ సాగి పోవడానికి దీపస్తంభాలు నిర్మిస్తారు. అలాగే సాయి నాథుని కథలు సంసార సాగరాన్ని దాటడానికి వుపయోగ పడును. బాబా లీలలు, కథలు చెవులలో ప్రవేశించి ద్వైత భావాన్ని తొలగించును. హృదయంలో జ్ఞానం కలుగును. బాబా కీర్తి, వర్ణన, భక్తితో శ్రవణం చేస్తే పాపాలు దహించి మోక్షము లభించును. కలి యుగంలో ముక్తి పొందాలంటే సులభ సాధనము సంకీర్తనము. ఈ సాధనమును అందరూ అవలంబించ వచ్చును. గురు కథా శ్రవణము ఒక్కటే అందరికి సులభమైనది, పుణ్యం పండిన వారే ఈ శ్రవణము చేయ గలరు. యోగము, యాగము, ధ్యానము, పఠనము, అవలంబించుట కష్టము, కాని ఈ కథా శ్రవణమునకు ఏకాగ్ర చిత్త మొక్కటి తప్ప మరి ఏమియును అవసరము లేదు. బాబా కథలు శ్రవణము, మననము చేస్తే పంచ పాపాలు పోయి, దుఃఖాలు నశించి శాంతి కలుగును.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *ఈ విశ్వం లో బాబా ఉన్నాడు, విశ్వమంతా బాబాలో ఉన్నది. బాబాయే బ్రహ్మము.*

# అధ్యాయము 4

(సాయి సమర్థవతరణము)

**శ్రీ సాయి బాబా అవతార లక్ష్యము :** సాధు జీవితాలు మధురాతి మధురాలు. అందులో 'సాయి కథ' అమృతము. సాయి భక్తులు ఈ కథామృతాన్ని పానం చేసి ఆనంద పరవశులగుదురు. ప్రజలు ధర్మాచారాలను కించ పరిచినప్పుడు, ధర్మ వచనాలు వినకుండ ఎవరి మాటలను లక్ష్య పెట్టనప్పుడు, బ్రాహ్మణులు మద్యపానాదులు సేవించి నప్పుడు, ధర్మపరులు దండనకు గురి అయినప్పుడు, ప్రజలు ఆయురారోగ్యాలు లెక్క చేయనప్పుడు, యోగులు జప, తప, ధ్యానాదులు మానినప్పుడు, జనులు ధన మాన పుత్రాదులే సర్వస్వమని తలచినప్పుడు, ధర్మం ముసుగులో అత్యాచారాలు జరిగినప్పుడు, ప్రజలను ఉద్ధరించడం కోసం సత్పురుషుల అవతరణ జరుగును. ధర్మాన్ని పునః ప్రతిష్ఠించడానికి సత్పురుషులు ప్రజల కొరకే అవతరిస్తారు. భక్తులను ఉద్ధరించి అవతార సమాప్తి చేస్తారు. మహా పురుషుడైన సాయికి కాయా, వాచా, మనసా శరణాగతి చేస్తే సర్వ సుఖాలు కలుగును. సకలేంద్రియాలను నడిపించు సాయియే ఈ గ్రంథ రచనకు ప్రేరేపించారు. ఒక పద్ధతిలో కథలను సూచించారు. శ్రీ సాయి గుణాలను వర్ణించడం ఎవరి తరం కాదు. పూర్ణ మౌనం ఒక్కటే అతన్ని వర్ణించ గలదు. సద్గురువుకు సంకల్పం కలిగినప్పుడు భక్తులను ప్రేరేపించి అనిర్వచనీయ తత్వాన్ని అనుభవించేలా చేస్తారు. సాయి గుణాలను కూడా అనుభవించ గలమే కాని ఇతరులకు విశదీకరించుట అసాధ్యము. సద్గురువు తానుగా సంకల్పించి నప్పుడే తనకు నచ్చిన వారికి ప్రేరణ కలిగిస్తాడు. వారే సాయి గుణాలను వివరంగా నిర్వచించ గలరు. బాబా భక్తులకు షిరిడియే పండరి పురము, బదరి, కేదారి, పూరి జగన్నాథము, కాశి, రామేశ్వరము, నాసిక్, త్రయంబకేశ్వరము, మహాబలేశ్వరము, గోకర్ణము. షిరిడిలో సాయి దర్శనమే పరమార్థానికి

సుగమ మార్గం, వారి చరణ దర్శనమే త్రివేణి సంగమ స్నానము, సాయి ఆజ్ఞయే మనకు వేద మంత్రం. విభూతి ప్రసాదమే పుణ్య పావనం. బాబాయే శ్రీకృష్ణుడు, శ్రీరాముడు. బాబా క్షేత్రము సర్వ వ్యాప్తం, షిరిడి కేవలం కేంద్ర స్థానము. బాబా పండరినాథుని అవతారమే. అతను అనాథల కొరకు, బీదల కొరకు అవతరించిన దయామయుడు. శ్రీ సాయిబాబా భక్తుల కొరకు **16** సంవత్సరముల బాలునిగా వేప చెట్టు కింద ప్రథమంగా బ్రహ్మజ్ఞానిగా ప్రకటమైనాడు. బాబా ఏ దేశములో,ఏ వంశములో, ఏ పుణ్య దంపతులకు జన్మించారనే విశయాలు ఎవరికి తెలియవు.

**షిరిడిలో దాసగణుకు ప్రయాగ తీర్థ స్నానము :** ఒక పండుగ నాడు దాసగణు మహారాజ్ ప్రయాగ తీర్థములో (గంగా యమునల సంగమము) స్నానము చేయాలని అనుకొని బాబా అనుమతి కోరాడు. అప్పుడు బాబా, 'గట్టి నమ్మకము ఉంటే ప్రయాగ తీర్థాలు ఇక్కడే వుంటాయి, వాటి గురించి అంత దూరం పోవలసిన పని లేదు' అని అన్నారు. దాసగణు మహారాజ్ బాబా పాదములపై శిరస్సు ఉంచిన వెంటనే, బాబా రెండు పాదముల బొటన వేలి నుండి గంగా యమునలు ప్రవహించాయి. దాసగణు బాబా లీలలను అద్భుత శక్తిని వర్ణించి కవిత్వముగా గానం చేసి తృప్తి పొందాడు.

**దాసగణు సాయిబాబాను స్తుతించుట :** 'సద్గురు బాబా నీ శక్తి అనంతము. నీ లీలలు అమోఘము, జీవులను తరింప చేయు నౌకవు. గంగా యమునలను నీ పాద బొటన వ్రేలి వద్ద ప్రవహింప చేసావు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కలయికే నీమూర్తి, భూమి పై విహరించే సాయి సద్గురుడవు. ఒకప్పుడు బ్రహ్మ వలె జ్ఞాన బోధ చేస్తావు, వేరొకప్పుడు శివుని వలె రుద్ర రూపుడవవుతావు. మరొక్కప్పుడు శ్రీ కృష్ణుని వలె బాల లీలలను చూపిస్తావు. నిన్ను ముస్లిమడామంటె నీకు గంధ మంటే ఇష్టం. హిందువందామంటే మసీదులో వుంటావు. శ్రీమంతుడవని అందామంటే భిక్షాటన చేస్తావు.

ఉదయం నుండి భక్తులు నీ పూజకై వస్తూవుంటారు, హారతి సమయంలో భాస్కరుని వలె కనపడుతావు, ఉదయం ధుని దగ్గర పరమ శివుని మరిపిస్తావు. ఈ విధంగా త్రిమూర్తుల లీలలు మాకు అనుభవమవుతాయి.'అని స్థుతించాడు. విచ్చల విడిగా తిరిగే తన మనస్సును స్థిరంగా వుంచమని దాసగణు మహారాజ్ బాబాను ఆనంద పారవశ్యంలో కీర్తించాడు.

**కాకా సాహెబ్ దీక్షిత్‌నకు విఠలునిగా దర్శనము:** శ్రీ సాయి బాబా ఎప్పుడు 'అల్లా మాలిక్' అని అనెవాడు. ఒకనాడు బాబా దాసగణును నామ సప్తాహము చేయమని ఆజ్ఞ ఇచ్చాడు, దాసగణు బాబాతో, విఠలుడు ప్రత్యక్ష మైతేనే సప్తాహం చేస్తానన్నాడు. బాబా అప్పుడు గుండెపై చేయి వేసుకొని 'భక్తి భావ ముంటే విఠలుడు తప్పకుండా ప్రత్యక్ష మవుతాడు. విఠలుని పండరి పురం, శ్రీ కృష్ణుని ద్వారక యిక్కడే ఉన్నాయి. విఠలుడు ఎక్కడి నుండి రావలసిన పని లేదు. భక్తుని ప్రేమకు తప్పకుండా కనపడతాడు', అని అన్నారు. సప్తాహం ముగిసిన తర్వాత దాసగణుకు విఠలుని దర్శనభాగ్యం కలిగింది. ఒక రోజు కాకా సాహెబ్ దీక్షిత్ ఉదయం ధ్యానంలో ఉండగా విఠలుని దర్శన భాగ్యము లభించింది. తర్వాత బాబా దర్శనానికి వెళ్ళగా బాబా కాకాతో, 'విఠల్ పటేల్ వచ్చాడు కదా. నిన్ను కలిసాడా? పారిపో గలడు. గట్టిగా కట్టి వేయుము. ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా తప్పించుకొని పోగలడు.' అని అన్నారు. బాబా సర్వజ్ఞుడు. అదే రోజు పండరి పుర విఠలుని **25** చిత్ర పటాలు అమ్మడానికి వచ్చాయి. ఉదయం ధ్యానంలో చూసిన మూర్తినే చిత్ర పటాలలో చూసి దీక్షిత్ అమితాశ్చర్య పడిపోయాడు. ఒక చిత్ర పటం కొని పూజా మందిరంలో పెట్టు కున్నాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 5

(శ్రీ సాయి పునః ప్రకటీభవము)

**శ్రీ సాయిబాబా షిరిడిలో పునః ప్రవేశము :** బాబా షిరిడిలో అదృష్యమై నాలుగు సంవత్సరములు ఎక్కడెక్కడో తిరిగి ఒక రోజు ఔరంగాబాద్ పరిసర ప్రాంతమైన సింధూన్ బింధూన్ అను గ్రామముల మధ్య అడవిలో కూర్చుని ఉండెను. ఔరంగాబాద్ జిల్లా లోని ధూప్‌ఖేడ్ గ్రామాధికారి చాంద్ భాయ్ పాటిల్ గుఱ్ఱము రెండు నెలల క్రితం తప్పి పోయెను. అతను గుఱ్ఱాన్ని వెతుకుతూ ఒక ఫకీరును మామిడి చెట్టు క్రింద చూసాడు. ఆ ఫకీరు తలపై టోపి, పొడుగాటి చొక్కా వేసుకుని, చంకలో సటకా పట్టుకొని చిలువ త్రాగుటకు ప్రయత్నించు చుండెను. ఆ ఫకీరు నిరాశ నిస్పృహలతో వున్న పాటిల్‌ను చాంద్‌భాయీ అని పేరు పెట్టి పిలిచి, చేతులో వున్న జీను గురించి అడిగాడు. పాటిల్ తన గుఱ్ఱం తప్పి పోయిందని చెప్పగా దగ్గరలో వున్న కాలువ దగ్గరలో వెతుకు వుంటుందని చెప్పాడు. పాటిల్ అక్కడ వెతుకగా గుఱ్ఱం అక్కడ లభించింది. పాటిల్ ఆశ్చర్యపడి, వీరు సామాన్యులు కాదు సాక్షాత్తు ఆవలియా (యోగి పుంగవుడు) అని అనుకున్నాడు. గుఱ్ఱాన్ని తీసుకొని వచ్చి ఆ ఫకీరు వద్ద కూర్చున్నాడు.

ఆ ఫకీరు వద్ద చిలుము తయారుగ వుండెను, కాని చిలుము వెలిగించుటకు నిప్పు, బట్ట తడుపుటకు నీరు కావలసి వుండెను. బాబా తన సటకాను భూమిపై కొట్టగా నిప్పు వచ్చెను. తర్వాత అదే సటకాతో అదే చోట మళ్ళీ కొట్టగా నీరు వచ్చెను. ఆ ఫకీరు గుడ్డను తడిపి చిలుము తయారు చేసి తను పీల్చి పాటిల్‌ను కూడా పీల్చు మన్నాడు. బాబా లీలను చూసి పాటిల్ చాల ఆశ్చర్యపడ్డాడు. పాటిల్ బాబాను ధూప్‌ఖేడ్ గ్రామానికి ఆహ్వానించాడు. బాబా కొన్ని రోజుల తర్వాత ధూప్‌ఖేడ్‌కు వెళ్ళి పాటిల్ ఇంట్లో కొన్ని రోజులు ఉన్నాడు. మనస్సనే గుఱ్ఱం తప్పి పోగా దానిని గుర్తించి ఎక్కడ దొరుకునో దారి చూపించి,

బాబా భక్తులందరికి తను గురువునని సూచన ప్రాయంగా తెలిపాడు. గురువును నమ్మిన వారికి దారి చూపించ గలనని ఈ కథ ద్వారా తెలుపు చున్నాడు.

**'సాయి' నామకరణము :** పాటిల్ మేనల్లుని పెళ్ళి షిరిడి అమ్మాయితో నిశ్చయమైంది. ఆ పెళ్ళి వారు బండ్లపై, గుఱ్ఱాలపై షిరిడి బయలు దేరారు. బాబా కూడ ఆ పెళ్ళి వారి తోనే షిరిడి ప్రయాణ మయినాడు. ఆ పెళ్ళి బృందం షిరిడి వూరి బయట వున్న ఖండోబా దేవాలయం దగ్గర ఆగారు. బాబా అందరి కంటె ముందు బండి నుండి దిగి ఖండోబా దేవాలయం వైపు నడిచాడు. ఆ దేవాలయ పూజారి 'మహల్సాపతి' బాబాను చూసి 'యా సాయి' (రండి సాయి, దయచేయి సాయి) అని ఆహ్వానించాడు. బాబా ఆ పేరును ఆమోదించాడు. అప్పటి నుండి ఆ ఫకీరును అందరు 'సాయి బాబా' గా పిలువ సాగారు. **1858** వ సంవత్సరము నుండి 'సాయి బాబా' గా ప్రఖ్యాతి చెందాడు. (నిఘంటువు ప్రకారము సాయి అంటే ప్రభువు, దేవుడు, నాథుడు, ప్రియుడు, ఫకీరు. భక్త కబీరు సాయి అనే పదాన్ని ప్రభువు, ఈశ్వరుడు అనే అర్థాల్లో ప్రయోగించాడు. గోరక్ నాథుడు తన గోరక్షకి మయగర్ గ్రంథంలో మహా విష్ణువులా సాయి పదాన్ని వాడాడు.) బాబా తర్వాత మసీదులో నివాసమేర్పరచుకున్నాడు. బాబా దగ్గర చిలుము, రేకుడబ్బా, పొగాకు, సటకా ఎప్పుడూ వుండేవి. శరీరానికి కఫిని, తలకు తెల్లని బట్ట చుట్టుకొని ఎడమ చెవి వద్ద జటాజూటంలా ముడి వేసేవాడు. వారం రోజులైన స్నానం చేసే వాడు కాదు. బట్టలను వారముల తరబడి ఉతకకుండ ఉంచే వాడు, చెప్పులను తొడిగే వాడు కాదు. గోనెముక్క పైననే కూర్చునే వాడు. తలగడ గాని పరుపు కాని ఎప్పుడూ వాడలేదు. ఎప్పుడూ మేలుకొని ఉండే వాడు. ధుని వద్ద కూర్చుని చలి కాచుకొనే వాడు. ఎప్పుడూ 'అల్లా మాలిక్' అనే వాడు. దక్షిణ ముఖంగా కూర్చుని వుండే వాడు. మసీదులో రెండు గదుల స్థలము వుండేది. బాబా అందులోనే

కూర్చోవడం, పడుకోవడం మరియు అందరికి దర్శనం కూడా అక్కడే ఇచ్చేవాడు.

**శ్రీ సాయిబాబా నీటితో దీపాలు వెలిగించుట :** సాయి బాబాకు దీపారాధన అంటే ఇష్టం. అతను రేకు డబ్బాలో నూనెను అడిగి తెచ్చి ప్రమిదలలో నింపి, చిరిగిన గుడ్డలతో వత్తులు చేసే వాడు. వాటిని మసీదులలోను, దేవాలయాలలోను వెలిగించేవాడు. వారు ఈ విధంగా ప్రతి రోజు వ్యాపారస్తుల దగ్గర నుండి డబ్బులివ్వ కుండా నూనెను అడుగుతూ ఉంటే వారికి విసుగెత్తి, బాబాకు నూనె ఇవ్వరాదని వ్యాపారు లందరూ కలిసి నిశ్చయించు కున్నారు. ఎప్పటి లాగ ఒక రోజు నూనెకై వెళ్ళగా అందరూ లేదని సమాధానం ఇచ్చారు. బాబా మాట్లాడ కుండా తిరిగి వెళ్ళి పోయడు. కాని బాబా తన పనిని ఆప లేదు. ప్రమిదలలో వత్తులు వేసారు. రేకు డబ్బాలో నూనె కొంచెమే ఉంది, ఆ నూనె దీపాలకు సరిపోదు. అందు వల్ల ఆ నూనెలో నీళ్ళు పోసి తాగేసారు. ఈ విధంగా పావనం చేసిన పిమ్మట  నీరంతయు డబ్బాలో ఉమ్మి వేసారు. ఆ ఉమ్మిన నీటిని ప్రమిదలలో పోసి దీపాలు వెలిగించారు. దీపాలు నూనె లేకుండానే రాత్రంత వెలిగాయి. ఆ చమత్కారాన్ని చూసిన వ్యాపారులు ఆశ్చర్య పడి అసత్యము చెప్పినందుకు పశ్చాత్తాప పడ్డారు. బాబాను మన్నించమని వేడుకున్నారు. బాబా రాగ ద్వేషములు లేనివాడు. వర్తకుల చేష్టలను మనస్సులో పెట్టుకో లేదు. ఇక మీదట సత్ప్రవర్తనతో ఉండమని చెప్పాడు. బాబాకు మిత్రులు లేరు శత్రువులు లేరు. అన్ని ప్రాణులు సమానము.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *ప్రజలను ఉద్ధరించడానికి సాకారంగా షిరిడిలో అవతరించాడు.*

# అధ్యాయము 6

(శ్రీ రామ నవమి ఉత్సవము)

**బ్రహ్మ తత్వం :** మనస్సు లోని మలినాన్ని శుభ్రం చేస్తే, వైరాగ్యం జనిస్తుంది. జ్ఞానం లభిస్తుంది. కైవల్య ఫలం దొరుకును. జనన మరణముల భయం పోయి ఆత్మానందం కలుగును. ఆది దేవుడైన పరమాత్మ స్వయం సిద్ధుడు. భక్తుల కొరకే బాబా రూపంలో ప్రకట మయ్యాడు. ఈ విధంగా బ్రహ్మ యొక్క శక్తి, ఆ బ్రహ్మ రూపమే మాయ. మాయ పరమాత్మ యొక్క కార్యమైతే జగత్తును మాయ సృష్టించింది. పరమాత్మ, మాయ, జగత్తు మూడు ఒక్కటే.

**బాబా యిచ్చిన హామి :** 'నా భక్తుల యిండ్లలో అన్న వస్త్రాలకు లోటుండదు. వాటి కొరకు శ్రమ పడకండి.' నా యందే మనస్సు నిలిపి, భక్తి శ్రద్ధలతో, మనస్సుతో నన్ను భజించి,సేవించిన వారి యోగ క్షేమములు నేను చూసెదను'. అని సాయి బాబా చెప్పేవాడు. ప్రపంచంలో పేరు, కీర్తి కాంక్ష వదలి, భగవంతుని ద్వారం ముందు నిలచి కొంగు చాచి భగవంతుణ్ణి హృదయం కరిగేలా యాచించాలి. సర్వేంద్రియాలకు భక్తితాపము కలిగి, వాటిని భక్తి వైపు మళ్ళించితే, ఫలితం కనపడుతుంది. ఎల్లప్పుడూ బాబా పైనే మనస్సు నిలపాలి. అప్పుడే మనస్సు శరీరం పైన, ఇంటి పైన, ధనం పైన ఉండక పరిపూర్ణ ప్రశాంతత లభించి పరమానందాన్ని పొందును, అప్పుడే మనస్సు సరియైన సాంగత్యంలో వున్నదని గ్రహించాలి. మనస్సు చంచల మైనచో శాంతి లభించదు. శ్రద్ధగా సాయి చరిత్రను శ్రవణము చేస్తే మనస్సు భక్తితో నిండుతుంది. తృప్తి కలుగును, చంచల మనస్సుకు విశ్రాంతి దొరుకును. అలజడి ఉపశమించి, శాంతి లభిస్తుంది.

**శ్రీరామ నవమి ఉత్సవములు:** షిరిడిలో జరుగు ఉత్సవములన్నిటిలో శ్రీరామ నవమియే గొప్పది. కోపర్‌గాంలో గోపాల్ రావ్ గుండు అను సాయి భక్తుడు, పోలీస్ సర్కిల్ ఇనస్పెక్టర్‌గా

నుండెను. అతనికి ముగ్గురు భార్యలు న్నప్పటికి సంతానం కలుగలేదు. సాయి ఆశీర్వాదంతో ఒక కొడుకు పుట్టాడు. అతను చాలా సంతోషపడి షిరిడిలో ఒక ఉత్సవం చేయాలని క్రీ.శ.**1897** వ. సం. లో భావించాడు. ఈ విషయము గురించి మిగతా భక్తులైన తాత్యాపాటిల్, దాదా కోటే పాటిల్, మాధవరావు దేశ్‌పాండే (శ్యామా) అను వారిని సంప్రదించాడు. వారందరు దీనికి సమ్మతించిరి. బాబా అనుమతి, ఆశీర్వాదము పొందారు. బాబా ఆశీర్వాదము ఉండుటచే గ్రామస్థులు మళ్ళీ ప్రయత్నించగా వెంటనే అనుమతి లభించింది. ఆనాటి నుండి శ్రీరామ నవమి ఉత్సవము జరుపుటకు నిశ్చయమైంది. ఈ ఉత్సవము గురించి దుకాణాలు వేసారు. ఆ కార్య కలాపాలు తాత్యా కోతే బాధ్యత వహించే వాడు. ఆ ఉత్సవానికి చాలా జనం వచ్చే వారు. శ్రీ రామ నవమి రోజు రకరకాల వాయిద్యాలతో భజనలు, పూజలు చేసేవారు. ఈ ఉత్సవములో కుస్తీ పోటీలు కూడ నిర్వహించే వారు. రెండు కొత్త జండాలు ఊరేగింపుగా తెచ్చి మసీదు శిఖరంపై కట్టే వారు. గోపాలరావు గుండు స్నేహితుడైన 'దాము అన్న కాసార్' కు బాబా అనుగ్రహంతో సంతానం కలిగెను. అతను గోపాల రావు ప్రోద్బలంతో ఒక జండా ఇచ్చేవాడు. నానాసాహెబ్ ప్రభోదించగా గోపాలరావు ఒక నగిషీ జండాను ఇచ్చేవాడు. ఈ రెండు జండాలను ఊరేగింపుగా తీసుకొని పోయి ద్వారకా మాయిపై నిలబెట్టేవారు. బీదలకు అన్నదానం అనగా బాబాకు చాలా ప్రీతి. ఈ ఉత్సవ సమయమందు అన్నదానం విరివిగా చేస్తూవుండేవారు. ప్రతి కార్యక్రమము లోను అనేక మంది భక్తులు పూనుకొనెడివారు.

**1897** నుడి **1911** వరకు ఉత్సవము వైభవంగా జరుగు చుండెను. **1912** లో ఒక మార్పు జరిగింది. సాయి సగుణోపాసన వ్రాసిన కవి కృష్ణారావు జోగీశ్వర భీష్మ అను వాడు ఉరుసుతో పాటు శ్రీ రామ జన్మోత్సవము చేయాలని తలచాడు. కాకా మహాజని దానికి సమ్మతించారు. బాబా అనుమతి తీసుకొనడానికి నిశ్చయించారు. ఈ

ఉత్సవంలో జోగేశ్వర భీష్మ కీర్తన చేయడానికి, కాకా మహాజని హార్మోనియం వాయించడానికి, రాధాకృష్ణ మాయి శొంఠి పొడి ప్రసాదం చేస్తుందని నిశ్చయించు కున్నారు. అందరూ బాబా అనుమతి తీసుకొనడానికి మసీదుకు వెళ్ళారు. కాకా బాబాను పూజిస్తుండగా సర్వజ్ఞుడైన బాబా 'వాడాలో ఏమి విశేషము?'అని అడిగాడు. కాకా గ్రహించక పోతే, బాబా భీష్ముని అడిగాడు. అప్పుడు కాకాకే గుర్తుకు వచ్చి శ్రీ రామ జన్మోత్సవము గురించి బాబాతో మనవి చేయగా, బాబా అనుమతి ఇచ్చాడు. ఆ మరుసటి దినము మసీదును అలంకరించిరి, శ్రీ రామ జన్మోత్సమము ప్రారంభమయ్యింది, భీష్ముడు కీర్తన చేయుటకు లేచాడు. కాకా మహాజని హార్మోనియం వాయించు చుండెను. శ్రోతలు కూడ సమయానికి జమ కూడారు. బాబా లెండి నుండి వచ్చి కాకాను పిలిపించాడు. కాకా మహాజని గాబరా పడ్డాడు. భయపడుతూ కాకా మెల్లగా బాబా దగ్గరకు వెళ్ళాడు. 'ఎందుకు ఇక్కడ ఊయల కట్టారు?'అని బాబా కాకాను అడిగాడు. కథా కీర్తన జరిపించాలని చెప్పగానే, బాబా సంతోషించి, దగ్గరలో నుండి ఒక పూలమాల తీసి కాకా మహాజని కంఠంలో వేసి, మరొక మాల భీష్ముని కొరకు ఇచ్చాడు. అప్పుడు అందరు సంతోషించారు. బాబా కూడా ప్రసన్నుడయ్యాడు. ప్రతి శ్రీ రామ నవమి నాడు, పగటి వేళ పతాకోత్సవము, రాత్రి చందనోత్సవము వైభవంగా జరుగు చుండెను. అమీర్ శక్కర్ అను మహమ్మదీయ భక్తుడు చందన ఉత్సవము ప్రారంభించెను.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *మహాత్ముడైతే తప్ప మహాత్ములను తెలుసు కొనుట సాధ్యము కాదని తెలుసు. సప్త సముద్రాల నీటిని కొలువ వచ్చు!కాని అవతార పురుషులను తెలుసుకొనుట అసాధ్యము.*

# అధ్యాయము 7

(వివిధ కథా నిరూపణము)

**బాబా విలక్షణ, అద్భుత అవతారం :** బాబా హిందువు అనుకునే వారికి ముస్లిం వలె, ముస్లిం అనుకున్న వారికి హిందువు వలే కనిపించే విలక్షణ అవతారం. అతడు ఎవరన్నది, యిప్పటికీ ఎవరికీ తెలియదు. బాబా హిందూ ముస్లింలను ఒకే విధంగా చూసేవాడు. శ్రీ రామ నవమి నాడు హిందూ ముస్లిములు విడివిడిగా ఏ గొడవ లేకుండ జరుపుకొనే వారు. శ్రీ రామ నవమి హిందువుల పండుగ తను స్వయంగా పండుగ చేసే వాడు. ఊయల కట్టించే వాడు, కథా కీర్తనం చేయించే వాడు. ఊయల వ్రేలాడ దీసి రామ కీర్తన చేయించే వాడు. ముస్లింలను కూడగట్టి సందల్ ఊరేగింపు చేయించే వాడు. ఈ ఆచారాన్ని అమీర్ శక్కర్ షిరిడిలో ప్రారంభించారు. ఆనాడు కుస్తీపోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చేవారు. గోకులాష్టమి నాడు గోపాలకాలా చేయించేవాడు. ముస్లింల పండుగలు వచ్చినప్పుడు మసీదులలో సమాజు చేయించేవాడు. మొహర్రం పండుగ నాడు తాబూల్ (పీరు) నిలిపి అయిదు రోజుల తర్వాత తనే తీసి వేసేవాడు. అతనికి హిందువు వలె చెవులు కుట్టి వుండెడివి. ఆయనది హిందూ ముస్లిం కాని అద్భుత అవతారం. వారు సున్తీ చేసుకొని వుండలేదు. మసీదులో ఉన్న వాణ్ణి హిందువు అని ఎలా అనగలం. ముసల్మాను అందామంటే అతని వద్ద అగ్ని, శంఖు, ఘంట, పూజలు, భజనలు, విసుఖ్ఖాయి, అన్న దానాలు, అగ్ని హోత్రము అర్ఘ్యపాద్యాదులతో పూజలు ఉన్నాయి. ఇన్ని వివిధ లక్షణాలు వున్న బాబాను హిందువని గాని మహమ్మదీయుడు అనిగాని గుర్తించడం ఎవరి తరం కాదు. ఒకరు మహమ్మదీయునికి పుట్టారని, మరి ఒకరు బ్రాహ్మణ కుటుంబంలో పుట్టారని వ్రాస్తారు. వారికి అన్ని మతాలు సమానం, అన్ని జాతులు ఒక్కటే. ఫకీరులతో కూర్చుని మత్స్య మాంసాలు తినే వాడు. వారి

పళ్ళెంలో కుక్కలు మూతి పెట్టినను అసహ్యించు వాడు కాదు. తులసి బృందావనం, చెక్క రథం వుండేవి. అందరి పూర్వ జన్మ ఫలం వలన బాబా పాదాలు అక్కడ స్థిర పడ్డాయి. ఎందరికో నిశ్చింత, శాంతి, సుఖం లభించాయి, ఇప్పటికి లభిస్తున్నాయి. బాబాను గురువుగా పొందిన వారు అందరూ ధన్యులు. బాబా పాదాల వద్ద చేరిన వారు మరియు వారిని పరీక్షించడానికి వచ్చిన వారు కూడ అక్కడే వుండి పోయేవారు. ఎందరో సాధువులు, సన్యాసులు వారి వద్దకు వచ్చే వారు. బాబాకు వాదించడం యిష్టం లేదు ఎప్పుడూ 'అల్లా మాలిక్'అంటూ నవ్వుతూ వుండే వాడు. రాజైనా, పేదైనా వారికి సమానమే. భక్తుల మనస్సులలో ఉన్న రహస్యాలను విప్పి చెప్పేవాడు. సర్వజ్ఞుడైనప్పటికి ఏమి తెలియని వానివలె కనిపించే వాడు. వారికి సన్మానాలు అంటే అయిష్టం. మానవుడయినప్పటికి అందరూ అతనిని భగవంతుడని భావించారు.

**బాబా చంటి బిడ్డను కాపాడుట :** క్రీ.శ. **1910** వ. సం. లో ఘన త్రయోదశి నాడు బాబా ధునిలో కట్టెలు వేయు చుండెను. ధుని బాగుగా మండుచుండెను. కొంత సేపయిన తర్వాత బాబా చేతిని ధునిలో పెట్టి నిశ్చింతగా కూర్చున్నాడు. వెంటనే చేయి కాలిపోయెను. బాబా దగ్గరలో కూర్చున్న శ్యామా వెంటనే బాబా నడుము రెండు చేతులతో పట్టుకొని లాగి ఎందుకిలా చేసావని అడిగాడు. బాబా స్పృహ లోకి వచ్చి 'ఒక కమ్మరి స్త్రీ తన చంటి బిడ్డను ఒళ్ళో పెట్టుకొని కొలిమి ఊదుచుండెను. ఆమె భర్త పిలువగా పర ధ్యానంలో ఉన్న ఆ తల్లి ఒడిలో బిడ్డ ఉన్నాడన్న విషయం మరిచి పోయి లేవగానే ఆ బిడ్డడు ఆ కొలిమిలో పడబోయాడు. ఆ బిడ్డను కొలిమి నుండి బయటకు లాగాను. నా చేయి కాలుతే ఫరవా లేదు. నా భక్తుని బిడ్డ ప్రాణాలు దక్కాయి' అని చెప్పాడు. బాబా సర్వాంతర్యామి, తనకు ఏ కష్టము వచ్చినను లెక్క చేయక భక్తులను కాపాడు అవతార మూర్తి అనుటకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

**భాగోజీ షిండే సేవలు :** బాబా యొక్క కాలిన చేతికి వైద్యం చేయించాలని మాధవరావు, నానాసాహెబ్ చందోర్కర్‌కు వ్రాసాడు. వెంటనే నానా పరమానందుడనే ప్రసిద్ధ డాక్టరును వెంట పెట్టుకొని మందులతో సహా షిరిడి వచ్చాడు. బాబాకు నమస్కారం చేసి చేతిని డాక్టరుకు చూపించుమని ప్రార్థించాడు. కాని బాబా ఒప్పుకోలేదు. భాగోజి శిండేతో రోజు మర్దన చేయించుకొని కట్టు కట్టించుకొనెడువాడు. నానా ఎంత ప్రార్థించి నప్పటికి, నా డాక్టరు అల్లా మాలిక్ అని ఈ డాక్టరును చేయి చూడనివ్వలేదు. ఈ కార్యం వల్ల ఆ డాక్టర్‌కు సాయి దర్శనం లభించింది. చేయి పుండు తగ్గిన తర్వాత కూడ భాగోజి రోజూ చేతికి నెయ్యి రాసి కట్టు కట్టేవాడు. ఈ సేవ సాయి బాబాకు అవసరం లేదు, కాని కుష్టురోగి అయిన భాగోజీని పూర్వజన్మ దోష నివారణకు, అతనిని అనుగ్రహించటానికి మాత్రమే అతనిచే సేవ చేయించు కొనెడివాడు. ఇది భాగోజి భాగ్యం. బాబా లెండి తోటకు వెళ్ళేటప్పుడు భాగోజియే గొడుగు పట్టే వాడు. చీము రక్తముతో నిండి ఉన్నప్పటికి అతడే బాబాకు ప్రథమ సేవకుడు. బాబా ధుని దగ్గర కూర్చోగానే అతను చేతి కట్టు విప్పి సేవా కార్యక్రమం మొదలు పెట్టే వాడు. ఎంత మహా పాపి అయినా బాబా సేవా భాగ్యం లభించింది. పూర్వజన్మల పాప కృత్యాల కారణంగా, భాగోజికి కుష్టు వ్యాధి సోకింది. ఆయన పూర్వ జన్మ సుకృతము కూడా గొప్పదే సాయి సాంగత్యం లభించింది. సేవా భాగ్యం కలిగించి కర్మ ఫలితాన్ని కడుగుకోవటానికి బాబా అవకాశం ఇచ్చాడు

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *బాబాకు సర్వస్య శరణాగతి అయిన వారిని సకల బంధముల నుండి ముక్తులను చేసి ముక్తి ప్రసాదించును.*

# అధ్యాయము 8

(శ్రీ సమర్థావతరణము)

**నరజన్మ యొక్క ఉద్దేశ్యము :** రోజులు గడుస్తూ అనేక సంవత్సరాలు గడిచి పోతాయి. సగం సమయం నిద్రావస్థలో గడిచి పోతుంది. మనిషి మిగతా సమయమైనా సరిగా అనుభవించడు. బాల్యం ఆటలలో, తరుణవయస్సులో కాంతామణులతో, వృద్ధాప్యంలో జ్వర పీడితులై సదా వ్యాధులతో గడుపుతారు. జన్మించిన తర్వాత, శ్వాస తీసుకుంటూ జీవించడం జీవిత ఉద్దేశ్యం కాదు. మానవ జన్మ యొక్క ధ్యేయం, పరమాత్మ ప్రాప్తి. జంతువులు కూడా పొట్ట నింపుకుంటూ, సంతానోత్పత్తి చేస్తాయి. మరి మానవ జన్మ ఉద్దేశ్యం ఏమిటి? మానవులు, జంతువులు సమానమేనా? వివేకంతో నిర్ణయించాలి. కుక్కలు కూడా పుష్టిగా పెరుగుతాయి. కుక్కలకు మానవులకు భేదం లేదా? మానవుడు నిర్భయుడు, స్వతంత్రుడు, జ్ఞాన సంపన్నుడు. శాశ్వత పదవి, మోక్షము పొందడమే ఈ జన్మ సార్థకత, లేక పోతే ఈ జన్మ వ్యర్థం. బాల్యం, యౌవనం, వృద్ధాప్యం ఈ అవస్థలను అందరూ అనుభవిస్తారు. ఇవి సహజంగానే వచ్చి పోతాయి. మానవునికి భగవంతుడిచ్చిన గొప్ప శక్తి జ్ఞానం. దీని సహాయం తోనే మానవుడు భగవంతుని సాక్షాత్కారం పొందగలడు. ఇంక ఏ జన్మ లోనైనను ఈ అవకాశం లేదు. ఈ కారణం చేతనే దేవతలు కూడా మానవ జన్మ పై ఈర్ష్యతో చూసెదరు. అందువలననే మానవ జన్మ సార్థకం చేసుకొని ముక్తి పొందాలి.

**సాయిబాబా భిక్షాపద్ధతి :** కనుసైగతో మనిషిని మహారాజుగా మార్చగల సమర్థుడు బాబా. అయినప్పటికి జోలె వేసుకుని భిక్షాటనకు వెళ్ళేవాడు. ఎవరింటికి వెళ్ళి ' బల్లా రొట్టె ముక్క పట్టుకొని రా' అని చేయి చాచితే వారు నిజంగా ధన్యులు. ఒక చేతిలో రేకు డబ్బా రెండో చేతి లో జోలి పట్టుకుని ప్రతి రోజు కొన్ని యిండ్లకు వెళ్ళే వాడు. పప్పు,

పులుసు, కూరలు పాలు మజ్జిగ పలుచని పదార్థాలు రేకుడబ్బాలో పోయించు కొనెడివాడు. అన్నం రొట్టె జోలెలో వేయించుకొనెడి వాడు. వారి జిహ్వకు రుచి లేదు. రుచి తెలుసు కోవాలని కోరిక లేదు. మధ్యాహ్నం జోలెలో పడ్డ వాటి తోనే కడుపు నింపుకొనే వాడు. తీసుకున్నవి అన్ని ఒక మట్టి పాత్రలో వేసే వాడు. ఒక నియమిత సమయంలో కాక ఒక్కొక్కసారి రోజుకు **12** సార్లు భిక్షకు వెళ్ళే వాడు. మట్టి కుండలో నుండి కాకులు, కుక్కలు స్వేచ్ఛగా తినేవి, వాటి నెప్పుడూ తరిమే వాడు కాదు. మసీదును తుడిచి శుభ్ర పరిచే స్త్రీ కూడా **10,12** రొట్టెలు తీసుకొని వెళ్ళేది. కుక్కలను పిల్లులను అడ్డు పెట్టని మహానుభావుడు బీదలను ఎలా అడ్డు పెట్ట గలడు. మొదట షిరిడి ప్రజలు బాబాను పిచ్చి ఫకీరు అని పిలిచేవారు. ఫకీరై నప్పటికీ ఉదారమైన మనస్సు గలవాడు. స్వార్థం లేని ప్రేమ స్వరూపులు, వారి మార్గము తెలియ రానిది. షిరిడిలో కొందరు దయార్ద్ర హృదయులు బాబాను అప్పుడే మహాత్మునిగా భావించారు.

బాబా గృహస్తుడు కాడు, వాన ప్రస్తుడు కాదు, వారు కేవలం బ్రహ్మ చారి, సన్యాసి. ఈ జగత్తు వారి గృహమని వారి నమ్మకము. తనే పర బ్రహ్మనని వారి దృఢ నిశ్చయము. వారిపై ఈ జగత్తు ఆధారపడి వున్నది. శివుడే ఈ అవతారమున మన వద్దకు వచ్చాడు. వారికి భిక్షాటన చేయు హక్కుకలదు. ప్రతి దినము బాబా అయిదు ఇళ్ళకు భిక్షకు వెళ్ళే వాడు. బాబాకు భిక్ష వేసిన వారు పంచ సూన పాపముల నుండి రక్షించ బడేవారు.

**తాత్యా తల్లి బాయజాబాయి సేవ :** తాత్యా కోతే పాటిల్ తల్లి బాయజా బాయి, ప్రతి రోజు రొట్టె, కూర ఒక బుట్టలో ఉంచి తలపై పెట్టుకుని బాబా తపస్సు చేయుచున్న చోటికి వెళ్ళి, ఎంతో ప్రయత్నం చేసి బాబాకు భోజనం పెట్టు చుండెను. ఆమె ఒక్కొక్కప్పుడు రెండు మూడు మైళ్ళు కూడ తిరిగి వెతుకుతూ వెళ్ళేది. బాబాకు నమస్కారం చేసి, ఆకు వేసి రొట్టె కూర పెట్టేది. ఆమె చేసిన సేవ బాబా మహా

సమాధి వరకు మరువలేదు. బాబా ఆమె పుత్రుని యోగ క్షేమములు తన పై వేసు కున్నాడు. వారికి బాబాపై అమిత మైన భక్తి. వారికి బాబాయే దైవం. తర్వాత బాబా అడవులలో తిరగడం మాని మసీదు లోనే భోజనం చేసే వాడు. ఆ తల్లికి అడవులు తిరిగే శ్రమ తప్పింది. బాబా ఈమె సేవకు సంతోషించి ఈమె కొడుకైన తాత్యా బరువు బాధ్యతలను తన పై వేసుకున్నాడు. తదనంతరము తాత్యా కూడ బాబా సేవ చేసే వారు.

నాకు తాత్యా ప్రాణానికి ముప్పు వున్నట్లుగా కనిపిస్తుంది. శక సంవత్సరము **1840** దక్షిణాయణ ఆశ్వయుజ మాసంలో విజయ దశమి రోజున తాత్యా పరమపదిస్తాడు. ఈ విషయము ఆయనతో చెప్పవద్దు. అని షిరిడి గ్రామ పటేలు రామచంద్ర దాదా తో అన్నాడు. కాలం వేగంగా కదిలి పోయింది. క్రీ.శ. **1918** భాద్రపద మాసం వచ్చింది. ఆశ్వయుజ మాసం సమీపిస్తున్నది. బాబా మాట ప్రకారం తాత్యా జ్వరంతో జబ్బు పడ్డాడు. మంచం పైనుండి లేవలేకుండా వుండి బాబా దర్శనానికి కూడా వెళ్ళ లేకుండెను. బాబాయే తన రక్షకుడని బాబాపై భారం వేసి శరీర యాతనను అనుభవించ సాగాడు. తాత్యా మరణంతో పోట్లాడుతున్నట్లుగా అందరూ భావించారు. ఆప్తులు, మిత్రులు బాధ పడసాగారు. ఇంతలో విచిత్రంగా తాత్యాను గండం నుంచి తప్పించి అతనికి బదులుగా తాను ప్రాణాలను అర్పించినట్లు బాబా ప్రాణాలు విడిచాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *సత్పురుషుల చరిత్ర, న్యాయ శాస్త్రము లేక తర్క శాస్త్రము లాంటిది కాదు. సత్సంగాలలో సద్గురువుల, యోగీశ్వరుల కథలను శ్రవణము మననము చేయు వారు ధన్యజీవులు.*



# అధ్యాయము 9

(పంచ సూనాది పాతక ప్రక్షాళన, ఆత్మారామునికథలు)

**భిక్ష ఆవశ్యకత:** సంవత్సరాల తరబడి బాబా భిక్షా వృత్తిని అవలంబించాడు. బాబా అలా ఎందుకు చేసాడని చాలా మందికి సందేహము. భిక్ష నిచ్చుట గృహస్తుల కర్తవ్యము, సాధువులకు భిక్ష పెట్టడం గృహస్థులకే శ్రేయస్కరం. భిక్ష గ్రహించుట సాధు సత్పురుషుల ధర్మం. త్రికరణ శుద్ధిగా కాయా, వాచా, మనసా తనువు మనస్సు ధనము సమర్పించే భక్తులంటే బాబాకు ప్రీతి. సంతానము, ధనము, కీర్తి సంపాదించుట యందు ప్రేమ వదలుకుని సన్యసించు వారు భిక్షాటన చేయవచ్చును, కాని వారు వండుకో రాదని శాస్త్రములు చెప్పుచున్నవి. వారికి భోజనము పెట్టు బాధ్యత గృహస్తు పైన వున్నది. యతులు ఏ వృత్తినీ అవలంబించే వారు కాదు. బాబా గృహస్తుడు కాడు, వాన ప్రస్తుడు కాదు, వారు కేవలం బ్రహ్మచారి, సన్యాసి. వారికి భిక్షాటన చేయు హక్కు కలదు. ప్రతి దినము బాబా అయిదు ఇళ్ళకు భిక్షకు వెళ్ళే వాడు. బాబాకు భిక్ష వేసిన వారు పంచసూన పాపముల నుండి రక్షించ బడేవారు. పంచ మహా యజ్ఞములు (**1**.బ్రహ్మ యజ్ఞము **2**. దేవ యజ్ఞము **3**. పితృయజ్ఞము **4**. భూత యజ్ఞము **5**. మనుష్య యజ్ఞము) చేస్తే పోయే పంచ సూన పాపాన్ని బాబాకు భిక్ష వేసి రక్షింపబడే వారు. పంచసూనలనగా **1**. కండణి దంచుట, చెరగుట, **2**. చుల్లీ వంటచేయుట, **3**. పేషణి విసరుట, **4**. ఉదకుంబి పాత్రలు బట్టలు శుభ్రపరచుట, **5**. మార్జని కల్లాపి చల్లుట. వళ్ళు తోముట. బాబా భక్తితో సమర్పించునటువంటివి తీసుకొని పంచ సూనాల నుండి ముక్తి ప్రసాదించేవాడు.

**విదేశీయుడు బాబా ఆజ్ఞ పాలించక ఆసుపత్రి పాలు :** ఒక ఐరోపా దేశస్తుడు బొంబాయిలో నానా సాహెబ్ నుండి ఒక పుత్తరం తీసుకుని షిరిడి వచ్చాడు. ఒక గుడారం వేసుకుని వున్నాడు. అతనికి బాబా పాదాలకు నమస్కరించి బాబా చేతిని చుంబించాలని కోరిక, అతను మూడు సార్లు ప్రయత్నం చేసాడు, కాని బాబా అతనిని మసీదు పైకి రానివ్వ లేదు. తన వద్ద కూర్చోనివ్వ లేదు. క్రింది నుండియే దర్శించు కొనుటకు మాత్రమే అనుజ్ఞ యిచ్చాడు. అతడు నిరాశ పడి తిరిగి పోవాలని నిశ్చయించుకుని బాబా అనుమతి కోరాడు. తొందర పడక మరుసటి రోజు వెళ్ళమని బాబా చెప్పాడు. మిగతా వారు కూడా అదే సలహా యిచ్చారు. బాబా సలహాకు వ్యతిరేకంగా అతడు టాంగాలో బయలు దేరాడు. మొదట గుర్రములు బాగానే నడిచాయి. షాపూర్ విహీర్ (బావి) దాటిన వెంటనే, బండి కెదురుగా సైకిల్ వచ్చింది. అది చూసి గుర్రములు బెదిరి, త్వరగా పరుగిడ టాంగా తల క్రిందు లయ్యెను. ఆ విదేశీయుడు కొంత దూరం ఈడ్వబడ్డాడు. అతి ప్రయాసతో బండి నెవరో లేవ నెత్తిరి. అతడు పాకుతూ పోయి బండినెక్కాడు. ఇటు షిరిడిలో వుండక అటు బొంబాయి వెళ్ళలేక కోపర్‌గాం లోని ఒక ఆసుపత్రిలో కొన్ని రోజులు ఉన్నాడు. బాబా మాటలు విననివారు కష్టాలు తెచ్చు కునేవారు మరియు ఆజ్ఞను పాటించిన వారు వేళ దాటినా రైలు దొరికి ప్రయాణం సుఖంగా సాగేది.

బాబా అనుమతి లేనిది షిరిడి నుండి వెళ్ళినా, వెళ్ళటానికి వారి ఆజ్ఞ అయిన తర్వాత షిరిడిలో వున్నా కష్టములు వచ్చు చుండెడివి. బాబా ఆజ్ఞను ధిక్కరించి వెళ్ళితే మార్గమధ్యములో అనేక కష్టములు వచ్చి దొంగలు దోచుకునే వారు, బండి దొరకక ఉపవాసం ఉండ వలసి వచ్చేది. బాబా మాటలు వినక పోతే కొన్ని సార్లు గుర్రాలు అలసి పోయేవి, రైళ్ళు తప్పేవి మరియు భక్తులు ఆకలితో మాడే వారు.

**ఆత్మారాముని భార్య బాబా ఆకలి తీర్చుట :** ఒక సారి మధ్యాహ్న సమయము భోజనాల గదిలో విస్తర్లలో అన్నీ వడ్డించి

వుండగా ఆకలి తోవున్న ఒక కుక్క అక్కడికి వచ్చింది. ఆత్మారాముని భార్య ఒక రొట్టె ముక్కను కుక్కకు వేసింది. అప్పుడు బురదతో నిండిన శరీరంతో ఆకలితో వున్న పందిని కూడ చూసింది. ఆపందికి కూడ రొట్టె ముక్క వేసింది. ఆ తల్లి ఆ విషయం పూర్తిగా మరిచి పోయింది. రోజు వెళ్ళినట్టుగా ఆమె మసీదుకు వెళ్ళి కూర్చోగానే బాబా, 'అమ్మా నువ్వీ రోజు ఆకలితో వున్న నాకు తినటానికి పెట్టావు. నా ప్రాణాలు తృప్తి పడ్డాయి. ఎప్పుడూ యిలాగే చేస్తూ వుండు. ఇదే నీకు మేలు చేస్తుంది. ఆకలితో వున్న జీవులకు ముందు పెట్టిన తర్వాతనే మనం తినాలి. అది గుర్తుంచుకొని నా అనుగ్రహం పొందండి, ఈ మసీదులో కూర్చుని నేనసత్యము చెప్పను.' అని అన్నారు. బాబా మాటలు ఆమెకు అర్థం కాలేదు. 'నేనెప్పుడు భోజనం పెట్టాను? నేనిక్కడ స్వతంత్రురాలిని కూడ కాదు. డబ్బులిచ్చి వారు పెట్టిందేదో తింటున్నాను,'అని తన సందేహాన్ని బాబాకు తెలిపింది.  అప్పుడు బాబా 'నువ్వు ప్రేమతో పెట్టిన రొట్టె తృప్తిగా తిని త్రేపులు వస్తున్నాయి. నువ్వు భోజనానికి కూర్చున్నప్పుడు ఆకలితో వున్న కుక్క, బురదతో నిండి వున్న పందిని చూసావు కదా! వాటిలో వున్న ఆత్మ, నాలో వున్న ఆత్మ ఒక్కటే.'అని జవాబిచ్చారు. బాబా మాటలు విన్న ఆ తల్లి ఆశ్చర్యపోయింది. 'సకల జీవరాసులలో నన్ను ఎవరైతే చూస్తారో వారంటేనే నాకెంతో ప్రేమ, నన్ను ఆరాధించే పద్ధతి అదే' అని బాబా అన్నాడు. బాబా మాటలు విని ఆమె కన్నులు ఆనంద భాష్పాలతో నిండిపోయాయి. భగవంతుడు జీవులన్నిటిలో వున్నాడని అన్ని గ్రంథములు ప్రబోధించు చున్నవి. బాబా ఈ ప్రబోధాలను అనుభవపూర్వకముగా నిర్ధారణ చేసాడు. ఎవరికి తన యందు ఎలాంటి భావం వుంటుందో వారికి ఆ అనుభవం కలుగ చేస్తాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 10

(శ్రీ సాయినాథ మహిమలు -1)

**శ్రీ సాయి బాబా స్మరణ:** బ్రహ్మ స్వరూపుడైన సాయిని ఎల్లప్పుడూ ప్రేమతో స్మరించండి. వారి స్మరణ మాత్రం చేత జీవన్మరణమను సమస్యకు పరిష్కారము లభించును. ఈ సాధన చేయడం వలన తక్కువ కష్టముతో ఎక్కువ ఫలం లభిస్తుంది. అతని గురించి ఒక చిల్లి గవ్వనైన ఖర్చు పెట్టనవసరం లేదు. ఇంద్రియములు స్థిరముగను, బుద్ధి సరిగా వున్నప్పుడే ప్రతినిమిషం పరమార్థం కొరకు సాధన చేయ వలయును. వు మాత్రమే నుదుటి రాతను మార్చగల దైవము. సద్గురువు సేవలో సంసార బంధము తొలగి పోతుంది. సద్గురువు నావికుని వలె కష్టములు, విచారములు అనే సముద్రము నుండి దాటించగలడు. సాగరాన్ని దాటడానికి నావికునిపై విశ్వాస ముంచాలి. అదే విధంగా సంసార సాగరాన్ని దాటుటకు సద్గురువు నందు పూర్తి నమ్మకము ఉంచాలి. గురువు శిష్యుని భక్తి శ్రద్ధలను గమనించి జ్ఞానాన్ని అందించి మోక్ష ప్రాప్తి కలిగిస్తారు. వారి దర్శన మాత్రమున ప్రారబ్ద కర్మలు క్షీణించి పోతాయి. శ్రీ సాయినామాన్ని ఎప్పుడూ గానం చేయండి. స్మరణం, మననం చేసి తరించండి. ముక్తి పొందుటకు సులభ మార్గాన్ని పాటించండి.

**నానావళి బాబా నిరాకారత్వము పరీక్షించుట :** షిరిడిలో నానావళి అనే విచిత్ర పురుషుడు వుండే వాడు. అతను చాలా కోపి. బాబా పనులను చక్కబెట్టు చుండెడి వాడు. ఒక నాడు బాబా వద్దకు పోయి, బాబాను గద్దెపై నుండి దిగుమనెను. వెంటనే బాబా లేచి గద్దెను నానావళికి ఇచ్చెను. నానావళి కొంత సేపు ఆ గద్దెపై కూర్చుండి, లేచి బాబా పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసి వెళ్ళి పోయాడు. తన గద్దెపై ఇంకొకరు కూర్చున్ననూ బాబా అసంతుష్టి వెలిబుచ్చ లేదు. నానావళి బాబా సమాధి చెందిన పదమూడవ రోజు దేహ త్యాగం

చేసాడు. వారి సమాధి కూడా లెండి దగ్గరలో ఏర్పాటు చేసారు. అతడు ఎంత ధన్యుడు. బాబా అనుగ్రహం పొందాడు.శ్రీ సాయి బాబా లోకులను అనుగ్రహించటానికే ఈ భూమిపై అవతరించాడు. సాధు మహాత్ముల హృదయం నవనీతం అంటారు. వేడి చేస్తేనే వెన్న కరుగుతుంది, కాని సాధువుల హృదయం పరుల దుఃఖాలతో తపించటం చూసి కరిగి నీరవుతుంది.

**సాయిబాబా నిరాకార తత్వము :** భక్తుల పుణ్యం వలన సాయి రూపంలో నిరాకార తత్వం అంకురించి షిరిడిలో పక్వానికి వచ్చింది. నిర్వచించలేని తత్వానికి వాక్కు, జన్మములేని దానికి జన్మ, ఆకారం లేని దానికి కరుణా రసము మూర్తీభవించినట్లు ఆకారం ధరించాడు. బాబా లోను, భగవంతుని లోను ఆరు గుణములు కలవు, అవి **1**. కీర్తి, **2**. సంపద, **3**. వైరాగ్యం, **4**. జ్ఞానము, **5**. ఐశ్వర్యము, **6**.ఔదార్యము. బాబా కేవలం భక్తుల కొరకే ఆకారం ధరించాడు. బాబా భక్తులతో ఇలా అనేవాడట, 'నేను మీ దాసానుదాసుడను. మీ ఋణగ్రస్తుడను. మీ దర్శనానికి వచ్చాను. మీ దయవల్ల మిమ్ములను కలుసు కున్నాను. మీ అశుద్దము లో నేనొక క్రిమిగా సృష్టించబడితే నే ధన్యుడను.'పై మాటలు బాబా ఉచ్చరించినవే. ఇవి బాబా వినమ్రతా గుణానికి సూచి. ఎవరికైనా ఇది బాబాను అగౌరవ పరిచినట్లు అనిపిస్తే అపవిత్రమైన వాగ్దోషము, శ్రవణ పాపము, సాయి నామ జపంతో తొలగి పోతుంది.

**శ్రీ సాయిబాబా విచిత్ర శయ్య :** బాబా ముస్లింలకు హిందువులకు తల్లి లాంటి వాడు. సాయి బాబా సన్నిధిలో పులులు మేకలు ఒకే దగ్గర కలిసి విహరించేవి. నానా సాహెబ్ డేంగలే క్రీ.శ.**1898** సం.లో బాబా కొరకు ఒక కర్ర పలకను తెచ్చెను. దాని పొడవు నాలుగు మూరలు, జానెడు వెడల్పు. దానిని చినిగి పోయిన గుడ్డ పీలికలతో వ్రేలాడ గట్టి తల వద్ద పాదాల వద్ద దీపాలు వెలిగించి దానిపై మెడ వంచుకొని కూర్చునేవాడు లేక పడుకునేవాడు. ఆ బల్ల బాబాను ఎలా మోయుచున్నదని అందరికి ఆశ్చర్యము

కలుగుచుండెను. బాబా దానిపైకి ఎలా ఎక్కేవారో ఎలా దిగేవారో ఎవరూ కనుగొనలేక పోయారు. అణిమాసిద్ధి (అణిమాసిద్ధి పొందిన వారు చాలా సులభంగా సూక్ష్మంగా వుండ గలరు. హనుమంతుడు లంకా ప్రవేశానికి ఈ సిద్ధిని ప్రదర్శించాడు) వారి దాసి అయి నప్పుడు దోమలా మారి పోవడం వారికెంత సేపు. ఏమి లేకనే ఆకాశంలో కూర్చో కలిగిన బాబాకు పలకపై కూర్చుండుట ఒక లెక్కలోనిది కాదు. అణిమా మహిమ, లఘిమ, గరిమ ప్రాప్తి, ప్రాకామ్యం ఈసత్వం మరియు వసిత్వము అను అష్ట సిద్ధులు ఆయన స్వాధీనం లోనే వుండెను. ఆయనకు సర్వ జీవరాసులు సమానము.

**శ్రీ సాయిబాబా బ్రహ్మ స్వరూపుడు :**బాబా మానవాకారంలో షిరిడిలో వున్నట్లు కనిపించిన పుణ్యరాశి. ఆయనకు చీమ, దోమ,పక్షులు, మనుష్యులు, రాజు, పేద అందరూ సమానమే. అతను లోపల నిరాశ కలిగి వున్నా పైకి భక్తుల ప్రేమ పాశంలో చిక్కు కున్నట్లు కనిపించే వాడు. లోపల ఏ కోరిక లేక పోయినా పైకి భక్తుల కోసం కోరిక వున్నట్లు కనిపించే వాడు. భక్తులను సరి అయిన మార్గంలో పెట్టడానికి కోపాన్ని ప్రదర్శించే వాడు. అంతరంగంలో పరబ్రహ్మస్థితి, బాహ్యంగా కఠిన ప్రవర్తన, అంతరంలో అద్వైత ప్రీతి, బాహ్యంగా విశ్వ జంఝాట నటన పరబ్రహ్మ స్వరూపంలో వుంటూనే బయటికి మాత్రం ఉద్రేకంగా కనిపించేవాడు. ఎప్పుడూ ఒకే ఆసనంపై కూర్చునే వాడు. ఎక్కడికీ ప్రయాణం చేసే వాడు కాదు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 11

(శ్రీ సాయినాథ మహిమలు - 2)

**శ్రీ సాయి సగుణ ధ్యానము:** బాబా పూర్ణ విరక్తులలో విరక్తుడు. బాబా అనేక మంది భక్తులకు ఆశ్రయము, విశ్రాంతి స్థానము. బ్రహ్మము భగవంతుడు రెండు విధములు, **1**) నిర్గుణ స్వరూపము, **2**) సగుణ స్వరూపము. నిర్గుణ స్వరూపమునకు ఆకారము లేదు, సగుణ స్వరూపమునకు ఆకారము కలదు. సగుణ మూర్తిని ధ్యానించక పోతే భక్తి భావము కలుగదు. ఈ రెండు వేరు వేరు కాదు. భక్తి కలుగనంత వరకు మనస్సు వికసించదు. రెండూ పరబ్రహ్మ స్వరూపాలే. సామాన్య మానవునికి దృష్టికి అందని శూన్యంలో భగవంతుని నిర్గుణ స్వరూపంపై ఏకాగ్రతతో ధ్యానించుట అత్యంత కష్టతరము. ఆ మానవుడే భగవంతుని సగుణ రూపంగా మలిచి, తన ముందర వుంచి, కొద్ది పాటి ప్రయత్నంతో ఏకాగ్రతతో ధ్యానిస్తే ఆ నిర్గుణ స్వరూపాన్ని చూడగలము. ఘనీభవించిన నేయి, కరిగి వున్న నేయి రెండూ నేయిగానే వుంటాయి. నిర్గుణత్వము విశ్వమంతట నిండి వుంది. నిర్గుణంలో కంటె సగుణంలో పరమాత్మను తెలుసు కొనుట సులభము. సగుణ స్వరూపమైన బ్రహ్మను కొన్నాళ్ళు పూజించిన తర్వాత, నిర్గుణ స్వరూపమైన బ్రహ్మను పూజించుటకు దారి తీయును. బాబా ఆకారంతో వున్నప్పటికి నిరాకార స్వరూపులు, నిర్వికారులు.

**బాబా నొసట చందనం పూయుట :** దాదా సాహెబ్ నూల్కర్ స్నేహితుడు డాక్టర్ పండిత్ బాబా దాదా సాహెబ్ నూల్కర్ స్నేహితుడు డాక్టర్ పండిత్ బాబా దర్శనమునకై షిరిడి వెళ్ళాడు. మసీదుకు వెళ్ళి బాబాకు సాష్టాంగపడి కొంత సేపు కూర్చున్నాడు. బాబా డాక్టర్ పండిత్‌ను దాదాభట్ కేల్కర్ వద్దకు పంపాడు. డాక్టరు దాదా భట్టు వద్దకు వెళ్ళగా సాదరంగా ఆహ్వానించాడు. దాదాభట్టు కేల్కరు బాబాను పూజించటానికి మసీదుకు బయలు దేరాడు. డాక్టర్

కూడ అతని తో వచ్చాడు, నూల్కర్ చందనముతో బాబాకు పూజ చేసాడు. అంతలో డాక్టర్ పండిత్ భక్తి పారవశ్యంతో కేల్కర్ చేతిలోని పళ్ళెమందు కొని బాబా నుదుట త్రిపుండ్ర రేఖలు దిద్దాడు. బాబా ఎవరిని తన నుదుట చందనము దిద్దటానికి  అనుమతి నిచ్చే వాడు కాదు.  సాయంత్రం నూల్కర్ బాబాతో ఇలా అన్నాడు, 'బాబా! మేము మీ నుదుట చందనం దిద్దాలని అనుకుంటే మీరు అనుమతించరు, కాని పండిత్ దిద్దుతే వారించ లేదు, కారణం ఏమిటి?' బాబా దాదా ప్రశ్నకు ఇలా సామాధాన మిచ్చాడు, 'దాదా! అతని గురువు బ్రాహ్మణుడు, రఘునాథ మహారాజ్. దోపేశ్వర్ నివాసి. డాక్టర్ పండిత్ తాను బ్రాహ్మణుడనై వుండి, మహమ్మదీయుడైన బాబాను ఎలా పూజించాలి, అని శంకించకుండా తన గురువును పూజించినట్లే పూజ చేసి నన్ను ఆధీనం చేసుకున్నాడు. అందుకే అతనిని అడ్డు పెట్ట లేక పోయాను.' పండిత్ తన గురువైన కాకా పురాణిక్‌ను బాబాలో దర్శించి తన గురువు వలెనే అనుభూతి పొందాడు. ఎవరి మనోభావం ఎలా ఉంటే వారి భక్తి ప్రభావం కూడ అలాగే వుంటుంది. బాబా తనకు నచ్చితేనే పూజ చేయించుకొనెడి వాడు. తనకు నచ్చక పోతే పూజా ద్రవ్యాలను కూడా విసరికొట్టే వాడు. నరసింహావతారం చూపేవాడు. అప్పుడు ఎవ్వరూ బాబా దగ్గరకు వెళ్ళ లేక పోయే వారు. ఒక్కొక్కప్పుడు బాబా నిప్పులు కక్కేవాడు, మరొ క్కప్పుడు బాబా  మెత్తగా, శాంత మూర్తిగా వుండేవాడు. తన సర్వస్వము భగవంతునికి శరణాగతి చేసి ఆత్మ నివేదనం చేసుకోవడం వలన, భగవంతుడే అన్ని చూసుకుంటాడు. .

**పంచ భూతములు సాయిబాబా స్వాధీనములో:** ఒక రోజు సాయంకాలం షిరిడిలో కారు మేఘాలు కమ్ముకొని  తీవ్రమైన గాలి వీచింది, పశుపక్ష్యాదులు భయపడేలా గాలి వేగం పెరిగి పోయింది. భయంకరంగా కుంభవృష్టి కురిసింది. గ్రామస్థులు భయపడి బీద, బిక్కి మసీదులో తల దాచుకొన్నారు. ఎక్కడ చూసినా నీటి మయం, ప్రజలు బాబా దగ్గరకు వచ్చి తుఫానును ఆపి వేయమని వేడుకున్నారు.

బాబాపై స్వచ్ఛమైన ప్రేమ వుంటే చాలు. ఎట్టి కష్టాలవైనా పార ద్రోలుతారు. బాబా బయటికి వచ్చి మసీదు అంచున నిలబడి పైకి చూస్తూ, గుడ్లు ఎర్ర చేసి గట్టిగా అరిచారు. 'ఆగు, ఆగు నీ కోపము తగ్గించు, నెమ్మదించు' కొన్ని నిముషములలో వర్షము తగ్గి పోయింది. ఇంద్రుడు బాబా మాట నిలబెట్టాడు. చంద్రుడు కనపడ్డాడు. మహా సంకటం నుండి బయట పడ్డ ప్రజలు బాబా ఉపకారాన్ని తలచుకుంటూ ఇళ్ళకు వెళ్ళి పోయారు. పశువులు కూడా క్షేమంగా తిరగ సాగాయి. పక్షులు కూడ గూటికి చేరుకున్నాయి.

బాబాకు అగ్ని దేవునిపై కూడ పూర్తి సాధీనము కలదు. ఒకరోజు మధ్యాహ్నము ధునిలో మంటలు అపరిమితంగా లేచెను. అగ్ని జ్వాలలు దూలాలకు అంటుకునే విధంగా తయారయ్యింది. మసీదు బూడిద అయి పోతుందేమోనని అందులో కూర్చున్న భక్తులు భయపడిరి. బాబా మాత్రము చలించ లేదు. అప్పుడు బాబా మంటల వైపు చూస్తూ ధుని దగ్గర స్తంభముపై కొట్టుచూ 'వెళ్ళు, వెనక్కు వెళ్ళి శాంతించు! శాంతించు!'అని అంటుంటే ఒక్కొక్క దెబ్బకు జ్వాల కొద్ది కొద్దిగా తగ్గిపోతూ ధుని శాంతించింది. అందరి భయం తొలగి పోయింది.

ఇదే విధంగా శ్రీరామ నవమికి వచ్చు భక్తుల నిమిత్తం బాబా ఉప్పు నీళ్ళ బావిని మంచి నీళ్ళ బావిగా మార్చేసాడు. మరియు మేఘశ్యాముడు బాబాకు అభిషేకం చేసినప్పుడు బాబా తల మాత్రం తడిచింది, మిగతా శరీరంపై ఒక్క చుక్క నీరు కూడా నిలువ లేదు,

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *కేవలము గురు చరిత్ర స్మరణము, మననము చేస్తే ఈ సంసార సాగరాన్ని అవలీలగా కాళ్ళకు తడి అంటకుండ దాటగలము. ఎవరైతే గురువును అంటి పెట్టుకుని వుంటారో వారే ముక్తి పొంద గలరు.*

# అధ్యాయము 12

(శ్రీ సంత ఘేలప దర్శనము)

**సాయిబాబా అవతారము :** ఈశ్వరుని అవతారం, శిష్టులను రక్షించి దుష్టులను శిక్షించడం.

గీత: పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతాం.
ధర్మ సంస్థాప నార్థాయ సంభవామి యుగే యుగే.

తా : వేదోక్త ధర్మములను నా ప్రీతికై ఆచరించుచు నా కొరకే జీవించువారు సాధువులు. వారికి నా స్వరూపమునందించి నాచేష్టలను చూపి వారిని ఆనందింప చేయుటయే నా అవతార ప్రయోజనము. నా భక్తులను మానసికంగా, శారీరకంగా, మాటలతో హింసించు వారు దుష్టులు. భక్తుల కొరకు ఈ దుష్టులను నేను నిర్మూలించెదను. ధర్మ సంస్థాపనార్థమై అన్ని రూపములతోను, అన్ని కాలముల యందు పుట్టుచునే యుందును. సద్గురువు బాబాకు చిన్న పెద్ద అందరూ సమానమే. ఈశ్వరుని కంటె సద్గురువు గొప్ప వాడు. వీరు దుర్మార్గులను, దుష్టులను కూడా సన్మార్గములో వుంచును. దీనులను ప్రేమతో కరుణించును. అజ్ఞానమనే చీకటిని నశింపచేసే సూర్యుని వంటివాడు. పరమాత్ముడే మన సాయి, భక్తుల కొరకే ధరిపై అవతరించాడు.

**మూళేశాస్త్రి గురు దర్శనము :** మూళేశాస్త్రి నాసిక్ నివాసి, ఆచారములు పాటించే బ్రాహ్మణుడు. ఆయన హస్త సాముద్రికములో ప్రవీణుడు. భక్తులంతా మసీదుకు వెళ్ళుతూ వుంటేమూళేశాస్త్రి కూడా వెళ్ళాడు. బాబాను దర్శనం చేసుకోగానే అతను చాలా ఆనందించాడు. భక్తులు ప్రేమతో బాబాకు పేడా, బత్తాయిలు, బర్ఫీ, కొబ్బరి కాయలు, పళ్ళు అర్పించు చున్నారు. ఇలా చేస్తుండగా మూళేశాస్త్రికి బాబా పాదాలను చూసి ఆశ్చర్యపడి, ధ్వజ వజ్రాంకుశాది రేఖలు చూడాలని కోరిక పుట్టింది. మూళేశాస్త్రి పళ్ళ కోసం కాక బాబా హస్తాన్ని

చూపించమని చేయి సాచాడు. మూళేశాస్త్రి బాబాతో నాకు పళ్ళు అవసరం లేదు. మీ హస్తం యివ్వండి సాముద్రికం చూస్తానని విన్నవించు కున్నారు. కాని బాబా తన చేతిని యివ్వలేదు. మూళేశాస్త్రి బాబా నిరాసక్తత చూసి భక్తులతో వాడాకు వెల్ళాడు.బాబా తెండి తోటకు బయలు దేరాడు. మార్గ మధ్యమున 'కాషాయ రంగు తెండి కాషాయ వస్త్రాలు ధరిస్తాను'అని అన్నాడు. ఆ మాటలు ఎవ్వరికి అర్థము కాలేదు. బాబా తన స్థానంలో కూర్చున్నాడు. హారతి ప్రారంభమయింది బాబా ఆ నాసిక్ బ్రాహ్మణుని దగ్గర నుండి దక్షిణ తీసుకొని రమ్మనెను. బూటి దక్షిణ తేవడానికి వెళ్ళాడు. బాబా ఆజ్ఞ అతనికి చెప్పగానే 'నేను ఆచార వంతుడను నేనెందుకు దక్షిణ యివ్వాలి, బాబా గొప్ప యోగి అయి ఉండ వచ్చు, నేను వారిపై ఆధార పడి వుండ లేదు.'అని మనస్సులో అనుకొన్నా. ధనికుడగు బూటి స్వయంగా వచ్చి దక్షిణ అడుగుటచే కాదనలేక పోయాడు. తన పూజ అనంతరము మశీదుకు బయలు దేరాడు. హఠాత్తుగా బాబా గతించిన తన గురువు ఘోలప లాగ దర్శనమిచ్చాడు. మసీదు లోనికి వెళ్ళి తన గురువు యొక్క పాదాలకు వందనము చేసి చేతులు జోడించి నిలుచున్నాడు. కాషాయ వస్త్రాలలో వున్న తన గురువు పాదాలను ఆలింగనం చేసు కున్నాడు. అందరు బాబా హారతి పాడగా, మూళేశాస్త్రి తన గురువు నామము జపించాడు. బాబా లీలను చూసి భక్తులందరు నిర్ఘాంత పోయారు.

**బాబాలో శ్రీరాముని రూపాన్ని దర్శించుట :** ఒక మామలతాదారు, తన స్నేహితుడైన డాక్టరును తీసుకొని షిరిడి క్రీ.శ.**1909** డిసెంబర్ **25** నాడు వచ్చాడు. ఆ డాక్టరు బ్రాహ్మణుడు, శ్రీరామ భక్తుడు. సాయి బాబా మహమ్మదీయుడు కనుక బాబాకు తను నమస్కరించనని, తన స్నేహితునితో బయలుదేరే ముందే చెప్పాడు. షిరిడి చేరగానే బాబా దర్శనార్థము మసీదుకు వెళ్ళగానే ముందు ఆ డాక్టరే బాబా ముందు సాష్టాంగ పడ్డాడు. అది చూసి అందరూ ఆశ్చర్యపడి ఒక మహమ్మదీయునికి ఎలా నమస్కరించావని అడిగారు.

తనకు చూడ చక్కనివాడైన శ్రీరాముడు దర్శనమీయడంతో నమస్కరించానని డాక్టరు బదులిచ్చాడు. క్షణంలో రాముడు అదృశ్యమై బాబా రూపం కనిపించింది.

ఆ డాక్టరు రెండవ రోజు సాయి నాథుడు అనుగ్రహిస్తే తప్ప తను మసీదులో అడుగు పెట్టనని ఉపవాస వ్రతం మొదలు పెట్టాడు. నాలుగో రోజు తన ప్రియ స్నేహితుడొక్కడు ఖాందేషు నుండి సాయి దర్శనార్థం షిరిడి వచ్చాడు. తొమ్మిది సంవత్సరముల తర్వాత కలిసిన స్నేహితుని చూసి ఆనందంతో తన దీక్షను మరిచి అతని వెంట మసీదుకు వెళ్ళి బాబాకు నమస్కరించాడు. అప్పుడు బాబా 'ఏం డాక్టర్! ఏవరైన నిన్ను రమ్మని పిలిచారా? ఎందుకు వచ్చావు చెప్పు?'అని అడిగాడు. ఈ ప్రశ్న విని ఆ డాక్టర్ ఆశ్చర్య పడి బాధ పడ్డాడు. ఆ రోజు రాత్రి అతనికి బాబా అనుగ్రహం కలిగింది. నిద్రావస్థలో పరమానంద స్థితి యొక్క మాధుర్యాన్ని చూడ గలిగాడు. అతనికి సాయి బాబాపై భక్తి ఎన్నో రేట్లు వృద్ధి పొందింది. ఈ విధమైన అనుభవాలు ఎంతో మందికి అనేకం వున్నాయి.

మూళేశాస్త్రి కథ వల్ల తన గురువు యందు పూర్ణవిశ్వాసం వుంచాలని బాబా బోధించాడు. గొప్పవారమని చెప్పుకొనే గురువులను ఆశ్రయించడం వ్యర్థం. బాబాకు మన పట్ల ప్రేమ ఉందని తెలుసుకొని నిర్మల మనస్సుతో బాబా లీలలను శ్రవణం చేద్దాం, భక్తి వున్న చోటే శ్రవణ లాలస వుంటుంది. ప్రత్యక్షఅనుభవము కలిగించడమే బాబా ప్రత్యేకత. అనుభవాలతో నిష్ఠ కుదురుతుంది. బాబా లీలలు చాలా విచిత్రం.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 13

(భక్తుల రోగనివారణ)

**సాయిబాబా చెప్పిన సత్యాలు** : బాబా మాటలు అర్థ గంభీర్యముగాను, క్లుప్తముగాను, శక్తి వంతముగాను, విశదముగాను ఉండేవి. వారు ఎప్పుడూ నిశ్చింతగానె ఉండే వాడు. లభించిన దానితోనే నిత్యం తృప్తులై ఉండేవాడు. ఎప్పుడూ చింత పెట్టుకొనేవాడు కాదు. బాబా మాయ యొక్క మహిమ గురించి యిలా చెప్పాడు. 'నేను ఫకీరును, యిల్లు వాకిలి లేని వాడను, భార్యకూడ లేని వాడను. ఒకే చోట స్థిరంగా యిలా వున్నా కూడా ఈ మాయా శక్తి ఎప్పుడూ నన్ను కూడా ఆవరించే వుంటుంది. అది హరి యొక్క మూలం, ఆఖరికి బ్రహ్మాదులను కూడా ఈ మాయ బాధిస్తూనే వుంటుంది. పేద ఫకీరునైన నేను ఒక లెఖ్ఖా! హరి ప్రసన్నుడైనప్పుడే దాని నుంచి తప్పించుకో గలరు. అవిచ్ఛిన్నమైన హరి భజన లేకుండా మాయ నుండి తప్పించుకోలేరు.'

భక్తుల కళ్యాణార్థం సాయి సమర్థుడు చెప్పిన సత్యాలు, 'పుణ్యాత్ములైన వారే నా భజన యందు నిమగ్నులై నన్ను తెలుసుకొంటారు. 'సాయి,సాయి' యని నిత్యము నన్నే తలిచితే సప్త సముద్రాలు దాటిస్తాను. ఈ మాటల యందు విశ్వాసముంచితే, నిశ్చయంగా శుభాన్ని పొందుతారు. నాకు ఆడంబరాలతో కూడిన పూజ అక్కర లేదు, షోడశోపచార పూజలు, అష్టాంగ యోగములు గాని నాకు అవసరం లేదు. భక్తి, శ్రద్ధలున్న చోటనే నా నివాసము.'అని భక్త వత్సలుడైన సాయి అనేక సార్లు చెప్పారు.

**బాలా గణపతి షింపీ నల్ల కుక్కకు అన్నం పెట్టుట:** బాలా గణపతి షింపీ ఒక దర్జీ, బాబా భక్తుడు. మలేరియాతో బాధ పడుచుండెను. అన్ని రకములైన మందులు, కషాయములు తీసుకున్నాడు, కాని జ్వరం తగ్గలేదు. షిరిడి పరుగెత్తి బాబా పాదాలపై

పడ్డాడు. బాబా జ్వరమునకు విరుగుడుగా లక్ష్మీదేవి ఆలయము ముందు ఉన్న నల్లకుక్కకు పెరుగన్నం పెట్టుమని చెప్పాడు. బాలా షింపి ఇంటికి వెళ్ళి గిన్నెలోని అన్నాన్ని పక్కింటి నుండి పెరుగును తీసుకొని, ఈ సమయంలో దేవాలయం దగ్గర నల్ల కుక్క వుంటుందా లేదా అనుకుంటూ వెళ్ళాడు. ఆ సమయంలో ఒక నల్లకుక్క తోకాడించు కుంటూ అతని దగ్గరికి వచ్చింది. బాలా ఆనందంతో పెరుగన్నం ఆ కుక్కకు పెట్టాడు. ఆ సమయం నుండి బాలా షింపి గణపతికి చలి జ్వరం పూర్తిగా తగ్గి పోయింది. ఇది నిజంగా బాబా లీల మాత్రమే, మానవ మాత్రులకు అర్థం కాదు. బాబా భక్తుల రోగ నివారణ పద్ధతులు చాలా విచిత్రంగా వుండేవి.

**బూటీ విరేచనములు, వాంతులు ఆగుట :** ఒకసారి బాపూసాహెబ్ బూటీ విరేచనములతోను, వాంతులతోను బాధపడు చుండేవాడు. పూర్తిగా నీరసించి పోయాడు. బాబాకు ఈ విషయం తెలిసి బూటీని తీసుకొని రమ్మని కబురు పంపాడు. అతనిని బాబా ముందు కూర్చో బెట్టారు. బాబా అతనితో 'ఖబర్దార్, ఇకనుండి నీవు విరేచనాలకు వెళ్ళ కూడదు. నీ వాంతులు కూడా ఆగి పోవాలి.'అని చేతి వేలును చూపుతూ అన్నాడు. ఆ మాటల కున్న శక్తితో రెండు వ్యాధులూ పారి పోయాయి.మరొక సారి షిరిడి గ్రామంలో కలరా వచ్చింది. బూటీ వాంతులు, విరేచనాలతోబాటు దప్పికతో తపించి పోయాడు. డాక్టర్ పిళ్ళే చేసిన ప్రయత్నాలన్ని వ్యర్థమై పోయాయి. చివరకు బాబా వద్దకెళ్ళి బూటీ పరిస్థితిని నివేదించారు. అప్పుడు బాబా ' పాలలో బాదం, అక్రోట్, పిస్తా వేసి అతనిచేత తాగించండి.'అని అన్నాడు. వారు బాబా చెప్పినట్టుగా చేయగా బూటీ వ్యాధి కుదిరింది.

**కాకా మహాజన్ విరేచనములు తగ్గుట :** కాకా మహాజన్ బాబా భక్తుడు. ఒక రోజు అతనికి నీళ్ళ విరేచనాలు ఎక్కువ కాసాగాయి. బాబాపై భారం వేసి ఏ ఔషధము తీసుకొనలేదు. ఈ బాధతో బాబా

సేవకు ఏ కష్టము కలుగ కుండుటకు ఒక చెంబు నిండా నీళ్ళు పోసి మసీదులో ఒక మూల పెట్టుకొని అవసరం వచ్చినప్పుడల్లా పోవు చుండెను. రోజు లాగ హారతిలో పాల్గొనే వాడు. మహాజనికి విరేచనాలు మొదలైన వారము రోజులకు మసీదు సభా మండపములో రాళ్ళు పరుచుటకు బాబా అనుజ్ఞ యిచ్చాడు. లెండి తోటకు వెళ్ళి వచ్చిన తర్వాత మొదలు పెట్టమని చెప్పాడు. అప్పుడు కాకా బాబా పాదములు పట్టుచుండెను. అప్పుడే కొందరు భక్తులు కోపర్గాం మరియు బొంబాయి నుండి వచ్చారు. అంధేరి పాటిల్ కూడ వచ్చి పుష్పాక్షతలతో పూజ చేసి కూర్చున్నాడు. నేలను చదునుచేయడం మొదలయ్యింది. అంతలో బాబా గట్టిగా అరిచి నృసింహావతారం దాల్చాడు. కళ్ళు భయంకరంగా వున్నాయి. 'గడ్డపారతో ఎవరు తవ్వుచున్నారు. వాణ్ణి నరికేస్తాను.'అని అరిచాడు. పనివాళ్ళందరు భయపడి పరుగెత్తి వెళ్ళిపోయారు. కాకా లేవబోగా కూర్చోమని అన్నాడు. తాత్యా భార్య రాగా ఆమెను కూడా తిట్టాడు. అక్కడున్న వారందరు తలో వైపు పరుగులు తీసారు. అందులో ఒకరి సంచిలో వేరుశెనగ కాయలు ఉన్నవి. బాబా పిడికిలితో గింజలు తీసి పొట్టు ఊదేసి నలుపుతూ శుభ్రం చేస్తూ మహజనికి తినడానికి ఇచ్చాడు. అటు తిట్టుతూ, యిటు మహాజనికి వేరు శనగ కాయలు ఇస్తూ, తను కూడా కొన్ని కాయలు తింటూ ఆ కాయలన్నీ ఖాళీ చేసారు. అన్నీ అయి పోయిన తర్వాత కాకాను దాహానికి నీరు తెమ్మని అన్నాడు. కాకా మహాజని నీరు తేగానే తను తాగి మహాజనిని కూడా తాగమని ఇచ్చాడు. యిప్పుడు నీ నీళ్ళ విరేచనాలు ఆగి పోయాయి. రాళ్ళతాపడం పనిని చూసుకొమ్మన్నాడు. పారిపోయిన వారందరు వచ్చి పని మొదలు పెట్టారు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 14

(రతన్‌జీ మౌలీ సాహెబ్ దక్షిణ వృత్తాంతము )

**శ్రీ సాయి సాధనామృతము** : బాబా అలక్ష్యమైన దానిపై దృష్టి నిలిపి, నానా మిషలతో భక్తులకు తన సాన్నిధ్యాన్ని కలిగించి కష్టాలు తీరుస్తాడు. దీనులను కాపాడి, దుష్ట రాక్షసత్వాన్ని నిరోధించి, భక్తుల దుర్వాసనలను దూరం చేయడానికి ఇదొక లీలావతారం. సద్భావంతో బాబా దర్శనానికి వెళ్ళిన వారు, ఆనందామృతాన్ని పానం చేసి ప్రేమ సుఖంలో తేలిపోతారు. తన ఆనంద జీవితము భక్తులు స్మరించుకొనటానికి సాయి ప్రేమతో కురిపించిన సాధనామృతము. భక్తులు చేయ వలసిన పనులను కథల రూపంలో, అనుభవ పూర్వకముగా బోధించిరి. ప్రపంచములోని జీవులందరు హాయిగా వుండ వలెనని బాబా వుద్దేశ్యము. భక్తులు జాగ్రత్తగా వుండి ఆత్మ సాక్షాత్కారము నకు ప్రయత్నము చేయవలెను. పూర్వ జన్మల పుణ్యము వలననే మనకు మానవ జన్మ లభించింది. ఈ శరీరాన్ని పశుప్రాయ జీవితంగా వ్యర్థం చేయకూడదు. మానవ శరీరము, మానవజన్మ ఉత్కృష్టమైనవి. ఈ మానవ జన్మలోనే మనిషి ప్రధానంగా భగవద్భక్తిని పెంపొందించు కోవాలి. ఈ మానవజన్మ సహాయంతో భక్తిమార్గము నవలంబించి ఆత్మసాక్షాత్కారము పొందవలెను. జాగ్రత్తగా వుండి జీవితాశయమును మరియు దాని ముఖ్యోద్దేశమైన మోక్షమును సంపాదించ వలెను. సత్పురుషుల చరణాల నాశ్రయించితేనే మోక్షము. ప్రతి నిత్యము సాయి కథలు, లీలలు వింటే శ్రేయస్సు కలిగి, సాయి చరణాల యందు భక్తి అభి వృద్ధి అవుతుంది. సుఖ శాంతులు జ్ఞానము కలిగి సాయిని చూడ గలము.

**రతన్‌జీ కి పుత్ర ప్రాప్తి** : నాందేడులో రతన్‌జీ అనే పార్సీ వ్యాపారి ఉండేవాడు. అతని పూర్తి పేరు. రతన్‌జీ షాపుర్జీ వాడియా, అతను ధార్మికుడు, ధనవంతుడు. అతను పొలములు, తోటలు, గుఱ్ఱాలు

మరియు బంట్లు సంపాదించాడు. ఎవరు అతనింటికి వచ్చినా నిరాశతో పంపేవాడు కాదు. అతను చాలా సంతోషంగా కనిపించినా అతనికి అంతరంగంలో చింత ఉండేది. ఈశ్వరుని పాలనలో దుఃఖము లేనివాడే లేడు. అతడు పుత్ర హీనుడవటం వలన ఎన్ని సంపదలున్ననూ సుఖపడ లేక పోతున్నాడు. అతనికి **12** మంది ఆడ పిల్లలు కలిగారు. కాని ఒక కొడుకు కూడ కలుగ లేదు. అందుకు అతనికి సుఖ శాంతులు లేవు. తన కళంకాన్ని కడిగేసి వంశాధారమైన ఒక కొడుకును ప్రసాదించుమని భగవంతుని వేడుకొని విలపించెడివాడు. రతన్‌జీని షిరిడి వెళ్ళమని సలహా దాసగణు యిచ్చాడు. రతన్‌జీ దాసగణు సలహ ప్రకారము షిరిడి వెళ్ళాడు. మసీదుకెళ్ళి బాబా దర్శనం చేసుకొని సాష్టాంగ ప్రణామం చేసాడు. అతనికి బాబా దర్శనంతో ప్రేమ ఉప్పొంగింది. ఒక బుట్టను తెరిచి పూలమాలను తీసి బాబా మెడలో వేసాడు. బాబా వద్దకు వెళ్ళి వినమృడై కూర్చుని యిలా ప్రార్థించాడు. 'మీ పాదముల నాశ్రయించితిని కనుక దయతో నాకు ఆశాభంగము కలుగ చేయకుము.' రతన్‌జీ యివ్వదలచిన **5** రూపాయలను దక్షిణ యిమ్మని అడిగాడు. అందులో రూ. **3140** యింతకు ముందే ముట్టినవి, ఇది తనకు బాగా గుర్తుంది, మిగిలిన రూ.**120** మాత్రమే యివ్వు మనెను. నిరాశ పరచకుమని వేడుకున్నాడు. సాయి నాథునికి రతన్‌జీపై దయ కలిగి, 'వృథాగా చింతించకు నీచెడు రోజులు ముగిసినవి, అల్లా నీ మనస్సు లోని కోరిక తీర్చును.' అని ఆశీర్వదించి విభూతి ప్రసాదము చేతిలో పెట్టాడు. రతన్‌జీ బాబా వద్ద ఆజ్ఞ తీసుకొని నాందేడు వెళ్ళి పోయాడు

రతన్‌జీ దాసగణు మహారాజును కలిసి షిరిడిలో జరిగిన వృత్తాంతము మొత్తము తెలిపాడు. బాబా ఆశీర్వదము ప్రసాదము లభించిందని కాని రూ.**3140** ముట్టినవని బాబా అన్నారు. అది తనకు అర్థం కాలేదని దాని అర్థం ఏమిటని దాసగణు మహారాజును అడిగాడు. ఆ విషయము దాసగణుకు కూడా అర్థము కాలేదు. తర్వాత దాసగణుకు మౌల్వీ సాహెబ్ అను ఒకయోగి గుర్తుకు వచ్చాడు. అతను మహమ్మ

దీయుడు, హమాలీ పని చేసుకుంటూ కాలం గడిపేవాడు. అతను మహాత్ముడు, ఆ విషయం నాందేడులో అందరికి తెలుసు. రతన్‌జీ యింటికి తరచూ వస్తూ వుండే వాడు. ఒక సారి సేఠ్‌జీ మౌళ్వీ సాహెబ్‌కు ఒక విందు ఏర్పాటు చేసాడు. దాసగణుకు ఆ విషయము గుర్తుకు వచ్చింది. ఆ నాటి ఖర్చు చూడగా సరిగా రూ.**3 14 0** ఎక్కువ కాదు, తక్కువ కాదు. బాబా ఈ రశీదు యివ్వటం వారికి ఆశ్చర్యం కలిగించింది. సాయి, మౌళ్వీ సాహెబ్ వేరు కాదు జ్ఞానానుసంధానం ఒక్కటే రతన్‌జీకి తర్వాత మంచి రోజులు వచ్చాయి. అతని భార్య గర్భము ధరించింది. బాబా ఆశీర్వాదము సత్యమై ఒక శుభ ఘడియలో రతన్‌జీ భార్య పుత్రుడిని ప్రసవించింది. అతని కోరిక తీరింది, అతను చాలా ఆనందించాడు తర్వాత ఇంకొక పుత్రిక జన్మించింది. పిమ్మట రతన్‌జీ షిరిడి వెళ్ళి సాయి దర్శనం చేసుకొని తన కోరిక తీరినందుకు బాబాకు ధన్యవాదాలు తెలుపుకున్నాడు.

దేవుని పూజ యందు బంగారు నాణెము లేనిదే పూజ పూర్తి కాదు. దేవుని పూజలో నాణెం అవసరమైతే యోగుల పూజలో కూడా వుండాలి. అని వేదములో చెప్పబడినది. తైత్తరీయోపనిషత్తు దానమీయడం వంటి సుగుణము లనభ్యసించ వలయునని చెప్పు చున్నది. దానము విశ్వాసము తోను, అణకువ తోను, కనికరముతోను ధారాళంగా చేయవలయు నని కూడా ఉపనిషత్తు చెప్పుచున్నది. శృతి యజ్ఞము, దానము, తపస్సు ద్వారా చిత్తశుద్ధిని పొందాలి అని చెబుతుంది. ఆత్మ జ్ఞానం పొందాలను కొనే వారికి దక్షిణే ఉపాయము

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 15

(దాసగణు సంకీర్తన,చోల్కర్ మొక్కు, బల్లి పలుకు )

**దాసగణు కీర్తన నారదీయ పద్ధతి :** ఒక సారి హరి భక్తుడైన దాసగణు యొక్క సంకీర్తనను కొపీనేశ్వర సన్నిధానంలో తానా జనులు ఏర్పాటు చేసారు. దాసగణు భక్తుల కోరికపై సంకీర్తన చేసేవాడు. నడుముకు ధోవతి కట్టుకొని పైన ఏమి తొడుక్కునే వాడు కాదు. తల పైకూడ ఏమి వుండేది కాదు. ఈ విధంగా వేసుకోవటాని కి సాయియే కారకుడు. అతని వేషధారణ ఇలా వున్నప్పటికి ప్రజలు సంకీర్తనలు వినటానికి గుంపులు గుంపులుగా వచ్చే వారు. ఒక సారి షిరిడి లో దాసగణు సంకీర్తన చేయటానికి ఆడంబరమైన నిండు అంగరఖా, తల పైన పాగా, పొడవైన కోటు, లోపల చొక్కా పైన వుత్తరీయం మామూలుగా ధరించే ధోవతి కట్టుకున్నాడు. వెళ్ళటానికి ముందు శిష్టాచారము ప్రకారము బాబాకు వందనం చేయటానికి మసీదుకు వెళ్ళాడు, అతని వేషధారణ చూసి బాబా, 'వాహ్వా! పెళ్ళి కొడుకులా అలంకరించు కున్నావు. ఎక్కడికి వెళ్ళు చున్నావు?'అని అడిగాడు. సంకీర్తనకని దాసగణు సమాధాన మిచ్చాడు. కీర్తన చేయటానికి ఆడంబరమైన బట్టలెందుకు. తీసి వేయమని బాబా చెప్పగానే, దాసగణు తీసి బాబా పాదాల చెంత వుంచాడు. అప్పటి నుండి దాసగణు చేతిలో చిరతలు, కంఠంలో తులసి మాల, లేక పూల మాల తప్ప ఏమి ధరించేవాడు కాదు.  ఇది ప్రసిద్ధుడైన నారదునిచే ప్రారంభమైన కీర్తనా పద్ధతి. నారదుడు, హరిదాసు లందరికి ఆదర్శం. ఈ హరి కీర్తనాపరులు బాహ్య రూపానికి, ఆడంబరాలకు ప్రాధన్యత నివ్వరు. వారి దృష్టి అంతా అంతఃకరణ శుద్ధి యందే వుంటుంది. నడుం క్రింది భాగం ధోతి ధరిస్తారు. చిరుతలతో తాళం వేస్తారు. వీణ వాయిస్తారు.  సాయి నాథుని కృప వల్ల దాసగణు మహాత్ముల కథలు స్వయంగా రచించి వాటిని కీర్తించటంలో పేరు పొందాడు. కొంకణ ప్రాంతంలో, ముంబాయిలో

మరియు దానిచుట్టుపట్ల ప్రాంతంలో సాయి తత్వాన్ని వ్యాపింప చేయటానికి దాసగణు మరియు దాసగణును బాబా కు పరిచయము చేసిన నానాసాహెబ్ చందోర్కర్ ముఖ్యులు.

**చోల్కర్ చక్కర కథ:** ఠానాలో కౌపీనేశ్వర దేవాలయంలో చోల్కరు అను ఒక శ్రద్ధ గల వ్యక్తి దాసగణు మహారాజు యొక్క హరికథ ద్వారా సాయి లీలలను విన్నాడు. ఆయన హృదయంలో బాబాపై నమ్మకం కలిగింది. బాబాతో తనను అనుగ్రహించుమని కోరుకున్నాడు. అతను సాయి చరణాలను ధ్యానించి ' సాయీ! నేను పరీక్షలో పాసై ఉద్యోగము వస్తే మీ పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసుకొని కలకండ పంచి పెట్ట గలను.'అని మొక్కుకున్నాడు. అతని అదృష్టం, బాబా అనుగ్రహముచే చోల్కర్ పరీక్షలో ఉత్తీర్ణుడైనాడు. ఖాయమైన ఉద్యోగం దొరికింది. అందుచే తొందరగా తన మొక్కు తీర్చవలెననుకున్నాడు. తన కుటుంబము చాలా పెద్దది. అతను షిరిడి యాత్రకై ఖర్చు పెట్టలేకుండెను. చోల్కర్‌కు తొందరగా మొక్కు తీర్చ వలెనని కోరిక కలిగెను. అందుకు అతడు 'టీ' లో చక్కర వేయకుండా తాగి మిగిలిన డబ్బును దాచుకొని ఆ డబ్బుతో షిరిడి వెళ్ళి తన మొక్కు తీర్చుకున్నాడు. నిర్మల మనస్సుతో బాబా పాదాలకు సాష్టాంగ వందనం చేసి సంతుష్టుడై, కలకండ పంచి పెట్టాడు. తను సంతుష్టుడనయ్యానని జన్మ సఫలమయిందని ఆనందించాడు.

షిరిడిలో వున్నప్పుడు చోల్కర్, జోగ్ వద్ద అతిథిగా వున్నాడు. దర్శనానంతరము జోగ్, చోల్కర్ లేవగానే బాబా జోగ్‌తో, 'ఇతనికి బాగా చక్కర వేసి టీ ఇవ్వు.'అని అన్నారు. ఆ మాటలు విని చోల్కర్ ఆశ్చర్య పడ్డాడు. ఆనందాశృవులతో బాబా చరణాలపై శిరస్సు నుంచాడు. జోగుకు బాబా మాటలు అర్థము కాలేదు. కుతూహల పడ్డాడు. బాబా అతని భావాన్ని గ్రహించి చోల్కర్‌తో 'నువ్వు చక్కర త్యజించి నియమాన్ని పాటించి త్వరగా మొక్కు తీర్చుకోవాలని అను కున్నావు. ఆలస్యం జరిగినందుకు నిన్ను నీవు ఎలా దండించు కొన్నావో

నాకు తెలుసు. నీ వీ విషయం గుప్తంగా దాచి ఉంచినా నాకు సమస్తం తెలుసు. మీరెవరైనా సరే ఎక్కడ ఉన్నా, భక్తి భావంతో నా ఎదుట చేతులు సాచితే నేను మీ భక్త్యానుసారము రాత్రింబగళ్ళు మీ వద్ద నిలబడి వుంటాను. నా శరీరం ఇక్కడనే వున్నా, మీరు సప్త సముద్రాల ఆవల ఉన్నా, నాకు తెలుస్తుంది. మీరు ఈ ప్రపంచములో ఎక్కడికైనా వెళ్ళండి. మీ వెంట నేనుంటాను. మీ హృదయమే నా గృహము. నేను మీ అంతర్యామిని. మీ హృదయాలలో ఉన్న నన్ను నిత్యం మీరు పూజించండి. సర్వ జీవులలో నేను ఉన్నాను. క్రిమి కీటకాలలో, జల చరాలలో, ఖేచరాలలో, కుక్కల్లో, పందుల్లో అన్ని ప్రాణులలో నేనే సర్వత్ర నిండి ఉన్నాను. నిరంతరం నన్ను మీ ఆత్మ గానే భావించండి. నన్ను యిలా తెలుసుకున్న వారు భాగ్య వంతులు.'అని గంభీరంగా అన్నాడు. ఈ మాటలు కొంచెంగా అని పించినా వీటి అర్థం గంభీర మైనది. బాబా వారి వారి ఆంతర్యాన్ని బట్టి అనుభవాలు కలిగించే వారు. బాబా మాటలు భక్తుల హృదయాలలో ప్రేమను, భక్తిని కలిగిస్తాయి. ఎక్కడనో ఉన్న చోల్కర్ మొక్కుకోగానే బాబా అతని కోరిక తీర్చాడు. అవకాశం వచ్చినప్పుడు బాబా హితోపదేశం చేసేవాడు. అవి విన్నవారు నిజంగా అదృష్ట వంతులు. చోల్కర్‌ను నిమిత్తమాత్రునిగా చేసి భక్తులకు హితోపదేశం చేసాడు. ఇది బాబా యొక్క కళాకౌశలం.


**రెండు బల్లుల కథ :** ఒక రోజు ఒక భక్తుడు బాబా యెదుట కూర్చుని ఉండగా, ఒక బల్లి కిచ కిచ మని పలుకడం విన్నాడు. బల్లి పలికినచో శుభ సూచకమని మరియు బల్లి పైన పడినచో అశుభమని నమ్మకాలు. అందుకు కుతూహలంతో బాబాను బల్లి పలుకు గురించి అడిగాడు. బాబా అతని తో 'ఔరంగా బాద్ నుంచి తన సోదరి వస్తుంది. ఆనందంతో బల్లి అరుస్తోంది'అని అన్నాడు. అతనికి బాబా మాటలు ఏమి అర్థము కాలేదు. అర్థం కాక మౌనంగా కూర్చున్నాడు. అంతలో బాబా దర్శనానికి ఒక భక్తుడు ఆ వచ్చిన భక్తుడు ఇంకా ముందుకు వెళ్ళ వలసి ఉన్నది. అతను గుఱ్ఱమునకు దాణా తేదలచి, గోనె సంచిని

తిరగేసి దులిపాడు. దాని నుండి భూమిపై ఒక బల్లి పడి, గాబరాగా అందరూ చూస్తుండగానే సరాసరి గోడ పైకి ప్రాకి పోయింది. అంతలో బాబా ఆ భక్తునితో 'ఇదే బల్లి సోదరి సరిగాచూడు.'అని అన్నాడు. బల్లి శబ్దం వస్తున్న వైపు ఈ చెల్లి బల్లి వయ్యారంగా వెళ్ళింది. ఆ రెండు బల్లులు సంతోషంగా ముద్దిడు కొని ఆలింగనం చేసుకొని అడ్డ దిడ్డంగా తిరిగి ఆనందించాయి. షిరిడి ఎక్కడ? ఔరంగాబాద్ ఎక్కడ? గుర్రపు రౌతు బల్లిని తీసుకొని ఔరంగాబాదు నుండి ఎలా వచ్చాడు? రాబోయే యిద్దరు అక్కా చెల్లెలు కలియుదురని బాబా ఎలా చెప్ప గలిగాడు? భక్తుడు ఆడిగిన ప్రశ్నకు దీనిరాకకు ఎలా సంబంధము కుదిరింది? ఇదొక అసాధారణ కలయిక. భక్తుల క్షేమం కోసం మహాత్ములు ఇలాంటి సంఘటనలను సృజిస్తారు. ఆ జిజ్ఞాసే లేకపోతె, ప్రశ్న అడుగక పోతే బాబా మహిమ ఎలా వ్యక్త మవుతుంది? ఎవరైతే నిత్యము ఈ అధ్యాయము పారాయణము చేయుదురో బాబా వారి కష్టాలు నివారిస్తాడు. అనన్య భావంతో బాబా చరణాల్లో తమ శిరస్సునుంచే వారికి బాబాయే రక్షకుడు, పోషకుడు, అభయ ప్రదాత అవుతాడు. వారికి బాబాయే కర్త. బాబా సర్వవ్యాపకుడని విశ్వాసం వున్న వారికి భయమనేదే ఉండదు. బాబా లీలలు వింటే బాబా శక్తి, వినోద స్వభావము తెలుస్తాయి. మనిషిలోవున్న సర్వ కోరికలు నివారణ అవుతుంది.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *సత్పురుషుల చరిత్ర, న్యాయ శాస్త్రము లేక తర్క శాస్త్రము లాంటిది కాదు.*
- *బాబా కళ్ళలోకి చూస్తుంటే ప్రేమ ఉప్పొంగి మనస్సు ఆనందములో విలీనమవుతుంది.*



# అధ్యాయము 16

(పరమ లోభి బ్రహ్మ జిజ్ఞాసి బ్రహ్మ స్వరూప వర్ణన)

**సద్గురువు :** సాయిబాబా దీనజనులను ఉద్ధరించటానికై, పరోప కారార్థం ఈ శరీరాన్ని ధరించాడు. సద్గురువు ఏ కోరికలూ లేని వాడు, వారు శిష్యుల కోరికలు తీర్చి నిష్కాములుగా చేస్తారు. భక్తితో ఏదైన సమర్పించినచో మిక్కిలి సంతోషముతో ఆర్తితో తీసుకొనెడి వాడు. అదే దురభి మానంతో గాని పరీక్షించటానికి కాని సమర్పించినచో తిరస్కరించే వాడు. బాహ్యోపచారాలను లక్ష్యపెట్టెడి వాడు కాదు. భక్తి శ్రద్ధలతో చేసిన సేవను ఆనందంగా అంగీకరించేవాడు. తనకేమి తెలియనట్లుగా వుండి అజ్ఞానులకు జ్ఞానాన్ని ప్రసాదించే వాడు. ప్రేమతో వారి సేవ చేసిన వారు బ్రహ్మ సాయుజ్యాన్ని పొందారు. శిష్యుడు కపటం ప్రదర్శించినచో అపాయంలో చిక్కు కుంటాడు. అపాయాలను తొలగించే దారి భక్తునికి తెలియ కుండానే సద్గురువే చూపిస్తారు. సాయిబాబా కంటే ఉదారులు, దయార్థ హృదయులైనట్టి సద్గురువు వేరెవరూ లేరు. కామదేనువు, కల్పతరువు, చింతామణి నుండి కేవలం కోరుకున్నవి మాత్రమే లభిస్తాయి. కాని సద్గురువు, ఊహించలేని ఆత్మ సాక్షాత్కారము, నిర్వికల్ప స్థితి ప్రసాదిస్తాడు. మహాత్ములు ఏ కోరికలూ లేని పరిపూర్ణులు. భక్తులు అనేక మైన కోరికలు కలిగి ఉంటారు. ఒకరు పుత్ర సంతతి, ఒకరు రాజ్య సంపత్తి కోరుతారు కాని సంసారం నుండి ముక్తి కోరేవారు ఎవరో ఒకరుంటారు.

**ధనికుడు బాబాను బ్రహ్మ జ్ఞానము కోరుట:** ఒకనాడు మామూలు భక్తుడైన గుల్జార్ అనే ధనికుడు, బాబా గొప్ప బ్రహ్మజ్ఞాని, సత్పురుషులకు మకుటమణి, ఉదార స్వభావుడు అనెడి ఖ్యాతి విని వారిద్వారా బ్రహ్మజ్ఞానాన్ని పొంది ధన్యుడ నౌతానని అనుకున్నాడు. తనకన్నీ ఉన్నవి ఒక బ్రహ్మజ్ఞానం మాత్రము లేదు. బ్రహ్మజ్ఞానము కావలయునని బాబాను కోరాడు. బ్రహ్మజ్ఞానాన్ని కోరువారు కోటికొక్కరు మాత్రమే. ఒక టాంగాను బాడుగకు మాట్లాడుకొని బ్రహ్మ జ్ఞానాన్ని సంపాదించాలనే కోరికతో ఆ ధనికుడు షిరిడి బయలు దేరాడు. సాయి దర్శనం చేసుకుని, పాదాలకు సాష్టాంగ పడ్డాడు. ఆ ధనికుడు బాబాతో ' బాబా! షిరిడి బాబా అతి త్వరగా బ్రహ్మను చూపిస్తారని జనులంటారు, నాకు బ్రహ్మను చూపించండి. అందుకని చాలాదూరం నుండి ఎంతో శ్రమ పడి వచ్చాను. మీరు బ్రహ్మజ్ఞానం ప్రసాదించినచో నేను పడిన శ్రమకు ఫలితం లభించును.'అని అన్నాడు. అప్పుడు బాబా అతనితో 'బ్రహ్మను ఇప్పుడే చూపిస్తా, ఇక్కడ ఆలస్యం ఏమీ లేదు. నీవు నిశ్చింతగా ఉండు. నా బేరమంతయు నగదే. కాని అరువు కాదు. అనేక మంది నా వద్దకు వచ్చి ప్రాపంచిక విషయములే అడుగుదురు. కాని బ్రహ్మజ్ఞానం కావాలని ఎవ్వరూ అడుగ లేదు, నీ లాంటి వారు చాలా అరుదు. నేను బ్రహ్మజిజ్ఞాసుల కొరకు తపించి పోతున్నాను, నీకు బ్రహ్మనే కాదు సర్వం చూపిస్తాను. ముందు నఖ శిఖాంతం నిన్ను చుట్టుకున్న మాయను బయటకు తీస్తాను.'అని అన్నారు. బాబా మాటలు అమృతం లాంటివి. వాటికి సంశయంతో ఊగిసలాడే చిత్తం గల వారిని ఉద్ధరించ గల సామర్థ్యం ఉంది. ఇంద్రియ విషయ సుఖాల్లో మునిగి వుండే వారిని కూడా సన్మార్గంలో పెడుతుంది. చింతామణి ప్రసన్నమవుతే లౌకిక సుఖాలు లభిస్తాయి. ఇంద్రుడు ప్రసన్నుడైతే స్వర్గ సుఖాలు లభిస్తాయి. మన గురువు విలక్షణమైన వాడు, బాబా ప్రసన్నుడైతే బ్రహ్మ జ్ఞానమే లభిస్తుంది. బాబా ఆ ధనికుడిని అలాగే కూర్చో బెట్టి, తను వచ్చిన

విషయం గుర్తుకు రాకుండునట్లుగా వేరే సంభాషణ లోనికి దించాడు. అతనిని ఇతర విషయములలో లీనంచేసారు. ఒక బాలుని పిలిచి, నందు మార్వాడి వద్దకు పోయి **5** రూపాయలు తీసుకొని రమ్మనెను. కుర్రవాడు పోయి, వెంటనే తిరిగి వచ్చి నందు యింటి వద్ద లేడని, తలుపుకు తాళం వేసి వుందని చెప్పాడు. కిరాణ దుకాణం బాలా దగ్గరికి పోయి **5** రూపాయలు ఒక గంట కోసం తెమ్మని మళ్ళీ పంపాడు బాబా. బాలా కూడ యింట్లో లేడని ఆ బాలుడు వట్టి చేతులతో తిరిగి వచ్చాడు. యింకా యిద్దరి ముగ్గురి వద్దకు బాబా ఆ బాలున్ని పంపారు కాని ఆ బాలుడు అలిసి పోయాడు కాని డబ్బు లభించ లేదు. అంతర్యామి అయిన బాబాకు నందు, బాలా మొదలగు వారు యింటి వద్ద ఉండరని తెలుసు. సాక్షాత్తు బ్రహ్మ స్వరూపుడైన బాబాకు **5** రూపాయల అవసరమేమిటి? అవి బాబాకు లభించవని కాదు! అక్కడున్న వారెవరైనా యివ్వగలరు, బ్రహ్మజ్ఞానం కోరిన వానికి పాఠం చెప్పాలని అలా చేసారు. బాబా ఆ ధనికుని నిమిత్తమాత్రుని చేసి సకల భక్తుల శ్రేయస్సు కోసం ఉపదేశం చేసారు. బ్రహ్మను కోరిన వాని జేబులో **250** రూపాయలు నోట్ల కట్ట ఉన్న విషయం కూడా బాబాకు తెలుసు. బ్రహ్మసాక్షాత్కారం కావాలని కోరి వచ్చిన వ్యక్తికి, సాయికి **5** రూపాయలు అప్పుగా ఒక గంట కోసం యివ్వటానికి మనస్సు రాలేదు. **5** రూపాయలు అప్పుగా యివ్వలేని లోభి అతడు మిగతా ఎవరైన యిలా బాబా అప్పు కావాలనుకున్నప్పుడు చూస్తూ డబ్బు యివ్వకుండా ఉండ గలరా?. ధనమోహంతో ఉన్న అతనికి బాబాకు డబ్బు యివ్వాలనిపించ లేదు. యివ్వలేదు సరికదా బాబాను బ్రహ్మను చూపించుమని చీకాకు పెట్టు చుండెను.అతనికి ఎక్కువ ఆలస్యమయితే కిరాయి పెరుగుతుందని బాధ.

**ఆత్మ తత్వం:** ప్రకాశం కిరణంలో అతి సూక్ష్మ మైన కణం, ఆ కణం కంటే సూక్ష్మమైన ప్రమాణంలో అణువు అని అనుమానంగా నిర్ధా రించారు. ఆత్మ ఎంత సూక్ష్మమో చెప్పలేము. స్థూలం కన్నా స్థూలం.

మహత్తు కన్నా మహత్తు, గొప్ప వానిలో గొప్పది, బ్రహ్మాండం ఆ బ్రహ్మాండంకంటే గొప్పది. కాని అవన్ని సాపేక్ష ప్రమాణాలు. ఆత్మ ప్రమాణాతీతమైనది. నామ రూపాలు ఆత్మకు కేవలం ఉపాధులే ఆత్మను ఉపాధులతో పోల్చడం వ్యర్థం. ఆత్మ పరిపూర్ణమైనది. ఆత్మకు జన్మ లేదు. మరణం లేదు. మూల కారణం లేదు. ఆత్మ జన్మ లేనిది. అది నిత్య శాశ్వతం, పురాతన మైనది. ఇది అని నిర్ధారణ చేయటానికి కష్టమైనది. బ్రహ్మప్రతీక అయిన ఓంకారమే బ్రహ్మ యొక్క పరమ స్వరూపం. ఆగమాచార్యులు తప్ప యితరులు ఆత్మతత్వాన్ని తెలుసుకోగల సమర్థులు కారు. బహు ప్రయాసలతో కూడా యితరు లెవ్వరికి సాధ్యము కాని దాన్ని సద్గురువు చరణాలను దృఢంగా నమ్ముకున్న వారు అల్ప ప్రయాసతో సాధించ గలరు. వారికి జ్ఞానం కలుగును. అజ్ఞానం తొలగిపోయి సచ్చిదానంద స్వరూపం సాక్షాత్కారమవుతుంది.

**ఆత్మసాక్షాత్కారము :** అహంకారం కరిగి పోనంత వరకు, లోభం నిర్మూలనం కానంత వరకు, మనస్సు వాసనారహితం అవనంత వరకు బ్రహ్మజ్ఞానం లభించదు. దేహాత్మకు బుద్ధియే భ్రాంతి. ఇదే బంధనానికి కారణం. ఆసక్తి, విషయవాసనల స్ఫురణ తొలగిపోతే బ్రహ్మ ప్రాప్తి హస్తగత మవుతుంది. పరబ్రహ్మసాక్షాత్కారం కఠినమైన కార్యం. అందువలన మంద బుద్ధులకు బ్రహ్మను విశేషాలతో నిరూపించటమే మర్మము, ధర్మము. ఆత్మ సర్వ జీవులలోను నిగూఢంగా వుంటుందని, వేదాంతులకు తెలుసు. కాని ఈ సత్యాన్ని ఎలా నిరూపించాలి? ఎలా అనుభూతి చెందాలి. కాని సర్వత్రా ఆత్మానుభూతి కావాలి. మొదట చిత్తశుద్ధి కావాలి. తర్వాత సూక్ష్మ కుశాగ్ర బుద్ధి కావాలి. అప్పుడు కృపతో ఆత్మ ప్రత్యక్ష మవుతుంది. ఆత్మను తెలుసుకున్న వారు శోకరహితులు, ధీమంతులు, వారు భవ సాగరం నుండి విముక్తులు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 17

(బ్రహ్మజ్ఞాన కథనము  శ్రేయము ప్రియము)

**శ్రేయస్కరమైనవి, ప్రియమైనవి :** ప్రకాశం అంధకారం ఒకటిగా వున్నట్టు కనిపిస్తాయి కాని అవి రెండు భిన్నమైనవి. అలాగే శ్రేయస్సు, ప్రేయస్సు కూడ భిన్నంగా వుంటాయి. పరమ పురుషార్థమైన మోక్షం శ్రేయస్సు, ఐహికమైన ఇంద్రియ విషయ సుఖభోగాలు, ప్రేయస్సు ప్రియకరం కాని అహితం చేస్తుంది. ప్రేయం అంటే ప్రియమైనవి. వాటి కొరకు పరుగెత్తు మనస్సు కలవారు స్వార్థంతో భ్రష్టు పట్టిపోతారు. శ్రేయం వివేకరూపమై శ్రేయస్సును కలిగిస్తుంది. ప్రేయం అవివేక రూపమై హాని కలిగించును. శ్రేయస్సు విద్యా రూపిణి, ప్రేయస్సు పూర్తిగా అవిద్యా రూపము. శ్రేయం సంబంధించిన విషయాలు జ్ఞానాన్ని కలిగించును. జ్ఞానులు ప్రియమైన వాటి గురించి పరితపించరు. అజ్ఞానులకు శ్రేయాన్ని కలిగించేని రుచించవు. కాంతా కనకాల యందు ప్రీతి వున్నంత వరకు, యింద్రియ సుఖాలపై కోరికలున్నంత వరకు, ప్రియమైన వాటినే కోరుకుంటారు. అట్టి వారికి వివేక వైరాగ్యములు వుండవు. నీరు పాలు కలిసి వున్నట్లే  శ్రేయము, ప్రేయము కలిసి వుంటాయి. నీటిని వదలి పాలను గ్రహించిన హంస వలె వివేకులు బుద్ధి మంతులు, అదృష్టవంతులు కేవలం శ్రేయన్నే కోరుతూ ప్రేయాలకు విముఖంగా వుంటారు. మందబుద్ధులు పశు, పుత్ర, ధన, మానాది యోగ క్షేమాల వెంట పడి ప్రేయాలనే ఆశిస్తారు. శ్రేయ ప్రేయాలను తెలుసుకో గలిగిన వారే వివేకులు. హంసవలె ప్రేయాలను పారద్రోలి శ్రేయాల నాదరించిన వాడే జ్ఞాని.

**సద్గురువు శరణు, బ్రహ్మతత్వ ప్రాప్తి :** 'నీ జేబులో **50** రెట్లు డబ్బుండగా నీవు ఊరికే కూర్చుని చూస్తున్నావు ఆ రూపాయలను బయటకు లాగు. బ్రహ్మ నీ జేబులోనే వున్నాడు.'అని అన్నాడు బాబా. ఆ పెద్ద మనిషి తన జేబులో నుంచి నోట్ల కట్ట బయటకు తీసి లెక్క పెట్టి

చూడగా సరిగా **25** పది రూపాయల నోట్లుండెను. అందరు మిక్కిలి ఆశ్చర్యపడిరి. ఆ ధనికుడు, ఈ మహారాజు ఎంతటి జ్ఞాని అనుకుంటూ బాబా ఆశీర్వాదాల కోసం బాబా పాదాలపై తన తలనుంచాడు. అప్పుడు బాబా యిలా అన్నాడు, 'నీ బ్రహ్మను (నోట్ల కట్టలను) మడత పెట్టుకొని దాచేసుకో, నిన్ను చుట్టుకున్న లోభం తొలగి పోయే వరకు నీకు బ్రహ్మజ్ఞానం లభించదు. మనస్సుకు ధనమందు, సంతానమందు, ఐశ్వర్యమందు ఆసక్తి వున్నంత వరకు బ్రహ్మజ్ఞానం లభించదు. ఈ ధనదాహం కలవారు దుఃఖమనే సముద్రములొ దుస్సహమైన మదమత్సరమనే మొసళ్ళను ఎదుర్కొనాలి. మోహం లేని వాడు ఒక్కడే తరించ గలడు. బ్రహ్మ లోభికి బద్ధ శతృవు. ఆచార భ్రష్టుడైన లోభికి నిశ్చింత, తృప్తి, మనశ్శాంతి వుండవు. ఒక్క సారి లోభం మనస్సులో ప్రవేశిస్తే చాలు ఆధ్యాత్మిక సాధనంతా మట్టిలో కలిసి పోతుంది. బ్రహ్మజ్ఞాన సంపన్నులైనా సరే ఫలాన్నాశించని వైరాగ్యం లేకపోతే ఆ బ్రహ్మజ్ఞానం వ్యర్థం. విషయ చింతనతో వున్న వారికి గురూపదేశం వ్యర్థం. వారు లౌకిక పరమార్థాలను రెంటిని కోల్పోతారు. రెంటికి చెడ్డ రేవడి అవుతారు.చిత్తశుద్ధి ఏర్పడనిదే పరమార్థ సాధనకు పూనుకోవద్దు అలాంటి వారు జ్ఞానంతో గర్విష్ఠులవుతారు. వారి సాధనంతా బూడిదలో పోసిన పన్నీరే కనుక ఇతరులకు నచ్చేలాగ ఎంత వరకు మాట్లాడ గలరో అంతే మాట్లాడాలి. ఎంత జీర్ణమవుతుందో అంతే తినాలి. లేకపోతే అజీర్ణంతో బాధ పడగలరు.' భగవంతుడు ఎవరిపై ప్రసన్నుడౌతాడె వారికే వైరాగ్యాన్ని ప్రసాదించి , దానికి వివేకాన్ని జత పరిచి భవ సాగరాన్ని దాటిస్తారు. ఆత్మ సాక్షాత్కారము కోరుకొను వారికి భూలోకం బ్రహ్మ లోకం తప్పమూడో చోటు లేదు. ఈ మహారాజు ఎంతటి జ్ఞాని అనుకుంటూ, బాబా ఆశీర్వాదాల కోసం బాబా పాదాలపై తన తలనుంచాడు. అప్పుడు బాబా యిలా అన్నాడు, 'నాభోషాణంలో నిధి ఎప్పుడూ నిండుగా వుంటుంది ఎవ్వరేది అడిగినా యివ్వగలను, కాని అడిగే వారి శక్తిని చూసి వారు భరించ కలిగి నంతనే యిస్తాను.

వారికి తగినంతనే, తగినదే యిస్తాను. దీనిని శ్రద్ధగా వింటే నీవు కృతార్థుడ వవుతావు. ఈ పవిత్ర మైన మసీదులో కూర్చుని నేనసత్యము పలుకను.'మరియు 'ఆమరణాంతం కించిత్తైనా చింత పెట్టు కోకుండా సదా ఆనంద భరితులై వుండండి.' అని బాబా ఉపదేశించే వారు. బాబా పరోపకారార్థం పదే పదే హితోపదేశాలు చేసారు. ఈ ఆధ్యాయం బాబాకు శరణన్న వారికి భవతరానికి నౌక. 'నువ్వు శుద్ధ పరబ్రహ్మవు ' అయినా గబ్బిలంలా శరీరాన్ని పట్టి వ్రేలాడు తున్నావు. మోహ మాయ వల్ల నీ నిజ రూపాన్ని విస్మరించావు. నిన్ను నువ్వు తెలుసుకో.'అని జీవునికి బోధ చేయాలి. భ్రమల కారణంగా శరీరాభిమానాలు పెరిగి పోయాయి. 'నేను' 'నా' అన్నది మృగజలం సమాన మని ఎరిగి, దేని పైన మమకారం లేకుండా వుండాలి. 'నేను, నీవు' అను ఈ మాయా ప్రపంచంలో చిక్కుకొనక, సుఖ దుఃఖాలనే అజ్ఞానాన్ని తొలగించుకొని జ్ఞానాన్ని సంపాదించండి. బ్రహ్మజ్ఞానం మీ దగ్గరనే వున్నది. 'నీవు, నేను' అను భావమున్నంత వరకు బ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకో లేరు. భవపాశం నుంచి విడిపించుకొనే ఘడియ ఎప్పుడొస్తుందని అహర్నిశలు బాధపడేవారు త్వరలో ముక్తులవుతారు. సంసారం నిస్సారమని నిశ్చయంగా తెలుసుకొని, ఏకాంతంగా ఆత్మచింతనలో నిరంతరం వుండాలి. బాబా బ్రహ్మజ్ఞానం కొరకు వచ్చిన వ్యక్తిని నిమిత్త మాత్రుణ్ణి చేసి భక్తులందరికి బ్రహ్మనిరూపణ చేసి జీవశివైక్యతను వివరించారు. సాయి భక్తుల బుద్ధి, వారి అర్హతను నిర్ధారణ చేసి జ్ఞాన సమృద్ధిని వితరణ చేస్తారు. ఎవరికేది సాధన యోగ్యమయినదో దానినే వారికి ఇచ్చే వారు. భక్తుల యోగ్యానుసారం వారి భారాన్ని వహించేవారు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 18

(శ్రీ సాయిబాబా అనుగ్రహము)

**సాఠేను గురుచరిత్ర పారాయణం :** బాబా ఎల్లప్పుడు వారివారి అర్హతలననుసరించి ఉపదేశాలు ఇచ్చే వాడు. ఇవి కల్పితాలు కావు. నిరర్థకము కావు. ప్రత్యక్షంగానే కాక స్వప్నంలో కూడ బోధించాడు. అవి అప్రమాణమని అనిపించవచ్చు కాని అది నిజం. బుధ కౌషిక ఋషికి రామ రక్షా స్తోత్రాన్ని స్వప్నంలోనే దీక్షనిచ్చారు. ఆ ఋషి అందరికి తెలియ చేసారు. ఆ విధంగా నే బాబా కూడ స్వప్నంలో బోధలు చేసాడు. తల్లి పిల్లల ఆరోగ్యం కొరకు పిల్లలను బుజ్జగించి మాయ మాటలు చెప్పి ఔషదం త్రాగించే రీతిలో భక్తుల శ్రేయస్సు గురించి బాబా ఉపదేశాలు ఇచ్చేవారు. లార్డ్ రే గవర్నరుగా వున్నప్పుడు క్రఫర్డ్ పాలనను రూపు మాపాడు. ఆ సమయములో ప్రసిద్ధుడైన ఒక పెద్ద మనిషి బాబా భక్తుడయ్యాడు. అతనే సాఠే. (వీరు సాఠే వాడ కట్టించిన రావుబహద్దూర్ సాఠే కాదు) సాఠే కష్టాల్లో వున్నప్పుడు అతని శ్రేయస్సు కోరి స్నేహితులతనితో సాయినాథుని శరణు జొచ్చితే వారి చరణాల యందు మనస్సు లగ్నమై కష్టాలుండ వని సలహా యిచ్చారు. సాఠేకు స్నేహితులిచ్చిన సలహా బాగా నచ్చింది. స్నేహితులు చెప్పిన దాన్ని విని సాఠే క్రీ.శ. **1917**వ సం. లో షిరిడి వెళ్ళాడు. బాబా దర్శనం చేసుకొని వారి పాదాలపై సాష్టాంగ నమస్కారం చేసాడు. బాబా దర్శన మాత్రముతోనే చిత్తానికి శాంతి, నిశ్చింత కల్గింది. మనస్సును దృఢ నిశ్చయం చేసుకొని గురు చరిత్ర పారాయణం ప్రారంభించాడు. సప్తాహం సమాప్తి అయిన రాత్రి, బాబా సాఠే స్వప్నంలో తన చేతిలో ఆ గ్రంథాన్ని పట్టుకొని, అతనికి అర్థాన్ని విడమర్చి చెప్పినట్లుగా దృష్టాంతాన్ని యిచ్చారు. సాఠే కలను జ్ఞాపకము ఉంచుకొని, మిగుల సంతసించాడు. ఆ మరుసటి దినము ఆ దృశ్యమును కాకా సాహెబ్ దీక్షిత్‌కు తెలియపరిచి. ఒక సప్తాహం

చాలునో లేక యింకొక సప్తాహం చేయవలయునో కనుగొనుమనెను. అంతలో బాబా, అతను గురుచరిత్ర ఇంకొకసారి పారాయణం చేయవలయును, గురు చరిత్ర పారాయణం చేసే వారికి వినేవారికి శుభం కలుగునని చెప్పెను.

**హేమాద్‌పంత్ ఆలోచన బాబా సమాధానము :** బాబా సాఠే గురించి చెప్పిన సమాధానము విని హేమాద్ పంత్ ఆశ్చర్యపడి యిలా మనస్సులో ఆలోచించాడు. 'సాఠే గురు చరిత్ర ఒక్కసారి, ఒక సప్తాహము మాత్రమే పారాయణం చేసాడు. ఇంత చేసినందుకే ఫలితం లభిస్తున్నది. నేను నలుబది సంవత్సరముల నుండి పారాయణం చేస్తున్నాను, కాని ఏమి ఫలితం లేదు. నా కోరిక ఎప్పుడు తీరునో?'అని అనుకోసాగాడు. ఈ ఆలోచన హేమాద్ పంత్ మనస్సులో మెదలగానే బాబా పసిగట్టాడు. మన మనస్సు యితరులెవ్వరికి తెలియక పోయినా సాయి మహారాజుకు మాత్రం అప్పుడే తెలిసి పోతుంది. 'శతృవు కూడా చేయలేని ఆలోచనలు మనస్సు చేస్తుంది.'అన్నది ఒక నానుడి. బాబా హేమాద్ పంత్ మనస్సును కనిపెట్టి అతనిని వెంటనే లేపి, 'శ్యామా వద్దకు ఇప్పుడే వెళ్ళి అతని వద్ద నుండి **15** రూపాయల దక్షిణ తీసుకొని రా! మరొక్క మాట! వెంటనే తిరిగి రాకు. అతనితో కొంత సేపు మాట్లాడిన పిమ్మట తిరిగి రా!'అని అన్నాడు. బాబా హేమాద్ పంత్‌ను దక్షిణ మిషతో అతని మనస్సులో వున్న ఆలోచనలకు సమాధానము యిప్పించడానికి మాత్రమే శ్యామా వద్దకు పంపాడు. బాబా ఆజ్ఞ శిరసా వహించి శ్యామా వద్దకు వెళ్ళాడు. శ్యామా అప్పుడే స్నానము చేసి ధోవతి కట్టుకొని, ధోవతి అంచులను సరిచేసుకొను చుండెను. అతను బయటికి వచ్చాడు. హేమాద్ పంత్‌ను చూసి వచ్చి కూర్చోండి. యిప్పుడే వస్తాను. మనము తీరిగ్గా మాట్లాడుకొన వచ్చును.'అని చెప్పి లోనికి వెళ్ళి పోయాడు. హేమాద్ పంత్ వసారాలో బల్లపై నున్న పుస్తకాలను తిరగేస్తుండగా 'ఏకనాథ భాగవతం' కనబడగానే

పైకితీసాడు. ఆ గ్రంథము తీసుకొని తెరువగానే అనుకోకుండ ప్రొద్దున అసంపూర్తిగా చదివిన అధ్యాయములోని భాగం కనిపించింది. హేమాద్ పంత్ అమితాశ్చర్య పడ్డాడు. ఉదయం చదువకుండా వదిలేసిన భాగాన్ని బాబా యిప్పుడు పూర్తి చేయించ డానికై ఇక్కడికి పంపించి సూచించినట్లయింది. నియమంగా చదివేటప్పుడు సంపూర్ణంగా చదవకుండా ఆ ఆసనం విడిచి వెళ్లకూడదని బాబా పాఠం నేర్పాడు.

**శ్రీమతి రాధాభాయి దేశ్ముఖ్ కు ఉపదేశము :** శ్రీమతి రాధాభాయి దేశ్ముఖ్, ఖశాబా దేశ్ముఖ్ తల్లి. ఆమె సాయి బాబా కీర్తి విని సంగమనేరు భక్తులతో బాబా దర్శనానికి షిరిడి వచ్చింది. ఎంతో నిష్ఠతో సాయిబాబా చరణాలకు నమస్కరించింది. బాబాను గురువుగా చేసుకొని ఉపదేశం తీసుకొంటే పరమార్థం సాధించ వచ్చునని విశ్వాసం కలిగింది. ఆ వృద్ధురాలు ఎలాగైనా బాబా వద్ద ఉపదేశం తీసుకోవాలని నిశ్చయించుకొని, అన్న పానాదులు వదలి వేసింది. దృఢమైన దీక్షతో కూర్చుంది. కొంచెమైన అన్నం తిన లేదు. ఒక గుటక నీరైన తాగ లేదు. మూడు రోజుల వరకు అన్నం, నీరు తీసుకొనక ఉపవాసం ఉంది. శ్యామా బాబాతో, 'ఆ రాధాభాయ్ దేశ్ముఖ్ మూడు రోజుల నుండి ఉపవాసంతో ఉంది. ఆమె ప్రాణాలు పోగొట్టుకొనేలా వుంది. హితోపదేశం చేసి అనుగ్రహించు. ఏదైనా చెప్పి పుణ్యం కట్టుకో' అని చెప్పాడు. 'సాయి ఆమెను అనుగ్రహించాడా?'అనే సందేహం భక్తులకు కలుగవచ్చును.ఆ సంశయాన్ని వచ్చే అధ్యాయములో విపులీకరించ బడినది. బాబా ఆమెకు తగిన ఉపదేశం చేసాడు. ఆ ముసలామె కారణంగా మనందరికి బాబా ఉపదేశం వినే భాగ్యం లభింస్తుంది. ఆ ఉపదేశాన్ని శ్రద్ధగా విని ఆచరిస్తే భక్తుల అజ్ఞానం నశించి, సర్వ సుఖాలు కలుగును.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 19

(శ్రీ సాయిబాబా అనుగ్రహము శ్రద్ధ, సహనము)

**భక్తిమార్గము, జ్ఞానమార్గము :** నిర్భయం, శాశ్వతమైన స్వతంత్రం, ముక్తి, పరమాత్మ ప్రాప్తి వీనిని సంపాదించుకోవడమే జీవుని కర్తవ్యం. అప్పుడే జన్మసాఫల్యత. జ్ఞానం లేకుండా మోక్షం లేదు. విరక్తి, వైరాగ్యం లేనిదే జ్ఞానం లభించదు. స్వప్నం నుండి జాగృతావస్థకు రాగానే స్వప్నం అంతరించి పోతుంది. అందువల్ల స్వ స్వరూపంలో స్థితులైన వారిని స్మరించాలి. అన్నిటికంటే జ్ఞానం శ్రేష్ఠమైనదే, కాని బాబా ఎల్లప్పుడు భక్తి మార్గాన్నే అవలంభించుమని హితోపదేశం చేసేవాడు. జ్ఞానమార్గం మహిమాన్వితం. అది రామాఫలం లాంటిది, భక్తి మార్గం సీతాఫలం లాంటిది. అది స్వల్ప సాధనతో మధుర రసఫలం సేవించటం లాంటిది. రెండూ మధుర రసభరితములే. రామాఫలం చెట్టుపైన పండుతేనే అత్యంత మధురంగా వుంటుంది, కాని వేరుగా పండుతే మధురంగా వుండదు. చెట్టుపై పండేలా జాగ్రత్త పడాలి. సీతాఫలానికి ఈ ప్రయాస అవసరం లేదు. రామఫలం క్రింద పడితే పతనభయం ఉంది. అదే విధంగా జ్ఞానులకు పతనభయం ఉంది. వారికి పూర్తి నియంత్రణ కావాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం ఉన్నా పతనమే. వారు జ్ఞానాభిమానాన్ని జయించాలి. సాయి నాథుడు తమ భక్తులకెప్పుడూ భక్తి మరియు నామ జపం గురించే ఎక్కువగా వివరించేవాడు. జ్ఞానం కంటే ధ్యానం శ్రేష్ఠమని శ్రీ కృష్ణ భగవానుడు అర్జునునికి చెప్పాడు. భక్తుల భవ బంధాలు తొలగి పోవడానికి సాయి బాబా కూడ అదే సాధన చెప్పేవాడు.

**బాబా ఉపదేశము :** బాబా వృద్ధురాలి నిగ్రహము చూసి ఆమెను అనుగ్రహించాడు. ఆమెను తన వద్దకు పిలిపించుకొని, ఆమెతో ప్రేమగా

'నేను నీ బిడ్డను. నీవు నాకు తల్లివి. నీకు నాపై అనురాగముండాలి. నీకు పరమ సుఖాన్ని కలిగించే ఒక విషయాన్ని చెబుతాను శ్రద్ధగా వినుము. నా గురువు గొప్ప మహాత్ముడు. అతను ఎంతో దయామయుడు. నేను వారి సేవ చేసి చేసి అలసిపోయాను. అయినా అతను నాకేమంత్రాన్ని యివ్వలేదు. వారిని ఎప్పుడూ విడవకూడదని ప్రయాసపడ్డాను. వారు నన్ను ముందు రెండు పైసలడిగారు. వారడిగిన పైసలు నిష్ఠ (శ్రద్ధ) మరియు సహనము (ఓపిక) మాత్రమే. నేనవి వెంటనే వారికి ఇచ్చి వేసాను. వారు ఎంతో సంతోషించారు. అమ్మా శ్రద్ధా, సబురీ (సహనము) లాంటిదే ధైర్యము. ధైర్యాన్నెప్పుడూ కోల్పోవద్దు. సహనమే ధైర్యాన్నిస్తుంది. ఎప్పుడైనా కష్టాల్లో చిక్కుకున్నప్పుడు, ఈ ధైర్యమే కష్టాలను దాటింప చేస్తుంది. ఈ సహనం పాపతాప దైన్యాలను, ఆపదలను నివారిస్తుంది. భయభీతులను దరిచేరనివ్వదు. దీని శక్తి ఎవ్వరికి తెలియదు.

**బాబా సూక్తులు :** బాబా పలికిన పలుకులు. 'నేను ఒకే ప్రదేశంలో వుండే వాడిని కాను. భూమి, గాలి, దేశము, ప్రపంచము, వెలుతురు, స్వర్గము, ఆకాశము లోను సంచరిస్తుంటాను. ఆరడుగుల శరీరంలోనే వున్నానని అనుకునే వారికి పాఠంచెప్పడానికి భువిపై అవతరిస్తాను. ఎన్నెన్నో రూపాలు ధరిస్తాను. రాత్రి పగలు నిష్కామంగా ఎవరు నన్ను అనన్యంగా భజిస్తారో వారు ప్రత్యక్షంగా నాలో కలిసి నాలో ఏకమై పోతారు. బెల్లాన్ని విడిచి మధురం, సాగరాన్ని విడిచి అలలు, కళ్ళను విడిచి తేజస్సు ఉండ వచ్చును. కాని నా భక్తులను విడిచి నేను వుండ లేను. మీ మనో బుద్ధుల ను నాకు సమర్పించి, నన్నెల్లప్పుడూ స్మరిస్తున్న వారికి, ఎప్పుడై నా, ఎక్కడై నా ఏ భయము ఉండదు. నా యందే దృష్టి ఉంచి నా కథలు వింటూ, అనన్య భవం లేని వారి చిత్తం చైతన్యమై పోతుంది. మీరు మీ కర్తవ్య కర్మలనాచరించుచు నాకు సర్వస్య శరణాగతి చేయండి. మీకు తప్పకుండా శాంతి లభిస్తుంది.'అని బాబా పదే పదే చెప్పుచుండెడి వాడు.

## సాయి బాబా కష్టమునకు తగిన కూలీ యిచ్చేవాడు :

బాబా క్రీ.శ. **1915** డిసెంబర్ మాసములో మిట్టమధ్యాహ్నము రాధాక్రిష్ణమాయి యింటి వద్దకు వచ్చి, అక్కడున్నవారితో ఒకనిచ్చెన తీసుకురమ్మని చెప్పాడు. ఒకరు వెళ్ళి నిచ్చెన తేగా దానిని వామన్ గోంద్కర్ యింటికి గోడకు వేయించాడు. చరచరా బాబా నిచ్చెన ఎక్కి యింటి పైకి వెళ్లాడు. అక్కడ నుండి రాధాక్రిష్ణమాయి యిల్లు గోంద్కర్ యింటినానుకొనే ఉన్నది. ఆ నిచ్చెనను రెండో వైపు తెప్పించుకొని నిచ్చెన ద్వారా క్రిందికి దిగాడు. బాబా చేసిన చమత్కారం ఎవరికి అర్థం కాలేదు. అప్పుడు రాధాక్రిష్ణమాయి చలిజ్వరం (మలేరియా) తో బాధపడుతూ ఉంది. ఆమె జ్వరం తొలగించుటకై బాబా యిట్లుచేసి వుండెను. వెంటనే నిచ్చెన తెచ్చిన వానికి రెండు రూపాయలు యిచ్చాడు. బాబాను ఒకరు ధైర్యం చేసి అతనికి అంత డబ్బు ఎందుకు యిచ్చారని ప్రశ్నించారు. బాబా, 'ఎవరినుండైనా సరే పని చేయించుకొని వారి పరిశ్రమ భారాన్ని ఉచితంగా లేశమైనా తీసుకొనరాదు. అది నియమంగా పెట్టుకోవాలి.'అని ప్రత్యుత్తర మిచ్చాడు బాబా. బాబా సలహా ప్రకారము ప్రవర్తించినచో కూలివాడు సరిగా పని చేయును. పని చేసే వారు, పని చేయించే వారు కూడా సుఖపడెదరు. సమ్మెలకు తావుండదు. మనస్పర్థలుండవు. మనం కేవలం బాబా ముఖతః వెలువడిన మాటలనే ఆశ్రయించాలి. అప్పుడు ఈ జీవితం సుఖవంతమౌతుంది. అన్ని కష్టాలనుండి విముక్తి లభిస్తుంది.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *బాబా భక్తుల ఇహ, పర శ్రేయస్సులు సేకరించి ఉద్ధరించుటయే బాబా అవతార ప్రథమ కార్యక్రమం, లక్ష్యం.*

# అధ్యాయము 20

(ఈశావాస్య ఉపనిసత్ సారము)

**ఈశావాస్యోపనిషత్తు సారాంశము :** దాసగణు ఈశావాస్యోపనిషత్తును సంస్కృతం నుండి మరాఠీ భాషలోనికి వ్యాఖ్య వ్రాయనారంభిచాడు. దానిని ఈశావాస్య భావార్థ బోధిని అన్న పేరుతో వ్యాఖ్యానిస్తున్నాడు. ఆ ఉపనిషత్తును ఓవీ బద్ధం చేసాడు. దాసగణు సంశయానికి ఏ పండితుని వద్ద సమాధానము దొరకలేదు. దానిలోని సంశయాలు తీర్చుకొనటానికి సద్గురువు సాయిబాబా చరణాల వద్దకు వచ్చాడు. సాయిబాబా దర్శనం చేసుకొని వారి పాదముల వద్ద శిరస్సునుంచి నమస్కరించాడు. దాసగణు 'బాబా నేను ఈశావాస్య బోధినిని రచిస్తున్నాను. అయితే మధ్యలో నాకు అనేక సంశయాలు, అపార్థాలు ఏర్పడుతున్నాయి. ఎందుకిలా జరుగుతుందో దయచేసి వివరించండి.'అని అడిగాడు. తరావాత దాసగణు తనకు ఏర్పడిన సంశయం బాబా ముందుంచాడు. 'బాబా! ఈ పుస్తక రచనలో నేను చేసిన ప్రయత్నమంతా వ్యర్థమైపోయింది. నా ఈ 'ఈశావాస్య' కథంతా నీకు చక్కగా తెలుసు. నా ఈ సంశయం పూర్తిగా నివారణ కాకుంటే నాశ్రమంతా వృథా అవుతుంది. ఈ పుస్తకం ఎవరికి అర్థం కాదు.'అని విన్నవించాడు. 'నీవు సంతోషంగా వుండు. అందులో ఏమి కష్టము ఉంది? నీవు ఎక్కడినుండి వచ్చావో అక్కడికి వెళ్ళినప్పుడు (విళ్ళెపార్లే) కాకా సాహెబ్ దీక్షితుని ఇంట్లోని పని పిల్ల నీ సంశయం తొలగిస్తుంది.'అని అన్నారు బాబా. బాబా ఉపనిషత్తు సారాంశం గురించి అన్న మాటలు దాసగణుకు మరియు అక్కడ ఉన్న అందరికి ఆశ్చర్యాన్ని కలిగించింది. దాసగణుకు బాబా మాటలు సత్యమేనని అనిపించింది. వారు నిష్కారణంగా అనరు. వారి మాటలలో ఒక్కొక్క అక్షరంలో అర్థం నిండి వుంటుంది. అది బ్రహ్మ లిఖితం. ఒక్క అక్షరం కూడా వ్యర్థం కాకుండా కార్యాన్ని సాధిస్తాయని దాసగణు నమ్మకం.

మనకు ఎంత నమ్మకం ఉంటే ఫలితం కూడా అలాగే వుంటుంది. బాబా మాటల యందు పూర్తి విశ్వాసముంచి దాసగణు పార్లే గ్రామంలోని కాకా సాహెబ్ దీక్షిత్ యింటికి వెళ్ళి అక్కడ బస చేసాడు. ఆ రోజు వుదయం దాసగణు మంచంపై పడుకొని మెలుకువతోనే వున్నాడు. ఒక బీద పనిపిల్ల ఒక పాటను పాడుచుండెను. ఆ పాట దాసగణు హృదయాన్ని ఆకర్షించింది. ఈశావాస్యో పనిషత్తు లోని అర్థం చెప్పే పనిపిల్ల ఈ పిల్లనే అయి వుంటుందని బయటికి వచ్చాడు. ఆ అమ్మాయి గిన్నెలు తోము తూ కనిపించింది. ఆ ఎనిమిది సంవత్సరముల పిల్ల నడుముకు చిరిగిన పాత గుడ్డముక్క కట్టుకొని ఎవరో కట్టుకున్న నారింజ పండు రంగు చీరెకొంగు ఎంతో మనోహరంగా వుందని పాడుచుండెను. అటువంటి చీరె తనకు దొరికే అవకాశము లేదని తెలిసినా, ఎంతో ఆనందంగా ఆ అమ్మాయి పాట పాడు చుండెను. దాసగణు మోరేశ్వర్. ప్రదాన్‌ను ఆ పిల్లకు ఒక చీరె కొని ఇవ్వమని కోరాడు. మోరేశ్వర్ ఒక చీరె కొని ఆ పిల్లకు బహూకరించాడు. రెండవ రోజు ఆ పిల్ల ఆ చీరెను కట్టుకొని ఇతర పిల్లలతో కలిసి ఆడుతూ పాడుతూ నాట్యము చేసింది, ఆడి పాడింది. మరుసటి రోజు చీరెను పెట్టెలో దాచుకొని మామూలు పాత బట్టనే వేసుకొని వచ్చింది. అయినా ఆమెలో ఏ దుఃఖమూ కనిపించలేదు. కొత్త చీర కావాలనే కోరిక ఆమెలో లేదు. గత్యంతరం లేక దుస్తులు ధరించటం ఒకటి, మంచి దుస్తులు ధరించగలిగి వుండి కూడా ఆ చిరిగిన దుస్తులను ధరించటం మరొక్కటి. మొదటి దశలో దైన్యం కోరికలుంటాయి. రెండవ దశలో దైన్యం కోరికలుండవు. సంతృప్తి శాంతి వుంటాయి. దీనినే గౌరవంగా పేదరికాన్ని స్వీకరించటం అని అంటారు. దీనిని బట్టి సుఖ దుఃఖాలు మనో భావాలననుసరించి ఉంటాయని దాసగణు గ్రహించాడు. అదే అతనిని బాధిస్తున్న అసలు సమస్య. అతని సమస్యకు స్పష్టమైన సమాధానం లభించింది. ఆమెలో కూడా తనే వున్నానని చెప్పి ఉపనిషత్తు అర్థంచెప్పాడు. మరియు మానవుడు భగవంతుడిచ్చిన దానితో సంతుష్టి చెందవలెను.

భగవంతుడేది యిచ్చినను అది తన మేలు కొరకే అని గ్రహించవలెను. యితరుల సొత్తుకై ఆశించక ఉన్నదానితో సంతుష్టి చెందవలెను.

**బాబా బోధల విధానం :** బాబా ఎప్పుడూ షిరిడిని విడువ నప్పటికి కొందరికి మచ్ఛీంద్ర గఢ్‌లో, కొందరికి కొల్హాపూర్‌లో దర్శన మిచ్చాడు. కొందరికి మామూలు రూపంలో కనిపించాడు. కొందరికి స్వప్నంలో, మరికొందరికి మేలుకొని వున్నప్పుడు దర్శనమిచ్చి కోరికలు తీర్చాడు. ఇలాంటి అనుభవాలు అనేకం. భక్తులకు బోధించే మార్గములు వర్ణింపనలవి కావు. దాసగణుకు పనిపిల్ల ద్వారా సంశయ నివృత్తి చేసాడు. దాసగణు బాబా వద్ద సందేహం వ్యక్తం చేయడమేమిటి? దానికి ఆ పని పిల్ల సమాధానం ఇవ్వడమేమిటి? ఆ పనిపిల్ల కాకా యింట ఉండడం ఏమిటి? ఈ ఏర్పాట్లన్ని మాయా కార్య క్రమాలు కావా? ఆ పిల్ల ఫలాని రోజున ఆ శృతి అర్థాన్ని విశదం చేసే పాట పాడుతుందని బాబా ఎలా గ్రహించాడు? దాసగణు నిజంగా ఆశ్చర్య పడ్డాడు. ఆయన సందేహము కూడా తీరింది. ఈ ఏర్పాట్లన్ని అసలెందుకు? బాబానే స్వయంగా నిర్ధారణ చేయవచ్చుగదా? అప్పుడే అక్కడనే చెప్ప వచ్చునే. అని శ్రోతలు మదన పడుతూ వుండవచ్చును. నిజమే కాని ఈ సంఘటనలోని ఇంత గొప్ప విశిష్టత మనకు ఎలా తెలిసేది. ఆ పేద పని పిల్లలోని హృదయంలో కూడా ఈశ్వరుడు నివశించి వున్నాడు. అన్న సత్యాన్ని ప్రదర్శించటమే బాబా ఆశయం. ఆత్మ యథార్థ స్వరూపాన్ని పూర్ణంగా నిరూపించడమే వ్యక్తిగత అనుభవం ద్వారా బాబా బోధించాడు. అన్ని ఉపనిషత్తుల పరమాశయమూ ఇదే. భగవద్గీత ఇచ్చే ఉపదేశం కూడా ఆదే. ఆత్మ తత్వాన్ని వివరంగా తెలుసుకున్న తర్వాత నేను, ఆత్మ ఒక్కటే అని అభేదానుభవ సంధానం చేసేవారికి ఆత్మ ప్రసన్నమౌతుంది.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 21

(అనుగ్రహ కరణము)

**అదృష్టవంతులకే యోగుల సాంగత్యము :** బాబా వాణి అతి మనోహరం. వారియొక్క ఉపదేశ పద్ధతి అభినవంగా, అలౌకికంగా వుండేది. అట్టి మహాపురుషుల సాంగత్యము భాగ్యవంతులకే లభించును. మహాత్ములు తమ సమీపంలో వున్నా దురదృష్టవంతులకు తెలియదు. బొంబాయిలోని బాంద్రా పట్టణంలో పీరు మౌలానా అనే ఒక సిద్ధపురుషుడు వుండే వాడు. హిందూ, పార్సీ మతస్తులు అతని వద్దకు వెళ్ళేవారు. హేమాద్ పంత్ ఆ సమయంలో అక్కడ న్యాయాధీశునిగా వుండెను. 'ఇమాస్' అనువాడు అక్కడ ఒక మసీదు శుభ్రపరుస్తూ వుండే వాడు. అతనికి హేమాద్ పంత్ బాగా పరిచయము. అతను హేమాద్ పంత్‌ను ఆ సిద్ధుని దర్శనానికి రమ్మని ఎంతో చెప్పేవాడు. ఆ జనసమూహము లోనికి వెళ్ళలేక ఆసిద్ధుని దర్శనం చేసు కొనలేదు. కొన్ని ఏళ్ళ తర్వాత అతనికి అక్కడి నుండి బదిలీ అయింది. ఈశ్వరుని దయ వుంటేనే సత్పురుషుల సాంగత్యం లభించుననడానికి ఇది ఒక ఉదాహరణము. తర్వాత అతనికి సాయి బాబాతో పరిచయము జరిగింది. సత్పురుషులు ఒక అనాది సంస్థ. వారి వ్యవస్థ గుహ్యంగా వుంటుంది. ఒకే కాలంలో వారి అవతార కార్యాలను సాధించటానికి వారి యిష్టానుసారము వేరు వేరు స్థలములలో ప్రకటమౌతారు. కాని వారు వేరు వేరుకారు. ఒక మహాత్ముని విషయాలు ఇంకొక మహాత్మునికి సంపూర్ణంగా వెంట వెంటనే తెలుస్తాయి.

**అనంతరావు పాటంకర్ గుఱ్ఱపు లద్దిల కథ :** పూనా వాస్తవ్యుడు అనంతరావు పాటంకర్ అను వ్యక్తి సాయిబాబా దర్శనానికి షిరిడి వచ్చాడు. అతను వేదాంత శ్రవణం చేసాడు. ఉపనిషత్తులు తాత్పర్యంతోసహ చదివాడు. కాని అతని మనస్సుకు ప్రశాంతత లభించలేదు. అతను సాయి బాబా దర్శనం చేసుకున్నాడు. సాయి

దర్శనంతో చాలా ఆనందం పొందాడు. పాదాభివందనం చేసి పూజ చేసిన తర్వాత బాబాతో యిలా అన్నాడు.'నేను వేదములను ఉపనిషత్తులను చదివితిని, అష్టాదశ పురాణములు వింటిని. నా మనస్సుకు శాంతి కలుగుట లేదు. నా పుస్తక జ్ఞానం నిష్ప్రయోజనమే. నిరాడంబర భక్తులు నాకంటే చాలా మేలు. శాంతి పొందుటకు పుస్తక జ్ఞానం అనవసరం. నీవు శాంతి ప్రసాదించగలవని విన్నాను. అందుకే నీ దర్శనం చేసుకొంటిని. నా యందు దయ వుంచి నన్ను అనుగ్రహించి నా మనస్సునకు శాంతి మరియు స్థిరత్వం ప్రసాదించు.'. అప్పుడు అతనికి బాబా ఒక వినోదమైన కథ చెప్పాడు. అది విని పాటంకర్ జ్ఞాన సాఫల్యత చెంది తృప్తి చెందాడు.

బాబా పాటంకర్‌కు కథ చెప్పసాగాడు. 'ఒకసారి ఒక వ్యాపారి యిక్కడకు వచ్చాడు. అప్పుడు అక్కడ అతని ఎదుట ఒక గుఱ్ఱము ఉంది. అది మల విసర్జనకు పూనుకుంది. అది తొమ్మిది లద్దిలుగా పడింది. ఆ వర్తకుడు వెంటనే ఆ లద్దిలను తన కొంగులో కట్టుకున్నాడు తర్వాత అతని మనస్సు శాంతించింది.'అని అన్నాడు బాబా. సాయి సమర్థుడు చెప్పిన కథ అర్థం ఎమిటి? ఈ మాటలకు అర్థము పాటంకర్ గ్రహించలేక గణేశ్ దామోదర్ ను అడిగాడు. అప్పుడ అతను' బాబా పలుకులు అలాగే వుంటాయి. నాకు కూడా అర్థం కావు. చెప్పే ప్రయత్నం చేసాడు. ఇచ్చట గుఱ్ఱం ఈశ్వరుని కృప. తొమ్మిది వుండలు అనగా, నవవిధ భక్తి మార్గములు. అవి **1**.శ్రవణము **2**.కీర్తనము **3**.స్మరణము **4**.పాదసేవనము **5**.అర్చనము **6**.నమస్కారము **7**.దాస్యము **8**.సఖ్యము**9**.ఆత్మ నివేదనము ఈ నవ విధ భక్తి మార్గములలో ఏ ఒక్కటైనా నమ్మకముతో ఆచరించినచో భగవంతుడు సంతుష్టి చెంది భక్తునికి అతనుండే చోటనే ప్రత్యక్ష మగును. భగవంతుడు భక్తి అనే ఆకలితో వుంటాడు. అతనికి కావలసినది భక్తి మాత్రమే. గుఱ్ఱము లద్ది వేయగానే ఆ వ్యాపారి వెంటనే వానిని గ్రహించినట్లు, నువ్వుకూడా ఆ వ్యాపారి వలె నవవిధ భక్తిని సంగ్రహిస్తే

నీ మనస్సు స్థిరపడి, విశ్రాంతి లభించును. భక్తి లేకుండా మనో చాంచల్యము పోదు. అదియే గురువర్యుల బోధన పరమార్థం..'అని అన్నాడు. రెండవ రోజు అనంతరావు బాబా పాదాలకు నమస్కరించు చుండగా, 'గుఙ్జపు లద్ది ప్రోగు చేసితివా లేదా!'అని బాబా అతనిని ప్రశ్నించాడు. అప్పుడు అతను బాబా తో 'మీకు ఈ దీనునిపై కృప వుంటేనే అవి సంగ్రహించ సాధ్యం'అని అన్నాడు. అతనికి శుభం కలుగునని బాబా ఆశీర్వదించి. స్థైర్యాన్ని కలుగ చేసాడు. అనంతరావు అసలైన జ్ఞానం పొంది ఆనందించి ప్రశాంతంగా వున్నాడు.
ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *బాబా కథలు మిక్కిలి ఆశ్చర్యమును, ఆనందమును కలుగ చేయును. అవి విచారగ్రస్తులకు, మనోవికలత చెందిన వారికి శాంతిని కలుగ చేయును.*
- *బాబా కథలు, లీలలు వేదముల వలె అనంత మైనవి. అవి శ్రవణము, మననము చేస్తే ఆకలి దప్పులు ఉండవు. ధ్యానానందము పొందెదరు, వారివారి కోరికలు నెరవేరును.*
- *బాబా చెప్పిన కథలు వింటే భక్తులు శరీర బాధలు మరిచి పోతారు. బాబా బోధలను మననము చేసిన వారికి, విన్న వారికి సంపూర్ణ శాంతి లభిస్తుంది మరియు బంధాల నుండి ముక్తి లభిస్తుంది.*
- *నా భక్తుల కోరిక నేనే తీరుస్తాను. భక్తుల అహంకారము పోగొట్టి నా పాదాల వద్ద ఆశ్రయము ఇస్తాను. అహంకారము లేని వారికి ఎప్పుడూ నా సహాయము ఉంటుంది. ఇంటా బయటా ఎల్లప్పుడూ తోడుంటాను.*

# అధ్యాయము 22

(అపమృత్యు నివారణము)

**బాబాయే భగవంతుని స్వరూపము** : సంధ్యా చీకటిలో సర్పంగా అగుపించినది, వెలుగులో తాడుగా కనిపిస్తున్నది. అంధకారాన్ని వెలుగును సృష్టించిన తండ్రి బాబానే. సర్పమనే భ్రాంతి పోగానే అది తాడని ప్రకాశింప చేస్తారు. భయాన్ని ఉత్పన్నం చేసేది బాబాయే దానిని నివారించేది బాబాయే. పూర్తిగా అంధకారం వున్నప్పుడు తాడు లేదు, పాము లేదు. భ్రాంతికి ఆవకాశం లేదు. అట్టి నిరాకారుడు బాబా. నిరాకారం నుంచి ఆకారము వచ్చునప్పుడు అల్ప ప్రకాశం కారణంగా సర్పమని భావన కలుగును. దానికి కూడా కారణం బాబాయే. పూర్తి ప్రకాశంలో తాడు అని తెలియడం కూడా బాబా యొక్క మాయనే. అజ్ఞానం నుండి జ్ఞానం ప్రసాదించగానే నిరాకారుడుగా వున్నది, బాబా రూపంలో వున్నది, ఆ భగవంతుడే అని అర్థమౌతున్నది. తాడును తాడుగా గుర్తించడమే జ్ఞానం. దీని అంతు ఎవ్వరూ కనుగొన లేరు. అనేక నాలుకలు గల ఆ ఆదిశేషుడే బాబాను పూర్తిగా కనుగొనలేక పోయాడు. అన్ని నాలుకలున్నప్పటికి స్తుతించలేక పోయాడు. అట్టి ఆ స్వరూప దర్శనం తప్ప మన మనస్సు వేరే ఇంకేది కోరకుండును గాక. మనం కళ్ళ ఎదుట బాబా రూపాన్ని నిలుపుకొని ధ్యానించటానికి ప్రయత్నం చేయాలి. భక్తునికి అజ్ఞానమనే అంధకారము ఆవరించి యున్నప్పుడు, బాబా ఉనికినే గుర్తించడు. అల్ప ప్రకాశమేర్పడినప్పుడు, స్వల్ప జ్ఞానముతో బాబా కూడా మానవుడనే భ్రమలో వుంటాడు. బాబా కృప వలన పరిపూర్ణ జ్ఞానం లభించినప్పుడు, భ్రమలు తొలగి పోయి బాబాయే భగవంతుని స్వరూపమని గ్రహించ గలుగుతాడు.

**ధ్యాన బింధువు, షిరిడి ఒక పుణ్య క్షేత్రం** : బాబాను అనేక మంది భక్తులు దర్శించి శిరస్సును పాదాలపై వుంచి, సుఖాన్ని

అనుభవిస్తున్నారు. అమావాస్య రెండవ రోజు చంద్రుని చూచుటకు చాలా ఏకాగ్రతతో రెండు చెట్ల మధ్యనుండి చూస్తేనే కనబడును. బాబా తేజస్సు కూడా అలాగే చూస్తే కనబడుతుంది. భక్తుల దర్శనాభిలాషను బాబా తన పాదాల చెంతనే తీరుస్తాడు. ఎడమ కాలిపై కుడికాలు వేసుకొని కూర్చున్నప్పుడు ఎడమ చేతి చూపుడు వేలు, మధ్య వేలు యొక్క మధ్య భాగమే ధ్యాన బింధువు. బాబా ప్రకాశము చూడవలెనన్నచో అహంకారమును విడిచి మిక్కిలి అణుకువతో చూపుడు వేలుకు మధ్య వేలుకు మధ్య వున్న ధ్యాన బిందువుపై దృష్టి సారించినచో బాబా ప్రకాశము చూడగలము.

బాబా మూలంగానే షిరిడి ఒక పుణ్య క్షేత్రమైనది. బాబా ఎప్పుడూ భక్తుల శ్రేయస్సునే కోరేవాడు. వారి ప్రేమను అనుభవించిన వారు ధన్యులు. ఒక్కొక్క సారి బాబా మౌనంగా వుండేవాడు. ఒక్కొక్కప్పుడు గూఢార్థంతో మాట్లడేవాడు. ఇంకొకప్పుడు వినోదంగా పరిహాసమాడేవాడు. ఒకప్పుడు నిశ్చలంగా కనిపించేవాడు. ఒకప్పుడు క్రోధంతో మాట్లాడేవాడు. ఇవన్నియు భక్తులకు ఉపదేశించే పద్ధతులే. బాబాను ఎంత సేపు చూసినప్పటికి తృప్తి తీరదు. భక్తులకు వారి మాటలు ఎంత సేపు విన్నా తనివి తీరేది కాదు. ఇంకా ఇంకా వినాలని అనిపించేది. భక్తుల మనస్సులు ఆనందాన్ని భరించలేవు కూడా. వర్షపు బిందువులను లెక్కించవచ్చు, నీటి ప్రవాహాన్ని మరియు గాలిని కూడా మూట కట్టవచ్చు. బాబా లీలలను, చమత్కారాలను లెక్కపెట్టలేము.

**అమీర్ శక్కర్‌ను బాబా పాము నుండి కాపాడుట :** కాకా సాహెబ్ మిరీకర్ అహమ్మద్నగర్ నివాసి. అతని పుత్రుడు బాలా సాహెబ్ మిరీకర్ కోపర్‌గాంలో మామలతాదారుగా వుండెను. చితలీ గ్రామంలో పనిపై వచ్చి షిరిడిలో సాయి దర్శనానికి వచ్చాడు. మసీదులో బాబా పాదాలపై శిరస్సునుంచి కూర్చున్నాడు. బాబా అతని క్షేమసమాచారాలు అడిగాడు. ఆ సమయంలో మాధవరావు మరియు మిగతా భక్తులు అక్కడనే వున్నారు. మిరీకర్‌తో బాబా, 'నీవిప్పుడు

కూర్చున్నదే ద్వారకామాయి. ఎవరైతే ఈ కరుణా మాయి ఒడిలో కూర్చొనెదరో వారు తరించుదురు. వారికి ఈమాత నిర్భయాన్నిస్తుంది.'అని చెప్పి అతనికి విభూతినిచ్చి అభయ హస్తాన్ని అతని శిరస్సుపై వుంచారు. బాలాసాహెబ్ బయలుదేరుతూ వుంటే, బాబా మాధవరావు దేశ్‌పాండేతో 'శ్యామా నీవు కూడా అతనితో వెళ్ళి చితిలీ చూసి తిరిగి రా! బాగుంటుంది.' బాబా వద్ద సెలవు తీసుకొని వారు **9**గం. కు చితలీ చేరారు. వారు అక్కడ మారుతి దేవాలయంలో బసచేసారు. మిరీకర్ వార్తా పత్రిక చదువు చుండెను. అతడు కప్పుకొన్న దుప్పటిపై ఒక సర్పము చుట్ట చుట్టుకొని, నిర్భయంగా శాంతంగా కూర్చుంది. అది వచ్చేటప్పుడు పేపరు చప్పుడైనప్పటికి ఎవరు గమనించ లేదు. అది బుస కొట్టుచూ కదులుచుండెను. ఆ ధ్వనిని అక్కడ నౌకరు విన్నాడు. బాలా సాహెబ్ మిరీకర్ దిన పత్రికలో లీనమై వున్నాడు. శ్యామా చకితుడై ఈ విఘ్నాన్ని తొలగించు మని బాబాను కోరుకున్నాడు. ఆ పాము మెల్లిగా జారి పోతుంటే, ఎవ్వరికి ఏది దొరికితే వాటితో దాన్ని చంపి ముక్కలు చేసారు. ఆ విధంగా అరిష్టము తొలగిపోయింది. దీనితో సాయి సమర్థతపై మిరీకరుకు ప్రేమ పొంగి బాష్పాలు కళ్ళనుండి ధారగా ప్రవహించాయి. బాబా యీ గండాన్ని ముందే తెలుసుకొని తొలగించాడు. అందుకే బాబా శ్యామాను పంపాడు. బాబా తన దర్శన మహిమను మరియు ద్వారకామాయి మహిమను తెలియ చేసాడు. మసీదు మహత్యాన్ని వారి మనస్సులో ముద్రించాడు. భక్తులపై తనకున్న ప్రేమను వ్యక్తం చేసాడు. అందరిని రక్షించు వాడు ఆ శ్రీహరియే వాటి రక్షణ, మృత్యువు , రెండు కూడా భగవత్ నిర్ణయాలే.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 23

(గురుభక్తి లీలా దర్శనము)

**బాబా మాటలు 'యాదే హక్' 'అల్లా మాలిక్' :** ఈ జీవుడు మాయచే కప్పబడి త్రిగుణాతీతుడైనప్పటికి సచ్చిదా నంద స్వరూపాన్ని మరిచి శరీరమే తాననుకుంటాడు. ఈ శరీరాభిమానం వలన నేను కర్తను అనుకొని జనన మరణ పరంపరలో చిక్కుకొని, వీని నుండి బయటపడే మార్గం తెలియక బాధపడుతుంటాడు. ఈ అనర్థాన్ని తప్పించుకొని ముక్తి పొందాలంటే గురు పాదాల యందు ప్రేమతో కూడిన భక్తి యోగమొక్కటే మార్గము. ఈ భక్తిని శ్రీ సాయియే ప్రసాదిస్తాడు. వారు పూర్ణావతారులై లోకాచారాలను వర్ణాశ్రమ ధర్మాలను చెప్పుచూ తాను అల్లా దాసుడనని చెప్పే వారు. ఎవ్వరిని అపహాస్యం చేసేవాడుకాదు. ఎవ్వరిని తుచ్ఛంగా చూసేవాడు కాదు. తను కూడా పరమేశ్వరుడనని అనేవాడు కాదు. నేను పరమేశ్వరుణ్ణి ఎప్పుడూ స్మరించేవాడినే. 'యాదే హక్' వారి పాద దాసుడిని, 'అల్లా మాలిక్' అని అల్లాను స్మరించే వాడు. సాయి మహానటుడు, భక్తులకు వివిధ చమత్కారాలు చూపిస్తాడు. అతడు నిజంగా శ్రీ కృష్ణుడే. అతను తన లీలలతో భక్తులను ఆనందంలో ముంచుతాడు. జీవులను ఉద్ధరించటానికి మాత్రమే బాబా అవతార మెత్తాడు. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప మనకు వారి గురించి వినాలని కోరిక కలుగదు.

**పాము కాటు నుండి శ్యామాను కాపాడుట :** ఒకసారి ఒక పాము శ్యామా చిటికెనవేలును ఉదయం ఏడు గంటల సమయంలో కాటు వేసింది. నిమోంకర్ బాబా విభూతిని తీసుకొని వెళ్ళమన్నాడు. మాధవరావు (శ్యామా) మసీదు కు పరుగు తీసాడు. అతను వెళ్ళగానే బాబా తిట్టడం మొదలు పెట్టాడు. అతనిని పైకి రానివ్వలేదు. 'బతుర్దా! (బతుర్దా సహజంగా బ్రాహ్మడిని కోపంగా పిలిచే మాట) పైకి ఎక్కకు, ఎక్కావంటే చూడు! ఖబర్దార్ పో! క్రిందకు దిగి పో!'అంటూ నిప్పులు

కక్కాడు. అత్యంత భయంకరంగా కోపించాడు. శ్యామా ఆశ్చర్య పడ్డాడు. బాబా అలా ఎందుకు మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు. ఏమి అర్థం కాక దుఃఖంతో క్రిందకూర్చుండి పోయాడు. తన తల్లియే కోపగించినచో తను యింకెక్కడికి వెళ్ళాలని బాధ పడ్డాడు. శ్యామా జీవితంపై ఆశ వదులుకున్నాడు. స్థిరంగా కూర్చున్నాడు. తర్వాత పైకి వెళ్ళి బాబా వద్ద కూర్చున్నాడు. అప్పుడు బాబా శ్యామాతో, 'ధైర్యంగా వుండు మనస్సులో ఏ చింతా పెట్టు కొనకు. నీవు బాగైపోతావు. యింటికి వెళ్ళి సుఖంగా కూర్చో. యింటి బయట ఎక్కడ తిరుగకు. ధైర్యంగా వుండు. నా పై విశ్వాసముంచు.' అని ధైర్యవచనములు చెప్పి బాబా శ్యామాను యింటికి పంపించారు. శ్యామా యింటికి చేరే లోపల తాత్యాను అతని వద్దకు పంపించి శ్యామాను నిద్ర పోవద్దని యింట్లోనే తిరగమని మరియు తనకిష్టమైనవి తినమని కబురు పంపాడు. రాత్రి కాకా సాహెబ్ దీక్షిత్‌తో 'శ్యామాకు కునుకు వచ్చినా నిద్ర పోనివ్వవద్దు'అని చెప్పి పంపించాడు. వేలు దగ్గర కాటేసిన గాయం కూడ తగ్గి పోయింది. సాయి మాత 'బతుర్దా! పైకి ఎక్కకు.'అని అన్న మాటలు శ్యామనుద్దేశించినవి కావు. కాటు చేసిన పాము విషాన్ని ఉద్దేశించి అన్న మాటలు. ఆ మాటలు 'ఖబర్దార్ ఎక్కావంటే' అన్న ఆజ్ఞకు విషం అక్కడనే ఆగిపోయింది. 'పో కిందకు పో 'అన్నదే సాయి పంచాక్షరి మంత్రము.వెంటనే విషం దిగి పోయింది. ఈ విధంగా బాబా భక్తుల కష్టాలను తీర్చేవాడు.

**కాకా సాహెబ్ దీక్షిత్ గురుభక్తి** : ఈ గురు భక్తి వింటే గురు భక్తులకు కూడా ఆశ్చర్యము కలుగును. ఒకరోజు ఒకరు చావటానికి సిద్ధంగా వున్న ఒక బక్కచిక్కిన మేకను మసీదు కు తెచ్చారు. దీక్షితుని మనస్సు గ్రహించాలని బాబా 'కాకా! నువ్వు వెళ్ళి కత్తి పట్టుకొని రా. ఆ మేకను బాధల నుండి విముక్తి చేద్దాం.'అని ఆజ్ఞాపించాడు. కాకా బాబా ఆజ్ఞ ప్రకారం సాఠే వాడాకు వెళ్ళి కత్తిని తీసుకొని వచ్చి మేకను చంపాలని సిద్ధమయ్యాడు. గురువాజ్ఞయే తన లక్ష్యమని మనస్సు

ధృఢం చేసుకొని చేతిలోనికి కత్తి తీసుకున్నాడు. అయినప్పటికి గుండె దడ దడ లాడింది. శరీరం చెమటలు పోసింది. మాంసాహారి బడేబాబానే మేకను చంపటానికి తట పటాయించి వెనుకాడాడు. అయినా దీక్షిత్ గురువాజ్ఞాబద్ధుడై ఆ పనికి సిద్దమై నాడు. అది చూసి గ్రామస్థులు ఆశ్చర్యపడసాగారు. కాకా కత్తిని గట్టిగా పట్టుకొని చేయి వెనుకకు జరుగుతూ ఉంది. 'ఏంటి చూస్తున్నావ్. కాకా వధించు.'అన్న బాబా ఆజ్ఞ విని ఆవేశంగా చేతిలోని కత్తిని పైకెత్తాడు దీక్షిత్. గురువాజ్ఞ తిరస్కరిస్తే పాపాల్లోకెల్ల మహా పాపమని తలచాడు. 'బాబా ఇక దీనితల నరకనా?' అని మళ్ళీ అడిగాడు. 'ఊ చంపేయి! ఇంకా చూస్తున్నావ్.' అని బాబా చివరి ఆజ్ఞయిచ్చాడు. నరకడానికి కాకా అర్థ చంద్రాకారంలోకి తిరిగాడు. అతడు నిజంగా వధించేలా వున్నాడని బాబాకు నిశ్చయమైంది. మేక అపాయ స్థితి చూసి బాబా, 'వద్దులేరా! ఊరుకో బ్రాహ్మణుడవై వుండి కూడా హింసకు సిద్ధ మైనావు. నీకు ఆలోచనే లేదా.'అని బాబా అనగానే దీక్షిత్ కత్తి క్రిందపడ వేసాడు. అందరికి ఆశ్చర్యం కలిగింది. అప్పుడు కాకా బాబాతో 'మీ పలుకులే మాకు శాసనం. మాకు వేరే ధర్మం లేదు. గురువచన పాలననే మాకు వేదం. గురువాజ్ఞనే మాకు భూషణం. అహర్నిశలు మీ ఆజ్ఞకు బద్ధులమై ఉండటం ఒక్కటే మాకు తెలుసు. అహింస మాకు తెలియదు. సద్గురువు చరణాలే మాకు కావాలి. గురువాజ్ఞ పాలనే మా కర్తవ్యం. మేము మీ ఆజ్ఞకు దాసులం.'అని అన్నాడు. అదే నిజమైన గురు భక్తి. ఒక సారి గురు చరణాల యందు విశ్వాసముంచితే మనకే రహస్యం బోధ పడుతుంది. శిష్యులకు ఏ చింతా అవసరము లేదు. తీరానికి చేర్చేది గురువే అని నమ్మాలి.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *



# అధ్యాయము 24

(వినోద విలసితము)

**బాబా కథలను శ్రవణం చేస్తే పరమానంద ప్రాప్తి :** మహా పురుషులు, సాధు సజ్జనులు మేఘాలు లేని స్వచ్ఛమైన ఆకాశంవలె నిర్మలంగా నిష్కల్మషంగా, దోషరహితులై వుంటారు. సాయి భజనతో స్వ స్వరూప దర్శనం మరియు శాంతి కలుగును. శ్రేయస్సును పొందగోరువారు ఈ కథలను శ్రవణం, మననము చేస్తే పరమానందాన్ని పొందగలరు. జీవిత పరమావధి పొందెదరు. మనస్సుకు విశ్రాంతి, పరమానంద ప్రాప్తి చివరకు సద్గతి తప్పక లభిస్తుంది. సాయియే పరమాత్మ భక్తుల భావాలను పూర్తిగా తెలుసుకొని తన కర్తవ్యాన్ని పాలించి మాట నిలబెట్టుకుంటాడు. హాస్య వినోదాలు అందరికీ యిష్టమే కాని తాము హాస్యాస్పదులగుటకు యిష్టపడరు. బాబా చమత్కార మార్గము వేరు. బాబా యొక్క హాస్య పరిహాసాలు భక్తులు ఎంతో యిష్టపడే వారు. ఆయన హాస్యాలు సహజంగా వినూత్నంగా వుండేవి. అతని ముఖంలోని నవ్వులు అతని చూపుల కదలికిలు ఆ హాస్యానికి వింత సోయగాలు కలిగించేవి. ఆ హాస్యం అభినయంతో కూడినప్పుడు చాలా సంతోషంగాను మరియు నీతిదాయకంగాను వుండేది. తాము హాస్యాస్పదులైనప్పటికి అంతగా బాధ పడేవారు కాదు. ఆనందపడేవారు కూడా.

**హేమాద్ పంత్ శనగల కథ :** షిరిడిలో ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. బియ్యం యితర వస్తువులు కూడా వుంటాయి. ఒక ఆదివారం బాబా దర్బారు జనంతో నిండి వుంది. హేమాద్ పంత్ బాబా

వద్ద కుడి ప్రక్క కూర్చుండి బాబా పాదాలను వత్తు చున్నాడు. ఎడమవైపు మాధవరావు, కుడివైపు వామనరావు శ్రీమంతు, బూటి మొదలగువారు కూడా సేవచేయడానికి కూర్చున్నారు. మాధవరావు దేశ్‌పాండే నవ్వుతూ 'అణ్ణాసాహెబ్! మీ కోటు జేబుకు శనగ గింజలు అతుక్కున్నాయి చూసుకో!'అని అన్నాడు. అణ్ణాసాహెబ్ తన కోటు మడతల నుండి యేబది శనగ గింజల వరకు ప్రోగు చేసాడు. కోటు జేబు లోనుండి ఈ గింజలు ఎలా వచ్చాయి అని అందరికి ఆశ్చర్యం కలిగించింది. హేమద్ పంత్ యిలా అనుకున్నాడు, 'నేను పాదాలు వడుతూనే వున్నాను. ఈ గింజలకథ అకస్మాత్తుగా ఎలా పుట్టింది?' అంతలో బాబా హాస్యానికై 'యితనికి తానొక్కడే తిని ఆనందించే దురలవాటు వున్నది. యివాళ సంతరోజు కదా! అక్కడ శనగ పప్పు తింటూ వచ్చాడు. ఆ గింజలే యిక్కడ కనిపించాయి. నాకన్నీ తెలుసు.' అని అన్నారు. అంతలో హేమాద్ పంత్ 'బాబా! ఎవరికీ పెట్టకుండా తినే అలవాటు నాకు లేదు. యితరులకు కొంచె మైనా పెట్టకుండా నేనేది తిని యెరుగను' అని అన్నాడు. అప్పుడు బాబా 'సరే దగ్గర వున్న వాళ్ళకు యిస్తావు. ఎవ్వరూ దగ్గర లేకపోతే ఏం చేస్తావు? నేను నీ దగ్గర లేనూ? నాకు అర్పిస్తున్నావా? తినేముందు నేను నీకు గుర్తుంటు న్నానా?' అని ప్రశ్నించాడు. పప్పు గింజలు ఒక నెపం మాత్రమే ఈ విషయం మనస్సులో నాటడానికే యీ లీలా నాటకము. ఇలా శనగల మిషతో నిశ్చలమైన తత్వాన్ని బోధించాడు. బాబా సంకల్ప శక్తితో శెనగలను సృష్టించడం ఒక విశేషం కాదు. అంత కంటే విలక్షణమైన లీలలను చూపించ గలరు. ఇంద్రజాలం చేసేవారు తమ పొట్టకోసం యిలా వస్తువులను బయటికి తీస్తారు. అలౌకిక గారడీ చేసే సాయి భక్తులకు ఉపదేశించడానికి తమ అద్భుతలీలను ఎన్నో చూపించ గలరు.

**అణ్ణా చించినీకర్ హాస్య సంఘటన** : బాబా వినోదముతో సహా మధ్యవర్తిత్వం చేసి బోధించిన సంఘటన యిది. భక్తులు

పోట్లాడుకుంటుంటే హాస్యరసాన్ని పుట్టించిన కథ యిది. అణ్ణా చించినీకర్‌కు బాబాపై ఎనలేని ప్రేమ. బయటికి కఠినుడి వలె వున్నామెత్తని హృదయం కలవాడు. అందుకే బాబాకు అతనిపై ప్రేమ. ఒక రోజు బాబా కటకటాల వద్ద కుర్చుని వున్నాడు. బాబాకు వివిధములైన సేవలు భక్తులు చేస్తుంటారు. బాబా బాల బ్రహ్మచారి కావున స్త్రీలను పురుషులను తనకు సేవ చేయనిచ్చేవాడు. ఒక రోజు చించినీకర్ బాబా ఎడమ చేయిని మర్ధన చేయుచుండెను. కుడి వైపున ఒక ముసలి వితంతువు వేణుబాయి కౌజల్గి (మౌసీబాయి)అను ఆమె మర్దన చేయుచుండెను. ఆమె బాబా నడుము, మొలను, వీపును, తన రెండు చేతుల వేళ్ళు అల్లి దానితో నొక్కుచుండెను. మౌసీబాయి ముఖము కిందకు మీదకు కదులు చుండెను. ఆమె తన సేవలో పరవశురాలై పోయింది. ఆ స్త్రీ ముఖము అణ్ణా ముఖానికి దగ్గరగా వచ్చు చుండెను. అప్పుడు ఆ స్త్రీ హాస్యానికై 'ఈ అన్నా ఎంత చపలుడో చూడండి. నన్ను ముద్దు పెట్టుకోవాలని అనుకొంటున్నాడు? ఈ పాడు బుద్ధులేమిటి. నన్ను ముద్దు పెట్టుకుంటావా?'అని అందామె. అప్పుడు అతనును 'ఎందుకట్లా దెబ్బలాడుతుంటావు నేనేమన్నా పిచ్చి వాడినా?'అని బదులిచ్చాడు. అప్పుడు బాబా కల్పించుకొని. వారిని శాంత పరచాలని, 'అరే అణ్ణా! ఊరికే ఎందుకు రెచ్చి పోతావు. అమ్మను ముద్దు పెట్టుకోవడం తప్పా?'అని ప్రేమగా అన్నాడు. బాబా మాటలు విని అందరు సంతుష్టి చెందారు. ఆ మాటలు అందరికి నచ్చాయి. చిన్న సన్నివేశమైనను ఎంత మధురమైనది. వాటి యెడల మనిషి చూపే భావాలే ప్రధానం. వారిద్దరూ సరదాగా సౌమ్యంగా వుండే వారు. తల్లీ బిడ్డలవలె ప్రేమ వుంటే వారికి కోపాలు వచ్చేవి కావు. బాబా సహజమైన యుక్తితో చెప్పే మాటలు శ్రోతల అంతరంగంలోకి ప్రవేశించి ధర్మం, మర్మం బోధించేవి.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 25

(భక్తాభీష్య సంపాదనము)

**సాయి బాబా కథలు :** కృపా సాగరుడైన సాయిబాబా సాక్షాత్తు ఈశ్వరుని అవతారం. సాయి పూర్ణపరబ్రహ్మం. దయామయుడైన సాయి బాబాకు సాష్టాంగ నమస్కారము. ఇట్టి సద్గురువును ప్రేమతో ఆరాధించుటయే అనన్య భక్తి. బాబా చరిత్ర ఒక చంద్రకాంతమణి వంటిది. ప్రేమమయు లైన శ్రోతలు సంకోచ రహితంగా, చకోరాల మాదిరిగా సాయి యొక్క పావన కథలు నిష్ఠతో వింటే బాబా సకలకష్టాలు తొలగించి, వారి అరిష్టాలు హరించి అభీష్టాలు తీరుస్తారు.

**బాబా దామోదర్ సావల్ రసనే కు సహాయము :** దాము అన్నా కాసార్ అహమ్మద్ నగర్ నివాసి. అతని పూర్తి పేరు సావల్ రామ్ రాసనే. అతను బాబా భక్తుడు. అతనికి సాయి పాదాల యందు పూర్తి నమ్మకం. దాము అన్నాకు సాయి బాబా ఆశీర్వాదము తోనే క్రీ.శ.**1897**లో సంతానము కలిగింది. ఒకరోజు స్నేహితుడు ఇద్దరము కలిసి పత్తి వ్యాపారం చేద్దామని వ్రాసాడు. సమయం మించి పోతే లాభం వుండదు అని కూడా రాసాడు. దాము అన్నాకు భగవంతుడిచ్చిన దానితో తృప్తి పడమని బాబా శ్యామాతో ఉత్తరము రాయించాడు. దాము అన్నా ఆలోచించుకొని స్వయంగా షిరిడి వెళ్ళి బాబా పాదాల చెంత కూర్చున్నాడు. బాబాను అడగడానికి ధైర్యం చాలడం లేదు. 'సాయి నాథా నాకు ఈ వ్యాపారంలో లాభం వచ్చేలా సహాయం చేస్తే కొంత భాగం నీ పాదాల కర్పిస్తాను.'అని తన వ్యాపారం గురించి ఆలోచిస్తున్నాడు. బాబా అన్నా మనస్సు తెలుసుకొని ప్రేమగా, ప్రపంచ విషయంలలో తగులుకొనుట నాకు యిష్టము లేదు. అని తనకు అతను ఇచ్చే లాభాలలో యిష్టం లేదని సూచించాడు. దాము అన్నాకు బాబా మాటలు అర్థమై సిగ్గుతో కూర్చుండి పోయాడు. అంతలో పోనీ! గోధుమలు, బియ్యం కొని మరోక్క వ్యాపారం చేస్తే బాగుంటుందేమో

అని అనుకొనుచుండెను. అంతలో బాబా 'ఐదు సేర్ల చొప్పున కొని ఏడు సేర్ల చొప్పున అమ్మాలి'అని అన్నాడు. తను వ్యాపారములో చేరనని స్నేహితునికి వ్రాసాడు. అతను మాత్రం ఆ వ్యాపారం లో పెట్టుబడి పెట్టాడు. రెండు మాసములలో ధరలు హఠాత్తుగా పడి పోయాయి. అతను పూర్తిగా నష్ట పోయాడు. దురదృష్టమునుండి దాము అన్నా కాపాడబడినాడు. స్నేహితుడని తో కలిసి వుంటే దాము అన్నా నష్టపోయే వాడు. ఆ ఫకీరు మాట విని బాగు పడ్డాడు. తను కూడా సాయిబాబా సలహా తీసుకొని వుంటే బాగుండేది. అని బొంబాయి స్నేహితుడు పాశ్చాత్తాప పడ్డాడు. తర్వాత దాము అన్నాకు బాబా పై నమ్మకం పెరిగి పోయింది.

**ఆమ్ర లీలా చమత్కారము :** ఒక సారి మామ్లేదార్ రాళే అను మామలతాదార్ గోవా నుండి శ్యామా పేర బాబా కొరకు **300** మామిడి పళ్ళ పార్శిల్ పంపించాడు. కోపర్గాం నుండి ఆ పార్శల్ తీసుకోని వచ్చి విప్పారు. అందులో నుండి సువాసనతో వున్న పళ్ళ ను బయటికి తీసారు. వాటిని బాబా శ్యామా స్వాధీనంలో పెట్టారు. వాటిలో నుండి బాబా **4** పళ్ళు మాత్రం ఒక కుండలో పెట్టి, ఈ పళ్ళు దాము అన్నా గురించి ఇవి ఇక్కడనే వుండవలెనని అన్నాడు. దాము అన్నా పూజ చేయడాని కై సామగ్రితో వచ్చాడు. బాబా ఆ పళ్ళను చూపిస్తూ అవి దాముఅన్నావి. ఆ పళ్ళు తిని వాడు చావాలి అని అన్నాడు. దాము అన్నా వాటిని ప్రసాదంగా తీసుకున్నాడు. బాబా గురించి తెలుసు కనుక బాబా మాటలకు అతను భయపడ లేదు. పూజ అయిన తర్వాత బాబా వద్దకు వచ్చి ఆ పళ్ళను ముగ్గురు భార్యల లో ఎవ్వరికి యివ్వాలని అడిగాడు. అప్పుడు బాబా 'ఆ పళ్ళను నీ చిన్న భార్యకు యివ్వు. ఆమెకు నలుగురు ఆడ పిల్లలు మరియు నలుగురు మగ పిల్లలు కలుగుతారు.'అని చెప్పాడు. దాము సంతానం గురించి ఎన్నో ప్రయత్నాలు చేసాడు. దాము అన్నాకు పిల్లలు లేరు. సాధువు లను సన్యాసుల ను కలిసాడు. వారికి ఎంతో సేవ చేసాడు. వారి

అనుగ్రహంతో సంతానం కలుగునని ఆశపడ్డాడు. కాని సంతానం యోగం లేదని జ్యోతిష్యులు చెప్పారు. అందుకు అతను నిరాశ చెందాడు. కాని బాబా అనుగ్రహం వలన అతనికి సంతానం కలిగింది.అతని మొదటి కొడుకు పేరు నానా సాహెబ్ రసనే జ్యోతిష్యుల మాట వట్టిదై పోయింది. శ్రీ సాయి నాథా మమ్ములను మీ చరణా లు మరిచి పోకుండా కరుణించండి. జనన మరణాల చక్రంలో విశ్రాంతి లేదు. తొందరగా వచ్చి కాపాడండి. స్వాభావికంగా మేము బాహ్య విషయాల గురించి యే ఆలోచిస్తుంటాము. మమ్ములను వాటి నుండి రక్షించండి. అందు నుంచి విముక్తులను చేయండి. మా యింద్రియాల స్వేచ్ఛను అరికట్టి వెనుకకు మరలించండి. మా మనస్సు నుండి అహంకారాన్ని పారద్రోలండి.

**బాబా సూక్తి :** బాబా శరీరధారి అయినప్పుడే చాలా మాటలు చెప్పాడు. 'నా ప్రాణం పోయిన తర్వాత కూడా నా మహిమలు చూపుతాను. నా మాటలు సత్య ప్రమాణంగా భావించండి. నా సమాధి నుండి నా ఎముకలు మీకు ధైర్యాన్ని కలిగిస్తాయి. నేనే కాదు నా సమాధి కూడా మాట్లాడు తుంది. కాని అనన్య శరణాగతి అవసరం. అంతఃకరణంలో నన్ను స్మరణ చేయండి. నిష్కామంతో నన్ను ఆరాధించండి. మీరు ధన్యులౌతారు.'బాబా మాట యిచ్చిన ప్రకారంగా తన మహిమలను శరీరం త్యజించిన తర్వాత కూడ ఎన్నో చూపించాడు. యింకా చూపిస్తున్నాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *వ్రతాలు, ఉపవాసాలు అవసరం లేదు, తీర్థ యాత్రలు కూడ అవసరం లేదు, సాయి బాబా చరిత్ర శ్రవణం ఒక్కటి చాలు.*

# అధ్యాయము 26

(అపస్మార ఆత్మ హత్యానివారణము)

**జగమంతా మాయ, ఆత్మయే జగము (విశ్వం) :** సమస్త విశ్వం మనలోనే వున్నా మాయచే అద్దంలోని నగరంలా ప్రతిబింబిస్తుంది. నిజంగా వస్తురీత్యా ఏమిలేదు. నిద్రలో కనిపించినవి మేలుకొనగానే మాయమగును. గురువు ప్రసన్నుడైనప్పుడే విశ్వం నిజంగా స్ఫురింపక కేవలం ఆత్మమయంగా కనిపిస్తుంది. అదే సాక్షాత్కారము. స్వ ప్రకాశమై ఆత్మ స్వరూపంలోనే ఈ విశ్వం అంతా వుంది. ఈ జగమంతా మాయనే. ఆత్మ స్వరూప జ్ఞానం లేనందువలన తాడు సర్పంగా తోస్తుంది. ఈ దృశ్యజగత్తు పరమాత్మ తత్వజ్ఞానంలో లయమైపోతుంది. శిష్యులకు తత్వోపదేశం చేయడంలో ఒక గురువే సమర్థుడు.

**భక్త పంత్‌కు తన గురువు చరణాలలో నిష్ట :** ఒకసారి పంత్‌కు అనే భక్తుడు తన మిత్రులతో కలిసి బాబా దర్శనానికి వచ్చాడు. అతనికి తన గురువు యందు స్థిరమైన భక్తి వుండేది. ఆ గురువునకు కూడా శిష్యునిపై అనుగ్రహము ఉండెను. అందుకు అతనికి షిరిడి వెళ్ళాలని ఇష్టము లేకుండెను. అతని అదృష్టము వలన షిరిడి వచ్చాడు. అతని స్నేహితులు, అత్తమామలు కలిసి బలవంత పెట్టడము వలన సరేనన్నాడు. విరార్ లో దిగి అతని గురువును దర్శించి షిరిడి పోవుటకై అనుమతి పొంది, చేతి ఖర్చుకై డబ్బు అప్పుతీసుకొని, తను కూడా బొంబాయి వెళ్ళాడు. తర్వాత స్నేహితులతో కలిసి షిరిడి వెళ్ళాడు. అందరూ ఆనందంగా **11** గంటల ప్రాంతంలో మసీదు కు వెళ్ళారు. అక్కడ భక్తుల పూజలు చూసి సంతోషించారు. యింతలో పంత్ తల తిరిగి మూర్ఛ వచ్చినట్లు తెలివి తప్పి పడి పోయాడు. స్నేహితులు భయపడ్డారు. బాబా దయ వల్ల తలపై నీరు పోయగానే నిద్ర నుండి లేచినట్లుగా తడబడుతూ లేచి కూర్చున్నాడు. సర్వజ్ఞుడైన

బాబా అతనికి తన గురువు పైన వున్న నమ్మకం తెలుసు కనుక అతనికి అభయహస్తం అందించి ఇలా అన్నాడు, 'ఎట్టి పరిస్థితులలోను, నీవు నీ గురువును వదల కూడదు. దృఢమైన భక్తికలిగి వుండు. గురువులంతా ఒకటేనని గుర్తించు.' అని బాబా చెప్పాడు. ఆ మాటల అర్థాన్ని పంత్ గ్రహించాడు. తన గురువు స్మరణకు వచ్చి బాబాను ప్రార్థించాడు. 'మా ఆనంద భాష్పాలు నీ పాద ప్రక్షాళన చేసే ఉష్ణజలం. మా శుద్ధ ప్రేమనే నీకు చందనము. మా శ్రద్ధ నీకు తొడిగే వస్త్రం. మానసిక పూజ తోనే మేము నిన్నారాధించ గలము. నీ నుదుట శ్రద్ధ అనే బుక్కా తిలకాన్ని పెడ తాము. నీ పాదాల బొటన వ్రేళ్ళకు మా తలలు వంచి మమ్ములను నీకు సమర్పించు కుంటాము. నిన్ను ప్రేమ అనే రత్నఖచిత భూషణాలతో అలంకరిస్తాం. పంచప్రాణాలతో వీవెనలు వీస్తాం. నీ ఉత్సవాన్ని చూసి ఆనందిస్తాం. మా దృష్టి తగులకుండా దిష్టి తీస్తాం. చందనాక్షతలతో అష్టాంగ పూజ చేస్తాం'.

**హరిశ్చంద్ర పితళే కొడుకు మూర్ఛ రోగము :** హరిశ్చంద్ర పితళే బొంబాయి వాస్తవ్యుడు. అతని కుమారుడు మూర్ఛ రోగంతో బాధపడు చుండెను. ఎందరో దేశ, విదేశ వైద్యులకు చూపించాడు. కాని వృధా అయింది. దాసగణు కీర్తనల ద్వారా శ్రీ సాయి బాబా కీర్తి దశ దిశలా వ్యాపించింది. బాబా అనుగ్రహముతో అందరి బాధలు హరించి వేయడం అనేకులకు అనుభవమయింది. అది తెలుసుకొనిన పితళేకు బాబా దర్శనం చేసుకోవాలని షిరిడి వచ్చారు. బాబా పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసి పుత్రుని బాబా పాదాలచెంత పడుకోబెట్టాడు. అప్పుడు సాయి బాబా కన్నులు ఆ పిల్లవాని కళ్ళతో కలిసాయి. ఆ పిల్లవాడు అకస్మాత్తుగా తెలివితప్పి పడిపోయి కళ్ళు తేలవేసాడు. నోటినుండి నురగ రాసాగింది. శ్వాస ఆగి పోతుందేమో అని అనిపించింది. బ్రతుకుతాడనే నమ్మకము పోయింది. వారు చాలా దుఃఖ పడ్డారు. ఈ విధంగా అనేక సార్లు మూర్ఛ వచ్చినా ఇంత ఘోరంగా రాలేదని అనుకున్నారు. పిల్లవాడి తల్లి ఏడవడం మొదలు పెట్టింది. 'ఈ

బాబా పాదాలు ఇంత ఘాతుకాన్ని చేస్తాయని తెలియక వచ్చాం. మా కష్టం వ్యర్థమైంది. దేవునిపై భక్తితో గుడికి వెళ్ళితే గుడి కూలి శరీరంపై పడ్డట్టయ్యింది', అని ఆ తల్లి ఏడువ సాగింది. అప్పుడు బాబా వారితో, 'కొంచెం ధైర్యం వహించి పిల్లవానిని లేవదీసి వాడా కు తీసుకొని వెళ్ళు ఒక ఘడియ లో పిల్లవాడు బాగవుతాడు. ఊరికే గాబరా పడవద్దు'అని అన్నాడు. వారు బాబా చెప్పినట్లుగా చేసారు. అతనికి తెలివి వచ్చింది. అతని తల్లితండ్రులకు విచారము పోయి ఆనందము కలిగింది. పితళే భార్యతో బాబా వద్దకు వెళ్ళి సాష్టాంగపడి, ఎంతో వినయంగా బాబా పాదాల వద్ద కూర్చున్నారు. బాబా నవ్వుతూ 'ఇప్పుడైనా మీ మనస్సులోని సంశయము తీరిందా? విశ్వాసముతో, సహనముతో వుంటే శ్రీహరి రక్షిస్తాడు', అని అన్నాడు. పితళే ఆగర్భ శ్రీమంతుడు. అతను తన హోదాకు తగ్గట్టుగా బాబాకు పళ్ళు మిఠాయిలు సమర్పించాడు, భక్తులకు పంచి పెట్టాడు.

**అంబాడేకర్ ఆత్మహత్యా ప్రయత్నము:** గోపాల్ నారాయణ అంబాడేకర్ బాబా భక్తుడు. ఎక్సైజ్ డిపార్టమెంట్‌లో ఉద్యోగం చేసేవాడు. అతను మొదట ఠానాలో ఉద్యోగము చేసినప్పుడు ఆఫీసరైనాడు. పదిసంవత్సరములు ఉద్యోగంచేసి విరమించు కున్నాడు. ఉద్యోగం లేక వుండటం వలన సంపద తరిగి పోయింది. ఈ విధంగా ఏడు సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రతి సంవత్సరము అతను షిరిడి వెళ్ళి బాబాకు తన బాధలు మనవి చేసుకొని వచ్చేవాడు. **1916**వ సంవత్సరము షిరిడి వెళ్ళి, అక్కడే ఆత్మహత్య చేసుకోవాలని తలచాడు. దీక్షిత్ వాడాకు ముందున్న ఎడ్లబండిపై కూర్చుని ఒకనాడు రాత్రి దగ్గరలో వున్న నూతిలో పడి చావవలెనని నిశ్చయించు కున్నాడు. కాని సూత్రధారి అయిన సాయి బాబా ఆ పాపం నుండి రక్షించాడు. కొన్ని అడుగుల దూరంలో ఒక హోటలు యజమాని సగుణమేర నాయక్, బాబా భక్తుడు. అతను అంబాడేకర్‌ను పిలిచి, 'అక్కల్ కోట మహారాజ్ పుస్తకాన్ని ఎప్పుడైనా చదివావా?'అని అడిగాడు. అంబాడేకర్

ఆ పుస్తకాన్ని తీసుకొని పుటలు తిరగవేస్తూ మధ్య నుండి చదవడం మొదలు పెట్టాడు. అతని పరిస్థితికి తగినట్టుగానే అందులో ఒక కథ వుంది. ఆ కథలో, అక్కల్‌కోట మహారాజ్ గారి కాలంలో ఒక భక్తుడు బాధ భరించలేక నిరాశ చెంది, బావిలో దుమికెను. అప్పుడు ఆ మహారాజ్ అతనిని బయటికి తీసి ఇట్లనెను. 'గత జన్మలో చేసిన పాప పుణ్యము లను నీవు అనుభవించక తప్పదు. మన పూర్వ కర్మలను పూర్తిగా అనుభవిస్తే తప్ప అవి నశించవు. ఆ కర్మలను అనుభవించక తప్పదు. ఆత్మహత్య చేసుకొంటే ఏం లాభం. నీవింకొక జన్మ ఎత్తి మరల బాధలు అనుభవించవలసి వస్తుంది. చచ్చుటకు ముందే ఓపికతో కర్మలను అనుభవించుట మేలు. గత జన్మ పాపములను తుడిచి వేయుట ఉత్తమం. దానిని శాశ్వతముగా పోవునట్లు చేసుకొనుము.' అని మహారాజ్ బోధించాడు. సమయోచితంగా వున్న ఆ కథను చదివి అంబాడేకర్ ఆశ్చర్యపోయాడు. బాబా సర్వవ్యాపకత్వాన్ని గ్రహించి సిగ్గుపడ్డాడు. ప్రాణత్యాగ సాహసం మంచిది కాదని బాబా తనకు సూచించినట్లు అనిపించింది. హోటల్ యజమాని సగుణమేర్ ద్వారా బాబానే సూచించాడని తలచాడు. ఆ పుస్తకాన్ని ఏ కొంత ఆలస్యంగా చూసినా, ఈ జన్మ కోల్పోయేవాడు. అంబాడేకర్‌కు బాబా యందు నమ్మకము బలపడి అతనికి గల భక్తి దృఢమైనది. అతని తండ్రి అక్కల్‌కోట మహారాజ్ భక్తుడు. కావున అతని కొడుకు కూడా తండ్రివలె భక్తుడు కావలెనని బాబా కోరిక.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *శ్రద్ధ, సహనము, ధైర్యము లేనిదే కొంచెమైనా ముక్తి పొందలేము గురువును ఆశ్రయిస్తేనే ముక్తి కలుగును*
- *నీ అహంకారాన్ని అణచుకొని అణకువతో ఉండాలి.*

# అధ్యాయము 27

(దీక్ష అనుగ్రహ దానము)

**శ్యామాకు విష్ణు సహస్ర నామ పుస్తకము ఇచ్చుట:** ఒక నాడు రామదాసు బువా అనే భక్తుడు షిరిడి వచ్చాడు. అతడు ప్రతిదినం విష్ణు సహస్రనామములు, ఆధ్యాత్మిక రామాయణము, శ్రద్ధతో పారాయణము చేసేవాడు. ఒక నాడు బాబా రామదాసిని పిలిచి, కడుపు నొప్పిగా వున్నది, త్వరగా సోనాముఖిని తీసుకొని రమ్మని బజారుకు పంపాడు. రామదాసు వెళ్ళగానే బాబా అక్కడున్న విష్ణు సహస్రనామ పుస్తకాన్ని తీసుకొని శ్యామాకు ఆ పుస్తకం ఇస్తూ, 'ఇది వట్టి పుస్తకము కాదు. చాలా ఉపయోగపడు విలువైన గ్రంథము. దీనిని నిత్యం పారాయణం చేయి. నీకు ఆనందము కలుగును.'అని బాబా అన్నాడు. అప్పుడు శ్యామా బాబాతో, 'ఆ పుస్తకం నాకు అక్కరలేదు. ఆ పుస్తకము రామదాసిది. అతడు మొండివాడు. మహాకోపి, వానితో తగువు వచ్చును.'అని అనెను. కాని బాబా ఈ విష్ణు సహస్ర నామములు అతని కంఠానికి బంధించి అతని వాక్కు సరిచేసి భవదుఃఖాలనుండి రక్షించాలని తలచాడు. రామదాసి సోనాముఖి ఔషధాన్ని తీసుకొని రాగానే శ్యామాతో గొడవ పడ్డాడు. ఆ పుస్తకము ఇవ్వకపోతే తల బద్దలు కొట్టుకుంటానని బెదిరించాడు. మాధవరావు అసలు విషయము ఎంత చెప్పినా రామదాసి వినడం లేదు. అప్పుడు బాబా రామదాసితో, 'రామదాసూ! శ్యామా మనవాడే కదా! ఊరికే ఎందుకు కోపగించు కొనుచున్నావు. కలహమాడుతా వెందుకు? రోజూ ఈ పుస్తకాన్ని చదువుచున్నావు కాని, నీకు చిత్తశుద్ధి లేదు. ! డబ్బు పారేస్తే పుస్తకాలు దొరుకుతాయి. కాని మనుష్యులు దొరకరు. అది తెలుసుకో!'అని అన్నాడు. రామదాసు అర్థం చేసుకున్నాడు. కాని యింకా కోపంగా, 'ఆ పుస్తకానికి బదులుగా పంచరత్న గీత తీసుకుంటాను.'అని అన్నాడు. రామదాసి చల్లబడినందుకు మాధవరావుకు సంతోషము కలిగింది.

ఒక్కటేమిటి పది పంచ రత్న గీతలు యిస్తానని అన్నాడు. గీతలో ఏమి చెప్పాడో తెలియని వానికి గీత ఎందులకు. బాబాను కూడా దుఃఖ పెడతాడా?అని అనుకున్నాడు శ్యామా. ఈ కథ జరిగినందుకు శ్యామాకు ఆ పుస్తకము పై శ్రద్ధ కలిగి పట్టుదల పెరుగు తుంది.

**ఖపర్దే దంపతులు సమర్పించిన పదార్థములు :** ఖపర్థే గొప్ప విద్వాంసుడు. అతడు సాయి సన్నిధిలో చేతులు జోడించి సాయి పాదాలపై తన తలను ఉంచేవాడు. అతను అమరావతిలో ప్రసిద్ధికెక్కిన ప్లీడరు. అతను ఢిల్లీ కౌన్సిల్‌లో సభ్యుడు. గొప్ప వక్త. అయినప్పటికి సాయి ముందు మౌనంగా వుండేవాడు. ఖపర్థే షిరిడిలో నాలుగు మాసములుండెను. అతని భార్య ఏడు మాసములుండెను. అతని భార్య చాలా నిష్ఠావంతురాలు. ఆమెకు బాబాపై అమితమైన ప్రేమ. ప్రతిరోజు **12** గంటలకు స్వహస్తాలతో నైవేద్యం తయారుచేసుకొని తెచ్చు చుండెను. బాబా ఆ నైవేద్యం స్వీకరించిన తర్వాతనే భోజనం చేయు చుండెను. ఒకరోజు యధాప్రకారము ఒక పళ్ళెంలో ఖపర్థే భార్య, సాంజా, పూరి, అన్నం, అప్పడాలు, పరమాన్నం మొదలగునవి మసీదు కు తెచ్చింది. వెంటనే సాయి తన ఆసనం నుండి లేచి, ఆ పళ్ళెమును తన దగ్గరకు జరుపుకొని, పైన బట్టను తొలగించి మక్కువతో భోజనానికి సిద్ధమయ్యాడు. యితరులు తెచ్చిన ప్రసాదములు ముట్టలేదు శ్యామా బాబా చర్య చూచి 'బాబా ! ఎందుకీ పక్షపాతము? ఇతరుల పళ్ళెములను పక్కన పెట్టావు. కాని ఈమె తెచ్చిన ప్రసాదాన్ని తింటావు? ఎందుకీ బేధభావం? ఇందులోని రహస్యమేమి?.'అని శ్యామా అడుగగానే బాబా, 'ఈ భోజనము మిక్కిలి అమూల్యమైనది. పూర్వ జన్మలో ఈమె ఒక వర్తకుని యింటిలో ఆవు. అది బాగా పాలిచ్చుచుండెను. కొన్నాళ్ళతర్వాత ఒక తోటమాలి యింటిలో జన్మించింది. తదుపరి ఒక క్షత్రియుని యింటిలో జన్మించి, ఒక వర్తకుని వివాహ మాడినది. ఆ తర్వాత ఒక బ్రాహ్మణుని యింటిలో జన్మించింది. చాలా కాలం తర్వాత ఆమెను చూచితిని. కావుననే ఆమె పళ్ళెంనుండి

తీసుకొంటిని. ఆమెకు సంతోషం కలిగించాలనేదే నా వుద్దేశ్యం.'అని చెప్పాడు. అధ్యాత్మిక ము తెలియని వారికి ఇది సామాన్య విషయము వలె కనిపించును. కాని ఇది 'శక్తి పాతం'. బాబా మాటలు శక్తి పూరిత మయినవి. ఒక్క క్షణంలో అవి ఆమె హృదయము లో స్థిరపడెను. బాబా భక్తుల మనో రథాలను సదా తీరుస్తుంటాడు.

**గీతా రహస్య భాష్యము :** ఒకసారి బాపూ సాహెబ్ జోగ్‌కు ఒక పార్సిల్ వచ్చెను. అందులో లోకమాన్యతిలక్ వ్రాసిన గీతా రహస్య భాష్యము వుండెను. అతడు ఆ పార్సల్‌ను చంకలో పెట్టుకొని బాబాకు సాష్టాంగ నమస్కారము చేస్తుంటె అది బాబా పాదాల వద్ద పడెను. బాబా, 'బాపూ సాహెబ్ యిదేమిటి?'అని అనెను. అతడు బాబా వద్ద ఆ పార్సిల్ విప్పి ఆ గ్రంథాన్ని బాబా చేతికి అందించెను. బాబా ఆ గ్రంథాన్ని అటూ ఇటూ చూసి, జేబులో నుండి ఒక రూపాయి దక్షిణ ఆ పుస్తకంపై పెట్టి, ఆ పుస్తకాన్ని జోగ్‌కు అందించెను. జోగ్‌కు యిస్తూ, 'దీనిని మొత్తం చదువుము. శుభం కలుగుతుంది.' అని బాబా అన్నాడు. దైవవశాత్తు గురు కృప లభించింది. భక్తులను ఉద్ధరించటానికి సాయి బాబా హేమాద్ పంత్‌చే ఈ గ్రంథాన్ని బలవంతంగా వ్రాయించాడు. అతను ఏ అధ్యయనం గాని సాధన కాని చేయలేదు. అఖండ ధ్యానమనే దారంలో, అనన్య ప్రేమ అనే విచిత్ర పుష్పాలను గ్రుచ్చి, మనోహర హారాన్ని తయారుచేసి, సాయి మెడలో
అలంకరిద్దాం

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *నీవు భయపడకుము. నా లీలలు భక్తి శ్రద్ధలతో వింటే ప్రపంచము పై వ్యామోహము తొలగి పోవును. నా లీలలలో మునిగిన వారికి జ్ఞాన రత్నాలు లభించును. భయాలు తొలగి పోవును.*

# అధ్యాయము 28

(కలలు, కథలు )

**వేలాది క్రోసుల దూరమున్నను షిరిడికి లాగుదును :** శ్రీ సాయి శబ్ద బ్రహ్మంలో ప్రవీణుడు. పరబ్రహ్మ స్వరూపుడు. అందుకే సద్గురువు స్థానానికి అధికారి. బ్రహ్మకీటకాలలో చీమలు, దోమలు, సర్వజీవులలో వ్యాపించి వున్నాడు. సాయి బాబా పూర్ణబ్రహ్మ. పరబ్రహ్మను తెలియచేసేది కూడా వారే. మహాజ్ఞాని అయివుండి శిష్యులకు జ్ఞానబోధ కాని నిజ స్వరూప దర్శనం చేయలేని గురువు సద్గురువు కాడు. శరీరానికి జన్మనిచ్చేది తండ్రి, జనన మరణముల బాధ నుండి నిర్మూలం చేయగలవారు కరుణామయుడైన గురువు మాత్రమే. ఒకరికి బాబా స్వప్నంలో దర్శనమిచ్చి త్రిశూలం గీయమని చెప్పాడు. మరొకరిని ఖిచిడి అడిగాడు. ఒకరిని గురువు వలె బెత్తంతో కొట్టి అతని బాధను తొలగించాడు. ఈ విధంగా బాబా అనేక మంది కష్టాలను తొలగించి తన యందు ప్రేమ కలిగేలా చేసాడు. సత్పురుషుల కథాశ్రవణం వలన అసత్యాలు నిందలు విన్న పాపాలు కడుగ బడుతాయి. 'నా మనిషి ఈ దేశంలో గాని, లేక వేలాది క్రోసుల దూరంలో వున్నా పిచ్చుక పిల్ల కాళ్ళకు దారం కట్టి లాక్కొని వచ్చినట్లు నా వైపు లాక్కుంటాను.' అని ఎన్నోసార్లు అనటం అనేకమంది విన్నారు. అలాగే అనుభవం కూడా అయ్యింది. బాబా అనేక మందిని షిరిడికి తీసుకొని వచ్చాడు. వాటిలో కొన్నిటిని ఈఅధ్యాయములో తెలుసు కొందాం.

**లాలా లక్ష్మీచందు పై బాబా అనుగ్రహము :** బాబా ఎంతో మందిని షిరిడి తీసుకొని వచ్చాడు అందులో ఒకడు ఈ లక్ష్మీచందు. ఒక వృద్ధుడైన మహాత్ముడు ఒకసారి దాసుగణు కీర్తన చేయునప్పుడు అక్కడ బాబా చిత్ర పటము చూసిన లక్ష్మీచందుకు తనకు కలలో కనిపించినది కూడా బాబా అనితలచి, ఆశ్చర్యపడి షిరిడి పోవాలని

నిశ్చయించుకున్నాడు. లక్ష్మీచందుకు షిరిడి పోవలయునని కోరిక మనస్సులో గాఢంగా నాటుకొని పోయింది. ఆరోజునే శంకర్ రావు అనుస్నేహితునితో కలిసి తన సోదరుని వద్ద రూ.**15** అప్పుగా తీసుకొని షిరిడికి రైలులో బయలు దేరాడు. రైలులో బాబా గురించి అందరిని అడిగే వాడు. బాబాకై జామ పళ్ళు కొనాలని తలచాడు. రైలుదిగి టాంగాలో షిరిడి వేళ్ళు చుండగా ఒక వృద్ధ స్త్రీ నెత్తిపై జామ పండ్ల బుట్ట పెట్టుకొని టాంగా వెంట పరుగెత్తుతూ రావడం అతను చూసి, టాంగాను ఆపి పళ్ళను తీసుకున్నాడు. తను పళ్ళు యివ్వాలని అనుకోగానే ఆ స్త్రీ రూపంలో కూడా బాబానే వచ్చాడేమోనని భావించాడు. ఆ యిద్దరు స్నేహితులు షిరిడి సమీపానికి రాగానే మసీదు పైనున్న జండాలను చూసి వందనం చేసారు. తర్వాత పూజా సామాను తీసుకొని మసీదు కు వెళ్ళి సాయి దర్శనం చేసుకొని సంతోషించారు. బాబా దర్శనంతో లక్ష్మీచందు తల్లీనుడై ఆకలి దప్పులు మరిచి పోయాడు. లక్ష్మీచందు అర్ఘ్య పాదాదు లయ్యాక, శ్రీ ఫలాన్ని దక్షిణ సమర్పించి, పాదాల చెంత కూర్చున్నాడు. అప్పుడు బాబా, 'సాలే! రాస్తే మే భజన్ కర్తే, ఔర్ దూస్రే ఆద్మీకు పూఛ్‌తే, క్యాదూస్‌రేసే పూఛ్‌నా (సబ్ కుఛ్ అప్నే ఆంఖోసే దేఖ్‌నా, కయికూ దూస్రే ఆద్‌మీకూ పూఛ్‌నా? ఝూటా హైక్యా సచ్చా సప్నా? కర్లో అప్నా విచార్ అబ్. మార్వడీసే లేకర్ అచ్చిత్, క్యాజరూరి దర్శన్‌కి హోతి? హుయీ క్యాఅబ్ మురాద్ పూరీ?' అని అడిగాడు. బాబా మాటలు, విని బాబా అంతర్జ్ఞానం చూసి లక్ష్మీచందుకు ఆశ్చర్యం కలిగింది. అప్పుచేసి పండుగలు, యాత్రలు చేయడం సరి అయిన పద్ధతి కాదని మనం గుణపాఠం నేర్చుకోవాలి.

**మేఘా శ్యాముడు గంగా స్నానం చేయించుట :** ఒక మకర సంక్రాంతి నాడు మేఘాకు గోదావరి నీరు తెచ్చి బాబాను అభిషేకం చేయించి చందనం పూయవలెనని తలచాడు. బాబా ఆజ్ఞ కోరగా 'సరే నీ యిష్టము వచ్చినట్లు చేయి.' అని అన్నాడు. తెల్లవారు

జాముస మేఘా శ్యాముడు **8** క్రోసుల దూరం నడచి వెళ్ళి నీరు తెచ్చాడు. అంత అతను నీరు తెచ్చి స్నానానికి రమ్మని బాబాను బలవంత పెట్టాడు. బాబా సమ్మతించ లేదు. మధ్యాహ్న హారతి కూడా అయి పోయింది. సాయి మేఘా చేయి తన చేత్తో పట్టుకొని, 'నీవెంత అమాయకుడివిరా! నేను ఫకీరును, నాకెందుకురా గంగా స్నానం?'అని అన్నాడు. కాని మేఘాకు అవేమి వినిపించ లేదు. అతను బాబాను శంకరుని వలె తలిచెను కనుక అతనికి గంగా స్నానం శివునికి ఆనందమని మాత్రము తెలుసు. అందు వలన బాబాతో, 'ఈ రోజు మకర సంక్రాంతి పండగ, ఈ రోజు శంకరునికి స్నానం చేయిస్తే సుప్రసన్నుడౌతాడు.'అని అన్నాడు. అతని ప్రేమను దృఢ నిశ్చయాన్ని చూసి 'సరే నీ కోరిక తీర్చుకో!'అని లేచి స్నానానికి వేసి వున్నపీటపై కూర్చుని, తలను మేఘా వద్దకు వంచి, 'శరీరానికి శిరస్సు ప్రధానం. కేవలం నాతలపై మాత్రం నీళ్ళు పోయి. పూర్తి స్నానం చేయించినట్లు అవుతుంది.'అని అన్నాడు. సరే అని మేఘా కలశం తీసుకొని, భక్తి ప్రేమలతో, 'హర గంగే' అంటూ బాబా శరీరమంతా పడేలా నీరు కుమ్మరించాడు. సంతోషంతో చెంబును క్రింద వుంచాడు. మేఘా బాబా శరీరమంతా పడునట్లు నీరు కుమ్మరించినప్పటికి బాబాకు శిరస్సు మాత్రం తడిచింది. బాబా వస్త్రాలు కాని, శరీరం కాని ఎక్కడా ఏ కొంచెమైనా తడవలేదు. మేఘా మరియు గుమికూడి వున్నవారు కూడా విభ్రాంతి చెందారు. అనేక సంవత్సరములు మేఘా శ్యాముడు, బాబా సేవ చేసి మధ్యాహ్న, సాయంకాల హారతులు, సేవలు చేసి తుదకు మేఘా క్రీ.శ.**1912** జనవరి **19**నాడు కాలంచేసాడు. బాబా అతని కళేబరముపై చేతులు చాచి 'ఇతడు నా నిజమైన భక్తుడు.'అని అన్నాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 29

(బాబా చేసే దాన ధర్మాలు)

**బాబా ప్రతిరోజు చేసే దాన ధర్మాలు :** ఉదయం అల్పాహారం చేసిన తర్వాత బాబా ధుని వద్ద ఒక స్తంభాన్ని ఆనుకొని కూర్చునేవాడు. బాబా భక్తుడైన కొండాజి కూతురు 'అమని' మసీదు కు రోజూ వస్తూ వుండేది. ఆమె వయస్సు మూడు సంవత్సరములు. ఆ అమ్మాయి నగ్నంగ వుండేది. బాబా ధుని దగ్గర కూర్చున్న సమయానికే వచ్చేది. వెంట ఆ అమ్మాయి తల్లి కూడా వుండేది. ఆ పిల్ల చేతిలో ఒక రేకుడబ్బా వుండేది. ఆ అమ్మాయి బాబా ఒళ్ళో కూర్చుని తన డబ్బా బాబా చేతికిచ్చి, రూపాయి, రూపాయి అని మోత పెట్టేది. బాబా ఆ అమ్మాయిని ముద్దు చేసేవాడు. బాబా హృదయంలో ప్రేమ తరంగాలు పొంగేవి. తన జేబులో చేయి పెట్టి రూపాయి బిళ్ళ పైకితీసి ఆ డబ్బాలో వేసేవాడు. టన్ మని చప్పుడు చేస్తూ డబ్బాను మూసేవాడు. ఆ డబ్బా చేతులో పడగానే ఆ పిల్ల రివ్వున పరుగెత్తుతూ పోయేది. ఇది ఉదయం జరిగే సంగతి. ఆ అమ్మాయికి బాబా లెండికి బయలుదేరు నప్పుడు కూడా ఒక రూపాయి యిచ్చేవాడు. మామూలుగా కోపగించుకుంటూనే సుమా! ఇలా బాబా ప్రతిరోజు ఆ పాపకు రెండు రూపాయలు ఇచ్చేవాడు. ఈ విధంగానే ప్రతిరోజు జయలీలకు (కొండాజి భార్య) ఆరు రూపాయలు, ఐదు దాదా కేల్కర్‌కు, రెండు, రెండు చొప్పున భాగ్య మరియు సుందరిలకు యిచ్చేవాడు. తాత్యాబకు పది నుండి పదిహేను వరకు, ఫకీరు బాబాకు పదిహేను నుండి ఏభై వరకు యిచ్చేవాడు. బీదలకు ఎనిమిది రూపాయలు పంచే వాడు.

**క్యాప్టెన్ హాటే చిక్కుడు కాయల కూర :** క్యాప్టెన్ హాటే అను డాక్టరు బాబాపై అమితమైన భక్తి కలవాడు. హాటే గ్వాలియర్ నందు ఉండేవాడు. బాబా అతనికి స్వప్నంలో కనిపించి 'నన్ను మరిచి పోయావా?' అని అడిగాడు. వెంటనే హాటే బాబా పాదాలను పట్టుకొని,

'బిడ్డలు తల్లిని మరిచినచో తరుణోపాయమెక్కడిది.'అని చెప్పి, వెంటనే తోటలోనికి వెళ్ళి చిక్కుడు కాయలు మరియు స్వయంపాకానికి అన్ని సామాను లు (బియ్యం, పప్పులు, పిండి) దక్షిణతో సహా రాగానే కల చెదిరి పోయింది. మెలుకువ వచ్చింది. షిరిడి వెళ్ళి పైవస్తువులు సమర్పించి రావాలని కోరిక కలిగింది. కాని అతడు చాలా దూరం వుండటం వలన బొంబాయిలో వున్న తన స్నేహితుడు దీక్షిత్‌కు ఉత్తరం వ్రాసాడు. 'నేను **12** రూ. డబ్బు పంపిస్తున్నాను. మీరు స్వయంగా షిరిడి వెళ్ళి స్వయం పాక వస్తువులు మరియు చిక్కుడు కొని మిగిలిన డబ్బులు బాబాకు దక్షిణగా సమర్పించవలసినది.' అని వ్రాసాడు. ఆ స్నేహితుడు డబ్బు అందగానే షిరిడి వెళ్ళి పప్పు, నెయ్యి, పిండి మొదలగు సామానులన్ని కొన్నాడు. అతనికి ఒక స్త్రీ తలపై బుట్టతో పోవటం కనిపించింది. ఆమెను పిలిచి చూడగా అందులో చిక్కుడు కాయలు కనిపించాయి. అతనికి ఆశ్చర్యం వేసింది. అవి తీసుకొని బాబాకు సమర్పించాడు. బాబా వానిని నిమోంకర్‌కు యిచ్చి 'వీనిని రేపు నైవేద్యానికి తీసుకొని రమ్ము.'అని చెప్పాడు. మరురోజు అన్నం పప్పు ముట్టకుండా, చిక్కుడు కాయ కూరనే తీసుకొని తిన్నాడు. ఈ వృత్తాంతాన్ని తెలుసుకొని హాటే ఆనందంతో వుప్పొంగి పోయాడు. తమలోని భావాన్ని బట్టి వారి వారికి అనుభవాలు కలుగుతాయి.

**క్యాప్టెన్ హాటేకు పవిత్ర నాణెమును పంపించుట :** ఒక సారి క్యాప్టెన్ హాటేకు సాయి బాబా హస్త స్పర్శతో పవిత్రం చేసిన ఒక రూపాయి నాణెం తన పూజా మందిరములో వుంచుకోవాలని కోరిక కలిగింది. అప్పుడే ఒక స్నేహితుడు సాయి బాబా దర్శనానికి షిరిడి వెళ్ళడాని కి సిద్ధంగా వుంటే, హాటే అతనికి ఒక రూపాయి యిచ్చి దీనిని మరిచి పోకుండా బాబా చేతికివ్వుమని చెప్పాడు. ఆ స్నేహితుడు షిరిడి వెళ్ళి బాబా దర్శనం చేసుకొని వారి సమక్షంలో కూర్చున్నాడు. బాబా దక్షిణ కొరకు చేయి సాచగా తన దక్షిణ యిచ్చాడు. వెంటనే తన జేబులో వేసు కున్నాడు. హాటే రూపాయిని బాబా చేతికిచ్చి యిది హాటే

పంపాడని చెప్పాడు. బాబా హాటే మనస్సులోని కోరిక తెలుసుకొని, ఆ రూపాయిని అట్లగే చూస్తూ కూర్చున్నాడు. దానిని ఎగుర వేస్తూ ఆడుకొని తిరిగి యిస్తూ, 'యిది ఎవరిదో వారికి యిచ్చివేయి. దీని వెంట ఊదీ ప్రసాదము తీసుకొని వెళ్ళు. తనకు ఏమి అక్కర లేదనియు, సంతోషంగా వుండుమని అతనితో చెప్పుము.'అని అన్నాడు బాబా. స్నేహితుడు బాబా ఆజ్ఞ తీసుకొని తిరిగి వచ్చాడు. హాటేకు అతని స్నేహితుడు షిరిడిలో జరిగిన విషయాలను చెప్పాడు. బాబా తన కోరిక తీర్చాడని సంతోషించాడు హాటే. బాబా సర్వాంతర్యామి ఆయన లీలలు అమోఘం. ఎవరూ అర్థం చేసుకొనలేరు. వామన నార్వేకర్ బాబాపై అపారమైన ప్రేమతో బాబాకు ఒక రూపాయి సమర్పించాలని తెచ్చాడు. దానికి ఒక వైపు సీతారామ లక్ష్మణులు, మరొక వైపు భక్తాంజనేయులు కలరు. అతడు దానిని బాబాకు యిచ్చాడు. బాబా దానిని పవిత్రం చేసి వూదీ ప్రసాదంతో యివ్వాలని కోరిక. కాని బాబా దానిని జేబులో వేసుకున్నాడు. వామనరావు ఆ రూపాయిని తిరిగి యివ్వమని కోరుకున్నాడు. బాబా వామనరావు సమక్షంలోనే 'అతనికిది ఎందు కివ్వాలి. రూపాయల రాశిపోసినా ఈ రూపాయను తూచలేవు. దీని విలువ కట్టడం సాధ్యం కాదు. శ్యామా ఈ రూపాయిని తీసుకొని దేవతార్చనలో వుంచి పూజ చేయి.' అని చెప్పాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *చైతన్య ఘనుడను అను జ్ఞానం కలిగి మనోవృత్తి భగవంతుని వైపు మరలుటే భక్తి. నేను సత్స్వరూప బ్రహ్మను. నిత్య, శుద్ధ, బుద్ధ ముక్తుడైన వాసుదేవుడనని తెలుసు కోవాలి. ఇదే శ్రద్ధాభక్తి సహితమైన నా పూజ.*

# అధ్యాయము 30

(మొక్కుబడులు, ఇతర కథలు)

**సాయి సదా మన వెంటనే :** కరణామయుడైన సాయి దర్శన మాత్రమున భవభయాలను వారించి ఆపదల నుండి దూరంగా తీసుకెళ్ళుతారు. బాబా నిర్గుణులైనా భక్తుల కోరికపై సగుణ రూపాన్ని ధరించారు. సత్పురుషులు భక్తులనుద్దరించటానికే అవతరిస్తారు. బాబా యోగులకే ఆచార్యుడు. బాబా చరణాలను పట్టుకున్న వారి సకల కల్మషాలు నశించిపోతాయి. పూర్వ జన్మ దోషాలు తొలగి మార్గము నిష్కంటకమౌతుంది. గొప్పతీర్థాల నుండి బ్రాహ్మణులు వచ్చి గాయత్రి మంత్రము జపించెదరు. వేద శాస్త్రములు పారాయణ చేస్తారు. యితరులు మనలను విడిచినప్పటికి సాయి మాత్రము విడువక మన వెంటనే వుంటారు. వారి కృపకు పాత్రులైన వారు శక్తి, జ్ఞానం, వివేకం పొందగలరు. సాయి ముఖం నుండి వెలువడే వచనాలలోని శబ్దాలనుండి భక్తులు ఎన్నో అనుభూతులు పొందుతారు. సాయి తమ భక్తుల మనోరథాన్ని తెలుసుకుంటాడు. భక్తుల కోరికలు తీర్చే సమర్థులు వారే. బాబా పాదాలపై శిరస్సునుంచి అపరాధములను క్షమించమని, దాసుల బాధలు నివారించమని భక్తులు సాయినాథుని స్మరించి వేడుకుంటే మనస్సుకు శాంతి కలుగుతుంది. అన్ని చింతల నుండి విముక్తి లభిస్తుంది. సాయినాథునికి భక్తుల మనోరథాలు తెలుసు. సాయి నోటి నుండి వెడలే ప్రతి మాట భక్తుల మనోరథాలపై ముద్రింపబడును. భక్తుల కోరికలు బాబా మాత్రమే తీర్చగలడు.

**మాధవరావు దేశ్‌పాండే మొక్కు :** కాకాజీ వైద్య నాసిక్ జిల్లాలోని 'వణి' అను గ్రామంలో సప్తశృంగీ దేవాలయంలో పూజారి. అతనికి సంసారములోని కష్టాలవలన మనస్సులో అశాంతి జనించింది. కాకాజీ దుఃఖిస్తూ దేవాలయం లోని దేవిని తన చింతను దూరంచేసి, కరుణించమని ప్రార్థించాడు. మాత అతని భక్తికి ప్రసన్నురాలై ఆ రాత్రే

అతనికి స్వప్నంలో 'నీవు బాబా వద్దకు వెళ్ళు. నీ మనస్సుకు శాంతి లభిస్తుంది. స్థిర పడుతుంది.' అని చెప్పింది. ఈ బాబా ఎవరు? ఎక్కడ వుంటారు? అని తెలుసుకొనే లోపల కల చెదిరిపోయింది. దేవి తెలియచేసిన బాబా త్రయంబకేశ్వరుడు కావచ్చని అక్కడికి వెళ్ళి పది రోజులున్నాడు. అతను నిత్యం లింగానికి రుద్రాభిషేకం, చేసినప్పటికి మనశ్శాంతి లభించలేదు. అతనికి అక్కడ ప్రశాంతత కాని శాంతి కాని దొరకక తిరిగి వెళ్ళి పోయాడు. మళ్ళీ దేవిని వేడుకున్నాడు.. దేవి మళ్ళీ స్వప్న దర్శనమిచ్చింది. స్వప్నంలో, 'నీవు వృథాగా త్రయంబ కేశ్వరము ఎందుకు వెళ్ళావు. నేను బాబా అని చెప్పింది షిరిడి లోని సాయి సమర్థుని గురించి.' అని తెలియ చేసింది. షిరిడి ఎక్కడ వుంది? ఎట్లా అక్కడికి వెళ్ళాలి. బాబా ఎవరో ఎలా తెలుసు కోవాలి? అని కాకాజీవైద్య ఆలోచించ సాగాడు. సత్పురుషుల దర్శనం చేసుకోవాలని, అదే ధ్యాసలో వుంటే భగవంతుడు వారి కోరికలు తీరుస్తాడు. యదార్థంగా మహా పురుషులు, భగవంతుడు ఒక్కడే. వారిలో భేదము లేదు. ఎవరైనా తామే వెళ్ళి దర్శించుట అనునది అబద్ధం. మహాత్ములు తలువనిది దర్శనం చేసుకోలేరు. అతని ఆజ్ఞ లేనిది చెట్టు ఆకు కూడా కదలదు. దర్శనాభిలాష ఎంత ఎక్కువగా వుంటే ఆనందానుభవం అంత పరాకాష్ట నందుకుంటుంది. తమ భక్తులను దర్శనానంతరం షిరిడి రప్పించి, వారికి నిస్వార్థం, పరమార్థం కలుగచేసి, వారి కోరికలు తీర్చి, వారికి శుభం కలిగించడమే బాబా అవతార లక్ష్యం, తత్వం. కాబట్టి బాబా భక్తులు సంతృప్తులై వుండేవారు. తల్లి శ్యామాకి అవసాన సమయంలో యిలా చెప్పింది. 'బాబ్యా! (మాధవరావుని తల్లి ముద్దుగా పిలుచుకొనే పేరు.) నీవు చిన్న పిల్లవాడిగా వున్నప్పుడు, ఒకసారి నాకు స్థనాలు వాచి తామరతో బాధ కలిగి నప్పుడు ఆ బాధ భరించలేక, తగ్గినచో దేవికి రెండు వెండి స్థనాలు అర్పిస్తానని మొక్కు కున్నాను. ఆలస్యం చేయకుండా దేవి మొక్కులు తీర్చు.' అని చెప్పింది. కాని ఇలా **30** సంవత్సరములు గడిచి పోయాయి మొక్కు మరిచి పోయారు.

బాపాజీ (శ్యామా తమ్ముడు)తో ఒక జ్యోతిస్కుడు మొక్కు సంగతి గుర్తు చేసాడు. శ్యామాకు ఆ విషయము చెప్పగా బాబానే దేవిగా భావించి మొక్కును సమర్పించాడు కాని బాబా మాత్రము శ్యామాను సప్తశృంగీ వెళ్ళి మొక్కు తీర్చుకొమ్మన్నాడు. బాబా ఆజ్ఞానుసారం శ్యామా సప్తశృంగి చేరుకున్నాడు. కాకాజీకి బాబాను దర్శించవలెనని కోరిక వున్న సమయంలో, మాధమవరావు షిరిడి నుండి వచ్చాడని తెలుసుకొని, చాలా సంతోషించాడు. కాకాజీ స్వయంగా మాధవరావు తల్లి మొక్కుల పూజను చేయించాడు. వెంటనే షిరిడి వెళ్లడానికి నిశ్చయించు కున్నాడు. అతను మనస్సులోని కోరిక లాగానే షిరిడి చేరుకున్నాడు. షిరిడి రాగానే వారు సాయి దర్శనానికి బయలు దేరారు. బాబాను చూడగానే కాకాజీ బాబా పాదాలపై పడ్డాడు. అతని మనస్సు శాంతించింది. సప్త శృంగీ దేవి స్వప్నంలో చెప్పిన రీతిన బాబాను చూడగానే తన మనస్సులోని చంచలత్వం పోయి ప్రశాంతి లభించింది. అతని మనస్సులో యిలా అనుకున్నాడు. 'ఆశీర్వాదము లేదు, బోధన లేదు, కేవలం దర్శనంతోనే నామనస్సు సంతృప్తి చెందింది. అలౌకిక మైన సుఖం లభించింది. దీనినే దర్శన మహత్యమంటారు.' సాయి పాదాల యందు మనస్సు దృష్టి నిలువగానే మాటలురాక మౌనంగా వుండి పోయాడు. అతని సంతోషమునకు అంతు లేకుండెను. భక్తితో సాయినాథునికి పూర్ణ శరణాగతు డయ్యాడు. తన బాధలను మరిచి ఆత్మసుఖాన్ని పొందాడు. అతను షిరిడిలో **12** రోజులుండి బాబా వద్ద ఊదీ ప్రసాదము, ఆశీర్వాదము తీసుకొని సుస్థిర మనస్సుతో యిల్లు చేరాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *నన్ను అనన్య శరణు జొచ్చిన వారికి నేను ఋణగ్రస్తుడను.*

# అధ్యాయము 31

(సాయి దర్శన మహిమ)

**పునర్జన్మ :** అంతిమ సమయంలో మనస్సు ఏ విధంగా వుంటుందో, ప్రాణం నిష్క్రమించే గతి కూడా అదే విధంగా వుంటుంది. అంత్య కాలమందు మనస్సు దేనిని ధ్యానిస్తుందో పునర్జన్మలో అదే రూపం వస్తుంది. మనస్సు భగవంతుని పాదాల యందు విలీనం చేస్తే, జన్మ రాహిత్యం కలుగును. నామస్మరణ అభ్యాసంలో వుంటే అంత్య కాలంలో గాబరా పడకుండా భగవన్నామస్మరణకు వస్తుంది. జీవితమంతా మేలుకొని అంత్య కాలంలో నిద్రపోతే అంతా వ్యర్థం. అందుకే సత్సంగము అవసరం. నిజమైన భక్తులు యోగులకు సర్వస్య శరణాగతి చేసెదరు. సర్వజ్ఞులు భక్తులకు దారి చూపి అంత్యకాలమున సహాయము చేసెదరని వారి నమ్మకం. భక్తులకు శుభ ఘడియ రాగానే తమ పాదాల చెంతకు బాబా రప్పించు కుంటారు.

**విజయానందునికి సద్గతి :** విజయానందుడనే సన్యాసి మానస సరోవరానికి బయలు దేరాడు. అతను బాబా యొక్క కీర్తి విని దర్శించవలెనని షిరిడి వచ్చాడు. అక్కడ హరిద్వార్ నుండి వచ్చిన సోమదేవర స్వామి వున్నాడు. అతని నుండి వివరములు తెలుసుకున్నాడు. విజయానందుడు సంగతులు తెలుసుకొని నిరాశచెంది యాత్ర మానుకున్నాడు. బాబా దర్శనం చేసుకొని ఆసనం వేసి ప్రసన్నంగా కూర్చున్నాడు. బాబా కోపంతో, 'ఈ పనికి రాని సన్యాసిని తరిమి వేయండి.' అని అన్నాడు. సన్యాసి గాబరా పడ్డాడు.. బాబా కోపించినప్పటికి అతనికి బాబా యందు ప్రేమ కలిగెను. అతనికి ఆ స్థలం విడుచుటకిష్టం లేదు. కూర్చున్న చోటు నుండి అతను లేవలేదు. అతను షిరిడిలో రెండు రోజులున్న తర్వాత, అతని తల్లికి జబ్బుగా వున్నదని వుత్తరము వచ్చింది. తల్లిని చూడ డానికి స్వదేశం వెళ్ళాలని తలచాడు. విజయానందుడు బాబాను కలిసి యింటికి

వెళ్ళడానికి అనుమతి కోరాడు. బాబా 'నీ తల్లిని అంత ప్రేమించు వాడవైతే సన్యాసమెందుకు తీసుకున్నావు. కాషాయ వస్త్రములు ధరించు వానికి దేని పైనను మమకారము వుండరాదు. నీ బసకుపోయి హాయిగా కూర్చొనుము. కాషాయ వస్త్రములకు కళంకము తెస్తున్నావు. రేపటినుండి భాగవత గ్రంథాన్ని మూడు వారముల వరకు చదువుము. నీకు శాంతి లభించును.' అని జ్ఞాన బోధ చేసాడు. రెండవ రోజునుండి భాగవతం చదువుటకు నిశ్చయించి, భాగవతం చదువటం మొదలు పెట్టాడు. రెండు వారములు సంపూర్ణంగా చదివాడు ఆ తర్వాత మూడవ రోజు బడేబాబా తొడపై ప్రాణం వదిలాడు. అతని దేహావసాన వార్త బాబాకు నివేదించగా ఒకరోజు పోలీసు వాళ్ళు విచారణ జరిపిన పిమ్మట శవ సంస్కారమునకు అనుజ్ఞనిచ్చాడు. తర్వాత యోగ్యమైన స్థలములో శవసంస్కారము చేసారు. ఈ విధంగా విజయానందునికి సద్గతి కల్పించాడు


**బాలారాం మన్కడ్ కు బాబా దర్శనము :** బాలారాం మన్కడ్ బాబా యొక్క పరమభక్తుడు. అతని భార్య స్వర్గస్థురాలైంది. పూర్వజన్మ ఫలం వలన అతనికి జీవితంపై విరక్తి జనించి, కొడుకునకు గృహభారమప్పగించి, షిరిడి వచ్చి సాయి చరణ సాన్నిధ్యంలో ఉండెను. మన్కడ్‌కు మనస్సు స్థిరంగా వుండక చంచలంగా వుండి కలవర పెడుతూ వుండేది.. 'బాబా తన స్థానం షిరిడి మాత్రమే కాదు, దేశమంతా తనదే' అని చెప్పటానికి షిరిడిలో వుండకూడదని అతనిని అలా మచ్ఛీంద్రగడ్ పంపించాడు. అక్కడ తపస్సు చేసి సుఖాన్ని పొందుమన్నాడు. మన్కడ్ బాబా ఆజ్ఞ ప్రకారమే 'చత్తీస్‌గడ్‌లోనే నిత్యం భగవన్నామ తత్పరుడనై సాధన చేస్తాను. నీ కరుణ స్వరూపాన్ని ధ్యానిస్తాను. ఇదే నా నిరంతర తపస్సు. నేను నీకు సంపూర్ణ శరణాగతుడనౌతాను. నీ ఆజ్ఞా శక్తి ప్రభావంతో నేను అక్కడకూడా స్వస్థచిత్తుడనై వుంటాను.'అని అనుకున్నాడు. బాబా అతనితో 'ప్రతిరోజు మూడుసార్లు ధ్యానం చేయి. కొంత కాలం తర్వాత ఆత్మానందాన్ని

పొందుతావు.' అని బాబా చెప్పాడు. మస్కడ్ అక్కడి వాతావరణాన్ని చూసి మనస్సు స్థిర పడింది. సాయి చెప్పినట్లుగా తపమాచరిస్తూ వున్నాడు. ఆ విధంగా తపోమగ్నుడై వున్నప్పుడు అతనికి బాబా యొక్క ప్రత్యక్ష సాక్షాత్కారం లభించింది. బాబాను 'బాబా! నన్నెందుకు యిక్కడికి పంపించారు?' అని అడిగాడు. అప్పుడు బాబా, 'షిరిడిలో వుండగా నీ మనస్సులో అనేక కల్పనా తరంగాలు లేచేవి. నీ చంచల మనస్సు స్థిరపడటానికి ఇక్కడకు పంపించాను. నీవు ఈ ఆకారం షిరిడిలో తప్ప బయట లేదని తలచావు. అక్కడ వున్నవాడినే యిప్పుడు యిక్కడా వున్నాను. స్వస్థచిత్తంతో చూడుము. ఇది గ్రహించడానికే నిన్ను ఇక్కడకు పంపించినానని తెలుసుకో.'అని చెప్పాడు. తుదకు బాబా సముఖమున బాబా ఆశీర్వదముతో ఈ ప్రపంచమును విడిచి ముక్తి పొందాడు. అతడు ఎంతో అదృష్టవంతుడు.

**మేఘ శ్యాముని శరీర విసర్జన :** మేఘ శ్యాముడు ధన్యుడు. భక్తి తత్పరుడై వుండి షిరిడిలో క్రీ.శ.**1912**లో శరీర విసర్జన చేసాడు. మేఘా చనిపోయినప్పుడు భక్తులు, గ్రామస్థులు ఎంతో మంది శ్మశానానికి వెళ్ళారు. బాబా కూడా వెంబడించాడు. బాబా అతని శవముపై పూలు కూడా చల్లాడు. అంత్య క్రియలు జరుగు చున్నప్పుడు, భక్త సఖుడైన బాబా మాయలో వున్న మానవుని వలె కళ్ళ నీరు కార్చి శోకించాడు. తన చేతులతో ప్రేమగా శవాన్ని పూలతో కప్పాడు. దుఃఖంతో మసీదుకు తిరిగి వచ్చాడు. తన స్వంత ఖర్చులతో, శాస్త్ర ప్రకారంగా ఉత్తరక్రియలు జరిపించి సంతర్పణలు కూడా చేయించాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *



# అధ్యాయము 32

(గురు మహిమ వర్ణనము)

**ముక్తి కాంక్షించే వారు సద్గురువు శరణు పొందాలి:** బాబా తన శరీరాన్ని పరుల హితం కొరకు సార్థకము చేసుకున్నారు. పరమార్థాన్ని సాధించ దలచినవారు, కఠినంగా అభ్యాసం చేయాలని తెలియపరిచాడు. ప్రేమ భరితం, ఆనంద భరితమైన కథను బాబా స్వయంగా వర్ణించి చెప్పాడు. పావన గంగామాతను దర్శిస్తే పాపాలు నశిస్తాయి. చంద్ర దర్శనంతో తాపం నశిస్తుంది. కాని సాయి మాటలు పాప తాపాలు రెండింటిని నిర్మూలనం చేస్తాయి. మనం వేదాలు, వేదాంగాలు, శ్రుతులు, పురాణాలు ఇతర ఆధ్యాత్మిక శాస్త్రాలు ఎన్నైనా అధ్యయనం చేయవచ్చు కాని గురు అనుగ్రహము లేనిది మనకు ఆత్మజ్ఞానం కలుగదు. వైరాగ్యమను పదునైన కత్తితో బలమైన వ్రేళ్ళను నరికినచో జ్యోతి స్వభావాన్ని తెలుసుకోగలరు. జన్మరాహిత్యము పొందగలరు. విరక్తులు ఈ బ్రహ్మ కోసమే పరిశ్రమిస్తారు. ముక్తి కాంక్షించే సాధకులు తాము కోరుకున్న సత్పురుషుల శరణు పొందాలి. కుతర్కాలు మాని వారు బోధించినది వినాలి. ఎవరెంత పండితుడైనప్పటికి, వేదములు చదివినప్పటికి తన గమ్యస్థానంకు సురక్షితముగా పోలేడు. మార్గదర్శి వుండి సహాయపడి సరియైన దారి చూపినచో, మార్గము లోని గోతులను, అడవి మృగములను తప్పించుకొని సుగమముగా పయనించెదరు. ఆత్మాభిమానమును క్రిందకు తొక్కినప్పుడే ఒడ్డుకు చేరగలడు. బాబా తన అనుభవమును స్వయముగా చెప్పిన మధుర కథ మిక్కిలి విచిత్రమైనది.

**భగవంతునికై ఆన్వేషణ :** మేము నలుగురం పురాణాలు, శాస్త్రాలు చదువుకున్నాం. మేము జ్ఞానవంతులమనుకున్నాం. నలుగురు పండితులం భగవంతుని స్వబుద్ధితో తెలుసుకోవాలని పరిశోధనకై బయలుదేరాం. అడవిలో విహరిస్తుంటే దారిలో ఒక వంజరి (బంజారా) మమ్ములను కలిసి 'ఎట్టిటి ఎండలో ఈ కీకారణ్యంలో ఎందుకు ఎక్కడికి వెళ్ళుతున్నారు? నాతో చెప్పండి?' అని అన్నాడు. అతని మనస్సు కరిగి, 'దుర్గమమైన ఈ అడివిలో దారి తెలయకుండా స్వేఛ్ఛా భావాలతో తిరగకండి. ఒక మార్గదర్శిని వెంట తీసుకొని వెళ్ళండి. అనవసరంగా ఈ ఎండలో ప్రయాస పడుతారెందుకు? మీ రహస్యాన్వేషణ నాతో చెప్పక పోయినా పర్వాలేదు. కూర్చుని కొంత రొట్టె తిని నీరు త్రాగి వెళ్ళండి..' అని ఎంతో దయతో చెప్పినా కాదని ముందుకు సాగి పోయాం. ఆ అడవులు పెద్దవి, మేము దారి తప్పి చాలసేపు అటు యిటు తిరిగి తిరిగి, అదృష్టవశాత్తు ఎక్కడి నుండి బయలు దేరామో అక్కడికే తిరిగి వచ్చాం. ఆ బంజారా మాకు తిరిగి కలిసి, మళ్ళీ యిలా అన్నాడు, 'చిన్న పనైనా పెద్దపనైనా తెలియ పరిచే వాళ్ళుండాలి. పరగడుపున ఏ పరిశోధన ఫలించదు. పరగడుపున (ఉత్తికడుపుతో) ఏ పరిశోధన ఫలించదు. మధ్యలో మీ బుద్ధి చాతుర్యము పనిచేయదు కదా! ఈశ్వరుని కృప ఉంటే తప్ప మార్గములో ఎవ్వరూ కలువరు. వడ్డించిన పళ్ళెమును తిరస్కరించకండి. అన్నాన్ని తోసిపుచ్చ కండి. అన్నం పెట్టి తినమని ఎవ్వరు అంటారో వారి వచనం పూర్ణ శుభ శకునమని, తలపెట్టిన కార్యము నిర్విఘ్నంగా జరుగుతుందని తలచి, అల్పాహారాన్ని తీసుకొనండి. ధైర్యం వహించండి.' అని చెప్పాడు. బంజారా చూపించిన అసామాన్య ప్రేమకు లొంగి పోయి అతను పెట్టిన భోజనమును తిని నీళ్ళు త్రాగాను. విచిత్రంగా అనుకోకుండా అక్కడ గురువుగారు నాకు ప్రత్యక్షమైనాడు. స్వార్థం లేకుండా ఇతరులను ప్రేమించేవారు నిజంగా పరమ జ్ఞానులే కదా!

**బాబా గురువు గారు బాబాను పరీక్షించుట :** బాబా గురువుగారు బాబాతో 'నీవు నాతో వచ్చుటకు యిష్టపడెదవా! నీకు కావలసినది నేను చూపెదను. నాపై నమ్మకము ఉన్న వారికే ఫలితము దక్కును.' అని అన్నారు. నేను సరేనన్నాను. గురువు గారు నన్ను ఒక బావి వద్దకు తీసుకొని వెళ్ళి రెండు కాళ్ళకు తాడు కట్టి తల క్రిందులుగా నీటికి **3** అడుగుల పైన బావిలో వ్రేలాడదీసి ఎక్కడికో వెళ్ళిపోయారు. నా చేతులకు నీరందదు. దాహం వేసినా నాకు నీరు లభించదు. దాహం తీసుకోలేని పరిస్థితి గురువుగారు **4, 5** గంటల తర్వాత వచ్చి నన్ను బయటికి లాగి క్షేమంగా వున్నావా అని అడిగారు. 'అత్యంత సుఖాన్ని, ఆనందాన్ని అనుభవించాను. నేను పామరుడిని ఆ సుఖాన్ని ఎలా వర్ణించను.'అని నేను అన్నాను. నా మాటలు విని గురువు గారు సంతోషించి తమ హస్తాలతో నా వళ్ళు నిమిరి నన్ను తన గురుకులం వద్ద వుంచుకున్నారు. పక్షులు తమ పిల్లలను చూసుకొను రీతిగా నన్ను చాలా ప్రేమతో చూసేవారు. అది తలచుకుంటే మనస్సు ఉప్పొంగుతుంది. వారి బోధనా పద్ధతి చాలా మధురమైనది. నా తల్లిదండ్రుల పైని అభిమానం కూడా మరిచి పోయాను. నా నుండి మోహ, మమకారాలు వీడి పోయాయి. నేను అవలీలగా ముక్తిని పొందాను. నాకు గురువు గారి మెడను కౌగలించుకొని, వారిని తదేక దృష్టితో ఎల్లప్పుడు వారిని చూచుచుండవలెననిపించింది. వారి ప్రతిబింబం నాకళ్ళల్లో లేకపోతె నాకళ్ళు లేకుంటేనే నయమనిపించింది. నా ఇల్లు, వాకిలి, తల్లి, తండ్రి, సర్వస్వం నాకు గురువే నా యింద్రియములన్నియు తమ తమ స్థానాలను విడిచి నా కండ్ల యందు కేంద్రీకృతమయ్యెను. నా దృష్టి గురువు యందు కేంద్రీ కృతమయ్యెను. నా ధ్యానమంతయు గురువు యందే నిలిపితిని.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 33

(విభూతి మహిమ -1)

**విభూతి ప్రసాదము :** సాయి బాబా ఇవ్వవలిసిన వారి నుండి దక్షిణ అడిగి తీసుకొని దీనులకు దాన ధర్మములు చేసే వాడు. మిగిలిన డబ్బుతో కట్టెలు కొని ఒక చోట పోసి వుంచేవాడు. వాటిని ధునిలో వేసే వాడు. ఆ విభూతిని భక్తులకు యిచ్చేవాడు. భక్తులు యింటికి వెళ్ళుటకు అనుమతి నిచ్చునప్పుడు, ఆశీర్వదించి, విభూతినివ్వటం బాబా అలవాటు. విభూతి పట్టుకొని రండి అని బాబా అంటే ఆయన అనుమతి అయిందని భక్తులు తలచే వారు. బాబా ఎప్పుడైనా విభూతి యివ్వకుండా వుండే వారు కాదు. అసలు విభూతి ధర్మమేమిటి? నిర్విరామంగా ధుని ఎందుకు? విభూతి ద్వారా బాబా సూచించేది ఏమిటి? ప్రపంచంలో కనిపించు వస్తువు లన్నింటికి అంత్య స్వరూపము బూడిదనే అని నిశ్చయంగా తెలుసుకోవాలి. మన ఈ శరీరము భోగ భాగ్యాలు అన్ని అనుభవించిన తర్వాత పతనమై పోయి బూడిదగా మారి పోవును. మనందరి స్థితి యిదేనని గుర్తుండేలా బాబా విభూతిని యిచ్చేవాడు. ఈ జగత్తు అశాశ్వతమని, బంధువులు కొడుకులు, తల్లి, తండ్రి కాని మనవారు కారని బాబా బోధించెను. మనం వంటరిగా వచ్చితిమి. వంటరిగానే పోయెదము. విభూతి దీనిని గుర్తుకు తెస్తుంది. విభూతి రాసుకుంటే వ్యాధులు నశించి పోతాయి. విభూతి మానసిక రోగములను బాగు చేయును. బాబా దక్షిణ మరియు విభూతి ద్వారా క్రమంగా వైరాగ్య లక్షణాలను తెలుసుకునేలా చేసేవాడు.

**నారాయణ మోతీరాం జాని తేలుకాటు వైద్యం :** నారాయణ మోతిరాం జాని ఒక బ్రాహ్మణుడు. అతను నాసిక్ నివాసి. బాబా భక్తుడైన రామచంద్ర వామన మోడక్ దగ్గర ఉద్యోగము చేయుచుండెను. అతను కూడా బాబా భక్తుడు. అతను తల్లిని తీసుకొని షిరిడి బాబా దర్శనానికి వెళ్ళగా బాబా, అతని తల్లితో ఆమె కొడుకు

స్వంత వ్యాపారము పెట్టుకోవాలని సూచించాడు. కొన్నిరోజుల తర్వాత బాబా మాట నిజమైంది. నారాయణ జాని ఉద్యోగము మాని స్వతంత్రంగా 'ఆనందాశ్రమము' అనే ఒక హోటలు పెట్టాడు. అది బాగుగా అభివృద్ధి చెందినది.. సాయి పాదముల యందు నిష్ఠపెరిగి భక్తిగా మారింది. సాయి చరణ సన్నిధి అత్యంత ప్రియమైంది. సాయి చరణాలపై ప్రేమ అధికమైంది. ఒకనాడు నారాయణ జాని మిత్రునికి తేలు కుట్టి చాలా బాధ పడసాగాడు. నారాయణ తేలుకుట్టిన చోట విభూతి పెట్టినచో బాగుగా పని చేయునని అనిపించింది. కాని విభూతి కనిపించలేదు. మిత్రుడి బాధ చూడలేక బాబా పటం వద్దకు వెళ్లి, ఆ ఫోటో వద్ద గల అగరు వత్తుల నుండి రాలిన ఊదీని తీసుకొని, దానిని బాబా విభూతిగా భావించి, సాయి నామాన్ని జపిస్తూ, తేలు కుట్టిన చోట అద్దాడు. విభూతి రాయగానె మిత్రుని బాధ పూర్తిగా తగ్గి పోయింది.

**విభూతితో ప్లేగు వ్యాధి తగ్గుట :** ఒకసారి బాంద్రాలో వున్న ఒక భక్తుని కుమార్తె ప్లేగు వ్యాధితో బాధపడుచుండెను. అతను బాబాను పూర్తిగా నమ్ము చుండెను. అతని వద్ద విభూతి లేదు. నానా సాహెబ్ చందోర్కర్ వద్దకు విభూతికై కబురు పంపాడు. ఆ సమయంలో నానాసాహెబ్ కళ్యాణ్‌కు వెడుతున్నాడు. అతనికి నానా థానా పట్టణంలో రైల్వే స్టేషన్‌లో కలిసాడు. అప్పుడు అతని వద్ద కూడా విభూతి లేకుండెను. అప్పుడు నానా రోడ్డు మీది నుండి మన్ను తీసి అక్కడే నిలబడి, సాయి బాబాను ప్రార్థించి వెనుకకు తిరిగి తన భార్యకు బొట్టు పెట్టాడు. ఆ సమయము నుండి భక్తుని కుమార్తె ప్లేగు వ్యాధి, జ్వరం పూర్తిగా తగ్గిపోయింది.

**జామ్నేర్ చమత్కారము:** నానా సాహెబ్ చందోర్కర్ **1904-05** లో మామల్తదారుగా వుండెను. నానా కూతురు మైనతాయి ప్రసవించు టకు సిద్ధంగా వుండెను. ఆమె సహించరాని ప్రసవవేదనను అనుభవించు చుండెను. బాబాకు అతనికి విభూతి పంపాలని అనిపించింది. అంతలో గోసాయి రాంగిరి బువాకు మనస్సులో తన వూరు ఖాందేష్ వెళ్ళాలని

బాబా అనుమతి తీసుకోవడానికి బాబా వద్దకు వచ్చాడు. రాంగిర్ బువాను బాబా చందోర్కర్ వూరికి వెళ్ళి ఆరతి పాట మరియు విభూతిని ఇవ్వమని. అంతా బాగా జరుగును భయపడకుమని చెప్పమని పంపాడు. బాబా ఆజ్ఞానుసారం విభూతి ప్రసాదము తీసుకొని బువా బయలు దేరాడు. జలగాం స్టేషన్‌లో దిగగానే ఒక సిపాయి వచ్చి రాంగిరి బువాను టంగాలో తీసుకొని వెళ్ళి చందోర్కర్ ఇంటి వద్ద దింపి మాయమయ్యాడు. బువాను నానా లోనికి ఆహ్వానించాడు. బువా విభూతి మరియు హారతి పాటను నానాకు అందచేసి, బాబా తనను పంపించిన వార్తను చెప్పాడు. ఆ సమయములో అందరు మైనతాయి గురించి ఆందోళన పడుచుండిరి. నానా వెంటనే భార్యను పిలిచి విభూతిని యిచ్చి అమ్మాయికి త్రాగించమన్నాడు. అతను స్వయంగా హారతి పాటను పాడ నారంబించాడు. విభూతి నీరు త్రాగించిన వెంటనే అమ్మాయి సుఖంగా ప్రసవించి. అందరి చింత దూరమై పోయింది. మీరు పంపిన టాంగా అబ్బాయి కనిపించటం లేదు. ఎక్కడికి వెళ్ళడని నానా సాహెబ్‌ను రాంగిర్ అడిగాడు. నేను ఏ టాంగాను పంపించ లేదనిచెప్పాడు. నీవు ఇక్కడకు వస్తున్నట్లు నాకు తెలియదు. నానాకు అప్పుడు రాంగిర్ జరిగిన కథ అంతా చెప్పాడు. అది విని నానాకు ఎంతో ఆశ్చర్యము ఆనందము కలిగింది. 'అన్ని పాత్రలు నటించింది సాయియే'అని తలచి పరమానంద పడ్డారు. భక్తుల యొక్క భావాన్ని బట్టి కష్టాలలో పరుగెత్తుకు వస్తాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *నాపై మనస్సు ఉంచిన వారి యోగ క్షేమములు నేను చూసు కుంటాను. నా నామాన్ని ప్రేమతో ధ్యానము చేయు వారి కోరికలు తీర్చి ప్రేమను వృద్ధి పరుస్తాను.*

# అధ్యాయము 34

(విభూతి మహిమ - 2)

**డాక్టర్ గారి మేనల్లుని కథ :** నాసిక్ జిల్లాలోని మాలేగాంలో డాక్టర్ ముల్కీ గారి మేనల్లుడు ఎముకలో రాచకురుపుతో బాధపడుచుండెను. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. ఆపరేషన్ కూడా చేసారు. దేశములోని వివిధ పద్ధతులు మరియు విదేశాలలోని చికిత్సలు చేసినప్పటికి గుణం కనిపించలేదు. షిరిడిలో ఒక మహాత్ముడు వున్నాడని, అతను దర్శన మాత్రముచే వ్యాధిని నివారించగలడని తెలిసి ఆ బాలుని తల్లిదండ్రులు సాయి దర్శనానికి వెళ్లడానికి నిశ్చయించుకున్నారు. వారు షిరిడి వెళ్ళి సాయి పాదములకు నమస్కరించి, ఆ పిల్లవానిని బాబా ముందుంచారు. వారు దీనంగా ఆ పిల్లవాని బాధ గురించి విన్నవించారు. 'ఆ పిల్లవాని బాధ మేము చూడలేకున్నాము. ఏమిచేయాలో దిక్కు తోచకుండా వుంది మీ మహిమలు విని మీ శరణుజొచ్చాము. మీ అభయహస్తాన్ని వీనిపై వుంచి వీని బాధ నివారించండి. వీనికి ప్రాణ దానముచేయమని వేడుకొనుచున్నాం.'అని బాబాతో అన్నారు. అప్పుడు కరుణామూర్తి అయిన సాయి బాబా, 'ఈ మసీదు ను ఆశ్రయించిన వారికెప్పుడు కల్పాంతం వరకు దుర్గతి కలుగదు. ఈ విభూతి తీసుకొని పూయండి. నాలుగు అయిదు రోజులలో తగ్గిపోతుంది. భగవంతుని యందు విశ్వాసముంచండి. ఇది మసీదు కాదు ద్వారాపతి. ఇక్కడ అడుగు పెట్టిన వెంటనే ఆరోగ్యమును పొంది బాగుపడతారుఇక్కడకు వచ్చి బాగుపడకపోవడం త్రికాలములో వుండదు. ఈ మసీదు మెట్లు ఎక్కిన వారు తీరాన్ని చేరుకున్నట్లె' అని అన్నాడు. ఆ తర్వాత ఆ బాలుని తన వద్ద కూర్చోబెట్టుకొని ఆ వ్రణంపై ప్రేమతో నిమిరాడు. బాబా సుందర వదనాన్ని చూసి ఆ బాలుడు తన బాధను మరిచి పోయాడు. బాబా మాటలు విని పరమసుఖాన్ని అనుభవించాడు. నాలుగు రోజులు

అందరూ అక్కడే వున్నారు. ఆ బాలుని జబ్బు నయమైంది. తదనంతరము బాబా పూర్తి అనుమతితో సంతోషంగా వారి గ్రామానికి వెళ్ళి పోయారు.

**డాక్టర్ పిళ్ళే నారు పుండుకు చికిత్స :** డాక్టరు పిళ్ళే బాబా ప్రియ భక్తులలో ఒక్కరు. ఒకసారి డాక్టరు పిళ్ళేకు గినియా పురుగుల నారుపుండు లేచింది. చాలా బాధ పడసాగాడు. దుర్భరమైన కురుపులబాధ సహించలేక దుఃఖించ సాగాడు. అతడు ఒకరోజు ఈ కురుపుల బాధ పడలేకుండా వున్నాను. గత జన్మలో చేసిన పాపం పోగొట్టుకొనుటకై నేను ఈ బాధ అనుభవించాలి. రాబోవు పది జన్మలకు ఈ బాధను పంచి పెట్టమని బాబాను వేడుకున్నాడు. 'అతడు ఎందుకు పది జన్మలవరకు బాధ పడవలెను పది రోజులలో గత జన్మ పాపము హరింప చేయగలను. అతనిని లేపి ఎవరి వీపుపైనైనను మోసుకొని రండి.' అని అన్నాడు. వెంటనే డాక్టరు పిళ్ళేను అట్టి స్థితిలో మసీదు కు మోసుకొని వచ్చారు. బాబా తన వెనుక నున్న తలగడను తీసి తమ కుడి ప్రక్కన ఫకీరు బాబా కూర్చునే చోట వేసి, 'దీనికి ఆనుకొని కూర్చో వ్యర్థమైన చింతలేవి పెట్టుకోకు. కాళ్ళు బాగా చాపుకో. నీకు విశ్రాంతిగా వుంటుంది. . బాబా 'ఇప్పుడు ఒక కాకి వస్తుంది. దానితో నీకు నయమవుతుంది.'అని చెప్పాడు. డాక్టరుగారు ఆ కాకి కొరకు ఎదురు చూస్తూ ఉన్నాడు. అంతలో మసీదు లో దీపాలు వెలిగించే అబ్దుల్ ' ప్రమిదలలో నూనె పోయటానికి పైకి ఎక్కి, చూడకుండా చాచుకొని కూర్చున్న పిళ్ళే కాళ్ళపై అడుగు వేసాడు. దానిపై అబ్దుల్ కాలు పడగానే అతని ప్రాణం పోయినంత పనైంది. గట్టిగా కేకలు పెట్టాడు. నారుకురుపు పగిలి పోయింది. పిళ్ళే చేతులు జోడించి బాధ పడుతూ బాబాతో 'దయామయా! నా దయనీయ స్థితి చూసి కరుణించు.!'అంటూ అర్థించడం మొదలు పెట్టాడు. అప్పుడు బాబా, 'బాపుకు బాగై పోయింది. పాట పాడుతున్నాడు చూడండి!'అని

అన్నాడు. 'నీ కాలుపై అడుగు వేసి పోయిందే ఆ కాకే నీ కాలు నారు కురుపును పొడిచి పోయింది. ఇక ఏ కాకీ రాదు. నీవు బాగు పడెదవు.'అని అన్నాడు. ఆ కురుపులనుండి ఏడు పురుగులు బయటికి వచ్చినవి. వేదన తగ్గి అతనికి దుఃఖం అంతమైంది. అబ్దుల్ రూపములో ప్రకటమై బాబా మాట ప్రకారము చేసింది ఆ కాకి. బాబా మాట బ్రహ్మ లిఖితము కర్మను కూడా నశింప చేస్తుంది. బాబా చమత్కారముతో పిళ్ళై ఆశ్చర్య పడి బాబా పాదాలను ఆలింగనము చేసుకున్నాడు.

**బొంబాయి స్త్రీ సుఖ ప్రసవము :** ఒక కాయస్త ప్రభు జాతికి చెందిన స్త్రీ బొంబాయి పట్టణములో వుంటూ వుండేది. ఆమె ప్రతి ప్రసవంలోను చాలా బాధ పడుచుండెను. అందువలన శ్రీరామ మారుతి అను సాయి భక్తుడు ప్రసూతికి షిరిడి తీసుకెళ్ళమని సలహా యిచ్చాడు. ఆమె భర్త ఆ స్త్రీని ప్రసవమునకు షిరిడిలో వుండాలని నిశ్చయించుకొని, షిరిడి తీసుకొని వచ్చాడు. అక్కడ కొన్ని మాసములు వున్నారు. సాయిపూజ, అర్చనలు, హారతి ఆ దంపతులకు ఆనందాన్ని కలిగించాయి. కొంత కాలమునకు ప్రసవ సమయము రానే వచ్చింది. గర్భద్వారము సరిగా లేక మళ్ళీ కష్టమైంది. వారు దిగులు చెందసాగారు. ఆ బాధకు ఏమి చేయవలెనో తోచలేదు. ఆమె బాబాతో కాపాడమని వేడుకొనసాగింది. వారు తప్ప కరుణించేవారెవరు! యిరుగు పొరుగు స్త్రీలు బాబాను ధ్యానించి, గ్లాసులో నీరు పోసి అందులో విభూతి వేసి, ఆ గర్భిణితో త్రాగించారు. ఐదు నిముషములు గడవకముందే సుఖ ప్రసవమైనది. కాని శిశువు గర్భములోనే మరణించాడు. కష్టము నిర్భయంగా గడిచిపోయినందుకు ఆమె కృతజ్ఞతతో బాబాకు వందనము చేసింది. బాబాను ఎల్లప్పుడు జ్ఞప్తియందుంచు కొనినది..

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 35

(విభూతి మహిమ - 3 , సంశయాల నివారణ)

**సాయిని నమ్మని వారు :** ఆధ్యాత్మిక విషయములో అహంకారము అన్నింటికన్న పెద్ద విఘ్నం. నేను నిరాకార బ్రహ్మను ఆరాధిస్తాను. దేవుడు నానా ఆకారములలో వుంటాడనేది ఒక భ్రమ అనియు, సాధువులకు నమస్కరించ నక్కరలేదనియు. బాబాకు కాని సాధువులకు కాని దక్షిణ యివ్వకూడ దనియు, ఎంతో మంది అనేక రకాలుగా వార్తలు చెప్పుకొనేవారు. అందరికి విశ్వాసము ఉండదు. షిరిడి వెళ్ళితే సాయి బాబా దక్షిణ అడుగుతాడని, అసలు గుడ్డిగా నమ్మటం మంచిది కాదు. ప్రత్యక్ష అనుభవం పొందిన తర్వాతనే ఏం చేయాలని నిర్ణయించుకోవాలి. నేను దక్షిణ యివ్వను. ధనాన్ని అడిగే సాధువును నేను సాధువుగా గౌరవించను. షిరిడి వెళ్ళి, ఆ సాధువును దర్శించుకుంటాను కాని పాదాభివందనము చేయను. అని మాట్లాడిన కుతర్కవాదులు, సాయి బాబాను దర్శించగానే వారి నిశ్చయాలను మరిచిపోయి, అందరికన్నా ముందే సాయి పాదములకు హత్తుకొని పోయారు. అహంకారం లేకపోతె ప్రాణం హాయిగా, ప్రశాంతంగా వుంటుంది. మనం తాబేలు పిల్లలం, కేవలం బాబా కృపాదృష్టి తోనే పోషింపబడుతున్నాం. వేరే అన్న పానీయాలు అనవసరం. మనకు ఎల్లప్పుడు సాయినాథుడే రక్ష. మన స్పర్శలోను, నాసికలోను, వాసన లోను, సాయియే నివసించి వున్నాడు. ఒక్క సాయిని సేవించితే సకల కర్మలూ నశించి పోతాయి. నైష్కర్మ స్థితి కలుగును.

**కాకా మహాజని స్నేహితుడు బాబాను పరీక్షించుట :** కాకా మహాజని స్నేహితుడు నిరాకార పరమాత్మను ఆరాధించే వాడు. కేవలం బాబాను పరీక్షించాలనే వుద్దేశంతో షిరిడి వెళ్ళాలని అనుకున్నాడు. కాకా మహాజని స్నేహితుడు రెండు షరతులపై షిరిడి రావడానికి ఒప్పుకున్నాడు. 'ఒకటి - నేను బాబాకు వంగి

నమస్కరించను, రెండు - దక్షిణ ఏమి యివ్వను. కేవలం దర్శనం చేసుకుంటాను అంతే.' అని అన్నాడు. ఉదయమే బాబా దర్శనానికి మసీదు కు వెళ్ళారు. వారు మెట్లు ఎక్కుతుండగా, బాబా వారిని 'రండి, రండి' అంటూ దూరము నుండే ఆహ్వానించాడు. ఆ కంఠధ్వని గతించిన తన తండ్రి కంఠము లాగే వుండెనని, అది విని ఆనందాశ్చర్యాలతో హృదయము ద్రవించింది. తన మనోనిశ్చయాన్ని మరిచి పోయి, బాబా పాదాలకు వందనం చేసాడు. తర్వాత బాబా కాకా మహాజనిని మాత్రమే దక్షిణ అడుగగా కాకా దక్షిణ యిచ్చాడు. వారు వసతికి వెళ్ళి, తర్వాత బొంబాయికి తిరిగి వెళ్ళడానికి వారి అనుమతిని కోరారు. మళ్ళీ బాబా కాకాను మాత్రము **17** రూపాయల దక్షిణ కోరాడు. కాకా దక్షిణ యిచ్చాడు. ఆ స్నేహితుడు బాధ పడుతూ కాకాతో, 'బాబా ఉదయం దక్షిణ నిన్నే అడిగాడు. మళ్ళీ యిప్పుడు కూడా నిన్నే అడుగుతున్నాడు. నేను నీ వెంటవున్నా నన్ను ఎందుకు వదలి వేశాడు?'అని అడిగాడు. కాకా బాబానే అడగమన్నాడు. అప్పుడు బాబానే,'అతనే మంటున్నాడు?'అని అడిగాడు. ఆ మిత్రుడు, 'స్వయంగా నన్ను దక్షిణ యివ్వమంటారా?'అని అడిగాడు. బాబా అతనితో, 'నీ మనస్సులో యివ్వాలని లేదు కదా? అందుకే నిన్ను అడుగ లేదు. నీ కిప్పుడు యివ్వాలని వుంటే యివ్వు.'అని అన్నాడు. ఆ స్నేహితుడు పదిహేడు రూపాయలు బాబా అడుగకుండానే యిచ్చాడు. తర్వాత బాబా స్నేహితునితో కూర్చొమ్మని, భేద భావాన్ని తొలగిస్తూ మధుర బోధ చేసాడు. వీరు వర్షములో తడిసి పోతారేమో అని శ్యామా అన్నాడు. 'వారికి మార్గ మధ్యములో వర్షము పట్టుకొనే భయమేమి లేదు. వారిని నిశ్చింతగా వెళ్ళనీ.' అని బాబా అన్నాడు.

**సేవాస్కర్ భార్య వంట పాత్రలో విభూతి మహిమ :** ఒక సారి బాలాజి సేవాస్కర్ శ్రాద్ధం నాడు వంటకాలన్నీ వండిన తర్వాత చూస్తే అంచనాలకు మించి మూడింతల మంది వచ్చారు. సేవాస్కర్

భార్య, కోడలు అవమానాలపాలు కావలసి వస్తుందేమోనని గాభరాపడి పోయారు. సేవాస్కర్ భార్య, 'సాయి సమర్థుడు మనకు తోడుండగా మనమెందుకు భయపడాలి!'అని ధైర్యం తెచ్చుకొని, ఒక పిడికెడు విభూతిని తెచ్చి, ప్రతివంట పాత్రలో పోసి మూసి వుంచింది. కోడలితో, 'యిక నిర్భయంగా పోయి వడ్డించు. ఎంత కావాలో తీసుకొని మళ్లీ పాత్రను మూసివుంచు. ఇదంతా సాయి యింటి అన్నం. ఇందులో ఒక్క మెతుకైనా మనది కాదు. చాలినా చాలకున్నా బాబాదే బాధ్యత. మనలను రక్షించుట సాయి భారము.'అని చెప్పింది. ఆ విధంగానే బంధువులందరూ భోజనం చేసి వెళ్ళినా వంటకాలు మిగిలి వున్నాయి. ఎవరు ఏ విధంగా భావిస్తే వారికి అలాగే అనుభవం కలుగిచే వాడు బాబా.

శ్రీ సాయి సచ్చరిత్ర ఎక్కడ పారాయణం చేసినా అక్కడే గోదావరి తీరం, షిరిడి క్షేత్రం, ద్వారకామాయి, అని సాయి నిశ్చయంగా పారాయణ చేసే వారి కష్టాలను తీరుస్తాడు. ఎక్కడ సాయి చరిత్ర పారాయణం జరుగుతుందో అక్కడ సాయి నివసిస్తాడు. మరియు ప్రసన్నులై పోతారు. ఆనందనిలయమైన సాయిని స్మరిస్తే, వారి నామాన్ని జపిస్తే చాలు. ఇతర జప తపాది సాధనాలు ధ్యాన ధారణ కష్టాలు పడనవసరం లేదు. మీరు సాయి బాబాకు వందనం చేయండి. బాబా పాదాలను స్మరిస్తూ విభూతిని ధారణ చేయండి. ఆ తర్వాత మీరు స్వయంగా విభూతి మహిమను అనుభవిస్తారు. కనీసం నా వినతి అమలు చేయండి. మీ మనోభీష్టాలు తీరుతాయి. ధర్మార్థ కామ మోక్షాలను పొంది కృతార్థులౌతారు. విభూతి సంపర్కముతో మహా పాపాలు, చిన్న పాపాలు నిర్మూలనమై మీరు నిర్మలమౌతారు. ఇక్కడ పూజ్య భావం ఉండాలి. కాని తర్కం పనికి రాదు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 36

(సాయి సర్వ వ్యాపకత , ఆశీర్వచన ఫలం)

**సాయి కథ పారాయణం శ్రవణానందం :** సాయి కథలు అనంతానంద పానీయములాంటిది. దీనిని త్రాగుతుంటే తృష్ణ పెరుగుతుంది. సాయి కథా శ్రవణము ప్రపంచములో కష్టాలు పడేవారి బాధలు నివారించి సుఖాన్ని కలుగచేస్తుంది. శ్రేయస్సును కోరుకునే సౌభాగ్యవంతులు సాయి కథలను శ్రవణం చేయాలి. సాధువుల అపార మహిమలను వర్ణించడం మన శక్యం కాదు. అటువంటప్పుడు తెలుసుకునే శక్తి వున్నదా అనేది కూడా సాయి కృపయే. సాయియే తన గుణగణాలను ఎవరి చేతనైన వ్రాయించు కొని శ్రవణం చేయిస్తారు. వారికి వూరు పేరు లేకున్నా తమ కాటాక్షముతో క్షణంలో నిరుపేదను మహారాజుగా మార్చగల అపార వైభవం కలవాడు. ఈ అవతార మూర్తి దూరంగా వుంటూనే అనేక సాక్షాత్కారాలు కలుగిస్తారు. వారు ఎవరిని కరుణిస్తే వారికి తమ వివిధ రూపాలను, సంఘటనలను చూపుతారు. వారిని ఎవరు అర్థం చేసుకొని ధ్యానిస్తారో, ప్రేమతో భజిస్తారో వారికి ఏ లోటు వుండకుండ కాపాడుతాడు. వారికి తన కథల యందు మక్కువ ఎక్కువ. అందు వలన వాటిని గుర్తుచేసి భక్తుల మనోరథం నెరవేరుస్తారు. ప్రపంచాన్ని వదలి పరమార్థ చింతన మునిగిన అనేకులను వారు ఉద్ధరించెదరు. దేశీయులు, విదేశీయులు కూడా వారిని భజిస్తారు. ఆరాధిస్తారు. వారి యొక్క గురు భక్తి ధ్వజమెప్పుడు ఎగురుతూనేవుంటుంది. సాయి దీనులను బలహీనులను కూడా శ్రద్ధగా చూస్తూ అందరి కోరికలను తీర్చును. సాయి చరిత్ర చెప్పినవారి వాక్కు విన్నవారి శ్రవణాలు పావనమౌతాయి.

**మహల్సాపతి - హంసరాజు :** సదా సాయి పాదాల చెంత వున్న మహల్సాపతి సాయికి అనన్య భక్తుడు. ఎన్ని కష్టాలలో వున్నా అతనిని బాబా డబ్బు కూడబెట్టనిచ్చేవాడు కాదు. సాయి ఎన్నో సార్లు

భక్తులు యిచ్చిన ధనాన్ని దానం చేసేవాడు. కాని మహల్సాపతి ఎంత ఆపదలో వున్నా ఎప్పుడూ ఏమి ఇచ్చేవాడు కాదు. మహల్సాపతి దృఢమైన నిశ్చయం కలవాడు. సంపత్తి వున్నస్థితి నికృష్టమైనది. వైరాగ్యం వుత్కృష్టమైనది. పేదరికాన్ని చుట్టుకున్నవారు అల్ప సంతోషులై వుంటారు. ఒకసారి ఒక దయగల వ్యాపారి హంసరాజు, మహల్సాపతి పేదరికాన్ని చూసి హృదయం ద్రవించి అతనికి సహాయపడాలని ఏమైనా యివ్వాలని అనుకున్నాడు. ఎవరైనా మహల్సాపతికి డబ్బు ఇచ్చినచో బాబాకు ఇష్టముండేది కాదు. ఆ వ్యాపారి బాబా సమక్షంలో మహల్సాపతి చేతికి డబ్బు ఇచ్చాడు. కాని మహల్సాపతి, 'సాయి ఆజ్ఞ లేనిదే నేను దానిని స్వీకరించను.' అని వినయంగా నిరాకరించాడు. మహల్సాపతి ధనాన్ని ఆశించే భక్తుడు కాదు. పరమార్థాన్ని కోరుకునే భక్తుడు. కాయా, వాచా సాయి పాదాల చెంత వుండే భక్తుడు. నిస్వార్థి. ఆ వ్యాపారి హంసరాజు బాబాతో, 'మహల్సాపతిని ఎందుకు డబ్బు ముట్ట నివ్వరు?' అని అడిగాడు. బాబా అతనితో, 'నా భక్తులను ద్రవ్యలోభ ప్రలోభంలో పొరపాటున కూడా పడనీయను.'అని సమాధానమిచ్చాడు.

బాబా ఎవరెవరితో మాట్లాడుతూ కూర్చుంటాడో, ఎవరెవరితో భోంచేస్తారో, శయనించారో, ఎవరివెంట నడిచాడో ఎవ్వరిని కోప గించాడో వారందరు భాగ్యవంతులలో శ్రేష్ఠులు. సాయిని ధ్యానించండి. స్మరించండి. మననం చేయండి. అనవసరంగా ఎక్కడెక్కడికో పరుగులు తీయకండి. తన నాభిలోనే కస్తూరిని వుంచుకొని కస్తూరి మృగం ఎక్కడికో పరుగెత్తినట్లు, భ్రమలో తిరగకండి. సుఖాన్నిచ్చే పాదాలకు హత్తుకొని పొండి.

**ఔరంగబాడ్కర్ భార్యకు పుత్ర ప్రాప్తి :** షోలాపూర్ నగరంలో నివసించే సఖారాం ఔరంగబాడ్కర్ భార్యకు **27** సం.లు వచ్చినప్పటికి సంతానం లేకుండెను. ఆమె ఎంతో మంది దేవతలకు మొక్కుకున్నది. అయినా లాభం లేకుండెను. ఆమె సాయి బాబా మహిమలను విని పుత్ర

సంతానం కొరకు సాయి బాబా దర్శనానికి షిరిడి వెళ్ళింది. బాబా ఎప్పుడూ భక్తుల మధ్యనే వుంటారు. ఎప్పుడు తన బాధ చెప్పుకుందామా అని సంకోచపడుతూ కూర్చుంది. ఆమె బాబాకు రెండు నెలలు సేవ చేసారు. ఆమె ఒకరోజు మాధవరావుతో తన బాధను చెప్పుకున్నది. ఎవరూ లేని సమయము లో తన మొర బాబాకు విన్నవించమని కోరుకున్నది. మాధవరావు అదేసరైన సమయమని తలచి ఆమెను రమ్మని సైగ చేసాడు. ఆ స్త్రీ వెంటనే వచ్చి బాబా ముందు వినయంగా పాదాభివందనము చేసి, కొబ్బరి కాయ, అగరు వత్తులు అర్పించింది. బాబా ఆ కొబ్బరికాయను తీసుకొని చేత్తో వూపుతూ వుంటే లోన చప్పుడు వచ్చుచుండెను. 'శ్యామా! ఇదేమంటుంది. బాగా గలగలాడు తుంది కదా!' అని అన్నాడు. అదే బాబాయిచ్చిన అవకాశంగా భావించి, బాబాతో,' ఆ స్త్రీ తన కడుపులో అలాగే గలగల లాడాలని మనస్సులో అను కుంటుంది. అట్లే జరిగి ఆమె సమస్య తీరిపోనీ ఆమెను కరుణించి ఆమె వడిలో ఒక కొబ్బరి కాయను వేయండి. మీ ఆశీర్వాదముంటే ఆమెకు సంతానం కలుగు తుంది'అని ప్రార్థించాడు. 'కొబ్బరికాయను పగల కొట్టు.' అని అన్నాడు బాబా. 'కాదు దానిని ఆశీర్వాదముతో ప్రసాద రూపంగా ఆమె వడిలో వేయి' అని అంటాడు శ్యామా. ఇద్దరూ వాదించుకొని చివరకు బాబాయే రాజీపడి 'సరేలే ఆమెకు సంతానం కలుగుతుంది.' అని అన్నాడు. ఆ స్త్రీ ధైర్యంగా బాబా పాదాలకు సాష్టాంగపడి బాబా వద్ద శెలవు తీసుకొని వెళ్ళి పోయింది. బాబా ఆశీర్వాదం ప్రకారం మూడు నెలలు కాగానే గర్భం దాల్చింది. ఆమె భాగ్యంపండి పుత్రుడిని ప్రసవించింది. ఐదు నెలల పిల్లవాణ్ణి తీసుకొని ఆ భార్యా భర్తలు బాబా దర్శనానికి వచ్చారు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 37

(చావడి వర్ణనము)

**భూలోకం స్వర్గ లోకం :** బాబా అద్భుత లీలలు ఒక దానిని మించి మరొక్కటి వుంటాయి. వాటి కారణాన్ని పరిశోధించాలని చాలా మంది ప్రయత్నం చేసి విఫలమైనారు. అనేకులు స్వర్గసుఖాలను వాని మహిమలను వర్ణించి దాని అర్థంపై విభేదాలు వచ్చి పోట్లాడుకుంటారు. భూలోకం తుచ్ఛం మరణభీతి కలదని అంటారు. అధర్మం అజ్ఞానం, రాగం, ద్వేషం మొదలగు ఈ మృత్యుపాశాలను ఉల్లంఘించినచో స్వర్గలోకంలో ప్రవేశించ గలరు. స్వర్గం అంటే వేరే ఎక్కడో లేదు. వైరాగ్యమే స్వర్గం. ఆత్మ స్వరూపాన్ని దుఃఖములేని మనస్సుతో చూడడమే స్వర్గం. చింతలు రోగాది కారణాలు, వ్యాధి బాధలు లేక, ఆకలి దప్పులు, వ్యాకులతలు లేక, ఎవరికి జరామరణ భయాలు లేక, జీవులు నిర్భయులై స్వేచ్ఛగా విహరించుటయే స్వర్గ స్థితి. పరబ్రహ్మ నాకంటే వేరు నేను పరబ్రహ్మను కాను అను భేదభావము కలవారు మరణాధీనులు. జన్మ వెనుక మరణం, మరణం వెనుక మళ్ళీ పునర్జన్మ వారిని వెన్నంటి వుంటుంది. దుష్కరమైన తపస్సు, యజ్ఞాలు, దానాలు. చేసి సంపాదించిన స్వర్గము కేవలము విషయ భోగాలకు స్థానం! విషయ లోలురకు స్వర్గమైనా నరకమైనా భేదం లేదు. ఇంద్రుడైనా గాడిదైనా ఒక్కటే! ఇంద్రుడు నందన వనంలో అనుభవించే సుఖం గాడిద చెత్తకుప్పలో పొర్లాడే సుఖం ఒక్కటే. రెండింటిలో తేడా ఏమి లేదు. ఇక్కడ సర్వం ఈశ్వరార్పణం. బుద్ధితో కర్మ చేస్తే నిర్భయస్థానాన్ని పొందుతారు.

**చావడి ఉత్సవము:** క్రీ.శ. **1909** సం. డిసెంబర్ **10**వ తేది నుండి చావడి యందు సాయి పూజలు మొదలయ్యాయి. బాబా ఒకనాడు మసీదులో, రెండవ నాడు చావడిలో నిదురించే వాడు. బాబా చావడిలో నిదురించే రోజు రాత్రి భక్తులు, భజన మండలి రెండు గంటల సేపు

భజన చేసేవారు. బాబా ప్రక్కగా మండుతున్న కఱ్ఱపుల్లలను తన కుడి కాలి బొటన వ్రేలితో జరిపి, వాటిని కుడి చేతితో ధునిలో వేసి ప్రజ్వలనం చేసే వాడు. అలా వెలిగించిన తర్వాతనే చావడికి బయలు దేరేవాడు. బయలు దేరే ముందు వెలుగుతున్న దీపాన్ని కుడి చేతితో ఆర్పేవాడు. అప్పుడు వాయిద్యాలు మ్రోగేవి. దివిటీలు, టపాకాయలు ప్రకాశ వంతంగా వెలిగేవి. అనేకరకాలైన వాయిద్యాలతో సాయి నామాన్ని పాడుతూ స్త్రీ పురుషులు భజన చేస్తూ నృత్యం చేస్తూ ముందు నడిచేవారు. మసీదు నుండి లేచి బాబా మెట్ల వరకు రాగానే భక్తులు జయ జయధ్వానాలు చేసే వారు. పతాకాన్ని పట్టుకొని ఒకరు ముందు నడిచేవారు. బాబా కిరు వైపుల వింజామరలు వీచేవారు. భక్తులు తమ ఉత్తరీయములను పరిచి వాటిపై బాబాతో నడిపించేవారు. తాత్యా బాబా యొక్క ఎడమ చేతిని, మహల్సాపతి కుడి చేతిని పట్టుకునేవారు. బాపూసాహెబ్ జోగ్ ఛత్రాన్ని పట్టుకునేవాడు. ఊరేగింపుకు ముందు శ్యామకర్ణి నడిచేది. అది రాగిరంగులో వుండేది. దానిని అందంగా ముస్తాబు చేసేవారు. దాని కాళ్ళకు మువ్వలు కట్టేవారు. అది నడుస్తూ వుంటే అవి గలగల శబ్దము చేసేవి. వెండి బెత్తాలవారు ముందు నడిచేవారు. జయ జయ ధ్వనులతో ఆకాశమంతా నిండి పోయేది. ఈ విధంగా ఆనందంతో ఉత్సాహంతో నడుస్తూ వుంటే భక్తులు ఆ కమనీయ దృశ్యం చూస్తూ వుండగా ఆ వూరేగింపు ముందుకు సాగేది. అప్పుడు బాబా ముఖం అరుణకాంతిలా వెలిగిపోతూ వుండేది! నానాసాహెబ్ నిమోంకర్ బాబా తలపై తెల్లటి ఛత్రాన్ని పట్టుకొనేవాడు. ఆ ముఖం చూడవలసినదే! బాబా భక్తులు, గ్రామస్థులు బాబా రక్తవర్ణ ముఖాన్ని దర్శనం చేసుకొనడానికి వచ్చేవారు. భక్తులు చావడికప్పుకు శుభ్రమైన వస్త్రాన్ని కట్టి, ప్రకాశవంతమైన అద్దములతో రకరకాల వస్తువులతోను దేదీప్యమాన దీపాలతోను చావడిని అలంకరించి ఉంచేవారు. అప్పుడు తాత్యా బాబాను పట్టుకొని ఆసనంపై కూర్చోబెట్టేవారు. వారి వెనుక ఆనుకోవడానికి ఒక తలగడను గోడకు వేసి దివ్యాంబరంలాంటి ఒక

అంగరకా తొడిగి, పూలమాల వేసి ముఖమునకు కస్తూరినామము, మధ్య బొట్టుపెట్టి, హారతినిచ్చేవారు. ఒక్కోసారి భక్తులు కిరీటాన్నిపెట్టి వారి సౌందర్యము చూసేవారు. ఒక్కోసారి భక్తులు రత్నాలు మాణిక్యాలు కలిపి చుట్టిన తెల్లటి ముత్యాల హారాన్ని బాబా కంఠంలో వేసేవారు. వైష్ణవులు పెట్టుకునే నామంలాగ పెట్టేవారు. కిరీటం వారి తలకు తగిలినచో విసరి పారవేయునేమోనని, వారికి తెలియకుండా పెట్టి తీసేవారు. ఆ భయంతో పాటు బాబా ధరించాలన్న కోరిక, ప్రేమ భక్తులకు తీవ్రంగా వుండేది. వారి ప్రేమ భక్తి, శ్రద్ధ విశ్వాసాలు చూసి బాబా మౌనంగా భరించేవాడు. అది భక్తుల తృప్తికే. బాపూ సాహెబ్ ప్రేమతో సాయి చరణాలను కడిగి అర్ఘ్యపాద్యాలను అర్పించి, పూజ చేసేవాడు. చందనాన్ని వారి చేతులకు వ్రాసి తాంబూలం వారి చేతిలో వుంచేవాడు. తాత్యా మొదలగువారు నిలబడియే వుండేవారు. బాబా పాదాలకు నమస్కారంచేసి తలగడకు ఆనుకుని చిలుము తయారుచేసి తాత్యా చేతికి యిచ్చేవాడు. మొదట తాత్యా దానిని ఊది పొగాకు అంటుకోగానే దానిని బాబా చేతికి యిచ్చేవాడు. బాబా పీల్చిన తర్వాత మహల్సాపతికి యిచ్చేవాడు. ఈ విధంగా గుండ్రాకారంగా ఒకరి నుండి మరొకరికి మహల్సాపతి, శ్యామా, తాత్యా చేతులలో తిరుగుచుండెడిది. భక్తులు బాబాకు పూలమాలలను వేసి పూలగుత్తిని చేతికి యిచ్చేవారు. హారతి సమాప్తి అయిన తర్వాత ఒక్కొక్కరూ బాబాకు సాష్టాంగ నమస్కారములను సమర్పించి, బాబా ఆజ్ఞ తీసుకొని వారి వారి గృహములకు వెళ్ళేవారు. అందరూ వెళ్ళిపోయిన తర్వాత బాబా పడుకునేవాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *గురు చరణ తీర్థం సేవిస్తే మోక్షం సునాయాసంగా లభించును.*

# అధ్యాయము 38

(హండీ వర్ణనము)

**అన్నదానము :** ధర్మ శాస్త్రాలలో వచించిన సిద్ధ యోగములు యుగ భేదమును బట్టి వుంటాయి. అవి కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో జ్ఞానము, ద్వాపర యుగములో యజ్ఞము కలియుగంలో దానము. ఈ యుగంలో ఎల్లప్పుడు దానం చేయడం మంచిది. అన్ని దానములలో శ్రేష్ఠమైనది అన్నదానం. సమయా సమయాలలో అతిథులు వచ్చినప్పుడు వారికి అన్నదానంతో సుఖపెట్టడం గృహస్తుల ధర్మం. అన్నం లేకుండా పంపటం దుర్గతిని ఆహ్వానించినట్లే. బట్టలు, పాత్రలు, ధనము దానము చేయునప్పుడు ఆలోచించి యివ్వవలెను. కాని అన్నదానంలో ఆలోచించ వలసిన అవసరం లేదు. ఇంటి ముందుకు ఎవరు వచ్చినా అన్నం పెట్టకుండా పంపడం ధర్మంకాదు. తైత్తరీయోపనిషత్తు ప్రకారం. ఆహారం పరబ్రహ్మ స్వరూపం. ఆహారంనుండియే సమస్త జీవులు ఉద్భవించినవి. చచ్చిన పిమ్మట తిరిగి ఆహారములో ప్రవేశించును. బాబా కూడా లౌకికరీతిలో ఆచరించి అన్న సంతర్పణలు చేసేవాడు. డబ్బు మరియు ఇతర దానములు అన్నదానం లేకుండా సంపూర్ణం కాదు. పతకం లేని హారం వలె అవి శోభించవు. పుణ్యాలలో పుణ్యం అన్నదానం. భక్తి లేని భజన, ఉప్పులేని మజ్జిగ రుచించవు. అన్నదానం సమయంలో ముందుగా గుడ్డివాళ్ళకు కుంటివాళ్ళకు, చెవిటివాళ్ళకు, రోగులకు, దీనులకు, బలహీనులకు పెట్టిన తర్వాతనే ఆప్తులకు, మిత్రులకు, బంధువులకు పెట్టవలెను.

**బాబా యొక్క హండీ :** ఒకసారి బాబా వంట చేసే సమయంలో పొయ్యిపైన దేగిసను పెట్టి, దానిలో మాంసం వేసాడు. బియ్యం కడిగి దానిలోనే వేసాడు. పొయ్యి లోని కట్టెలు ఊదుతూ కూర్చున్నాడు బాబా వంట స్వయంగా చేసేవాడు. నాలుగిళ్ళు తిరిగి

రొట్టె ముక్కలను అడిగి మధూకరిని తెచ్చి పొట్ట నింపుకొనే వాడు. కాని అన్నదానం చేయడానికి తనే చేసేవాడు. వంట మాత్రమే కాదు కట్టెలు పెట్టే గది ముందు భాగం గోడను స్వహస్తాలతో తయారు చేసే వాడు. వంట పాత్రలో నుండి భయంకరంగా ఆవిరి వస్తూ కుత కుత ఉడుకు తున్నప్పుడు, బాబా చేతి కఫినీని పైకి జరుపుకొని తన చేత్తో క్రింది వరకు చేయి పోనిచ్చి అన్నం కలుపుతూ అద్భుతమైన లీలను చూపించే వాడు. భగ భగ మండుతున్న దేగిసలో తన చేయితో కలిపినా ఆచేయి ఏ మాత్రం కాలినట్లు కనిపించేది కాదు. వారి ముఖంలో కూడా భయ లక్షణాలు కనిపించేవి కావు. సాయి వండిన వంటను తినాలని ఎవరినీ బలవంత పెట్టలేదు. ఆ ప్రసాదాన్ని తినాలని ప్రేరణ కలిగిన వారే తినేవారు. వారికే బాబా ప్రసాదము పంచేవాడు. మరొక సంఘటనలో బాబాచేయి ధునిలో కాలుతుంది. అదికూడా బాబా లీలయే. ఆ సంఘటన ద్వారా తన భక్త పరాయణత్వము చూపించాడు. ఒక కుష్ఠురోగి (భాగోజి షిండే)కి బాబా సేవ చేసుకొనే అవకాశ మిచ్చాడు. బాబా సేవచేసి తన పాపప్రక్షాళణ చేసుకున్నాడు. భక్తుల సేవకు అలా అవకాశమిచ్చాడు. రామాయణంలో అగ్ని ప్రవేశం చేసిన సీత కాలక పోవడం మరియు మంటల్లో పడవేసినా ప్రహ్లాదుడు కాలక పోవడం కూడా అసత్యాలు కావని స్పష్టమవుతున్నది. అదొక విధమైన యోగశక్తి అగ్నిలోని దహన శక్తిని కూడా శక్తివిహీనం చేయగలదని తెలియు చున్నది. క్రీ.శ.**1910** తర్వాత భక్తులు అనేకరకములైన ఫలహారములను పరమాన్నం, చపాతీలు, బాబాకు నైవేద్యము పెట్టు చుండిరి. వాటిని అందరూ తినగా మిగులు చుండెను. అందుకే బాబా అన్నం వండడం ఆపివేసాడు.

**బాబా రొట్టెలు చేసి తన భక్తులకు వడ్డించేవాడు :** భక్తులందరిని దగ్గరికి పిలిచి, కూర్చోబెట్టుకొని వారికి కడుపు నిండా తినిపించేవాడు. చపాతీలను పరమాన్నాన్ని కలిపి ముద్ద చేసేవాడు. నెయ్యి వేసేవాడు. మరింత రుచిగా చేసేవాడు. ఆ రుచికర ఆహారాన్ని

బాబా స్వయంగా అందరికి పెట్టేవాడు. ఒకసారి పూరణ్ పోలీలను, ఒకసారి పూరీలను పంచదార పాకంలో ముంచి పెట్టేవాడు. మరొక్కసారి బాసుంది, సిరా, సంజోరి ఇచ్చేవాడు. మరోసారి బెల్లం, చపాతీలు పంచేవాడు. ఇలా రకరకాల వంటలు వడ్డించేవాడు. 'అంబే మోహర్' బియ్యం ఎంతో సువాసనలు కలవి. అన్నాన్ని రుచికరమైన వసర్‌తో కలిపేవాడు. నెయ్యి వేసేవాడు. రకరకాల కూరలు వడ్డించేవాడు. బాబా ప్రసాదములో ఊరగాయలుండేవి. అప్పడాలుండేవి. మజ్జిగ పెరుగుం డేది. భక్తులు తృప్తిగా తిని త్రేన్చేవారు. సంతృప్తిగా కడుపులు నిమురు కునేవారు. వారి నోట్లోకి వెళ్ళిన ప్రతి ముద్ద వారి ఆకలి బాధను తీర్చేది. పూర్తి తృప్తినిచ్చేది. బాబా ప్రేమతో వడ్డించే వాడు. పక్వాన్నం పై ప్రీతి వున్నవారికి అడిగి అడిగి వడ్డించేవాడు. అదెంతో పవిత్రంగా వుండేది. భక్తులు ముద్ద ముద్దకు సాయి నామాన్ని స్మరించేవారు. అందరూ సంతృప్తిగా భుజించేవారు. అయినా పాత్ర ఖాళీ అయ్యేది కాదు. ఎప్పుడూ పూర్ణంగా వుండేది. 'జీర్ సాల్' అనే బియ్యం కూడా సువాసన లు వెదజల్లేది. జాజిమొగ్గల్లా ఆ మెతుకులుండేవి. ఆ అన్నం పై బంగారం రంగులో, కందిపప్పు, వరమ్ పోసేవాడు. దానిపై గరిటెడు నెయ్యి కుమ్మరించే వాడు. ఆ అన్నాన్ని అందరికి పెట్టేవాడు. అన్నాన్ని వడ్డిస్తున్నప్పుడు సువాసనలు నలువైపులా వ్యాపించేవి. పచ్చళ్ళు వేసేవారు. భోజనం నోరూరించేది. ఎన్నోసార్లు ఎన్నో విధాలుగా అన్నదానం చేసేవాడు. అవి తలుచు కుంటేనే మనసంతా ఆనందమయ మౌతుంది. ఈ మాధుర్యానికి మూలం గురు పాదాలపై వున్న నిష్ఠ. శ్రద్ధయే కాని బెల్లం, చెక్కర మాత్రం కావు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 39

(గీతా శ్లోక వివరణ సమాధి మందిర నిర్మాణం )

**షిరిడి పవిత్రమైనది :** బాబా నిర్యాణ పర్యంతము నివసించిన ద్వారకామాయి భవనము ధన్యమయినది. బాబా ఎంతో దూరం నుండి వచ్చి షిరిడి ప్రజలను ఋణగ్రస్తులను చేసాడు. అట్టి షిరిడి ప్రజలు పుణ్యజీవులు. మొదట ఎంతో చిన్నదిగా వున్న షిరిడి గ్రామం సాయి బాబా పాదస్పర్శతో పావనమై చాలా గొప్ప యాత్రా స్థలమైనది. షిరిడిలోని స్త్రీలు కూడా ధన్యులు. వారు సాయి బాబాపై భక్తి శ్రద్ధలు కలవారు. వారు స్నానం చేస్తున్నా ధ్యానం చేస్తున్నా వంట చేస్తున్నా సాయి లీలలను గానం చేసేవారు. వారి పాటలు మనస్సుకు శాంతి చేకూర్చు చుండెడివి. ధూప్‌ఖేడ్ నుండి పెళ్లివారితో సాయి బాబా రావడం భక్తోద్ధరణే. చాంద్‌పాటిల్ నిమిత్తమాత్రుడు. ఈ అవతారం ధరించి బాబానే వచ్చారు. **18** ఏళ్ళ వయస్సు నుండి ఏకాంతంగా రాత్రింబగళ్ళు ఎక్కడో నిర్భయంగా వుంటూ సర్వం ఈశ్వరమయమని తలచేవాడు. పగటిపూట ఎక్కడనో తిరిగి రాత్రిపూట ఏదో పెంటకుప్పపై నిదురించేవాడు. అలాగే అనేక సంవత్సరములు గడచిన తర్వాత అక్కడే ఒక విశాల భవనము ఏర్పడి చివరకది సాయి యొక్క సమాధి మందిరమైంది. సాయిసమర్థులు భక్తజనోద్ధరణకై ఆభవనము నిర్మింపచేసాడు. భవ సాగరాన్ని దాటటం అందరికి అవసరం. దానికై శుద్ధాంతఃకరణం అవసరం. చిత్త శుద్ధి ముఖ్యసాధనం. దానికి మూలం భగవంతుని భజన, శ్రవణానికి సమానమైన భక్తి వేరే లేదు. శ్రవణం వలన సహజంగా గురు చరణాలపై భక్తి కలుగుతుంది. దానితో మనస్సు నిర్మలమౌతుంది. ఆ పరిశుద్ధ మనస్సుతో పరమార్థం లభిస్తుంది.

**చందోర్కర్‌కు గీతా శ్లోకార్థము చెప్పుట:** నానా సాహెబ్ చందోర్కర్ బాబాకు మంచి భక్తుడు. అతనికి వేదాంత పాండిత్యం వున్నది. తన పాండిత్యమునకు అతను గర్వపడుచుండెడివాడు. బాబాకు

సంస్కృతం తెలియదని అతని అభిప్రాయం. ఒకనాడు చందోర్కర్ మసీదు లో కూర్చుని బాబా కాళ్ళు పట్టుచూ ఒక భగవద్గీత లోని శ్లోకము గొణుగు చుండగా దాని అర్థము చెప్పమనెను. అప్పుడు చందోర్కర్ శ్లోకము చదివి అర్థము ఇలా చెప్పెను. కాని చందోర్కర్ గర్వమనచే విధంగా బాబా దాని పూర్తి అర్థము చెప్పాడు.

తద్విద్ధి ప్రణిపాతేన, పరి ప్రశ్నేన సేవయాం
ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానినః తత్వ దర్శినః

'గురు చరణాలకు సాష్టాంగపడి, గురుసేవకు జీవితాన్ని అంకితంచేసి, ఆదరంగా గురువును ప్రశ్నిస్తే, జ్ఞానులైన గురువులు జ్ఞానాన్ని ఉపదేశిస్తారు. అది దాని అర్థం. కృపామూర్తి అయిన కృష్ణభగవానుడు గురుసేవ, గురువుకు ప్రణతులు జ్ఞాన సంపాదనకు సాధనాలు అని చెప్పినారు. వీని వలన తత్వ జ్ఞానులు ప్రసన్నులై జ్ఞాన మార్గాన్ని చూపిస్తారు.' అజ్ఞానమును నశింప చేయుటయే జ్ఞానము. జ్ఞానము తెలియ చేసే విషయము కాదు. అది శబ్దాలకు అతీతమైనది. అగ్నిని బూడిద కప్పివేసినట్లు జ్ఞానం అజ్ఞానంతో ఆవృతమై వుంటుంది. అజ్ఞానం తొలగిస్తే స్వభావ సిద్ధంగా జ్ఞానం ప్రకాశించును. జ్ఞానం నిర్భేద్యం. స్వయం సిద్ధం. జ్ఞానం తెలుసుకొనే వస్తువుకాదు. అలాగే వుపదేశించగల విషయంకూడాకాదు. ఈ స్వ స్వరూపం యొక్క అజ్ఞానమే మాయ యొక్క జన్మస్థానం. గురుకృప ద్వారా మాయ తొలగి పోతే జ్ఞానం మిగులుతుంది. ఈ విశ్వం సత్యమను కోవటం భ్రమ. ఇదే జ్ఞానాన్ని ఆవరించుకొని వున్న చీకటి. మొదట దీనిని తొలగిస్తే జ్ఞాన బ్రహ్మ ప్రకటమౌతాడు. జ్ఞానం సాధించవలసిన సాధ్యంకాదు. అది మొదటి నుండి స్వయం సిద్ధంగా వున్నదే. జ్ఞానానికి విరోధి అజ్ఞానం.

## సమాధి మందిర నిర్మాణానికి బాబా అనుమతి :

మహాత్ముడైన సాయి బాబా శ్రీమంతుడైన బాపు సాహెబ్ మరియు బాబా భక్తుడైన బూటి ద్వారా సమాధి మందిరాన్ని నిర్మించుకొని తన శరీరాన్ని విశ్రమింప చేసాడు. బూటీ సాయిబాబాకు పరమ భక్తుడు.

అతడు క్రీ.శ. **1910** నుండి కుటుంబ సమేతంగా షిరిడిలో వుండి బాబాకు సేవ చేసాడు. బూటి ఒకరోజు దీక్షిత్ మేడ మీద నిద్రిస్తూ వుండగా. బాబా అతనికి ఒక స్వప్నంలో ఒక మందిరంతో సహా ఒక భవనాన్ని నిర్మించు అని ఆజ్ఞాపించాడు. అక్కడే ఇంకొకపక్క మాధవరావు నిద్రిస్తూ వుండగా అతనికి కూడా అదే విధంగా కల వచ్చింది. ఇద్దరికి ఒకేసారి ఒకే దృష్టాంతం కలుగటం వలన అతని మనస్సు లోని అనుమానాలు దూరమయ్యాయి. బూటి ఎంతో ఆనందంగా భవనం నిర్మించడానికి రూపురేఖలు నిశ్చయించుకున్నాడు. దీక్షిత్ దానిని ఆమోదించాడు. మందిరము కట్టడానికి బాబా అనుమతి కూడా తీసుకున్నారు. నిర్మాణం పని జరిగేటప్పుడు బూటి మనస్సులో ఒక గర్భగుడిని కూడా అదే భవనంలో నిర్మించి అందులో శ్రీకృష్ణుని స్థాపించాలని సంకల్పం కలిగింది. ఆ విషయము శ్యామా ద్వారా బాబాను అడుగగా, 'సరే! అలానే కానివ్వండి. మందిరము పూర్తయ్యాక ఇక్కడుండటానికి నేనే వస్తాను. దీనిని మనకోసమే వుపయో గించుకుందాం. ఒకరి నొకరం కౌగలించుకుందాం. సుఖంగా ఆనందాన్ని అనుభవిస్తాం.' అని అన్నాడు.. తర్వాత మురళీధరునికి గర్భగుడి తయారయింది. విగ్రహం తయ్యారు చేయడానికి కూడా ఒకరికి పని అప్పచెప్పారు. నిర్మాణం జరిగేటప్పుడు, బాబా లెండి వెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడు తలుపులు, కిటికీలు పెట్టడం అవలోకిస్తూ చూపుడు వేలితో చూపిస్తూ, 'ఇక్కడ తలుపు, ఇక్కడ కిటికి, ఇక్కడ గ్యాలరి ఉంటే అందంగా కనిపిస్తుంది' అని చెప్పేవాడు. బాబా యొక్క ఆజ్ఞప్రకారం సాయిబాబా యొక్క పవిత్ర శరీరాన్ని ఆ భవనంలో వుంచారు. ఆ భవనమే ఇప్పటి సమాధి మందిరము'

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 40

(ఉధ్యాపన కథా కథనము)

**శక్తి పాతం :** బాబా భక్తులకు నిస్వార్థము, పరమార్థాన్ని బోధించి కృతార్థులను చేసాడు. వారి హస్తం శిరస్సుపైన పడగానే వెంటనే'శక్తి పాతం' జరుగుతుంది. భేద బుద్ధి తొలగిపోయి, దుస్సాధ్యమైన పరమాత్మ తత్వం ప్రాప్తిస్తుంది. వారికి పూర్ణ శరణాగతులై సాగిలపడితే హృదయానికి హత్తుకుంటాడు. నదులు సాగరములో కలిసిన తర్వాత ఏకమై పోతాయి. అలాగే సాయి శరణు జొచ్చిన వారిని పరికించి తమతో సమానం చేసి తనలో ఐక్యం చేసుకుంటాడు. సాయి షిరిడిలో స్థిరంగా వున్నట్టు కనిపించినా అతను బ్రహ్మాండమంతా వ్యాపించి వున్నాడు. సాయి నాథుడు విసుఖ్ఖాయి వద్ద కూర్చుని వున్నప్పుడు హేమాద్ పంత్ ఆశ్చర్య పడ్డాడు. ఆ క్రియయే ఈ గ్రంథ రచనకు మూలం. వారి లీలలను వర్ణిస్తే సకల పాపాలు హరించుకపోతాయి. తన కథల కన్నా తన భక్తుల పుణ్యకథలను గానం చేస్తే హరికి ఎంతో సంతోషం. భక్తుల కళ్యాణం కొరకు బాబా ఈ రచనను ఆమోదించాడు. హేమాద్ పంత్‌కు ఈ రచన చేయాలని కోరిక కలిగింది. 'సాయియే ఆ బుద్ధి ప్రదాత. అందరి చిత్తాన్ని నడిపించేది వారే. వారి కథలను వారే చెబుతారు. సాయియే నిజ గ్రంథకర్త. నేను సాయిచేతిలో ఆడే కీలుబొమ్మను మాత్రమే.' అని హేమాద్ పంత్ అన్నారు.

**బి.వి దేవ్ గారింటికి వ్రతమునకు వెళ్ళుట :** బాబా ఎక్కడి నుండి పిలిచినా పరుగెత్తుకొని వస్తాడు. ఒక సారి బాబా సాహెబ్ దేవ్ తల్లి **25 30** వ్రతాలు చేసి వానిని ఉధ్యాపన చేయవలసి వచ్చింది. బ్రాహ్మణులను భోజనానికి ఆహ్వానించింది. జోగ్‌కు ఉత్తరం వ్రాసాడు. అందులో తన తరపున బాబాను రమ్మని ప్రార్థించమని కోరాడు. బాబా జోగ్‌తో 'దేవ్ శుద్ధ భక్తితో ఆహ్వానించాడు. మరొకరు ముగ్గురం కలిసి వస్తామని ఉత్తరం వ్రాయి.' అని బదులు వ్రాయమన్నాడు. ఉధ్యాపనకు

కొన్నాళ్ళ క్రితం బెంగాలీవలె దుస్తులు ధరించిన ఒక సన్యాసి గోశాల ప్రచారకుడు గోసంస్థ స్వయం సేవకుడు చందా వసూలు నిమిత్తం వచ్చాడు. అప్పుడు దేవ్‌ను ఆ సన్యాసికి పరిచయము చేసాడు. చందాలకై రెండు మూడు నెలల తర్వాత రమ్మాన్నాడు దేవ్ ఒక నెల తర్వాత ఆ సన్యాసి ఒక నెల తర్వాత మళ్ళీ వచ్చాడు. దేవ్ హడావిడి చూసి ఆ సన్యాసి, 'అయ్యా! నేను డబ్బు కొరకు రాలేదు. ఈ రోజు ఇక్కడ భోజనం చేయాలని వచ్చాను ఇంకా ఇద్దరు కుఱ్ఱాళ్ళు ఉన్నారని అనగా దేవ్ సంతోషంతో ఆహ్వానించాడు. వారు తృప్తిగా భోజనం చేసి. వెళ్ళిపోయారు. ఆహ్వానించకుండానే భోజన సమయానికి అతిథులు వచ్చి భోజనం చేసారని దేవ్ సంతోషించాడు. అతని మనస్సు మాయచే ఆవరించి వుండటం వలన అతడు బాబాయే అని తెలుసుకోలేక పోయాడు. ఆ రోజు భోజనాలకు ముందు ఒక సన్యాసి వస్తే అతను డబ్బు గురించి వచ్చాడని అనుమానించాడు. డబ్బుకొరకు కాదు భోజనానికని చెప్పి మరో యిద్దరిని తీసుకొని వెళ్ళి భోజనం చేసాము. ప్రాణ్ జాయే పర్ వచన్ నజాయే - నా ప్రాణం పోయినా నేను అన్న మాట తప్పను. నా నోటిమాట వ్యర్థం కాదు.' అని సాయి జోగ్‌తో చెప్పి ఉత్తరం వ్రాయమన్నాడు.సాయి చెప్పినదంతా దేవ్‌కు వుత్తరంలో వ్రాసాడు జోగ్.. దానిని చదువగానే దేవ్‌కు ఆనంద భాష్పాలు దొర్లాయి. అనవసరంగా బాబాను నిందించినందుకు పశ్చాత్తాప పడ్డాడు.

**హోళీ పండుగ భోజనము : 1917** వ సంవత్సరము ఫాల్గుణ శుద్ధ పూర్ణమి రోజు హేమాద్ పంత్ నిద్రిస్తుండగా ఒక స్వప్నం వచ్చింది. ఒక సన్యాసి మేలుకొలిపి తను ఈ రోజు భోజనానికి వస్తానని చెప్పాడు. ఎవరూ కనిపించలేదు. అతడు ఆనందించి తన భార్యతో, 'ఇవాళ హోళీ పండగ, బాబా కలలో కనిపించి వస్తానని చెప్పాడు. ఒక పావుసేరు బియ్యం ఎక్కువ వండుము' అని చెప్పాడు. యధావిధిగా భోజనానికి కూర్చున్నాడు. భోజన పంక్తి మధ్య ముగ్గులు గీసి ఒక పీట వేసి సాయి కొరకు పళ్ళెంలో అన్నం వడ్డించారు. పన్నెండవగానే

భోక్తలంతా  పీటల మీద కూర్చున్నారు. బాబాకు పీట వుంచిన స్థలం ఖాళీగా వుంది. ఎవరైనా వస్తారని ఎదురు చూసి గడియ వేసి కూర్చోవడానికి సిద్ధమయ్యేలోపల, అలీ అహమ్మద్ మౌలానా, వారి శిష్యుడు ఇష్మ ముజావర్ ఇద్దరూ నిలబడి వున్నారు. వారు హేమాద్ పంత్‌తో 'మీరు భోజనం వద్దనుండి లేచి వచ్చినట్లుగా వున్నది. ఈ వస్తువును తీసుకొండి.' అని ఒక ప్యాకెట్ హేమాద్ పంత్ చేతిలో పెట్టి వారు  వెళ్ళి పోయారు. రావు సాహెబ్ దభోల్కర్ ఆ ప్యాకెట్ విప్పి చూడగా అందులో సాయి బాబా ఫోటో వుంది. వారు ఆ ఫోటో చూసి అందరూ ఎంతో నిర్ఘాంతపోయారు. శరీరం పులకించింది. అతను బాబా పాదాలపై శిరస్సునుంచాడు. ఇదొక లీలగా తోచిందతనికి. సరిగా భోజన సమయానికి బాబా ఫోటో రూపంలో వచ్చినందుకు అతడు ఎంతో సంతోషించాడు. బాబా కొరకు కేటాయించిన స్థలంలో ఆ ఫోటోను పెట్టి, ఆర్ఘ్య పాద్యాది పూజలు చేసి ప్రేమతో నైవేద్యం సమర్పించాడు. తర్వాత అందరు భోజనానికి ఉపక్రమించారు. ఫోటో రూపంగా, అతిథిగా వచ్చి భోజనానికి కూర్చోవటం నిజంగా అద్భుతం. ఇలా జరిగిన సంఘటన అందరిని ఆశ్చర్యంలో ముంచి వేస్తుంది. బాబా పిలువకనే వచ్చి భక్తుల మనోగత సంకల్పాలను నెరవేరుస్తాడు. భక్తులను ఎలా జాగృతం చేస్తాడో ఆయనకే తెలుసు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *నా చరిత్రను, లీలలను గానం చేయు వారికి శాశ్వతమైన ఆనందమును ఇచ్చెదను.*
- *నన్నెవరు సర్వస్య శరణాగతి వేడెదరో వారికి సుఖ శాంతులు కలిగిస్తాను.*

# అధ్యాయము 41

(సాయి కృపానుగ్రహ దానము)

**సాయి కరుణామయుడు :** మంచికాని, చెడుకాని కేవలం శరీరంతో చేసే కర్మలతో శరీరం విడిపోదు. మనస్సు అంతర్ముఖ మవ్వాలి. గురువు చరణాలయందు ప్రేమ వుంటే, వారి యోగక్షేమాలు గురువు వహించి వారికి దివ్యమైన అనుభవాలు కలుగ చేస్తారు. ఏ శ్రమతోను లభించని స్థితి గురువు యొక్క సంకీర్తనల వలన లభించును. మహాప్రయత్నంతో లభించనిది కూడా గురుకృపతో లభించును. సాయిని పరీక్షించాలని వచ్చిన వారంతా వారి అహంకారాన్ని పోగొట్టుకొని తృప్తి చెందారు. యశస్సు, ఐశ్వర్యం, ఔదార్యం, జ్ఞానం, వైరాగ్యం, శాంతి ఆరు గుణాలతో (షడ్గుణాలతో) సంపూర్ణ ఐశ్వర్యంతో ఉన్న విష్ణు భగవానుడే శ్రీ సాయి. భగవంతుడు భక్తికి వశుడౌతాడు. మనకు భక్తి లేకున్నా కరుణ చూపించేవారు సాయి మహాత్ముడు.

**చిత్ర పటము యొక్క చమత్కార వృత్తాంతము :** అలీ మహమ్మద్ ఒక రోజు అతను బొంబాయి వీధులలో తిరుగు చుండగా సాయి బాబా ఫోటో కనిపించింది. అతనికి సాయియే ఆరాధ్య దైవం. అతను సాయి బాబా చిత్రపటాన్ని కొని ఇంటికి తీసుకొని వచ్చి గోడకు తగిలించి నిత్యం దర్శనం చేసుకొనెడివాడు హేమాద్ పంత్‌కు చిత్ర పటము యిచ్చుటకు మూడు నెలలు ముందు అతనికి కాలు మీద కురుపు లేచి బాధ పడుచుండెను. దానికి శస్త్రచికిత్స జరిగినది. అప్పుడతడు బొంబాయిలోని తన బావమరిది నూర్ మహమ్మద్ పీర్ ఇంటిలో వుండెను. తన ఇల్లు మూడు మాసముల వరకు మూయబడి వుండెను. ఆ యింటిలో ఎవరూ లేకుండిరి. అచ్చట ప్రసిద్ధి చెందిన అబ్దుల్ రహమాన్ బాబా, మౌలానా సాహెబ్ మహమ్మద్ హుస్సే, సాయిబాబా, తాజుద్దీన్‌బాబా మొదలగు సజీవ యోగుల పటము లుండెను. కాని కాలచక్రం సాయిని మాత్రం వదలి పెట్టింది. అది

ఎనిమిది సంవత్సరములు టేబుల్‌లో పడియుండెను. ఒకనాడు దానిని చూసి ఫోటోగ్రాఫర్ వద్దకు తీసుకొని పోయి సజీవ ప్రమాణమంత పెద్దదిగా చేయించి దాని ప్రతులను తన బంధువులకు, స్నేహితులకు ఇచ్చాడు. అతని గురువైన అబ్దుల్ రహమాన్‌కు విగ్రహారాదన అంటే యిష్టము లేని కారణంగా, అతను మౌలానా దర్బారుకు వెళ్ళి ముజఫర్ ఇస్మాన్‌ను ఏకాంతంగా కలుసుకొని ఆ ఫోటోను పూజ్య భావంతో చూసే వ్యక్తి ఎవరని ఆలోచించాడు. సాయియే ఆ పోటోను హేమాద్ పంత్‌కు యివ్వాలని సూచించి వుంటాడు. వారు హేమాద్ పంత్ ఆ ఫోటోను జాగ్రత్త పరచునని తలచిరి. వారిద్దరూ హేమాద్ పంత్ దగ్గరికి పోయి సరియైన కాలంలో ఆ ఫోటోను సమర్పించిరి. ఈ కథను బట్టి బాబాకు భూత భవష్యత్ వర్తమాన కాలములు తెలియుననియు. భక్తుల కోరికలు తీర్చుననియు తేటతెల్లమవు చున్నది. హేమాద్ పంత్ వారు వచ్చే సమయములో భోజనానికి సిద్దంగా వుండడం వలన ఈ కథ చెప్పే అవకాశము కలుగ లేదు.

**బాలా సాహెబ్‌దేవ్‌తో జ్ఞానేశ్వరి చదివించుట :** దేవ్‌కు జ్ఞానేశ్వరి చదువాలని పట్టుదల, ఆసక్తి వున్నప్పటికి సాయి బాబా ఆదేశం అందే వరకు చదువలేక పోయాడు. బాబా దేవ్‌ను జ్ఞానేశ్వరి చదువుమని ఆజ్ఞ యిచ్చి అంతటితో వూరుకోలేదు. రెండునెల్లలోనే బాబా దేవ్‌కు స్వప్నంలో దర్శన మిచ్చాడు క్రీస్తు శకం **1914** వ సంవత్సరం ఎప్రిల్ **2** గురువారం తెల్లవారు జామున దేవ్ స్వప్నంలో మేడపైన కలిసి జ్ఞానేశ్వరి చదువుచున్నావా అర్థమవుతుందా? అని అడిగాడు. లేదు అని సమాధానం యివ్వగానే'మరెప్పుడు అర్థం చేసుకుంటావు?' అని ప్రశ్నించాడు. బాబా. దేవ్ కళ్ళనీళ్ళతో మీ అనుగ్రహం లేకుండా గ్రంథ పఠనం వ్యర్థం. అర్థం చేసుకోవడం కష్టం' అని అన్నాడు. బాబా 'నువ్వు గ్రంథం పఠించేటప్పుడు చాలా త్వరపడుతున్నావు. నాదగ్గర కూర్చుని చదువు. నేను చూస్తాను.' అని అన్నాడు. ఏం చదివావని అడుగగా ఆధ్యాత్మిక గ్రంథమని చెప్పాడు

దేవ్. దేవ్ గ్రంథాన్ని తీసుకు రావడానికి వెళ్ళబోతుండగా తెలివి వచ్చింది. అతనికి కొంతకాలం అవకాశమిచ్చి, పిల్లవాడు సరిగా చదువు చున్నాడా లేదా? అర్థమౌతుందా, లేదా? అని కనుక్కున్నాడు బాబా. అలా సాయి తప్ప ఇంకెవరు చేయగలరు? సాయికి సాష్టాంగ నమస్కారం చేయండి. సాయియే మన స్వార్థం, మన సుఖం. మనలను కృతార్థులను చేసేదీ సాయియే. గోవు యొక్క పొదుగు నిండా పాలు వున్నా, పొదుగు సమీపంలో వున్న జోరీగలు రక్తాన్ని పీల్చుకుంటాయి. ఆ పాలు మాత్రం భాగ్యవంతులకే! సరోవరంలోని కమలాల నుండి భ్రమరాలే మకరందాన్ని గ్రహించగలవు. ప్రక్కనే వున్న కప్పలకు బురదే గతి! తల్లి తన సంతానాన్ని గారాబంగా చూస్తూ ముద్దు మురిపాలు తీర్చినట్లు, బాబా భక్తుల కోరికలను తీర్చేవాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *గురు కథా శ్రవణము ఒక్కటే అందరికి సులభమైనది, పుణ్యం పండిన వారే ఈ శ్రవణము చేయ గలరు. ఈ కథా శ్రవణమునకు ఏకాగ్ర చిత్త మొక్కటి తప్ప మరి ఏమియును అవసరము లేదు.*
- *బాబా కథలు శ్రవణము, మననము చేస్తే పంచ పాపాలు పోయి, దుఃఖాలు నశించి శాంతి కలుగును.*
- *ఈ శరీరం అస్థిరము, బ్రహ్మ అమర్త్యం, అవినాశం. బ్రహ్మనే పూజించాలి. అదే నిజమైన గురు పూజ.*

# అధ్యాయము 42

(సాయినాథుని మహ సమాధి -1)

**సాయి కృప :** గోదావరి తీరంలో నివసించిన సాయికి నమస్కారం. పరబ్రహ్మ మూర్తికి నమస్కారం. కౌపీన ధారికి ప్రణామాలు. గురు సాయి కృప ద్వారా భవ భయారిష్టాలు తొలగిపోవును. దుఃఖాలు పోయి సుఖాలు కలుగును. సద్గురు చరణాలను ప్రతిరోజు స్మరిస్తే, విఘ్నాలను కలిగించే విఘ్నం తొలగి పోవును. మరణానికే మరణం వస్తుంది. సాయి దీనులందరికి తన చరణాల వద్ద శరణు యిస్తాడు. సాధువులందరి కంటే ఉత్తమునిగా సాయి అవతరించాడు. సాయి కథలను శ్రవణం చేస్తే భక్తులకు శ్రేయస్సు కలుగును. మనస్సుకు ప్రశాంతి లభించును. సాయి బాబా యొక్క సహవాససుఖాన్ని అర్ధశతాబ్దం పైగా అనుభవించిన షిరిడి ప్రజలు ధన్యులు.

**బాబా తన నిర్యాణం గురించి ముందే సూచించుట :** బాబా తన నిర్యాణం గురించి రెండు సంవత్సరములకు ముందే సూచించాడు. క్రీస్తు శకం **1916** సం. భక్తులు సీమోల్లంఘన నుండి తిరిగి వచ్చునప్పుడు, ఆకాశంలో మేఘ గర్జనలు, మెరుపులు, మొదలయ్యాయి. అప్పుడు బాబా తన తలగుడ్డ, కఫినీ, లంగోటి తీసి ముక్కలు ముక్కలుచేసి ధునిలో పారవేసి, నగ్న స్వరూపంలో ప్రకటమయ్యారు. బాబా అప్పుడు జమదగ్ని అవతారంగా అసలే మండుతున్న ధుని. బాబా బట్టలు వేయగానే జ్వాలలు లేచాయి. అప్పుడు ఆ అగ్ని తేజం కంటే బాబా తేజోవంతంగా కనిపించాడు. బాబా దిగంబరంగా వుండి, 'ఇప్పుడు బాగా చూడండిరా! నేనెవరినో నేను హిందువా, ముసల్మానా అన్న విషయం నిస్సందేహంగా నిశ్చయించుకొండి.' అని గర్జించాడు. వారిని చూసిన భక్తులు భయ కంపితులై వారిని ఎలా శాంతింప చేయాలో ఆలోచించ సాగారు. బాబా యొక్క భక్త శ్రేష్ఠుడు కుష్టురోగి అయిన భాగోజి షిండే ధైర్యంగా బాబా

సమీపానికి వెళ్ళి వారి నడుముకు లుంగీ చుట్టి, బాబా ఈ రోజు దసరా పండుగ సీమోల్లంఘన సమయమప్పుడు ఇదేమిటని ప్రశ్నించాడు. 'ఇది నా సీమోల్లంఘన.' అంటూ బాబా సటకాతో భూమిపై కొట్టాడు. ఆ రోజు చావడి ఊరేగింపు ఎలాగా అని భక్తులు చింతించసాగారు. ఊరేగింపు తొమ్మిది గంటలకు బయలు దేరాలి, పదకొండు గంటలు దాటింది. అప్పుడు బాబా శాంతించి లంగోటి, కఫినీ ధరించాడు. రాజోపచారాలతో చావడి వుత్సవం జరిగింది. బాబా దసరా రోజున సమాధి చెందుదునని ఈ సంఘటనతో సూచించటమే కాదు, భక్తులు అనుభవించేలా చేసాడు. **1918** విజయదశమి దగ్గర పడుచుండెను. బాబా మాట ప్రకారం తాత్యా జ్వరంతో జబ్బు పడ్డాడు. బాబా కూడా ఆ సమయంలో చలి జ్వరంతో బాధపడసాగాడు. బాబా చెప్పినట్లుగా తాత్యా ప్రాణం కోల్పో తాడని అనుకున్నారు. ఇంతలో విచిత్రంగా తాత్యాను గండం నుంచి తప్పించి అతనికి బదులుగా తను ప్రాణాలను అర్పించినట్లు బాబా ప్రాణాలు విడిచాడు. లోకోద్ధరణకు అవతరించిన వారు తమ కార్యము పూర్తి కాగానే తమ అవతారాన్ని చాలిస్తారు. బాబా జనన మరణాలకు అతీతులు. బాబాకర్మలో వున్నట్లు కనిపించినా ఎప్పుడూ కర్మలో చిక్కుకొని ఏ కర్మా చేయలేదు. అతడు సర్వత్రా బ్రహ్మనే దర్శిస్తాడు. కర్మ ఫలం భోగమే. ఇది ద్వైతం. కాని బ్రహ్మజ్ఞానికి కర్మఫలం లేదు. భోగం లేదు. ఎందుకంటే బ్రహ్మ జ్ఞానికి రెండవదంటూ లేదు. అతనికి కర్మలు బ్రహ్మ స్వరూపాలే. బాబా లాంటి మాతృమూర్తి, మహాత్ముడు మృత్యువుకు బలి అవుతాడా! అతను బ్రహ్మంలో ఐక్యమౌతాడు.

**లక్ష్మిబాయి షిండే :** తాను కొద్ది సేపటిలో సమాధి చెందెద నని బాబాకు తెలుసు. బాబా తన కఫినీ జేబులో చేయివేసి ఆ సమయంలో దానం చేయాలని తోచినట్లు నిరంతరం చరణ సన్నిధిలో వుండే సులక్షణురాలయిన లక్ష్మికి ద్రవ్య దానం చేసాడు. బాబా తొమ్మిది నాణెములు దానం చేసాడు. అవియే నవవిధ భక్తి మార్గములు. ఆ లక్ష్మి

ఎవరో కాదు లక్ష్మి బాయి షిండే. బాబాకు సేవ చేసే నిమిత్తం అప్పుడు మసీదు కు వచ్చింది. లక్ష్మి బాయి బాబాకు వేళకు రొట్టె, కూర పంపించేది. ఆమె సేవను వర్ణించలేము. ఒక సారి తాత్యాతో కూర్చుని వుండగా లక్ష్మి బాబాకు నమస్కరించగా, 'లక్ష్మీ నాకు ఆకలిగా వుందమ్మా' అని అన్నారు. ఆమె వెంటనే ఇంటికి పోయి రొట్టె తయారు చేసి, కూర పచ్చడివేసి తీసుకొనివచ్చి బాబా వద్ద ఉంచింది. బాబా ఆ విస్తరిని తీసి కుక్క ముందుంచాడు. వెంటనే లక్ష్మి 'ను రొట్టె చేసుకొని వచ్చింది కుక్క పొట్ట నింపటానికా? ఆకలిగా వుందని చెప్పి ఒక్క ముక్కనయినా నోటిలో పెట్టుకోకుండా మొత్తం కుక్కకు వేసారు. ఇదేమి అద్భుతమైన ఆకలి బాబా? నన్ను అనవసరంగా శ్రమ పెట్టావు.'అని గొడవ చేసింది. బాబా, 'నేను తినలేదని ఎందుకు బాధ పడతావు? ఈ కుక్క కడుపు నిండితే నేను తృప్తి చెందినట్లే అని తెలుసుకో. ఈ కుక్కలో ప్రాణం లేదా? అన్ని ప్రాణులయందు ఆకలి ఒక్కటే. భేదము వుండదు. అది నోరులేని మూగ జీవి. ఆకలితో అలమటించే ఏ ప్రాణులకు అన్నదానం చేసినా అది నా నోటికి అందినట్లే. ఇది ఎప్పుడూ ప్రమాణమని గ్రహించాలి.'అని లక్ష్మితో అన్నాడు. బాబా ఆదేశాను సారం లక్ష్మి బాయి రోజూ రొట్టె పాలు ప్రేమతో తెచ్చిపెట్టేది. బాబా ఆ రొట్టెను ప్రేమతో తినే వారు. భోజన సమయంలో పళ్ళెంలో అన్ని వడ్డించినప్పటికి లక్ష్మిరొట్టె వచ్చేంత వరకు ఆహారాన్ని సేవించేవారు కాదు. తర్వాత చాలా రోజుల వరకు సాయంకాలం లక్ష్మితో సేమ్యాను తెప్పించుకొని కొంచెం తినేవాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *నన్ను సేవించిన వారు, నన్ను అనన్య చింతనతో శరణు జొచ్చిన వారు నా స్వరూపమై పోతారు.*

# అధ్యాయము 43

(సాయినాథుని మహా సమాధి - 2)

**రామ విజయము పారాయణము :** బాబా **1918** అక్టోబర్ **1,** నిర్యాణానికి పదునాలుగు రోజులముందు నుండి 'వఝే అను భక్తుని మసీదులో కూర్చుని శ్రీధర స్వామి రచించిన రామ విజయము' పారాయణము చేయుమని నియమించాడు. అతను రోజూ శ్రవణం చేసేవాడు. ఒక సప్తాహము అయిన తర్వాత కూడా మళ్ళీ ఆపకుండా పఠించమని ఆజ్ఞ యిచ్చాడు. ఈ విధంగా వఝే రాత్రి పగలు మూడు రోజులు చదివాడు. మొత్తం పదకొండు రోజులు విశ్రాంతి లేకుండా వఝే రామ విజయము చదివి అశక్తుడైనాడు. అప్పుడు బాబా గ్రంథపారాయనాన్ని సమాప్తి చేసి వఝేను అక్కడి నుంచి పంపివేసి ప్రశాంతంగా వుండి పోయాడు. ఈ విధంగా సజ్జనులు అవసాన కాలమందు పురాణ గ్రంథాలను పారాయణం చేయించి శ్రవణం చేస్తారు. శుక బ్రహ్మ ఏడు రోజులు మహా భాగవతాన్ని చదివిచెప్పితే, దానిని విని పరీక్షిత్ మహారాజు సునాయాసంగా తనువుచాలించి ముక్తిని పొందాడు. భగవంతుని ధ్యానించుతూ ప్రాణాలు విడిచిన వారు ఘన విజయం సాధించినట్లే. మహాత్ములకు మరణం శరీరం యొక్క ప్రకృతి, జీవితం శరీరం యొక్క వికృతి. వారి శరీరానికి జన్మలేదు. అటువంటప్పుడు మరణమే లేదు. సాయి పూర్ణ బ్రహ్మ. దేహస్ఫురణ లేనివాడు. ప్రాణధారణ విసర్జన భక్తోద్ధరణ నిమిత్తమే, భక్తుల పూర్ణ పుణ్యం వలన భక్తులకై షిరిడిలో సాయి రూపం ప్రకటమైంది. సాయి తన సంకల్పము తోనే తన శరీరాన్ని వదలి అవ్యక్తంలో విలీనమై భక్తుల హృదయాలలో ఎప్పుడూ వుంటారు. ఎవరి నామస్మరణతో ముక్తి లభించునో అట్టి వారికి మరణావస్థ ఎక్కడిది. జడమైన శరీరాన్ని వదలి ఆత్మ స్థితిలో వుంటూ భక్తులను జాగృతం చేస్తారు. బాబా విశ్వాంతం వరకు చిరంజీవి. వారికి జననం మరణం లేదు. ఏకనాథుడు పైఠానులో వెలిసినట్లు, తుకారం

దేహులో, సమర్థ రామదాసు పర్లిలో, స్వామిసమర్థ అక్కల్ కోటలో, మానిక్ ప్రభు ఉమ్నాబాద్‌లో వెలిసారు. ఆవిధంగానే షిరిడిలో సాయిబాబా వెలిసాడు.

**లక్ష్మణ మామ హారతి** : మాధవరావు మామ లక్ష్మణమామ ఇంటిలో నిద్ర పోవుచుండగా బాబా అతని చేయి పట్టుకొని 'త్వరగాలే నేను మరణించాననుకొని బాపు సాహెబ్ జోగ్ ఈ రోజు రాడు. నీవు వచ్చి నా పూజ చేసి కాకడ హారతినివ్వు.'అని నిద్ర లేపాడు. లక్ష్మణమామ బ్రాహ్మణుడు. నిత్యం ప్రాతఃకాలం స్నానం చేసి మడి కట్టుకొని బాబా దర్శనం చేసుకొని వారిపాద ప్రక్షాళన చేసి తులసితో పూజించి, ధూప దీప నైవేద్యాలు, దక్షిణ ప్రదానం చేసేవాడు. బాబా ఆశీర్వదం చేసేవాడు. బాబా ఆశీర్వదం తీసుకొని ప్రసాదాన్ని అక్కడ వున్న వారికి పంచి నొసట తిలకం దిద్దుకొని వెళ్ళి గ్రామంలోని గణపతి దేవుని, శనేశ్వరుడిని, శివుడిని, ఆంజనేయుణ్ణి పూజించేవాడు. లక్ష్మణమామకు నిద్రలో కలిగిన దృష్టాంతముతో కాకడ హారతిని ఇవ్వటానికి వచ్చాడు. అతను బాబాకు సాష్టాంగ నమస్కారం చేసాడు. తర్వాత వారి ముఖాన్నుండి వస్త్రాన్ని తొలగించాడు. వారిని ప్రేమతో చూసి, వారికి పాద ప్రక్షాళన చేసాడు. యధావిధిగా పూజ చేసాడు. అక్కడున్న మౌల్వీలు బాబాను తాకకూడదని అన్నా లక్ష్మణమామ వారి మాటలు వినకుండా బాబాకు గంధం వ్రాసాడు. బాబా తన ఆరాధ్య దైవమని తలచాడు. అతను హిందువా ముస్లిమా అన్న దృష్టి అతనికి లేదు. అతని కళ్ళనుండి అశ్రువులు కారాయి. బాబాను అలా చూడలేక మనస్సు వికలమైంది. కాళ్ళు చేతులు వణికాయి. అయినా బాబా చేతిలో తాంబూలం, దక్షిణ ప్రతిరోజులా వుంచి శరీరాన్ని కప్పి మామ వెళ్ళిపోయాడు. తర్వాత మధ్యాహ్నహారతి రోజువలెనే బాపూ సాహెబ్ జోగ్ మసీదు లో మిగతా భక్తులతో కలిసి చేసారు. బాబాతో భక్తులకు **72** జన్మల సంబంధం, తరతరాల ఋణానుబంధం వుందని చెప్పాడు. బాబా అందరిని ప్రేమపాశంలో బంధించి ప్రవాసానికి వెళ్ళి పోయాడు.

మళ్ళీ వస్తాడని భక్తులకు పూర్ణ విశ్వాసం. బాబా నిర్యాణం తర్వాత ఎందరికో సాక్షాత్కారములు, చమత్కారములు గుప్త రూపంగా చూపించాడు. ఎవరి అనుభూతులు ఎట్లా వుంటే వారి అనుభవాలు కూడా అట్లాగే వుంటాయి. బాబా చావడిలో గుప్త రూపంలో, మసీదు లో బ్రహ్మ రూపంలో, సమాధిలో సమాధ్యావస్తలో సర్వత్ర పరమార్థ స్వరూపంలో ఉండి మనస్సులూ భక్తి హృదయంలో ప్రేమ వుంటే సాయి సమర్థుడు లేక పోవడమనేది లేదు. వారు ఎల్లప్పుడు అక్షయంగానే వుండే వారు. సత్పురుషులు ఉన్నచోటనే బ్రహ్మస్థితిలో వుంటారు. కాని దేవతలు వారిచోటికి వెళ్ళి పోతారు. గురు చరణాల యందు నిష్కామ ప్రీతి, గురువు కథల యందు ఆసక్తి నిర్మలమైన భక్తి ఉండే భక్తుల స్నేహ పాశం విడిపోదు.

**బాబా అంతిమ సంస్కారం :** బాబా శరీరానికి అంతిమ సంస్కారము ఎలా చేయాలని **36** గంటల పాటు తర్జనబర్జన చేసారు. ఈ శరీరాన్ని హిందువులు తాకకుండా ముందు స్మశానానికి తీసుకెళ్ళాలని ఒకరంటే, ఆరు బయట సమాధి కట్టాలని మరొకరన్నారు. కుశాల్ చంద్, అమీర్ శక్కర్ ఈ మాటనే సమ్మతించారు. కాని చివరి శ్వాస విడుస్తూ నా శరీరాన్ని వాడాలో వుంచండి అని అన్నాడు బాబా. గ్రామాధికారి రామచంద్ర పటేల్ బాబా భక్తుడు. అతను, 'మీ అభిప్రాయాలు ఏవైనా సరే మేము వాటిని అంగీకరించం. సాయి బాబా శరీరాన్ని వాడాలో తప్ప మరెక్కడా ఒక్క క్షణం కూడా వుంచకూడదు.'అని గ్రామస్థులతో అన్నాడు. అయినా హిందువులు ముసల్మానులు వాదించుకున్నారు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *మహా పురుషుడైన సాయికి కాయా, వాచా, మనసా శరణాగతి చేస్తే సర్వ సుఖాలు కలుగును.*

# అధ్యాయము 44

(సాయినాథుని మహ సమాధి - 3)

**సాయిబాబాయే శ్రీరాముడు, శ్రీకృష్ణునిలో :** సాయి చరణాలకు వందనం చేస్తే సమస్త పాపాలు ప్రక్షాళనమౌతాయి. భక్తితో సాయిని భజించేవారు ధన్యులు. వారి దర్శనంతో సంసార దుఃఖములనే కాక ఆకలి దప్పికలను మరిచి పోతారు. బాబా మనస్సు వాసనారహితము. అపకారం చేసేవారికి కూడా ఉపకారం చేసే శాంత మూర్తి. వారిని మన అంతరంగములో నివశింప చేసుకోవాలి. బాబా సుందర రూపంలో వున్న ఆనంద స్వరూపులు. వారి దృష్టికి కనిపించనిది ఏమి లేదు. 'యే యధామాం ప్రపద్యంతే' ఎవరు ఏ విధంగా నన్ను భజిస్తారో వారిని ఆ విధంగానే చూస్తాను అని దేవతలు అంటారు. కాని నిందించే వారిని కూడా కరుణిస్తారు బాబా. రాముడు, కృష్ణుడు, సాయి వీరి పేర్లు వేరైనా ముగ్గురిలో ఏ అంతరం లేదు. కరుణామయుడైన సాయి గురువుకు ప్రారబ్దం, సంచితం లాంటి కర్మలేవి లేవు. వారి కృప వుంటేనే మన ప్రాణములు కుదుట పడును. సాయి సచ్చరిత్రలో సాయి రత్నాలు పొదిగి వున్నవి. సాయి సచ్చరిత్ర శ్రవణం చేస్తే మనోభీష్టం తీరును. ఏకాగ్రతతో శ్రవణం చేయాలి. బాబా లీలలు వింటే మనస్సుకు తృప్తి కలుగును. సర్వ సుఖాలకు మిన్న అయిన ఆత్మానందాన్ని కలుగ చేస్తాయి. ఎంత విన్నా నిత్య నూతనంగా వుంటాయి. ఇది కథ మాత్రమే కాదు అమూల్య రత్నాల పేటిక. భక్తితో ఆ పేటికను తెరువాలి.

**72 గంటల సమాధిలో వుండుట :** బాబా సమాధి రోజుకు **32** సంవత్సరములకు ముందు మార్గశిర శుద్ధ పూర్ణమి రోజు అస్వస్థు లైనారు. బాబా ఎంతో బాధపడసాగాడు. అతను అస్వస్థులై రాత్రి **10**గం. ల సమయమున తన ప్రాణమును బ్రహ్మాండంలో లీనం చేసి సమాధి లోనికి వెళ్లాడు. బాబా మహల్సాపతితో 'నువ్వు మూడు రోజులు

జాగ్రత్తగా చూసి తర్వాత సభామండపములో ఆ మూల త్రవ్వి నన్ను సమాధిచేసి అక్కడ రెండు జండాలను జాగ్రత్తగా గుర్తుగా వుంచండి.' అన్నాడు. అప్పుడు బాబా యొక్క ఇంద్రియములు చలన రహితములైనవి. బాహ్య స్మృతిని కోల్పో యాడు. శ్వాస ఆడటం లేదు. శరీరంలో వేడి తగ్గింది. అందరూ బాబాపై ఆశ వదలుకున్నారు. మహల్సాపతి బాబా తలను తన ఒడిలో పెట్టుకొని రాత్రింబగళ్ళు జాగ్రత్తగా మేలుకొని వున్నాడు.. అందరూ ఆందోళనగా చూ స్తున్నారు. ఏమి తోచని స్థితిలో వుండి పోయారు. రెండు రోజుల తర్వాత కొందరు గ్రామ ప్రజలు బాబా చూపించిన స్థలంలో తవ్వి సమాధి చేయాలని ఆలోచించ సాగారు. కొందరు 'బాబా అందరిలా సాధారణ మనిషికాదు. మరికొంత కాలం ఆగి చూద్దాం. బాబా మాటలు నిజమౌతాయి.' అని మరి కొందరు భక్తులు తల చారు. వారు సమాధి చేయటానికి సమ్మతించలేదు. మూడు రోజులు గడిచిన తర్వాత ఉదయం మూడు గంటల సమయములో బాబాలో చైతన్యం కనిపించింది. శ్వాస ఆడటం మొదలైంది. పొట్ట దలసాగింది. బాబా కళ్లు తెరిచి ప్రసన్న వదనంతో కనిపించాడు. దేవుని దయ వల్ల విఘ్నం తొలగి పోయిందని భక్తులు తలచారు మిక్కిలి సంతోషించారు. మౌల్వీలు ఫకీర్లు తమ ముఖాలను చాటు చేసుకున్నారు. ఇలా ఒక భయంకర సంఘటన తప్పిపోయింది. లోకో ద్ధరణకై సాయి తన సమాధిని చాలించాడు.

**ఇటుక రాయి విరుగుట :** అనేక సంవత్సరములనుండి బాబా వద్ద ఒక యిటుకరాయి వుండెను. వారు దానిపై చేయి ఆనించి కూర్చుండేవాడు. ఒకరోజు బాబా మసీదు లో లేని సమయంలో ఒక కుర్రాడు మసీదు ను శుభ్రం చేస్తూ యిటుక క్రింద చిమ్మటానికి పైకి తీసాడు. అది అతని చేయి నుండి జారి పడి రెండు ముక్కలైంది. ఆ విషయం తెలుసుకున్న బాబా యిటుక కాదు నా కర్మ బద్దలైంది, అని బాబా బాధ పడి కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. 'దాని సహాయంతో నేను

ధ్యానంలో వుండేవాడిని. అది యిటుకరాయి మాత్రమే అయినా నాకు దానిపై మక్కువ ఎక్కువ. జీవితమంతా నా తోడు వున్న యిటుక నన్ను వదలి పోయింది. అది నా ప్రాణం. అది లేకుండా యిక నేను ఉండను.' అని బాబా అన్నాడు. క్షణంలో ముక్కలైన యిటుక కొరకు బాబా ఎందుకు శోకించారో బాబాకే తెలుసు. వారు నవ్వినా ఏడ్చినా అది పామరుల కొరకే. అది లౌకిక నాటకమే.

**నా శరీరాన్ని వాడాలో వుంచండి :** బూటీ బంగళాలో మధ్య హాలులో మురళీధరుని మందిర నిర్మాణానికి పునాది తవ్వటం ప్రారంభించినప్పుడు. బాబా లెండికి వెళ్ళుతూ అక్కడ నిలబడి వున్నప్పుడు. మందిర సమయానికిది శుభ సమయమేనా కొబ్బరికాయ కొట్టమంటారా! అని శ్యామా ప్రశ్నించినప్పుడు 'ఊ కొట్టు. మనం గోపాల బాలురమంతా సుఖంగా యిక్కడ ఆడుకుందాం.' అని బాబా అన్నాడు. మరియు 'నా ఈ శరీరాన్ని వాడాలో వుంచండి,' అని అన్న వారి చివరిమాట ప్రకారం మురళీధరునికి నియమించిన స్థలంలో బాబా శరీరాన్ని ఉంచటానికి నిశ్చయమైంది. అచ్చట మధ్య భాగంలో తవ్వటం ప్రారంభించారు. రహతా నుండి సబ్ ఇనస్పెక్టర్ వచ్చాడు. ఇతరులు మిగతా స్థలాలనుండి వచ్చారు. మరుసటిరోజు అమీర్‌బాయి బొంబాయి నుండి వచ్చాడు. కోపర్‌గాం నుండి మామలతాదార్ వచ్చాడు. ప్రజలు భిన్నాభిప్రాయముతో వున్నట్టుగా తోచింది. మామలతాదారు ఎన్నికల ద్వారా నిశ్చయించమని చెప్పాడు. వాడాను వుపయోగించుటకు రెండు రెట్ల కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయి. అయిననూ జిల్లా కలెక్టరును సంప్రదించవలెనని అమీర్ శక్కర్, కాకా సాహెబ్ దీక్షిత్ అహమ్మద్ నగర్ పోవుటకు సిద్ధమయ్యారు. ఈ లోగా బాబా ప్రేరణ వల్ల మిగతా వారి మనస్సు కూడా మారెను. బూటీ హిందువులు మహమ్మదీయులు దానికి అంగీకరించారు. మురళీధరునికి కట్టిన చోట శాస్త్రోక్తంగా సమాధి చేసారు. బాబా శరీరం **36** గంటలు గాలిలో పెట్టినప్పటికి అది బిగుసుకు పోలేదు. శరీరము చెడి పోలేదు. అవయవములన్ని సాగు

చుండెను. వారి కఫినీ చింపకుండా సులభంగా తీయగలిగారు. ఆ విధంగా సాయి బాబా మురళీధరుడైనాడు. బాబాను అచ్చట వుంచక పోయినచో ఎంతో ఖర్చుచేసి కట్టిన భవంతి శూన్యమై పోయేది. ఇప్పుడక్కడ నిత్యం పూజలు, భజనలు, పురాణ శ్రవణం, కీర్తనలు అన్నసంతర్పణలు మొదలైనవి జరుగుచున్నవి. వీటి అన్నిటికి కారణం సాయియే. దేశదేశాల నుండి వివిధ సాంప్రదాయాలకు చెందిన ప్రజలు అక్కడికి వెళ్ళటం సాయి బాబాపై వారికున్న విశ్వాసమే.

బాబా యొక్క ఉత్తరక్రియలను **13**వ రోజు ప్రారంభించారు. బాలా సాహెబ్ శాస్త్రప్రకారం తడిబట్టలతో క్రియాకర్మచేసారు. తిల తర్పణం, పిండ ప్రదానం, అన్ని ఉత్తరక్రియలు ఆయా సమయాలలో చేయవలసిన కర్మలన్నీ చేసారు. సంవత్సరము వరకు మాసిక శ్రాద్ధం కూడా చేసారు. ఉపాసనీ బాబా జోగ్‌తో సహా గోదావరి పవిత్ర స్థానంలో ధర్మ సమ్మతంగా హోమాలు హవనాలు చేసి బ్రాహ్మణులకు అన్న సంతర్పణలు చేసారు. శాస్త్ర ప్రకారం దక్షిణ సంభావనలు కూడా సమర్పించారు.

## సాయి బోధనామృతం :

### సాయి బాబా ఎన్నో సార్లు మసీదు లో పలికిన పలుకులు.....

*1 .ఎవరు నాపై ప్రేమతో, అంతటా నన్నే చూస్తూ నా గురించి ముచ్చటించు కుంటూ ఎల్లప్పుడు నన్నే తలపోస్తూ వుంటారో, ఎవరికి ఈ సృష్టి శూన్యంగా తోస్తుందో, అట్టివారి వద్ద తిష్ట వేసుకొని కూర్చుని వారిని నేను కనిపెట్టుకొని వుంటాను. 2. ఎవరు ఎల్లప్పుడూ జిహ్వతో నా నామాన్ని జపం చేస్తూ, నా చరిత్రను గానం చేస్తూ వుంటారో వారు కర్మాకర్మలకు నిమిత్తం లేకుండా నాలో ఐక్య మయ్యేదరు. 3. నన్ను అనన్య శరణు జొచ్చిన వారికి నేను ఋణగ్రస్తుడను. 4. ఎవరు ఆకలి దప్పుల స్పృహలేకుండా, నాకర్పించనిదే అన్నపానాదులు సేవింపక ,సదా నాధ్యానలో వుంటారో అట్టివారి ఆధీనంలో నేనుంటాను.5. తల్లి తండ్రి భార్య, పిల్లలు, ఆప్తులు, ప్రియులు వీరి నుండి విముఖు లైన*

*వారు నా చరణాల యందు ఆసక్తులై వుంటారు.* ***6.*** *వర్షాకాలంలో నదులు సముద్రములో ఐక్యమైపోయి తన నామ రూపాలు అస్థిత్వాన్ని కోల్పోయి, మహాసాగరంలా మారి పోతాయో, అలాగే నిరంతరం నన్ను ధ్యానిస్తే మీ మనస్సులు నామరూపాలు మరిచిపోయి నాలో ఐక్యమై పోతాయి. వారికి నాకంటే వేరే చోటు లేదు.7. ఎవరు ఎవరిని దూషించినా నన్ను దూషించినట్లే. నాహృదయాన్ని గాయపరిచినట్లే.* ***8.*** *ఎవరు ఎదురుచెప్పకుండా సహిస్తారో వారునాకు సంతుష్టి కలిగి స్తారు.' అనేవారు బాబా. బాబాకు ప్రేమ ఒక్కటే ముఖ్యం.*

నేను మీ హృదయాలలోనే వున్నాను. అయినా నన్ను తెలుసుకోలేక పోతున్నారు. సృష్టి అంతటా నానారకాల నామరూపాలతో మాయావరణలో నిండి వున్న తత్వాన్ని ఎవరూ గ్రహించలేరు. సత్వ, రజ, తమో గుణాలనుదాటి సాత్వికస్ఫురణ కలిగినప్పుడు, హృదయం లోని నన్ను తెలుసుకొనగలరు. మీ హృదయములో వున్నది నేనే. ఆ నేనే నువ్వని తెలుసుకొన్నచో అన్నిప్రాణులలో గురువును దర్శించ గలరు. నేను లేని చోటు లేదు. ఇటువంటి అభ్యాసం చేయగాచేయగా నా వ్యాపకత్వం అనుభవానికి వచ్చి, నీవు నాలో ఐక్యమై అనన్య మైన ఆనందాన్ని పొందగలవు. హృదయంలో నన్ను అనుసంధానం చేస్తే, గంగాజలం లేకుండానే గంగా స్నానం చేసినట్లుగా, నీ అంతఃకరణము పరిశుద్ధమౌతుంది. ప్రకృతి కర్మల అభిమానంవలన బంధనము, జ్ఞానం బంధనమునకు పట్టుకొని వ్రేలాడదు. స్వ స్వరూపంలోనే వుంటూ అక్కడనుండి కొంచెమైనా కదలకుండా వుండేవారికి సమాధి ఉత్థానాలతో ప్రయోజనం లేదు.' అది బాబా బోధ.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 45

(గురుచరణ మహిమ వర్ణనము)

**అంతరంగములో సాయిని స్థాపించాలి :** పతివ్రత మనసెప్పుడూ నిశ్చలంగా వుంటుంది. అట్టి సాధ్వి తన పతిని మాత్రం సేవించును, ప్రేమించును. మరిది, మామ ఇంక ఎవరు ఎదురు పడినా వందనం చేస్తుంది. ఇతరులపై మనస్సు పోనివ్వదు. తన గృహం విడిచి పోదు. శిష్యులకు కూడా అటువంటి ప్రేమ గురువు పై వుండాలి. గురువుకు శిష్యులపై ప్రేమ అనంతం. తల్లి తండ్రులు ప్రేమను చూపుతారు. పుత్రుడు ధనాన్ని ఆశిస్తాడు. భార్య పసుపు కుంకుమ బాగుండాలని కోరుకుంటుంది. కాని పరమార్థ మార్గములో సహకరించేవారు ఎవరూ లేరు. పారమార్థిక విషయం ఎవరికి వారే చూసుకోవాలి. నిత్యా నిత్య వివేకముతో మోక్షాన్ని పొందగోరు వారు ధన్యులు. నిత్యానిత్యములు తెలుసుకోగానే ప్రపంచము మిథ్య అని తెలుసుకొందుము. దాని వలన ప్రాపంచిక విషయముల యందు వ్యామోహము తగ్గును. క్రమంగా గురువే పరబ్రహ్మ స్వరూపమనియు, వారొక్కరే నిజమనియు గ్రహించెదము. భయంతోనో ప్రేమతోనో నిత్యం ధ్యానం చేస్తే చాలు ధ్యాత ధ్యేయమై పోతాడు.. అసత్యమైన వానిని త్యజించి సద్గురుని ధ్యానిస్తే భేద బుద్ధి తొలగిపోయి అన్ని ప్రాణులలో భగవంతుణ్ణి దర్శించే జ్ఞానము కలుగుతుంది.

**కాకా సాహెబ్ దీక్షిత్ సంశయము :** కాకా సాహెబ్ దీక్షిత్ బాబా ఆజ్ఞానుసారం రోజు భాగవతం పఠించేవాడు. ఒకనాడు దీక్షిత్ కాకామహాజని భాగవతం లోని ఏకాదశ స్కందములో చదువు చుండెను. శ్యామా కూడా అక్కడ శ్రవణం చేస్తున్నాడు. గ్రంథపఠన అయిన తర్వాత కాకా సాహెబ్ మాధవరావుతో మనకు మోక్షము వచ్చుటెట్లు? తరుణోపాయము కనిపించుట లేదు. అని బాధ పడు చుండెను. కాకా సాహెబ్ నిరాశ చెందటం శ్యామాకు నచ్చలేదు. కాకా

దీనత్వం అతను చూడలేక పోయాడు. అప్పుడు కాకాతో శ్యామా యిట్లనెను, 'ఎవరైతే వారి అదృష్టముచే బాబా యందు నిశ్చలమైన విశ్వాసమే వున్నచో వారు చిరాకు చెందనేల? నవ నాథుల భక్తివలె మనది ప్రేమానురాగాలతో నిండి వుండలేదా? అట్లయిన ఆందోళన చెందనవసరమేమి?' అయినప్పటికి కాకా నవనాథుల వంటి భక్తి పొందుటెట్లు? అను మనో వేదన కలిగి ఆందోళన, రెండవరోజు కాకా సాహెబ్ భాగవతం పఠించే సమయంలో ఆనందరావు పాఖడే మాధవరావును తనకు బాబా స్వప్నంలోని ఆజ్ఞ శిరసావహించి ఈ పట్టు శాలువాను పట్టుకొని వచ్చాడు మాధవరావు ఆ శాలువాను స్వీకరించక, 'నన్ను శాలువాను తీసు కొమ్మని బాబా నాకు చెప్పలేదు.' అని అన్నాడు. ఏదైనా దృష్టాంతం లేనిదే నేను తీసుకోనని అన్నాడు. అప్పుడు కాకా సేహెబ్ దీక్షిత్ శాలువాను తీసు కోవాలా వద్దా అని బాబాను ప్రశ్నిద్దామని అనుకున్నాడు. అప్పుడు ఒక చీటిపై 'తీసుకో' అని రెండవ చీటిపై 'వద్దు' అని వ్రాసి బాబా ఫోటో ఎదుట వుంచాడు. ఒక బాలుని పిలిచి దానిలో నుండి ఒకటి తీయించారు. అందులో తీసుకో అని వచ్చింది. అప్పుడు మాధవరావు సందేహము లేకుండ స్వీకరించాడు. బాబా మన వెంటనే వున్నాడని కాకా సంశయం తీరింది. బాబాకు అంకితమైన శరీరంపై తనకు హక్కు లేదని తలచాడు. అతను లక్షల లాభాన్ని కూడా వదలుకున్నాడు. ఆమరణాంతం ఆ భావంతోనే వున్నాడు. కాకా గురు నామస్మరణ చేస్తూ క్రీ.శ.**1926** జులై **5** నాడు బాబాలో ఐక్యమయ్యాడు.


**ఆనందరావు కలలో చూసిన దృశ్యము :** ఆనందరావు ఇలా చెప్పారంభించాడు. 'మహా సముద్రములో నేను నడుము వరకు నీటిలో నిలబడి వున్నాను. అకస్మాత్తుగా అక్కడ రత్నఖచిత సింహాసనముపై బాబా కూర్చుని ఉండెను. వారి పాదములు నీటిలో ఉండెను. అట్టి మనోహర దృశ్యము చూసి నేనెంతో ఆనందించాను. అది నిజముగా జరుగుచున్నటులనే వుండెను. అది స్వప్నమని అనిపించలేదు. అక్కడే

వున్న మాధవరావు బాబా పాదములకు వందనము చేయుమని చెప్పాడు. నాకు కూడా బాబా చరణాలకు నమస్కరించాలని కోరిక ఉండెను. కాని వారి పాదాలు నీటిలో వున్నాయి. నేనెలా వాటిపై శిరస్సుంచి నమస్కరించను? నాకేం తోచటం లేదు. ఇప్పుడెలా చేయాలి అని నేను మాధవరావుతో అన్నాను. అప్పుడు బాబాతో శ్యామా, 'దేవా! నీటిలో వున్న మీ పాదాలు మీదకు తీయండి' అని వేడుకున్నాడు. అప్పుడు బాబా తన పాదాలను నీటి నుండి యటికి తీసాడు. వెంటనే నేను వారి పాదములు పట్టుకొని మొక్కితిని. బాబా అతనిని ఆశీర్వదిస్తూ, 'నీకు శుభం కలుగుతుంది. నీవేం భయపడ నవసరం లేదు. మాధవరావుకు పట్టు శాలువాను కొని పెట్టు. నీకు మంచి జరుగుతుంది.'అని అన్నాడు అంటూ స్వప్న వృత్తాంతాన్ని వివరించాడు.

గురువు చరణాలపై శిరస్సునుంచి వారి శరణు జొచ్చి వారి ఉపదేశాలు శ్రద్ధగా పాటించాలి. మన గురించి మన కంటే గురువుకే ఎక్కువగా తెలుస్తుంది. శిష్యులకు కావలసినవి వారే నిర్ణయిస్తారు. గురువు మన గురించి ఏది చెబితే దానిని మనస్ఫూర్తిగా ఆదరించాలి. వారి ముఖ్య ఉపదేశాలు చింతనలో ఉంచుకొని ధ్యానం చేయాలి. 'ఏ సాధువైనా సరే ఒకటే. వారి వచనాలను అవమానించకండి. బాబానే కన్న తల్లిగా సహకరిస్తారు. నిజంగా తల్లికి తన బిడ్డలపై ఎంత ప్రేమ వుంటుందో బిడ్డలకు తెలియదు. సాధువులు సృష్టిలో ఎంత మంది ఉన్నా మన తండ్రి మన తండ్రియే.' అని అన్న బాబా మాటలను హృదయ ఫలకంపై వ్రాసుకోండి. వారి వచనాలనెప్పుడూ మరిచి పోకూడదు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *



# అధ్యాయము 46

(శ్యామా కాశి గయ ప్రయాణము , మేకల జన్మ వృత్తాంతము)

**సాయి బాబా నిరాడంబర భక్తులను రక్షించుట:** శ్రీ సాయి బాబా చరణాలను స్మరించేవారు ధన్యులు. బాబా దర్శనభాగ్యము పొందే వారు అదృష్టవంతులు. సాయి బాబా ప్రస్తుతం అదృశ్యరూపములో వున్నప్పటికి భక్తి భావమున్నవారికి జాగృతములో వున్నట్లుగానే సమాధి నుండే అనుభవాలు కలుగచేస్తాడు. కళ్ళకు కనిపించని అతి సూక్ష్మ మైన దారంతో దేశవిదేశాలలోని భక్తులను కూడా తమపాదాల చెంతకులాక్కుని తల్లి తన బిడ్డలను ప్రేమించినట్లుగా సాయి తన హృదయానికి హత్తు కుంటాడు. వారు ఎక్కడ వుంటారో తెలియక పోయినప్పటికి మన వెన్నంటి నీడలా వున్నానని అనుభవాలు కలుగ జేస్తారు. జ్ఞానులు, పండితులు, అహంకారంతో సంసార గుండం లో మునిగి పోతారు. సాయి బాబా నిరాడంబర భక్తులను రక్షించును. కాని తనకెట్టి సంబంధం లేనట్లుగా కనిపించును. బాబా అన్ని పనులు నెరవేర్చినప్పటికి ఏమియు చేయని వాని వలె నటించును. వారిని ఎవరూ తెలుసుకోలేరు. మన శరీరమును, వాక్కును, మనస్సును బాబా చరణాలకు అర్పించి నిరంతరం బాబా నామస్మరణ చేస్తే మన పాపాలు ప్రక్షాళన మవుతాయి. బాబా కోరికలున్న వారి కోరికలు తీర్చి నిష్కాములను చేసి వారిని సుఖ ధామము చేర్చును. బాబా మధురనామము జపించుటయే భక్తులకు సులభ సాధనము. ఈ సాధన వలన భక్తుల పాపములు రజ స్తమోగుణములు నశించును. క్రమంగా సత్వరజోగుణం అభివృద్ధి అయి ధార్మికత్వము అలవడును.

**బాబా శ్యామాకు గయ యాత్రలో దర్శనము :** కాకా సాహెబ్ కుమారుని వుపనయనానికి నాగపూర్‌కు మరియు చందోర్కర్ కుమారుని వివాహానికి గ్వాలియర్‌కు రమ్మని బాబాను ఆహ్వా నించారు. బాబా శ్యామాను తీసుకొని వెళ్ళండి.. కాశి, ప్రయాగలు చూసు కొని శ్యామా కంటే ముందుగానే వస్తాను. నేను రావటం ఎంత సేపు'అని అన్నాడు. మాధవరావు ఆదరపూర్వకంగా, 'బాబా! ఉపనయనం అయిన తర్వాత గ్వాలియర్ నుండి కాశి గయ వెళ్ళి రావాలని ఉంది మరి వెళ్ళి రావాలా?' అని ప్రార్థించాడు. బాబా 'ఈ విషయాన్ని అడగాలా. వెళ్ళి రా! అప్రయాసంగా మంచి అవకాశం లభిస్తే దానిని జారవిడవకుండా ఉపయోగించు కోవాలి.' అని అనుజ్ఞనిచ్చాడు శ్యామా అప్పాకోతే తో సహా బయలు దేరాడు. వారు అక్కడ ఉపనయనం, వివాహాము చూసుకొని కాశి వెళ్ళి రెండు నెలలు అక్కడ వుండి గయకు బయలు దేరారు. వారు ప్రయాణం చేస్తుండగా గయలో ప్లేగు వ్యాపించి అక్కడ ప్రజలు వ్యాకులపడుతున్నారని తెలిసింది. రైలు గయ చేరుకునే వరకు రాత్రి చీకటి పడింది. వారు ఆ రాత్రి ధర్మశాలలో విశ్రమించారు. వారిద్దరు ఒక పాండా యింటిలో దిగారు. ఇంట్లో కూర్చోగానే వారి యెదుట సాయి బాబా ఫోటో కనిపించింది. అది చూసి మాధవ రావు మైమరిచాడు. అతని శరీరం పులకించింది. అంత దూరంలో వున్న గయలో కూడా బాబా ఫోటో కనబడుతుందని అతను ఊహించలేదు. అతను అమితాశ్చర్యపడ్డాడు. అతని కళ్ళనుండి ఆనందభాష్పాలు శ్యామా మాత్రం తన సాయి ఇప్పుడు తన కంటే ముందు ఎలా ఇక్కడ ప్రకటమయ్యాడో అని ఆలోచిస్తున్నాడు. 'శ్యామా కంటే ముందు కాశి ప్రయాగలు దర్శించుకొని వస్తా' అని అన్న బాబా మాటలు గుర్తుకు వచ్చాయి.

గయ లోని పాండా గొప్ప శ్రీమంతుడు. మాధవ రావుకు చక్కనైన సదుపాయాలు చేసి బాగా సత్కరించాడు. అతనిని ఏనుగుపై కూర్చుండ బెట్టి తాను పల్లకిలో కూర్చుని ఆనందోల్లాసాలతో విష్ణు

పాదాల వద్దకు తీసుకొని వెళ్ళాడు. అక్కడ పూజ అభిషేకార్చనలు చేయించాడు.

**బాబా రెండు మేకలను అధిక ధరకు కొనుట :** బాబా మనుష్యులనేకాక ఇతర ప్రాణులను కూడా ఎంతో ప్రేమగా చూసేవారు. ఒక సారి లెండి తోటనుండి మసీదు వచ్చేటప్పుడు, బాబాకు మేకల మంద కనిపించింది. అప్పుడు ఆ మందను చూడగానే పరమానంద పడ్డాడు. ఆ మందపై అమృత దృష్టి ప్రసరింపచేసాడు. అప్పుడప్పుడు మేకలను కొని యజమాని అడిగినంత డబ్బు ఇచ్చి ఒకటో రెండో మేకలను కొని తెచ్చి, వానిని కొండాజీ వద్ద జాగ్రత్తగా పెంచడానికి ఉంచేవాడు. ఆ గుంపులోని రెండు మేకలపై బాబా కరుణా దృష్టి పడింది. బాబా హృదయం ద్రవించింది. వాటి వెన్ను తట్టి నిమిరాడు. వాటిని **32** రూపాయలనిచ్చి కొని తెచ్చాడు. బాబా ప్రవర్తనకు భక్తులు ఆశ్చర్య పడ్డారు. **24** రూపాయలు ఖరీదు చేసే మేకను **16** రూపాయలు ఎక్కువ యిచ్చి కొన్నాడు. అందరూ యిదేం చిత్రమనుకున్నారు. తాత్యా, శ్యామాలకు బాబా చేసిన బేరం అసలు నచ్చలేదు. 'బాబాకు డబ్బు విలువ తెలియదా? ఆయనెలా మోసపోయాడు'అని బాబాపై విసుక్కున్నారు. వారు బాబాను నిందించారు కూడా. ఏదో వింతను చూడటానికి వచ్చినట్టు జనం గుమి కూడారు. శ్యామా, తాత్యా నిందించినప్పటికి కూడా బాబా కోపగించుకోలేదు.

**మేకల పూర్వజన్మ వృత్తాంతము :** తాత్యా మరియు శ్యామాలు కంగారు పడుతూ వుంటే వారి మనస్సును శాంతింప చేయటానికై వారికి మేకల పూర్వజన్మ వృత్తాంతం చెప్పాసాగాడు. ఈ మేకలు పూర్వజన్మలో దైవవశాత్తు మానవులుగా వుండేవారు. ఇద్దరూ అన్న దమ్ములు. వారికి మొదట ఒకరిపై ఒకరికి ప్రేమ వుండేది. ద్రవ్య లోభం వలన ఒకరినొకరు కొట్టుకొని చని పోయారు. ఆ విధంగా మానవ

జీవితాన్ని అంతం చేసుకున్నారు. తమ కర్మలను అనుభవించటానికై మేకలై జన్మించారు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- పంచ భూతముల రూపముగాను మనస్సు మొదలగు ఇంద్రియ రూపములుగాను, అహంకార రూపముగాను, ఎనిమిది విధములుగా విభజింపబడి వున్న ప్రకృతి నాఆధీనమైనది.
- వి విధ పేర్లతో రూపాలతో నేనే ఉన్నాను. ప్రపంచము లోని అన్ని వస్తువులలో నేనే ఉన్నాను.
- 'ఓం' ప్రణవం నా పేరు. పదాన్ని కూడా నేనే. నేనే ఆత్మను. అన్ని ప్రదేశాలలో ఆత్మ నిండి ఉన్నది, యిక వేరే కోరికలు ఎందుకు.
- ఈ కోరికలు సూర్యుని కిరణాలతో కరిగిన మంచులా ఆత్మ సాక్షాత్కారముతో కరిగి పోవును.
- . నేను విరాట్ స్థూల శరీరాన్ని కాను, సూక్ష్మ శరీరాన్ని కాను, కేవలం సనాతన సాక్షిని.
- చైతన్య ఘనుడను అను జ్ఞానం కలిగి మనోవృత్తి భగవంతుని వైపు మరలుటే భక్తి. నేను సత్స్వరూప బ్రహ్మను. నిత్య, శుద్ధ, బుద్ధ ముక్తుడైన వాసుదేవుడనని తెలుసు కోవాలి. ఇదే శ్రద్ధాభక్తి సహితమైన నా పూజ.
- నా ప్రాణం పోయినా నేను అన్న మాట తప్పను. నా నోటిమాట వ్యర్థం కాదు.

# అధ్యాయము 47

(శ్రీ సాయి ముఖ స్తుత కథనము)

**శ్రీసాయి బాబా యోగులందరిలో మకుటమణి :** శ్రీ సాయిని క్షణం పాటు దర్శించినా జన్మ జన్మల దుఃఖాలు నశించిపోతాయి. పరమానందం కలగును. వారి దయార్ధదృష్టి మనపై పడినచో మన కర్మబంధములు విడిపోయి పరమానందము పొందెదము. గంగా మాత లోకుల పాపాల నన్నింటిని కడిగి పునీతం చేస్తుంది. కల్మషాన్ని తను మిగుల్చు కుంటుంది. తనలోని మలినాన్ని శుభ్రం చేసుకొనడానికి సాధువుల పాదరజను కోసం ఎదురు చూస్తుంది. సాధు పుంగవుల పాదాలు నన్నెప్పుడు తాకుతాయోకదా, నా జలంలో వారెప్పుడు స్నానం చేస్తారో అని ఆతురతతో ఎదురు చూస్తుంది. యోగులలో మకుటమణి శ్రీ సాయి సమర్థులు. కల్ప వృక్షం కింద కూర్చున్న వారికి కోరికలు అంకురించగానే నెరవేరుతాయి. సూర్యుని ఇంట్లో దీపం లేదని ఎవరైనా చింతిస్తారా? నిరంతరం అమృతపానం చేసేవారు విషయ సుఖం కోరుకుంటారా? సాయి మనకు రక్షకుడై వున్నంతవరకు మనకేమి భయం. నిత్యం లౌకికమైన ధర్మ కార్యాలనాచరించాలి. లేకపోతే అది అధర్మం. అది మరణానికి దారి తీయును. ఎవరు ఏవిధంగా కర్మనాచరిస్తే వారు ఆ విధంగా జన్మ పొందుతారు. మరల మరల జన్మించాలని కోరుకునే వారు సత్కర్మముల నాచరించి తాము కోరుకున్న జన్మను పొంద వచ్చును. పుణ్యం ఎలా సంపాదించుకుంటే శరీరాలు అలాగే ప్రాప్తిస్తాయి. అందువలన శరీరం పతనానికి ముందు గాని అమూల్యమైన మానవ జన్మను వ్యర్థం చేసుకోకుండా ఆత్మను తెలుసు కోవాలి.

**సర్పము కప్ప జన్మజన్మల బంధము :** బాబా ఒకనాడు చెట్ల నీడలో కూర్చుని చిలుము నింపడానికి ప్రయత్నము చేసే సమయములో ఒక కప్ప బెక బెక మని శబ్దం చేసింది. అదే

సమయములో ఒక బాటసారి వచ్చి బాబాకు నమస్కారము చేసి బాబా దగ్గర కూర్చున్నాడు. వారు మాట్లాడుతూ చిలుము పీలుస్తూ వుండగా మళ్ళీ కప్ప గట్టిగా అరవ సాగింది. బాటసారి అదేమిటని ప్రశ్నించాడు. 'నదీ తీరంలో ఒక కప్ప కష్టములో చిక్కుకున్నది. పూర్వ జన్మలో ఎలా చేస్తే అలాగే ఈ జన్మలో అనుభవించాలి. కర్మ అనుభవించక తప్పదు. అని బాబా అన్నాడు. ఆ బాటసారి ఆ నదీ ఒడ్డు దగ్గరికి వెళ్ళి చూసాడు. ఒక కప్పను పెద్ద పాము నోటిలో చిక్కి ఏడుస్తున్నది. బాబాతో ఆ విషయము చెప్పగా ఆ యిద్దరూ పూర్వ జన్మలో భయంక పాపాలు చేసి అవి అనుభవించడానికి ఇప్పు డిలా జన్మించారని చెప్పాడు. ఆ బాటసారి వాటిని చూసి వాటి ఖర్మ ఇంతేనని అనుకున్నాడు. అప్పుడు బాబా 'నేను బాబాను అన్నింటికి తండ్రిని నేనిక్కడ కూర్చుని వుండగా ఆ పాము కప్ప నెలా చంపుతుందో చూస్తాను. అలా జరుగుతే ఇక నేనుండి లాభమేమిటి? నేను నా మసీదు  వదలి ఇంత దూరము వచ్చాను. ఇక్కడ కూర్చున్నాను. భగవంతు నన్ను ఇక్కడకు పంపించాడు. నా ముందే పాము కప్పను తింటుందా! నేనా కప్పను విడిపిస్తాను చూడు. నీవు చిలుము నింపి వెలిగించు'అని అన్నాడు. కొంచెము చిలుము పీల్చి సర్పము తో గంభీర స్వరముతో బాబా యిలా అన్నాడు. 'ఒరే వీర భద్రప్పా! ఈ చెన్న బసప్ప ఇంకా నీకు శత్రువేనా? ఈ సర్పము రూపమునకు వచ్చి కూడా నీకు పశ్చాత్తాపము కలుగలేదా?ఇప్పుడైనా సిగ్గు పడరాదూ! నీ శత్రుత్వము వీడి సుఖంగా వుండరాదూ!'అని అన్నాడు. ఆ మాటలు విని ఆ సర్పము కప్పను వదలి వేసింది. నీటి వద్ద వున్న రంధ్రము లోనికి దూరి పోయింది. బాటసారి ఈ వింత చూసి ఈ వీర భద్రప్ప ఎవరు? చెన్నబసవప్ప ఎవరు? వారిద్దరి వైరమేమిటి?అని అడిగాడు. బాబా చిలుము పీల్చిన తర్వాత చెప్పుతానని వెళ్ళి పోయారు.

పూర్వజన్మలో బాబా వుండే ప్రదేశమునకు రెండు క్రోసుల దూరములో ఒక పుణ్క క్షేత్రముండేది. అక్కడ శిథిలమైపోయిన ఒక

దేవాలయ ము ఉండేది. దానిని పునరుద్ధరించడానికి అక్కడి వారంతా కలిసిచందాలు వేసుకొని ఒక శ్రీమంతుడిని ధర్మకర్తగా నియమించి వసూలైని డబ్బు యిచ్చారు. కాని అతను ఆ డబ్బంతా తనే ఖర్చుచేసుకున్నాడు. రెండవ సారి కూడా ఆ ఊరి ప్రజలు చందాలు వేసుకొని అతనికి డబ్బు యిచ్చారు. అయినా అతను ఏపని చేయించ లేదు. ఒకనాడు శ్రీమంతుని భార్య కలలో కనిపించి గోపురము నిర్మించమని చెప్పాడు. ఆమె భర్తతో చెప్పగా భర్త ఆమె వద్దగల స్త్రీ ధనము రూ.**1000** కూడా తీసుకొని 'దుబకి'అనే స్త్రీ తన వద్ద తాకట్టు పెట్టిన భూమిని గుడికి దానము చేపించాడు. కొంత కాలానికి తుఫాను వ్చచి అందరూ చనిపోయారు. ఆ ధనికుడు ఒక పేద కుటుంబములో వీర భద్రప్పగా జన్మించాడు. అతని భార్య ఒక పూజారి ఇంటిలో గౌరిగా జన్మించింది. మరియు దుబకి ఒక గురువని కుటంబములో మగ శిశువుగా, చెన్న బస్సపగా జన్మించాడు. బాబా సలహా పై గౌరికి మరియు వీరభద్రప్పతో వివాహము చేసారు. దుబకి తాకట్టు పెట్టిన స్థలము విలువ చాలా పెరిగింది. ఆ స్థలము గురించి చెన్న బసప్పకు మరియు పూజారి కూతురు గౌరి వాళ్ళకు భేదాభిప్రాయాలు వచ్చాయి. బాబా మాత్రము ఆ స్థలము గౌరికి చెందునని చెప్పాడు. వీర భద్రప్ప చెన్న బసప్పను నరుకుతానని పైపైకి వచ్చాడు. అప్పుడు చెన్న బసప్పను వీర భద్రప్ప చేతిలో చావనివ్వనని బాబా అభయ మిచ్చాడు. కొంత కాలానికి వీరభద్రప్ప వాతంతో చనిపోయాడు. చెన్న బసప్ప మరణించాడు. చెన్న బస్సప కప్పగా మరియు వీరభద్రప్ప పాముగా జన్మించి ఆ కక్షలు ఇంకా తీసుకుంటుంటే బాబా తనిచ్చిన మాట ప్రకారము చెన్న బస్సప్ప అయిన కప్పను కాపాడాడు. భగవంతుడు ఆపదలో వున్న భక్తుని కాపాడటానికి వస్తాడు. ఆ దేవుడే నన్నిక్కడికి పంపాడు. అని బాబా అన్నాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 48

(సాశంక భక్త అనుగ్రహము)

సపత్నేకర్ : సపత్నేకర్ అక్కల్ కోటలో వకీలుగా వుండేవాడు. అతను రాత్రింబగళ్ళు వకీలు పరీక్షకు చదివే రోజులలో అతని వద్దకు షేవడే అనే ఓ విద్యార్థి వచ్చాడు. ఇతర విద్యార్థులు కూడా అక్కడికి వచ్చి ఎవరు ఎలా చదివారో చర్చించుకున్నారు. షేవడే ప్రశ్నలకు సమాధానం సరిగా చెప్పలేక పోయాడు. మిగతా స్నేహితులు షేవడేతో 'పరీక్ష ఎలా వ్రాస్తావు?'అని హేళన చేసారు. అప్పుడు షేవడే 'నేను సరిగా చదువక పోయినా పర్వా లేదు. నా సాయి బాబా ఎట్లైనా పాస్ చేయిస్తారు. నాకు వారిపై పూర్తి విశ్వాసమున్నది. నేను బాధ పడవలసిన పని లేదు'అని అన్నాడు. ఈ మాటలు విని సపత్నేకర్ ఆశ్చర్యపడ్డాడు. షేవడే వద్దకు వచ్చి, 'నీవు ఇంత విశ్వాస పూర్ణంగా వర్ణించిన ఆ సాయి బాబా ఎవరు?అతన్నెందుకు ఇంతగా నమ్ముచున్నావు? అతను ఎక్కడుంటాడు?'అని షేవడేను అడిగాడు. 'అహమ్మద్ నగర్ జిల్లాలోని షిరిడి గ్రామంలో ఒక మసీదు లో ఒక ఫకీరు వుంటాడు. వారి పేరు సాయి బాబా. వారు ప్రసిద్ధి చెందిన మహాపురుషులు. ఎంతో అదృష్టవంతులకు గాని అతని దర్శన భాగ్యము లభించదు'అని షేవడే అన్నాడు. సాయి బాబా మాటకు తిరుగులేదు. వారు చెప్పింది అక్షరాలా జరుగును. వారి మాటపై నాకు పూర్తి నమ్మకము. నేను యిప్పుడు ఎంతప్రయత్నం చేసినా పరీక్ష పాస్ కాను. కాని వచ్చే సంవత్సరము సులభంగా వుత్తీర్ణున్ని అవుతాను. ఇది సత్యం అని చెప్పాడు. సపత్నేకర్‌కు ఆ మాటలు హాస్యాస్పదంగా తోచినవి. అతను స్నేహితుని ధైర్యమునకు నవ్వి, బాబాను కూడా వెక్కిరించాడు.

సపత్నేకర్‌కు అకస్మాత్తుగా దురదృష్టం చుట్టుకుంది. తనపై విరక్తి కలిగింది. అంతలో అతనికి షేవడే మాటలు, బాబాపై వున్న

సమ్మకం గుర్తుకు వచ్చింది. తొందరగా తన తమ్ముడు పండిత రావును వెంటపెట్టుకొని షిరిడి బయలు దేరాడు. సపత్నేకర్ దూరం నుండే సాయి దర్శనం చేసుకొని ఆనం దించాడు. అతని సమీపానికి వెళ్ళి సాష్టాంగపడి ఒక టెంకాయను సమర్పించాడు. ఎదురుగా వెళ్ళి కూర్చున్నాడు. బాబా సపత్నేకర్‌ను 'చల్ హట్' అని అరిచాడు. బాబా కటాక్షము పొందుటకు ఎవరి సలహానైనా తీసుకోవలయునని ప్రయత్నించాడు. కొందరు బాలాషింపి పేరు చెప్పారు. అతను బాలా షింపిని కలిసి బాబా దర్శనం కలిగించుమని వేడుకున్నాడు. సపత్నేకర్ బాబా ఫోటో నొక్కదాన్ని కొనుక్కొని బాలాషింపి వెంట బాబా వద్దకు బయలు దేరాడు. బాలాషింపి బాబా ఫోటోను బాబా చేతికిచ్చి 'ఈ ఫోటో ఎవరిది?' అని అడిగాడు. ఈ ఫోటో ఇతని సఖునిది'అని సపత్నేకర్‌ను చూపించి నవ్వాడు బాబా. అక్కడున్న వారంతా కూడా నవ్వారు. 'బాబా మీరన్నదానికి అర్థ మేమిటి?'అని బాలాషింపి అడిగాడు. సపత్నేకర్ నమస్కరించగా బాబా మళ్ళీ 'చల్ హట్'అని తరిమాడు. నాకేది దారి అని బాబా ముందు చేతులు జోడించి కూర్చున్నాడు 'ఇక్కడి నుండి వెళ్ళి పో.'అని మళ్ళీ ఆజ్ఞాపించాడు. సపత్నేకర్‌కు ఏమి చేయవలెనో తోచలేదు. 'బాబా! మీ ఆజ్ఞను ఎవరు ఉల్లంఘించలేరు. ఈ క్షణమే బయలుదేరి వెళ్ళిపోతాను, దయయుంచి త్వరగా మీ పాద సన్నిధికి వచ్చేలా ఆశీర్వదించుము.' అని వేడుకొని తన గ్రామం వెళ్ళి పోయాడు. ఒకసారి అతని భార్యకు ఒక వింత కల వచ్చింది. కలలో కుండను తీసుకొని నీటికి వెళ్ళింది. అక్కడ వేపచెట్టు క్రింద తలకు ఒక రుమాలు చుట్టుకొని ఒక ఫకీరు ఆమె వద్దకు వచ్చి, 'అమ్మాయి నువ్వెందుకు శ్రమ పడతావు? నేను స్వచ్ఛజలంతో నీ కుండ నింపెదను.'అని అన్నాడు. ఆ విషయము తెలుసుకొని సపత్నేకర్ వెంటనే షిరిడి బయలుదేరాడు బాబా సపత్నేకర్ వైపు చేయి చూపుతూ, 'నేనతని పుత్రున్ని చంపినానని నాపై నేరారోపణ చేస్తున్నాడు. నేను

లోకుల బిడ్డలను చంపుతానా? ఈ మసీదుకు వచ్చి ఏడుస్తున్నాడెందుకు? నేను అతని పుత్రున్ని మరల అతని భార్య గర్భం లోనికి తీసుకొని వస్తాను.'అని అంటూ, సపత్నేకర్ తలపై వరద హస్తాన్నుంచి, 'చూడు ఈ పాదాలు ముదుసలివి నాపై పూర్తి విశ్వాసముంచు. నీ చింత, అశాంతి, దూరమై నీవు త్వరలో కృతార్థుడ వవుతావు' అని అన్నాడు. బాబా మాటలు విని అతను కన్నీళ్ళతో బాబా పాదాలు కడిగాడు. ఆ రోజు చావడి పుత్సవాన్ని ఉత్సాహంగా తిలకించాడు. అతనికి బాబా పాండురంగని వలెనే కనిపించాడు. అది బాబా యొక్క లీల. సపత్నేకర్ తన వూరికి వెళ్ళాలని బాబాను ఆజ్ఞ కోరగా, 'భోజనం చేసి వెళ్ళు' అని బాబా సపత్నేకర్ చేతిలో ఒక రూపాయి పెట్టాడు. మరల బాబా ఒకే రూపాయి అడిగి తీసుకున్నాడు. తర్వాత బాబా అతనికి ఒక కొబ్బరి కాయనిచ్చి, 'దీనిని నీ భార్యవడిలో వేయి. నీ బాధలన్నీ మరిచి పోయి సుఖంగా వెళ్ళు.'అని చెప్పాడు. పన్నెండు నెలల తర్వాత అతని భార్య గర్భం ధరించింది. మగ శిశువును ప్రసవించింది. ఎనిమిది నెలల తర్వాత బార్యాభర్తలిద్దరూ బాబా దర్శనానికి వచ్చి తమ పుత్రుని బాబా పాదాల చెంత వుంచారు. సపత్నేకర్ బాబాతో, 'మీ ఉపకారం మేమెలా తీర్చగలం. మేము ఏమి ఎరుగని దీనులం. పామరులం. అనాధలమైన మాపై మీ దయ ఎల్లప్పుడూ వుండాలి. మీ పాదాల చెంత కొంత చోటివ్వండి. జాగ్రదా వస్థలోవలె స్వప్నంలో కూడా ఆలోచనలతో మనస్సు అస్థిరంగా వుంది. దానికి మీ భజనలో విశ్రాంతిని కలిగించండి.' అని వేడుకున్నాడు. అతని పుత్రునికి మురళీధరుడని పేరు పెట్టారు. తర్వాత అతనికి యింకా యిద్దరు పుత్రులు కలిగారు. వారి పేర్లు భాస్కర్, దినకర్. వారిని కూడా వెంట పెట్టుకుని మరల బాబా దర్శనానికి వచ్చారు. బాబా మాటలు వృథా కావని సపత్నేకర్ భార్యా భర్తలు గ్రహించారు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 49

(సత్పురుష పరీక్ష మనోనిగ్రహము)

**సాయి అవతారము :** సాయి బాబా సర్వత్రా నిండి వున్నాడు. గంధర్వ యక్ష సురాసురుల్లో సాయియే వున్నాడు. సాయియే సర్వ వ్యాపకుడు. ఇంతటి వాడైనా సాయి ఆకారం స్వీకరించాడు. సదా నిరాకారంగానే వుంటాడు. సాయి లోక సంగ్రహము కోసం అవతారం గ్రహించాడు. సాయి భక్తి ప్రభావము మాత్సర్యం తొలగించి, ధైర్యము, ఐశ్వర్యము, శాంతి కలిగించి భక్తులను కృతకృత్యులను చేస్తుంది. సగుణ సాకార మూర్తిని ఆశ్రయించక పోతే నిరాకార పరమాత్మను తెలుసుకోవడం అసాధ్యం.

**భక్తిమార్గము, జ్ఞానమార్గము :** సత్పురుషులను తెలుసుకొనడానికి రెండు మార్గములు. ఒకటి భక్తిమార్గము, రెండవది జ్ఞాన మార్గము. జ్ఞానమార్గము అతి కష్టమైనది. కాని భక్తిమార్గము సులభమైనది. అయినా సులభంగా లభించే భక్తి ఎందుకు కోరుకోరు? అది మహా భాగ్యముంటేనే లభించును. కోటి జన్మల పుణ్యఫలం వుంటేనే సత్పురుషుల సందర్శన భాగ్యం లభించును. వారితో కలయిక జరిగినప్పుడు భక్తి వికసిస్తుంది. మన భక్తి ఎలా వుంటుదో మనస్సు కూడా అలాగే వుంటుంది. ఎల్లప్పుడూ విషయ భోగాలను గురించి ఆలోచిస్తూ సాయి చెంతకు చేరితే వారు వెంటనే యిస్తారు. పరమార్థన్ని కోరితే పరమార్థాన్ని కూడా యిస్తారు.

**హరికనోబా(హరి బాపు) బాబాను పరీక్షించుట :** సాయి మహారాజు మహిమలు స్నేహితుని ద్వారావిని, హరికనోబా బొంబాయి నుండి స్నేహితుని వెంటపెట్టుకొని షిరిడి వచ్చాడు. అతడు స్వయంగా భక్తుడు కాదు. సాయి యొక్క మహిమను తెలుసుకోవాలని అనుకొన్నాడు. బాబా హరికనోబా తన చమత్కారము చూపించాలని అనుకున్నాడు. జరీ తలపాగా చుట్టుకొని మంచి పాదరక్షలు తొడుగుకొని

సాయిని దర్శించడానికి వచ్చాడు. మసీదు వద్దకు రాగానే సాయిని దూరం నుండి చూసి దగ్గరకు వెళ్ళి నమస్క రించాలని అనిపించింది. కాని తన పాదరక్షలు పోతాయేమోనని అతని భయము. అయినా వాటిని ఒక మూల జాగ్రత్త పరిచి పైకి వెళ్ళాడు. భక్తిగా సాయికి సాష్టాంగపడి. విభూతి ప్రసాదము తీసుకొని, తిరిగి వాడాకు బయలుదేరాడు. క్రిందికి దిగి పాదరక్షలు వేసుకోవాలని చూస్తే అవి కనిపించలేదు. అతనికి భోజనం కూడా సహించ లేదు. చేతులు కడుక్కోవడానికి బయటికి వచ్చాడు. అక్కడికి ఒక మరాఠి కుఱ్ఱవాడు అతని చెప్పులను ఒక కఱ్ఱకు తగిలించి పైకి జండాలా పట్టు కొని వచ్చాడు. 'ఈ కఱ్ఱ పట్టుకొని 'హరికా బేటా, జరీకా ఫేటా' అని అరుచు కుంటూ వెళ్ళు అని నన్ను బాబా పంపాడు'అంటూ వెళ్ళు చున్నాడు. ఆ కుఱ్ఱవాని అరుపులు హరి బావూ విన్నాడు. అతను తన చెప్పుల ను గుర్తించాడు. 'ఇదిగో ఇదే నా ఫేటా (తలపాగా) జరీకా ఫేటా సరిగా చూడు. నీ అనుమానా లన్నీ పోతాయి. ఈ చెప్పులకు నేనే యజమానిని. నువ్వే తెలుసు కుంటావు. అని జరిపాగా చూపించాడు. అదంతా విని ఆ పిల్ల వానికి సత్యం అర్థమైంది. అవి ఆ మనిషివేనని నమ్మాడు. అవి హరి బావూకు ఇచ్చి వేసాడు. పోయిన చెప్పులు దొరికాయని హరి ఊపిరి పీల్చుకున్నాడు. సాయి బాబా మహాత్ముడన్న అనుభవం కలిగింది. తన తలపాగా అందరికి కనిపించును, తను ఇదే షిరిడికి మొదటిసారి రావడం. తన పేరు హరి అని ఎవరికి తెలియదు. తన తండ్రి పేరు కన్హోబా, అందువల్ల 'క' యొక్క పుత్రుడనని చాలా బాగా తెలియ చేసాడు. అని ఆశ్చర్యపడ్డాడు, అనుమానించాను కదా! అని పశ్చాత్తాప పడ్డాడు.

### సోమ దేవర స్వామి బాబాను పరీక్షించుట : క్రీశ.1906

సోమదేవర స్వామి అనే వ్యక్తి బాబాను పరీక్షించవలననే వుద్దేశ్యంతో వచ్చాడు. వీరి మఠం హరిద్వారంలో కలదు. వీరు 'హరిద్వార స్వామిగా' ప్రసిద్ధి. కాకా సాహెబ్ దీక్షిత్ తమ్ముడు బాయాజీ నాగపూర్లో నివసించు చుండెను. అతను బద్రీ కేదార్ యాత్రలు ముగించుకొని

తిరుగు ప్రయాణంలో సోమదేవర స్వామిని కలిసాడు. తర్వాత ఒక సారి బాయిజీ నుండి ఒక పరిచయ పత్రము తీసుకొని స్వామి షిరిడి పయనమయ్యాడు. కోపర్‌గాం నుండి షిరిడికి టాంగాలో బయలు దేరాడు. స్వామికి దూరం నుండి మసీదు పై ఎగురుతున్న జండాలు కనిపించినవి. వాటిని చూడగానే మసీదు పై జండాలు ఎగుర వేయడం సాధువుల లక్షణమా? ఇటువంటి సాధువు అనుగ్రహము నాకనవసరము అంటూ తిరుగు ప్రయాణమునకు సిద్ధమైనాడు. మిగతా సహ ప్రయాణీకుల సలహా పై సాయి బాబా దర్శనానికి వెళ్ళాడు. సాయిని చూడ గానే స్వామి హృదయం ద్రవించిపోయింది. ప్రేమతో కళ్ళు చెమ్మగిల్లాయి. సాయి దర్శనంతో పరమానందము పొందాడు. తన ఆత్మకు విశ్రామధామం యిదే, యిక్కడే వుండిపోవాలని అనిపించింది. లోపల బయటా శాంతిని పొందాడు. మనసెక్కడ స్థిరపడుతుందో అదే నీ గురుస్థానమని తన గురువు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. మెల్ల మెల్లగా బాబా ముందుకు వెళ్ళాడు. సాయి సమర్థులు ఉగ్ర రూపంతో తిట్లను కురిపించాడు. ‘నీవిక్కడనుండి వెళ్ళిపో! మసీదు పైన జండాలను ఎగురవేసుకునే వారి దర్శనానికి ఎందుకు వచ్చావు? ఇక్కడ ఒక్క నిముషము కూడా వుండకూడదు. వెళ్ళు.’ అని కోపంగా అన్నాడు. ఆ సభామండపంలో స్వామికి బాబా మాటలు తన మనస్సు ప్రతి ధ్వనిలా అనిపించి సిగ్గు పడిపోయాడు. ‘వీరు నా అంతరంగము లోని విష యములను తెలుసుకున్న అంతర్యామి.’అని అనుకుంటూ పశ్చాత్తాప పడ్డాడు. ఇంత ప్రేమమయుడు నాపై కోపగించుటానికి కారణం నాదురాలోచనే ఇది వారి క్రోధం కాదు వారి బోధ అను కున్నాడు. సాయి కృపవలన నిర్మలుడై సంతుష్టుడై పరమ భక్తుడైనాడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 50

(అజ్ఞాన నిరసనము)

**పరమాత్మ :** జ్ఞానసంపన్నులు ఈ ఆధ్యాయాయము ఒకటికి రెండు సార్లు భక్తితో విశ్లేషణా పూర్వకంగా చదవండి. మనకు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఉపకారమునకు అంతులేదు. దానిని మనము ఏవిధంగా నైనా తీర్చలేము. మాతృ గర్భము నుండి జంతువుగానో అవిటి వాడిగానో జన్మించలేదు. భగవంతుని దయవల్ల జీవితాన్ని భగవంతునికి అర్పించాలి. ప్రతి జన్మ లోను తల్లి దండ్రులు వుంటారు. కాని ఈ జనన మరణ చక్రము నుండి ముక్తిని కలిగించే తల్లిదండ్రులు దొరకటం దుర్లభం. సద్గురువు జీవుని జనన మరణాలను నివారిస్తాడు. అతను సర్వవ్యాపి. అట్టి సద్గురువుకు నమస్కరిద్దాం. స్థూలము. ఇంద్రియములు సూక్ష్మమైనవి. ఇంద్రియాల కంటే మనస్సు పరమ సూక్ష్మము. మనస్సుకంటే బుద్ధి సూక్ష్మము. బుద్ధికంటే సూక్ష్మము పరమాత్మ. పరమహితుడైన పరమాత్మనే మన స్వస్వరూపము. ప్రాణేంద్రియ మనో బుద్ధులు ఆత్మయొక్క సూక్ష్మ శరీరం, పంచీకృత పంచ భూతాలనుండి విరాట్ స్వరూపముద్భవిస్తుంది. అదియే ఆత్మ యొక్క స్థూలరూపము. స్వ స్వరూపం లో స్థితులవటమే మోక్షము. దీని కంటే వేరే మోక్షము ఏదీ లేదు.

**అజ్ఞానం, జ్ఞానం, బ్రహ్మజ్ఞానం :** అజ్ఞానాన్ని తెలుసుకోవటానికి అజ్ఞాన నిరూపణ అవసరం.లేదు. బ్రహ్మజ్ఞానం అతీంద్రియం. అంటే ఇంద్రియాలతో తెలుసుకోలేనిది. అంటే దానిని సూక్ష్మ బుద్ధితో గ్రహించవచ్చును. అప్పుడు మనస్సులో ఓంకారం ప్రవేశిస్తుంది. ఈ ఓంకార బ్రహ్మ ధ్యానం చేస్తూ భగవంతుని స్మరణలో శరీరాన్ని త్యజిస్తే జన్మ సార్థకమౌతుంది.పరబ్రహ్మనుండి అవ్యక్తం, అవ్యక్తం నుండి మహత్తత్వం దాని నుండి అహంభావం జనించింది. జగత్తుయొక్క రూప లక్షణం మాయ, మాయ యనే అజ్ఞానాన్ని తొలగించడానికి అజ్ఞానాన్ని

వివరంగా వ్యాఖ్యానించడం అవశ్యకం. అజ్ఞానావరణను ఉపదేశంతో తొలగించు కోవాలి. వాస్తవమొకటైతే వస్తువు వేరుగా కనబడేది మాయ. జ్ఞానులు కూడా దాని యందు ఓడిపోతారు.

మానవులు తృష్ణా పాశంలో చిక్కుకుని జీవితమంతా గడిచి పోయినా కొంచెమైనా సుఖన్ని అనుభవించరు. ప్రజ్ఞావంతులు, శాస్త్ర పండితులు మావంటి వారు మరొకరు లేరని అభిమాన పడతారు. ఇది అశాంతికి కారణం. ఆ దురభిమానమే అజ్ఞానం. దానిని తొలగించు కొంటేనే జ్ఞానం ప్రకటమౌతుంది. జ్ఞానమనే రత్నం మట్టితో కప్పబడినా, అజ్ఞానమనే మట్టిని తొలగిస్తే జ్ఞానం ప్రకటమౌతుంది. నిజమైనవి తెలుసుకోలేక నకిలీ వస్తువులే నిజమని నమ్మి మోసపోయి తీసుకొనే వ్యక్తులనేకం. నకిలీ వస్తువులను ఏరి పారేయాలంటే మేధావుల బుద్ధి కూడా పని చేయదు. అది అజ్ఞాన కారణంగానే. అజ్ఞానం తొలగి పోతే సద్వస్తువులు మిగులును. గురూపదేశంతో అంధకారం పారి పోయి జ్ఞానం ప్రకటమౌతుంది. 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ' బ్రహ్మయే నిత్యసత్యం. అవిద్య మాయ సకలం భ్రమ. ఈ భ్రమ తొలగి పోవటమే జ్ఞానం. శరీరాభిమానం వున్నంత వరకు అజ్ఞానంలో వున్నట్లే మాయాపూరిత జగత్తు అజ్ఞానం నుండి ఉద్భవించింది. దీని వైభవం అజ్ఞానజనితం. ఏకత్వంలో అనే కత్వాన్ని తిలకించటం అజ్ఞానం. వేద శాస్త్ర జ్ఞానం కాని, మహా మేధస్సు కాని, గ్రంథావలోకనం కాని, పాండిత్యం కాని, విశ్వాన్ని విపరీత బుద్ధితో చూసే వారికి బ్రహ్మతత్వం దుర్గమం. శబ్దాలతో శబ్దజ్ఞానం కలుగుతుంది. కాని వస్తువు యొక్క విజ్ఞానం కలుగదు. గొప్ప గొప్ప శబ్ధ పండితులు ఆత్మ జ్ఞానం ముందు మిణుగురు పురుగుల వలె వెల వెల పోతారు. అజ్ఞాన నిరసనమే పక్తకు ధ్యేయం గా వుండాలి. భక్తి శ్రద్ధలతో భగవంతుని (పరమాత్మ) ధ్యానం చేస్తూ, ఆత్మ పరమాత్మకు భేదం లేదని తలుస్తూ ఉపాసన చేస్తే ఆత్మ ప్రసన్నమై తన తత్వా న్ని ప్రకాశింప చేస్తుంది. వారిని కరుణిస్తుంది. ఆత్మ స్వరూపం ముందు మహా పండితులు వెల వెల పోతారు.

పరమాత్మ తత్వం వాక్కు అగోచరం. దానిని శబ్దాలు ఎలా తెలుపుతాయి? ఆత్మను పరమాత్మ గా భావించి ఏకం చేయాలి. అలా చేసే ఉపాసకునికే ఆత్మ ప్రసన్నమవుతుంది. ఇంతకన్న వేరే సాధన లేదు.

ఆత్మస్థితి అదృశ్యంగా వుంటుంది. ఆత్మయే విశ్వానికి మూలం. అది నశించినట్లు కనిపిస్తుంది. కాని నశించదు. ఆత్మ నిరంతరము సత్యమై వుంది. కుండను పగలగొడితే ఆకారం పోతుంది. దాని అస్థిత్వమూ, దాని ఆధారమైన మట్టి నశించి పోదు. సర్వ తీర్థాల కంటే పావనమైనది జ్ఞానం. బ్రహ్మజ్ఞానాన్ని పొందలేని భజనలు వ్యర్థం. అజ్ఞానం వలన అంతఃకరణం మలినమై పోతుంది. ఆ మలక్షాళన భగవంతునిపై భక్తి లేకుండా జరుగదు. భక్తి లేకుండా జ్ఞానముద్భ వించదు. గురువులు మాత్రం అజ్ఞానం తొలగింప చేయుదురు. భగవంతుని యెడల భక్తి లేకుండా అజ్ఞాన నివృత్తి అసంభవం.

అజ్ఞాన ఘృతాన్ని (నెయ్యి) యజ్ఞంలో ప్రేల్చితే జీవేశ్వర భేదం దహనమై అభేద జ్ఞానం ప్రకటమౌతుంది. అగ్ని తేజస్సును పొగ కప్పినట్లు జ్ఞాన ప్రకాశాన్ని కామ క్రోధాలతో నిండిన అజ్ఞానం కప్పి వేస్తుంది. గొప్ప జ్ఞాని పాప కృత్యాలు చేయ సంకల్పించడు. 'సర్వ అనర్థాలకు కారణం కామమే.' (ఇది సర్వ మతాలు అంగీకరించిన సత్యం). కామగతికి అవరోధం ఏర్పడినప్పుడు క్రోధం జనించును. ఈ కామమే మోక్షానికి ప్రతిబంధకం. ఈ కామ క్రోధాలు జీవులను బాధ పెడుతుంటవి. ఇంద్రియములు, మనస్సు, బుద్ధి కామానికి ఆధారాలు. ఇవి జీవులను మోహంలో పడవేస్తాయి. పరతత్వమైన ఆత్మజ్ఞానాన్ని పొందటానికి ముందుగా ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి. దాని వలన కామ క్రోధాలు తొలగి పోతాయి.

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

# అధ్యాయము 51

(భక్త త్రయ వృత్త కథనము)

**మోహ విచ్ఛిత్తి అయింది :** విశ్వ జనులను సంతోష పరచడానికి మేఘాలు వర్షిస్తాయి. దేవతలకు ఉపయోగ పడటానికి పుష్పాలు వికశిస్తాయి. భక్తులు సంతోషపడటానికి ఈ కథలు, లీలలు ఉదయించాయి. ఈ కథలు చదివే వారి నోళ్ళు, వినేవారి చెవులు పవిత్రమగును. భగవద్గీతలోని **18** వ అధ్యాయము **72** వ శ్లోకములో శ్రీ కృష్ణపరమత్మ అర్జునిని ఇలా ప్రశ్నించాడు.

కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతనాం
కచ్చిదజ్ఞానసమ్మోహఃప్రనష్టస్తే ధనంజయః

తా: 'ఓ పార్థా గీతా శాస్త్రమును నీవు ఏకాగ్ర చిత్తంతో వింటివా? ఓ ధనంజయా! అజ్ఞాన జనితమైన నీ మోహము పూర్తిగా నశించినదా?'అని ప్రశ్నించాడు. అర్జునుడు మోహ విచ్ఛిత్తి అయిందని సమాధానమిచ్చాడు. కాని నాకు జ్ఞానం ప్రాప్తించిందని చెప్పలేదు. కేవలం మాయ తొలగిందని అన్నాడు. ఈ రెండు శబ్దాలు వేరుగా కనిపించినా రెండిటి అర్థం ఒక్కటే. పరమాత్మ ప్రాప్తికి కోటానుకోట్ల సాధనోపాయాలు వున్నా సద్గురువు యొక్క కృపాదృష్టి లేనంతవరకు ముక్తి లభించదు.

**కాకా సాహెబ్ దీక్షిత్ (1864 1926) :** హరి సీతారాం దీక్షిత్‌ను బాబా మరియు సాయి భక్తులు కాకా సాహెబ్ దీక్షిత్ అని, కాకా అని పిలిచేవారు. **1909** సంవత్సరమునకు ముందు హరి సీతారాంకు సాయి బాబాతో పరిచయము లేదు. తర్వాత అతడు సాయి బాబాకు పరమ భక్తుడయ్యాడు. అతనికి నానా సాహెబ్ చందోర్కర్ మిత్రుడు. స్నేహితులు చాలా కాలానికి కలుసుకున్నారు. పరస్పరం మాట్లాడుకున్నారు. తను లండన్‌లో రైలు ఎక్కబోతు కాలుజారి కాలుకు గాయం అయింది. అతనికి ఎంతప్రయత్నించినా ఉపశమనం కలుగ

లేదని దీక్షిత్ నానాతో మాటల సందర్భములో చెప్పాడు. నానాకు సాయి బాబా గుర్తుకు వచ్చాడు. 'నీ కాలుకుంటి పోవాలంటే మా గురువు సాయి వద్దకు వచ్చి దర్శనం చేసుకో' అని చెప్పాడు. కాని కొన్ని రోజుల తర్వాత అతను చందోర్కర్ తోపరమపావనమైన షిరిడి చేరారు. సాయి బాబా దర్శనంతో దీక్షితుని హృదయము ద్రవించింది. నయనాలు అశ్రుపూరితాలైనాయి. బాబా కాకా సాహెబ్ దీక్షిత్‌తో 'నిన్ను కలుసుకోవాలని శ్యామాను నగర్‌కు నేనే పంపించాను. నేను నీ రాకకోసం ఎదురు చూస్తున్నాను.' అని అన్నాడు. దానితో దీక్షిత్ శరీరం రోమాంచితమైంది. అంతఃకరణం ఆనందమైంది. తన జన్మ సార్థకమైందని తలచాడు. బాబా పాదాలను ఆలింగనం చేసుకున్నాడు. సాయి బాబా దీక్షితుని 'నేను నిన్ను విమానంలో తీసుకొని వెళ్ళుతాను' అని అభయ ప్రధానం చేసాడు. బాబా మాట ప్రకారం దీక్షిత్ జీవితం చాలించాడు.హేమాద్ పంత్ మరియు దీక్షిత్ రైలులో ప్రయాణం చేస్తుండగా సాయిగుణాలను గానం చేస్తుండగా అకాస్మాత్తుగా విమానాన్నెక్కి వెళ్ళిపోయినట్లుగా మెడను హేమాద్ పంత్‌పై వాల్చాడు. అనాయాసంగా శరీరాన్ని విసర్జించాడు. తన జ్యోతిని పరంజ్యోతిలో కలిపేసాడు. సాయిపైనున్న భక్తితో శరీరాభిమానం కరిగిపోయింది. క్రీశ. **1926** జ్యేష్ఠ మాసం ఏకాదశి రోజున దీక్షిత్ ఈ కర్మభూమిని విడిచాడు.

**టెంబె స్వామి సాయికి టెంకాయను పంపుట :** గోదావరి తీరాన ఉన్న రాజమహేంద్రం (రాజమండ్రి) పట్టణానికి శ్రీ వాసుదేవానంద సరస్వతిస్వామి (టెంబేస్వామి) వచ్చారు. వారు కర్మ మార్గాన్ని ఆచరించేవారు. అతడు అంతర్జ్ఞాని. వారి కీర్తి విని నాందేడులోని ప్రసిద్ధి చెందిన వకీలు పుండలీకరావు మరికొందరు భక్తులు స్వామి దర్శనం చేసుకొనగోరి గోదావరి తీరానికి వచ్చారు. స్వామితో మాటల సందర్భములో సాయి బాబా పేరు మరియు షిరిడి పేరు వచ్చింది. స్వామి తన చేతులు జోడించి, 'సాయి మా బంధువు,

మాకు వారిపై అమితమైన ప్రేమ.'అని నమస్కరించాడు. అతను ఒక టెంకాయను పుండలీక రావు చేతిలో పెట్టి, 'ఈ శ్రీ ఫలాన్ని సాయి పాదాలకు సమర్పించి వారికి నా నమస్కారములు చెప్పండి. సాధారణంగా మేము స్వాములం మేము ఇతరులకు నమస్కారములు చేయరాదని నిబంధన వున్నా దానిని బాబా విషయంలో ఉల్లంఘించు చున్నాను. అందువలన మరిచి పోకుండా బాబాకు అందచేసి నా నమస్కారములు అని చెప్పండి.'అని అన్నారు. పుండలీక రావు స్వామి వద్ద సెలవు తీసుకొని మిగతా భక్తులతో బయలుదేరారు. ఒక నెల తర్వాత పుండలీక రావు తన నలుగురు స్నేహితులను తీసుకొని స్వామి తన చేతికందించిన టెంకాయను తీసుకొని సాయి బాబా దర్శనానికి షిరిడి బయలు దేరాడు. వారు మన్‌మాడ్‌లో రైలు దిగేసరికి కోపర్‌గాం వెళ్ళే రైలు వెళ్ళి పోయింది. వారికి అప్పుడు దాహం కలిగింది. నదీ తీరమునకు వెళ్ళి కారపు అటుకులను నోటిలో వేసుకున్నారు. అవి కారంగా వుండటం వలన కొబ్బరి కాయను కొట్టి వాటిలో కలుపుకొని ఫలహారంచేసి నీరు తాగారు. వారు ఆకలితో వున్నందున ఆ కొబ్బరికాయ ఎక్కడిదనే ఆలోచన రాలేదు. షిరిడి సమీపానికి వచ్చాక కొబ్బరికాయ గురించి గుర్తుకు వచ్చింది. చాలా ఆందోళన చెందాడు. అపరాధం జరిగిందని తలచాడు. స్వామి శపిస్తాడేమోనని కంపించి పోయాడు. కొబ్బరికాయ లేదు. ఇప్పుడు స్వామికి ఏమి ఇవ్వను. సర్వాంతర్యామి అయిన స్వామికి అబద్ధం ఎలా చెప్పను. ఇప్పడేం చేయాలని చింతిస్తూనే సాయి దర్శనానికి వెళ్ళాడు. అక్కడ అందరూ సాష్టాంగపడిరి. స్వామి తన కోసం టెంకాయను పంపిన వార్త తెలిసింది. పుండలీకరావుతో 'మా బంధువు వద్ద నుండి తీసుకొని వచ్చిన వస్తువును యివ్వు?' అని అని అడిగాడు. పుండలీకరావు సాయి పాదాలను గట్టిగా పట్టుకొని 'బాబా! నన్ను దయతో క్షమించు. నాకింతకన్నా మరొక దారి లేదు. నేను అపచారం చేసాను. నా మతి మరుపు నన్ను అపరాధిలా మార్చి వేసింది. ఆకలితో వున్న మేము కొబ్బరి కాయను తినివేసాము.

అప్పుడు మాకు 'అదెవరిది' అన్న ఆలోచన రాలేదు. బాబా నేనింకొక కొబ్బరి కాయను సమర్పించుకుంటాను. నన్ను అనుగ్రహించు. బాబా! నాకు తెలియకుండానే నమ్మక ద్రోహము చేసాను. నన్ను దయతో నీ రెక్కల క్రిందకు చేర్చుకొని రక్షించు. నన్ను దయతో క్షమించు. నిజంగా నా అపరాధం క్షమించరానిదే. పూజ్యులైన స్వామి మిమ్ములను నిర్లక్ష్యం చేసాను. మీకు ఇవ్వవలసిన కానుకను నేను భక్షించాను. నేనెంతో పాపం చేసాను. అంత నిర్లంక్ష్యంగా ఎందుకు ప్రవర్తించానో నాకే తెలియదు' అంటూ పుండలీకరావు బాధ పడ్డాడు. అతను లేవబోతుంటే బాబా అతనిని ఆపాడు. 'నువ్వెన్ని కాయలు తెచ్చినా ఆ కాయకున్న విలువ రాదు. స్వామి నీపై విశ్వాసముంచితే నువ్వేం చేసావు? ఆ కాయను జాగ్రత్త పరచలేని వాడివి ఎందుకు తీసుకున్నావు? జరుగ వలసిందంతా జరిగి పోయింది. ఇప్పుడు అనవసరంగా ఎందుకు బాధ పడుతున్నావు?' అని బాబా అన్నాడు.

'స్వామి నీ చేతికి టెంకాయనివ్వడం నా సంకల్పమే. అనవసరంగా అభిమానంతో అహంభావ బుద్ధితో నేను తప్పు చేసాను అని అనుకొను చున్నావు. పుణ్యకార్యాలు కాని పాపకార్యాలు కాని రెండింటి ప్రభావం ఒక్కటే. అందువలన వాటిని ఆచరించేవానిని నేను కానని నిరహంకార భావంతో ప్రవర్తించు. నీవు నా బిడ్డవే కదా! నీవు దానిని ఆరగించినా నాకు సమర్పించినట్లే.'అని బోధించారు బాబా. దానితో పుండలీకరావు మనస్సు శాంతించింది. మనోవృత్తి నిరహంకారమైనప్పుడే అది పరమార్థంలో ప్రవేశించకలదు..

ఓం శ్రీ సాయినాథాయనమః

* * * * *

- *నేనెవరో తెలుసుకొని నా శరణుజొచ్చి నాలో ఐక్యం కావాలి.*
- *మహా పురుషుడైన సాయికి కాయా, వాచా, మనసా శరణాగతి చేస్తే సర్వ సుఖాలు కలుగును.*

# అధ్యాయము 52

(ఫలశృతి , ప్రార్థన)

**సచ్చరిత్ర :** ఇదియే చివరి అధ్యాయము. హేమాద్ పంత్ **53** వ అధ్యాయములో అవతరణిక యని పూర్తి సచ్చరిత్రను సింహావలోకన చేసి సారాంశం నివేదిస్తానని వ్రాసారు. కాని దానికి సంబంధించిన కాగితములు లభించలేదు. బాబా యొక్క భక్తుడు బి.వి. దేవ్ (ఠానా నివాసి) మామలతా దారుగా వుద్యోగవిరమణ తర్వాత వ్రాసి పూర్తి చేసాడు. ఈ గ్రంథములో విషయసూచికలో యివ్వబడినది. ఈ సచ్చరిత్ర సాయి సమర్థులు తాము శరీరముతో వున్నప్పుడు భక్తులకు కలుగచేసిన అనుభవాల సంపుటి. ఈ కథ పరమ పవిత్రము. ఈ సచ్చరిత్ర నిత్య పఠనము వలన ఇహ, పర సుఖములు పొందవచ్చును. గోదావరిలో పవిత్ర స్నానమాచరించి సమాధి దర్శనము చేసుకొని ఈ సచ్చరిత్ర శ్రవణం చేస్తే త్రితాపాలు ఉపశమిస్తాయి. సాయిని భక్తితో ఆరాధించిన వారిని ఉద్ధరించటానికి సాయి తన ప్రఖ్యాత చరిత్రను లిఖింప చేసారు.సాయి చరణాల యందు శరణు పొందిన భక్తుల అహంభావం తొలగిపోతుంది. జాగృతి, స్వప్నం, సుషుప్తి ఈ మూడు అవస్థలలో మనస్సు సాయిమయమైతే సంసార నివృత్తి అయినట్లే. సాయిస్మరణతో సకల కోరికలు తీరుతాయి. భవసాగరము దుస్తరమైనది. మోహపు అలలు ఉప్పొంగి తీరాన వున్న ధైర్యమనే వృక్షాన్ని కూల్చి వేస్తాయి. అహంకారమనే పెనుగాలి ఈ సాగరాన్ని అల్లకల్లోలం చేస్తుంది. నేను, నాదనే క్రోధ ద్వేషాల మొసళ్ళు ఇక్కడ నిర్భయంగా మసలుతుంటాయి. వాసనలనే సుడిగుండాలు వుంటాయి. నింద అసూయ తిరస్కారమనే అసంఖ్యాక జలచరాలు ఇందు సంచరిస్తుంటాయి. ఈ భయంకర సాగరాన్ని సద్గురువు అగస్త్యునివలె ఔపోసనం పట్టేస్తారు. సద్గురువు సాయి సమర్థుని పాదాల నాశ్రయిస్తే తీరాన్ని చేరుకోగలం. సంసార దుఃఖముండదు. అత్యంత భక్తి కలిగి

వుంటే సకల ప్రాణులలో సాయిని తిలకించే శక్తి కలుగుతుంది. ఎన్నో జన్మలను వ్యర్థం చేసుకున్నాం. ఈ జన్మలోనైనా సద్గతి పొందాలి.

**ప్రార్థన:** సాయి బాబా పాదాలకు సాష్టాంగపడి మనము బాబాను కోరుకుందాము. మా మనస్సు అటు ఇటు సంచారము చేయకుండుగాక, ఈ సచ్చరిత్ర ప్రతి గృహమునందు ఉండుగాక, దీనిని ప్రతి రోజు పారాయణము చేసేదముగాక. ఎవరైతె దీనిని ప్రతినిత్యము పారాయణము చేసెదరో, సప్తాహం చేసెదరో వారి ఆపదలు తొలగి పోవు గాక.

**ఫలశ్రుతి:** ఈ సచ్చరిత్రను పారాయణం చేసి ఐశ్వర్యాన్ని కోరుకుంటే ఐశ్వర్యం, కీర్తిని కోరుకుంటే కీర్తి, వ్యాపార వృద్ధి కోరుకుంటే వ్యాపార వృద్ధి లభించును. వారి వారి నిష్ఠను బట్టి ఫలితముంటుంది. భక్తి లేకుండా అశ్రద్ధతో దీనిని పఠిస్తే ఏ అనుభవమూ కలుగదు. కాని భక్తి పూర్వకంగా పఠిస్తే సాయి నాథుడు ప్రత్యక్షమై, అజ్ఞాన దారిద్రాన్ని తొలగించి జ్ఞాన ధనాన్ని ప్రసాదిస్తారు. నిశ్చలమైన చిత్తంతో నియమ నిష్టతో ప్రతిరోజు ఒక అధ్యాయము పఠిస్తే సుఖ శాంతులు పొందుతారు. గురు పూర్ణిమ కృష్ణాష్టమి, విజయదశిమి, శ్రీరామ నవమి ఉత్సవాలలో ఈ సాయి సచ్చరిత్రను నియమంగా పారాయణం చేయాలి. మనస్సులలోని కోరికలనుబట్టి పునర్జన్మ లభిస్తుంది. 'అంతే మతి తైసీ గతి'. సాయియే భక్తులకు ఆధారము. వారి కృప లేకుండా విఘ్నాలు నశింపవు. తీవ్రమైన మోక్షేచ్ఛ కలిగిన వారు నిత్యం శుభ కర్మలనాచరిస్తూ, నవ విధ భక్తి మార్గములతో అంతఃకరణం నిత్యం శుద్ధం చేసుకోవాలి. సద్గురువు అనుగ్రహము లేకపోతే చిత్త శుద్ధి కలుగదు. గురువు లేకుండా 'బ్రహ్మ ఏవ అహం' నేనే బ్రహ్మను అను నిత్య స్మరణ కలుగదు. గురు శిష్యుల సంబంధం, తండ్రి కొడుకుల బాంధవ్యం కలిగి వుంటుంది. తండ్రి ఇహ లోక సుఖాలనిచ్చే ధనాన్న ఇస్తాడు. కాని గురువు శాశ్వతమైన పరలోక సుఖం ఆత్మ శాంతిని కలిగిస్తారు. తల్లి సంతానాన్ని తొమ్మిది మాసాలు గర్భంలో ధరించి

బయట పడేసి జన్మ నిస్తుంది. కాని గురువు మనను అంతర్ముఖం చేసి ప్రపంచం నుంచి లోపల పడవేస్తాడు. అంతిమ సమయంలో గురువును స్మరిస్తూ శరీరాన్ని త్యజిస్తే నిస్సంశయంగా సాయుజ్యాన్ని పొందుతారు. ఈ శరీరాన్ని గురువు చేతులలో అంతమొందించినచో పునర్జన్మ కలుగదు.

బాబా! గురుదేవా! పునర్జన్మకు కారణమైన అహంకారాన్ని పూర్తిగా తీసివేయి. సంకల్ప వికల్పాలను తొలగించి నిర్వికల్ప స్థితిని అనుగ్రహించి మోహాన్ని, భ్రమలను ఛేదించి, పరమ సుఖాన్ని ప్రసాదించుము. నాకు పుణ్యం వద్దు. పాపం వద్దు. ఈ జనన మరణ పరంపర వద్దు. మీరు సర్వాంతర్యామి. నా హృదయంలోను మీరు వున్నారు. కాని నిన్ను నాలో చూసుకొనటానికి నేను, నీవను భేద భావము ఇంకా నాలో పోలేదు. అందుకు మీ చరణాల నాశ్రయించి శరణు పొందుచున్నాను. నేను సత్పురుషుల సహవాసంలో కాలం గడుపలేదు. సాధువులను ఆరాధించనూలేదు. సాయీ! మీ కృపతోనే మిమ్ములను స్మరించగలుగుతున్నాను. ఈ సచ్చరిత్రను వ్రాయ గలిగాను. సాయి సేవలో తలచిన కార్యం సమాప్తమైనది. ఈ గ్రంథం సాయి పాదాలకంకితం.

శ్రోతలకు సాష్టాంగ ప్రణామములు. శ్రద్ధా భక్తులతో ఈ గ్రంథాన్ని పారాయణం చేస్తే రోగులు ఆరోగ్యవంతులౌతారు. దరిద్రులు ధనవంతు లౌతారు, దీనులు ఔదార్యులౌతారు. మనస్సులోని సంకల్ప వికల్పాలు శాంతించి చిత్త స్థైర్యం కలుగుతుంది. భూత ప్రేత పిశాచాల బాధలు తొలగి పోతాయి. కుంటి, చెవిటి, మూగ, గుడ్డి వారికి కూడా ఈ గ్రంథం ఆనందాన్ని కలుగచేస్తుంది. నరులవలె జనియించి, అసురుల వలె సంచరిస్తూ, మిథ్యా ప్రపంచాన్ని సుఖమయంగా తలచే వారిని ఈ గ్రంథం ఉద్ధరిస్తుంది.

ఓం శ్రీ సాయినాథాయనమః

ఓం శాంతిఃశాంతిఃశాంతిః

## షిరిడిలో చూడవలసిన స్థలములు

1. భాబా సమాధి మందిరము
2. ద్వారకామాయి
3 చావడి
4. గురుస్థాన్
5. లెండి బాగ్
6. అబ్దుల్ బాబా, నానావళి సమాధులు
7. ఘణేశాలయము, మారుతి దేవాలయము, శనేశ్వరాలయము, శివాలయము, అష్టలక్ష్మి దేవాలయము
8. ప్రతి గురువారము రాత్రి **9** గంటలకు ద్వారకామాయి నుండి ప్రారంబమగు చావడి ఉత్సవము
9. మహాల్సాపతి ఇంటిలో బాబా సమాధి, ఆయన వాడిన వస్తువులు మరియు బాబా గారి పాదుకలు
10. లక్ష్మి బాయి షిండెకు బాబా యిచ్చిన **9** వెండి నాణెములు
11. ఖండోబా దేవాలయము.
12. శ్యామా ఇంటిలో బాబా ప్రసాదించిన గణపతి.
13. కోపర్ గాంలో గల సాయి మందిరము మరియు దత్తాత్రేయ మందిరము.
14. సాకొరి లోని ఉపాసని బాబా గోదావరి మాత సమాధులు, దత్త మందిరము
15. **60** కి.మీ. దూరములోని శని షింగణాపూర్ లోని శని దేవాలయము మరియు దగ్గర లోనే వున్న రేణుకా దేవి మందిరము.
16. **100** కి. మీ. దూరము లో గల గోదావరి నది పుట్టిన ప్రదేశము, త్రయంబకేశ్వరము మరియు నాసిక్